సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 336
సోమవారం 26-2-2018
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా
పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు’



పూల రెక్కలు.. కొన్ని తేనె చుక్కలు..
రంగరిస్తివో.. ఇలా బొమ్మ చేస్తివో..
అసలు భూలోకం..
ఇలాంటి సిరి చూసి ఉంటదా..
కనక ఈ చిత్రం..
స్వర్గానికి చెందివుంటదా..



దేవకన్యా.. దిగిరావా!

అనంతలోకాలకు అతిలోక సుందరి

- దుబాయ్‌లో గుండెపోటుతో శ్రీదేవి హఠాన్మరణం
- మేనల్లుడి వివాహానికి భర్త, చిన్న కూతురుతో కలసి హాజరు
- రాత్రి 11 గంటల సమయంలో హోటల్‌లోని స్నానాల గదిలో కుప్పకూలిన నటి.. ఆసుపత్రికి తీసుకెళ్లినా దక్కని ఫలితం
- యావత్ సినీ ప్రపంచాన్ని ఏలిన ఏకైక సూపర్‌స్టార్
- శోకసంద్రంలో భారతావని.. రాష్ట్రపతి, ప్రధాని సంతాపం
- నేడు ప్రత్యేక విమానంలో భౌతికకాయం.. ముంబైలో అంత్యక్రియలు

స్వర్గలోకపు దారుల్ని వెతుక్కుంటూ..
ఆసేతు హిమాచలాన్ని శోకసంద్రంలో ముంచేస్తూ..
దివికేగిన ఓ దేవకన్యా..
అంగుళీయకము లేదని స్వర్గలోక ప్రవేశానికి
ఇంద్రుడు నిరాకరిస్తే..
మళ్లీ భూలోకానికి దిగిరావా...!!

2లో

జననం **1963**
మరణం **2018**

మనమ్మాయే..
కామరాజర్ సిఫార్సుతో సినిమాల్లోకి..

దేవుడా..
దేవుడా..
దేవుడా...

ఎదుటివారిని నొప్పించేది కాదు: జయసుధ
మాకు విభేదాలు లేవు: జయప్రద

మరిన్ని వార్తలు, కథనాలు
5, ఫ్యామిలీ పేజీల్లో..

అమరావతిలో ‘హ్యాపీ సిటీస్’ సమ్మిట్

2లో

‘ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు’ బ్యానర్లతో పాదయాత్రలో అడుగులు వేస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



మాలలు, మాదిగలకు చెరో కార్పొరేషన్

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ

- వారు నా రెండు కళ్లలాంటి వారు..
- వారి కోసం ఏమి చేయడానికైనా సిద్ధమే
- చంద్రబాబులా అబద్ధాలు చెప్పి మోసం చేయలేను
- ప్రత్యేక హోదా ప్లకార్డులు పట్టుకొని జగన్‌తో కలిసి నడిచిన యువత
- 1,300 కిలోమీటర్ల మైలురాయి దాటిన పాదయాత్ర

6లో

www సాక్షి వెబ్‌సైట్‌లో

సవాళ్లతో కూడుకున్న సినిమా రంగంలో తెరపైనే కాదు తెర వెనుక కూడా మహిళలు సత్తా చాటుతున్నారు. కథానాయికలు, సహాయక పాత్రల్లో తెరపై కనిపించడానికే పరిమితం కాకుండా సినిమా నిర్మాణంలో తమదైన శైలిలో దూసుకెళ్తున్నారు. ఒకప్పుడు సినిమాల్లో నటనకు, పాటలు పాడటానికి, నర్తించడానికి మాత్రమే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంతో సంక్లిష్టమైన దర్శకత్వ బాధ్యతలు చేపట్టి తామేంటో నిరూపిస్తున్న ‘నవతరం డైరెక్షన్‘ కథనం www.sakshi.com క్లిక్ చేసి చదవండి.

మహిళలకు సమ ప్రాతినిధ్యం

ఇది భారతీయులందరి ప్రాథమిక విధి
మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

- వివరాలు 8లో



భారత్‌కంటే మేమే ముందు

విశాఖ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశం కంటే ఆంధ్రప్రదేశ్‌కే మెరుగైన ర్యాంక్
- ఇండియా ర్యాంక్ 100, ఏపీ ర్యాంక్ 88
- ప్రపంచ దేశాలతోనే మాకు పోటీ
- టాప్–5 దేశాల్లో ఒకటిగా ఎదగడమే లక్ష్యం
- విశాఖపట్నాన్ని ఇన్నోవేటివ్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం..
- కొత్త ఆవిష్కరణల ప్రోత్సాహానికి ఇన్నోవేషన్ సొసైటీ

7లో



విశాఖలో ఐఐపీకి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి సురేష్‌ప్రభు, సీఎం చంద్రబాబు

దేవకన్యా.. దిగిరావా



సాక్షి, హైదరాబాద్/దుబాయ్/ముంబై

ఐదు దశాబ్దాలపాటు వెండితెరను ఏలిన అతిలోక సుందరి శ్రీదేవి (54) ఇక లేరు. శనివారం రాత్రి దుబాయ్‌లో ఆమె గుండెపోటుతో కన్నుమూశారు. ఆదివారం తెలతెలవారుతుండగా ఈ చేదువార్త విని యావత్ భారతావని శోకసంద్రంలో మునిగిపోయింది. సినీలోకం మూగబోయింది. తన మేనల్లుడు మోహిత్ మార్వా వివాహం కోసం భర్త బోనీ కపూర్, చిన్న కూతురు ఖుషీతో కలిసి శ్రీదేవి దుబాయ్ వెళ్లారు. పెద్ద కూతురు జాహ్నవి షూటింగ్ కారణంగా ముంబైలోనే ఉండిపోయారు. శనివారం రాత్రి శ్రీదేవి వేడుకల్లో హుషారుగానే పాల్గొన్నారు. కొందరు బంధువులు తిరిగి స్వదేశం చేరుకున్నా ఆమె అక్కడే ఆగిపోయారు. జుమైరా ఎమిరేట్స్ టవర్ హోటల్‌లోని తన స్నానాల గదిలో రాత్రి 11 గంటల సమయంలో ఆమె కుప్పకూలి కనిపించారని సమాచారం. వెంటనే రషీద్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మరణించారని డాక్టర్లు ధ్రువీకరించారు. శ్రీదేవికి భర్త బోనీకపూర్, ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, ఖుషీ ఉన్నారు. శ్రీదేవి భౌతికకాయానికి దుబాయ్‌లోనే పోస్టుమార్టం పూర్తయింది. సోమవారం ఉదయం భౌతికకాయాన్ని ముంబైకి తీసుకురానున్నట్లు ఆమె కుటుంబీకులు ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగేళ్ల వయసు నుంచే..

తమిళనాడులోని శివకాశిలో 1963లో జన్మించిన శ్రీదేవి నాలుగేళ్ల వయసు నుంచే వెండితెరపై వెలిగారు. 1967లో 'కందన్ కరుణై' చిత్రంలో బాలనటిగా రంగప్రవేశం చేశారు. 'కొందరు సిల్వర్ స్పూన్‌తో పుడతారు.. శ్రీదేవి సిల్వర్ స్క్రీన్‌తో పుట్టింది' అనే నానుడి స్థిరపడేలా బాలనటిగా దూసుకుపోయారు. ఆ రోజుల్లో పర్సనల్ మేకప్‌మన్ ఉన్న ఏకైక బాలనటి శ్రీదేవియే కావడం విశేషం. ఎన్టీఆర్, శివాజీ గణేశన్, ఎస్వీఆర్ వంటి హేమాహేమీల నడుమ, గంభీరమైన రూపు– వాచకం ఉన్న అంత పెద్ద నటుల మధ్య ఏమాత్రం తొట్రుపడకుండా అలవోకగా శ్రీదేవి నటించారు. 'బడిపంతులు'లో 'బూచాడమ్మ బూచాడు' పాటతో తెలుగు ప్రేక్షకులు ముచ్చటపడే చిన్నారిగా మారారు. 11వ ఏటనే మలయాళంలో హీరోయిన్‌గా నటించినా 13వ ఏట తెలుగులో 'అనురాగాలు' (1976), 14వ ఏట 'మా బంగారక్క' (1977) సినిమాలతో తెలుగు హీరోయిన్‌గా మారారు. 'పదహారేళ్ల వయసు' (1978) ఘన విజయంతో ఆమె దశ తిరిగింది. ఆ తర్వాత రెండు దశాబ్దాల పాటు ఇటు దక్షిణాదిని, అటు ఉత్తరాదిని ఏలారు. 'ప్రేమాభిషేకం', 'వేటగాడు', 'కొండవీటి సింహం', 'దేవత' వంటి సూపర్ హిట్స్ ఆమె ఖాతాలో ఉన్నాయి. నాగార్జునతో 'ఆఖరి పోరాటం', చిరంజీవితో 'జగదేకవీరుడు–అతిలోక సుందరి' వంటి భారీ హిట్స్ ఇచ్చారు. హిందీలో 'సద్మా', 'చాందినీ', 'చాల్‌బాజ్', 'ఖుదాగవా', 'లమ్హే' వంటి సినిమాలు ఆమె వల్లే హిట్ అయ్యాయి. 2013లో శ్రీదేవి 'పద్మశ్రీ' అందుకున్నారు.

సిసలైన తెలుగు నటి

శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ శివకాశిలో స్థిరపడ్డ తెలుగు కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయన తెలుగు స్పష్టంగా మాట్లాడేవారు. తల్లి రాజేశ్వరి చిత్తూరు జిల్లా నుంచి సినీ రంగ అవకాశాలను వెతుక్కుంటూ చెన్నై వెళ్లారు. శ్రీదేవికి శ్రీలత అనే సోదరి ఉంది. నటి మహేశ్వరి కజిన్. బోనీ కపూర్‌ను వివాహమాడారు. నటుడు అనిల్ కపూర్ ఆమెకు మరిది. శ్రీదేవి చివరి సినిమా 'మామ్' (2017). పదిహేనేళ్లపాటు చిత్రాలకు విరామం ఇచ్చిన అనంతరం 'ఇంగ్లిష్ వింగ్లిష్' చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. కుమార్తె జాహ్నవి నటిస్తున్న తొలి చిత్రం 'ధడక్' ప్రస్తుతం చిత్రీకరణలో ఉంది. కుమార్తెను హీరోయిన్‌గా చూడాలని శ్రీదేవి ఎంతో పరితపించారు. ఆ సినిమా విడుదల కాకముందే ఆమె మరణించడం విషాదం.

కన్నీరు పెట్టిన చిత్రపరిశ్రమ

శ్రీదేవి హఠాన్మరణంతో భారత చిత్రపరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది. అమితాబ్ బచ్చన్, ప్రియాంక చోప్రా, సుస్మితాసేన్, సిద్ధార్థ్ మల్హోత్రా, రితేశ్ దేశ్‌ముఖ్ తదితరులు ట్వీటర్ ద్వారా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీదేవి మృతిపై అందరికన్నా ముందుగా స్పందించింది అమితాబే. 'ఈ బాధను వర్ణించేందుకు మాటల్లేవు. శ్రీదేవిని అభిమానించే అందరికీ నా సానుభూతి. ఇదో చీకటి దినం' అని ప్రియాంక చోప్రా ట్వీటర్ ద్వారా విచారం వ్యక్తం చేశారు. 'షాక్‌కు గురయ్యా. చాలా బాధగా ఉంది. శ్రీదేవి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢసానుభూతి' అని హాస్యనటుడు జానీ లివర్ పేర్కొన్నారు. 'శ్రీదేవి లేరనే వార్త తెలిసినప్పటినుంచీ ఏడుపాగటం లేదు. చాలా బాధగా ఉంది' అని సుస్మితా సేన్ తెలిపారు. 'భారత లెజెండరీ నటి శ్రీదేవి ఇకలేరనే వార్త జీర్ణించుకోలేకపోతున్నా' అని టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆర్టిస్టిక్ డైరెక్టర్ కెమరాన్ బైలీ పేర్కొన్నారు.

ఆమెకు హృద్రోగ సమస్యల్లేవు

శ్రీదేవికి హృద్రోగ సమస్యలేమీ లేవని ఆమె మరిది, నటుడు సంజయ్ కపూర్ తెలిపారు. 'శనివారం రాత్రి 11 గంటల సమయంలో తీవ్రమైన గుండెపోటుకు గురయ్యారు. ఆ సమయంలో ఆమె హోటల్ గదిలో ఉన్నారు' అని ఆయన చెప్పారు.

పోస్టుమార్టం నివేదిక ఆలస్యం

శ్రీదేవి భౌతికకాయానికి దుబాయ్‌లోనే పోస్టుమార్టం పూర్తయినా ఆదివారం రాత్రి వరకు పోలీసుల విచారణ నివేదిక రాలేదు. దీంతో ఆమె భౌతికకాయాన్ని సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో ముంబైకి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దుబాయ్ చట్టాల ప్రకారం.. ఆసుపత్రిలో కాకుండా వేరేచోట మృతిచెందిన వారి పోస్టుమార్టం పూర్తయ్యేందుకు కనీసం 24 గంటలు పడుతుంది.

మార్చురీలో భౌతికకాయం

శ్రీదేవి భౌతిక కాయాన్ని భారత్‌కు వీలైనంత తొందరగా తరలించేందుకు దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులు అక్కడి పోలీసులతో కలసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆమె పార్థివదేహం దుబాయ్ పోలీసు ప్రధాన కార్యాలయంలోని మార్చురీలో ఉంది.









1. శనివారం అర్ధరాత్రి దుబాయ్‌లో జరిగిన బంధువుల పెళ్లి వేడుకలో నృత్యం చేస్తున్న శ్రీదేవి, బోనీకపూర్
2. వధూవరులతో శ్రీదేవి దంపతులు
3. ముంబైలోని శ్రీదేవి నివాసం వద్ద రోదిస్తున్న అభిమాని
4. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న శ్రీదేవి(ఫైల్)

అమరావతిలో 'హ్యాపీ సిటీస్' సమ్మిట్

- ఏప్రిల్ 10 -12 తేదీల్లో నిర్వహణకు సర్కారు నిర్ణయం
- 'దావోస్' తరహాలో ప్రతి ఏడాదీ సదస్సు
- నిర్వహణ ఏజెన్సీలకు నామినేషన్‌పై పనులు
- జీవో 81 జారీ చేసిన రాష్ట్రప్రభుత్వం

సాక్షి, అమరావతి: దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు తరహాలో అమరావతిలో ప్రతీ ఏడాది ఓ భారీ సమ్మిట్‌ను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ ఏడాది ఏప్రిల్ 10 నుంచి 12 వరకు నిర్వహించే ఈ సదస్సుకు 'హ్యాపీ సిటీస్ సమ్మిట్ అమరావతి–2018' పేరును ఖరారు చేశారు. ఇటీవల జరిగిన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో సీఎం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ సమ్మిట్‌లో సిటిజన్ –సెంట్రిక్ గవర్నెన్స్, లివబుల్ కమ్యూనిటీస్, క్లీన్ అండ్ హెల్త్, పర్యావరణం, బలమైన ఆర్థిక వ్యవస్థలపై ప్రధానంగా చర్చించనున్నారు. భారతీయ పారిశ్రామిక సమాఖ్య, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ సహకారంతో ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమ్మిట్ నిర్వహణకు రూ.52 కోట్లు వ్యయం అవుతుందని సీఆర్‌డీఏ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తొలుత ఈవెంట్‌ను భవానీద్వీపం వద్ద నిర్వహించాలని భావించినా ఆ తరువాత ఎ–కన్వెన్షన్ సెంటర్‌లో చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ జీవో 81 జారీ చేసింది. ఈ ఈవెంట్ నిర్వహణకు అవసరమైన సేవలందించే ఏజెన్సీలను నామినేషన్‌పై ఎంపిక చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

25 నుంచి 30 దేశాల ప్రతినిధులు..


హ్యాపీ సిటీస్ ఇండెక్స్‌లో మొదటి స్థానాల్లో ఉన్న 25 నుంచి 30 దేశాల ప్రతినిధులను ఈ సమ్మిట్‌కు ఆహ్వానించనున్నారు. వీరందరికీ విమాన చార్జీలతో పాటు రెమ్యునరేషన్, రవాణా, అకామడేషన్ ఛార్జీలను సీఆర్‌డీఏ భరించనుంది. పట్టణీకరణలో టెక్నాలజీ వినియోగంపైన ఈ సదస్సులో చర్చించనున్నారు. పట్టణీకరణలో అనుభవజ్ఞులను, విధానపరమైన నిర్ణయాలు తీసుకున్న నాయకులను, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న సిటీ అడ్మినిస్ట్రేటర్స్‌ను, సిటీ ప్లానర్స్, ఆర్కిటెక్చర్స్, డిజైనర్స్‌ను ఆహ్వానించనున్నారు. సదస్సు నిర్వహణ కోసం పలు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సమ్మిట్ నిర్వహణలో మార్గదర్శనం చేసేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో పలువురు మంత్రులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. మంత్రి నారాయణ నేతృత్వంలో పలువురు అధికారులతో వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ)కార్యదర్శి నేతృత్వంలో పలువురు అధికారులతో ప్రొటోకాల్ కమిటీని, శాంతి భద్రతల అదనపు డీజీతో నేతృత్వంలో సెక్యూరిటీ కమిటీ, సిటీ బ్యూటిఫికేషన్ కమిటీ, సాంస్కృతిక కమిటీ, మీడియా కమిటీ, ఎగ్జిబిషన్ కమిటీ, కృష్ణా రివర్ వాటర్ లాజిస్టిక్స్ కమిటీ ఏర్పాటు చేశారు.

భారతీయ సినీ రంగానికి తీరని లోటు

శ్రీదేవి మృతి పట్ల వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



సాక్షి, హైదరాబాద్: ప్రఖ్యాత సినీ నటి శ్రీదేవి ఆకస్మిక మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె మరణం సినీ ప్రియులకు, భారతీయ సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. శ్రీదేవి తన నటన, ప్రతిభా పాటవాలతో ప్రజల మనసు గెలుచుకున్నారని, బాలనటిగా మర్చిపోలేని నటనను ప్రదర్శించారని ఆదివారం ఒక సందేశంలో కొనియాడారు. ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలు ధరించి మెప్పించిన శ్రీదేవి.. 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమాలో గృహిణిగా అద్భుతమైన నటనను ప్రదర్శించి విశేష మన్ననలను అందుకున్నారని పేర్కొన్నారు. శ్రీదేవి మరణంతో దుఃఖ సాగరంలో మునిగి ఉన్న ఆమె కుటుంబసభ్యులకు జగన్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ట్వీటర్ ద్వారా కూడా ఆయన సంతాపం ప్రకటించారు.



సమాజానికి చేయూత అందరి బాధ్యత

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు
- గుంటూరులో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ అవార్డుల ప్రదానం



కూచిభొట్ల ఆనంద్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు, డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: సమాజంలో లక్షల మంది పేదలు రెండు పూటలా తిండిలేక అవస్థలు పడుతున్నారని.. వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సహాయం చేసే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు ఆకాంక్షించారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగిన 2017 స్ఫూర్తి అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. సభకు అలహాబాద్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, స్ఫూర్తి అవార్డుల జ్యూరీ చైర్మన్ జస్టిస్ అంబటి లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ, సమాజానికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పేదరికంలో బాధపడుతున్న వారికి సహాయం చేయడంలో ఉన్న ఆనందం తీర్పు ఇచ్చిన రోజున కూడా తనకు కలుగలేదన్నారు.

పిల్లలకు సంప్రదాయ, సాంస్కృతిక విద్య

ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, సాంస్కృతిక విద్యా విధానంతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే సంప్రదాయ, సాంస్కృతిక విద్య విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. వివిధ రంగాలలో నిస్వార్థ సేవలు అందించిన వారిని ఫౌండేషన్ వారు గుర్తించి పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. జస్టిస్ అంబటి లక్ష్మణరావు మాట్లాడుతూ, నాలుగేళ్లుగా నిష్ణాతులైన వ్యక్తులను గుర్తించి బొమ్మిడాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవలో వారికి మరింత ఉత్తేజాన్ని కలిగించడంతో పాటు.. యువతకు స్ఫూర్తి కలిగించేందుకు అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రముఖ రచయిత్రి ఓల్గా (పోపూరి లలితకుమారి), విద్యారంగంలో యుఎస్‌ఎ సిలికాన్ ఆంధ్రా సీఈవో, చైర్మన్ కూచిభొట్ల ఆనంద్, గ్రామీణాభివృద్ధిలో విశిష్ట సేవలందిస్తున్న వరంగల్ బాలవికాస వ్యవస్థాపకుడు బాల థెరెసా సింగారెడ్డి జింగ్రాస్, సామాజిక సేవారంగంలో ఉత్తరప్రదేశ్ ఆర్టీఐ కార్యకర్త కేఎం యాదవ్‌కు జ్ఞాపిక, సన్మానపత్రం అందజేశారు. అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ.3 లక్షల నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, డాక్టర్ వకులాభరణం రామకృష్ణ, డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ సీతారత్నం, ప్రొఫెసర్ బాల మోహన్‌దాస్, పెండ్యాల ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



అలా అని సబ్సిడీలు ఎత్తేస్తానంటే ఎలా సార్!

మంగళగిరి ఐటీ పార్కులో భారీ అగ్నిప్రమాదం

- రెండు ఐటీ కంపెనీల్లో మంటలు
- కంప్యూటర్లు, ఫర్నిచర్ దగ్ధం
- రూ.20 లక్షల ఆస్తి నష్టం
- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం
- గత నెలలో వీటిని ప్రారంభించిన ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్



ఎన్‌ఆర్టీ టెక్ పార్క్‌లో మంటలు (ఇన్‌సెట్‌లో) గ్రౌండ్ ఫ్లోర్‌లో కాలి బూడిదైన 300 కుర్చీలు

మంగళగిరి రూరల్/తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఎన్‌ఆర్టీ టెక్ పార్క్‌లో ఐటీ కంపెనీలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లినట్లు కంపెనీ అధికారులు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ జనవరి, 17నే వీటిని ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఆర్టీ టెక్ పార్క్ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. క్షణాల్లో ఫస్ట్ ఫ్లోర్‌లోని చార్వికెంట్ ఐటీ కంపెనీలోకి వ్యాపించిన మంటలు.. ఆ వెంటనే సెకండ్ ఫ్లోర్‌లోని అద్వైత ఐటీ కంపెనీకి వ్యాపించాయి. చార్వికెంట్ ఐటీ కంపెనీకి చెందిన 12 కంప్యూటర్లు, ఫర్నిచర్ తదితర సామగ్రి దగ్ధంకాగా, అద్వైత ఐటీ కంపెనీని ఇటీవల ప్రారంభించడంతో పూర్తి స్థాయిలో కంప్యూటర్లు బిగించకపోవడంతో కొద్దిపాటి నష్టమే జరిగింది. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి రావడం ఆలస్యంకావడంతో లోపల్నుంచి ఎగిసిపడుతున్న మంటల ఉధృతి తగ్గించేందుకు యువకుల సాయంతో పోలీసులు అద్దాలు పగులగొట్టించారు. విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఆదివారం అయినందున ఆయా కంపెనీల్లో సిబ్బంది లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. గుంటూరు అర్బన్ ఎస్పీ విజయారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై తమకు పూర్తి సమాచారం లేదని, దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయా.. లేక ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా తగలబెట్టారా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. భవనంలో సేఫ్టీ మెజర్స్ ఏ మాత్రం లేకున్నా నాయకుల ఒత్తిడి మేరకు అనుమతులు ఇవ్వాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

వైభవంగా తెప్పోత్సవాలు ప్రారంభం

తొలిరోజు శ్రీరాముని అవతారంలో పుష్కరిణిలో విహరించిన స్వామివారు

సాక్షి, తిరుమల: తిరుమలలో ఆదివారం శ్రీవారి తెప్పోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు సాగనున్న ఈ ఉత్సవాల్లో తొలిరోజు సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి అవతారంలో మలయప్ప స్వామివారు మూడుసార్లు పుష్కరిణిలో ప్రదక్షిణగా విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రెండో రోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి, చివరి మూడు రోజులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు పుష్కరిణిలో విహరించనున్నారు. క్రీ.శ.1468 సాళువ నరసింహరాయలు పుష్కరిణి మధ్యలో ఉత్సవాలకు అనువుగా 'నీరాళి మంటపం' నిర్మించారు. అంతకుముందు నుంచే శ్రీవారికి తెప్పోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శాసనాధారం. ఈ సందర్భంగా ఆర్జిత సేవలైన వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దు చేశారు. పుష్కరిణితో పాటు ఆలయానికి దేదీప్యమానంగా విద్యుత్ దీపాలతో అలంకరణ, వివిధ దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య జరిగిన వేడుకలో టీటీడీ ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, జేఈఓ కేఎస్ శ్రీనివాసరాజు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



తెప్పపై సీతారామలక్ష్మణులు

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం వెలుపల జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే తదితరులు

సాక్షి, తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయం అనంతరం ఆయన ఆలయానికి వచ్చారు. ధ్వజ స్తంభానికి మొక్కుకున్న అనంతరం శ్రీవారిని, వకుళమాతను దర్శించుకున్నారు. తర్వాత హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు జస్టిస్‌ను ఆశీర్వదించగా, డిప్యూటీ ఈవో శ్రీధర్, ఓఎస్డీ లక్ష్మీనారాయణయాదవ్ లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

దారి వెతుక్కుంటూ ఓ నిరంతర బాటసారి

నివాళి

24 ఫిబ్రవరి 2018. యీరోజు గూడా యెప్పటిలాగే తెల్లవారింది. పదకొండు గంటల ప్రాంతంలో వాట్సాప్‌లో సాహితీ మిత్రుడొకరు మునిపల్లె రాజుగారి ఫొటో పెట్టి కింద 'నివాళి' అని రాశాడు. సాదాసీదాగా తెల్లవారిన యీరోజు వొక్కసారిగా సాహిత్య అస్తిత్వాన్నంతా వూపి పారేసింది. యేనాటి మునిపల్లె రాజు గారు? రెండు నెలల క్రితం ఇచ్ఛాపురం జగన్నాథరావు గారు. యిప్పుడు మునిపల్లె రాజు గారు. తెలుగు కథ రెండో దశలో, దాన్ని అత్యున్నత శిఖరాలకెక్కించిన మహా రచయితలు క్రమంగా నిష్క్రమిస్తున్నారు.


93 సంవత్సరాల నిండైన జీవితం గడిపిన వ్యక్తి మరణించినప్పుడిలా మనస్సు కలగుండు పడిన చెరువులా అలజడి చెందుతోందెందుకు? మరణం సహజమేనని తెలిసినా, ప్రతిరోజూ రకరకాల జీవన పరిణామాలను గమనిస్తూనేవున్నా, కొందరు వ్యక్తులు మరణించినా వాళ్ళ స్ఫూర్తి వాళ్ళు చేసిన పనిలో సజీవంగానే వుండిపోతుందన్న నమ్మకం కలిగినా, యింకా యీ ఆందోళన యెందుకు తగ్గదు?

ఆరడుగుల నల్లటి చేవ బారిన శరీరం, పొడవెంతో కన్పించేలా మాత్రమే పెరిగిన ఆకారం, తలపైన వయస్సును తెలిపే తెల్లటి వెంట్రుకలు, తనవి గావనిపించే పాంటూ షర్టూ, ఆ పైన అప్పుడప్పుడూ పాత మిలిటరీదేమోననిపించే స్వెట్టరూ, దేనిపైనా నిలవని చూపులు, నిద్రలోనే నడచి వస్తున్నాడేమోననిపించే వ్యక్తి, పలకరిస్తే వులిక్కిపడి తిరిగి చూడటం, అప్పుడే నిద్ర మేల్కొని చూస్తున్నట్టుగా వుండే వైనం... గుర్తించినట్టుగా నవ్వే నవ్వు... జీవితానుభవాల్ని నిరూపిస్తున్నట్టుగా మిగిలిన కొన్ని పళ్లు... ఆ వ్యక్తిని నేను 1993 లేకపోతే 94 ప్రాంతాల్లో మొదటిసారిగా చూశాను. చివరిసారిగా, రెండేళ్ల క్రితం, యేదో సాహితీసభకు వచ్చినప్పుడూ అలాగే కనిపించాడాయన.

మునిపల్లె రాజు చిత్రమైన వ్యక్తి. పదిమందిలో పెద్దగా మాట్లాడరు. పరిచయం కుదిరిన వ్యక్తితో మాట్లాడటం మొదలుపెడితే ఆపరు. ఆయన మాట్లాడుతూంటే ఆ వ్యక్తే 'వీరకుంకుమ', 'బిచ్చగాళ్ల జెండా', 'అరణ్యంలో మానవ యంత్రం', 'వారాల పిల్లాడు' మొదలైన గొప్ప కథలు రాసిన వ్యక్తని గుర్తుకు తెచ్చుకుని ఆశ్చర్యపోతాం. మాట్లాడుతున్నప్పుడు ఆయన యెదుటి వ్యక్తితో మాట్లాడుతున్నట్టుండదు. అరమోడ్పు కళ్లతో ఆయన తనతో తాను మాట్లాడుకుంటున్నట్టుగా కనిపిస్తారు.

రాయలసీమ కరువు గురించి రాసిన తొలి కథల్లో ముఖ్యమైనదైన 'వీరకుంకుమ' రాసిన మునిపల్లె రాజు గారు నిజానికి రాయలసీమ వాసి గాడు. దాదాపు వంద, వందాయాభై సంవత్సరాల క్రితం కొందరు కోస్తా ప్రాంతపు వైద్యులు (ఎంబీబీయెస్ గాదనీ, ఆర్‌ఎంపీల వంటి రెండో రకం డిగ్రీలుండేవారనీ తర్వాత తెలిసింది) చిత్తూరు, కడప జిల్లాలకొచ్చి స్థిరపడ్డారు (యాభై అరవై సంవత్సరాల క్రితం వాళ్ళు మళ్లీ తమ స్వంత ప్రదేశాల కెళ్ళిపోయారు). వాళ్లలో మునిపల్లె రాజు గారి అన్న పిచ్చిరాజు గారొకరు. (మునిపల్లె రాజు పూర్తి పేరు మునిపల్లె బక్కరాజు). కడపలో ఉన్న అన్న దగ్గరికొచ్చిన తమ్ముడు అప్పటి రాయలసీమ జీవనగతుల్ని గురించి రాసిన కథ అది.

మునిపల్లె రాజు సైన్యంలో వుద్యోగిగా పనిచేసినవారు. హిమాలయ పర్వత సానువుల్లో చాలా కాలం గడిపి



మునిపల్లె రాజు
(16 మార్చి 1925 - 24 ఫిబ్రవరి 2018)

వచ్చినవారు. యెక్కడికెళ్లినా ఆయన చూపులు మాత్రం గాయపడినవాళ్ళు, అవమానించబడుతున్నవాళ్ళపైనే వుండేది. డాస్టోవిస్కీని ద్రష్ట (Prophet)గా గుర్తించిన ఇ.ఎం.ఫాస్టర్ ''యిప్పుడు యెంతమంది గొప్ప రచయితలున్నా వీళ్లలో డి.హెచ్.లారెన్సు మాత్రమే ద్రష్ట'' అంటాడు. గతాన్ని స్పష్టంగా అర్థం చేసుకుని, వర్తమానాన్ని నిర్దుష్టంగా అవగతం చేసుకున్న రచయిత మాత్రమే రాబోయే పరిణామాల్ని ముందుగా కనిపెట్టగలడు. యిటువంటి ద్రష్టత్వం వున్న చాలా కొద్దిమంది ఆధునిక భారతీయ రచయితల్లో మునిపల్లె రాజు గారిది విశిష్టమైన స్థానం. 'బిచ్చగాళ్ల జెండా'లోని బిచ్చగాళ్ళ తిరుగుబాటూ, 'అరణ్యంలో మానవయంత్రం'లో ముసుగు దొంగలు అక్రమ వ్యాపారిని దోచుకోవడం - యీ రెండు కథలూ ఆ తర్వాతి కాలంలో తెలుగు రాష్ట్రంలో విజృంభించిన వామపక్ష పోరాటాల బీజాలను చాలా ముందుగా పసిగట్టాయి. తిరగబడుతున్న పీడితులతో మమేకమైన రచయిత పీడనలోంచి పోరాటం పుట్టడం అనివార్యమని హెచ్చరిస్తాడు.

1950–75 ప్రాంతాల్లో యిన్ని గొప్ప కథలు రాసిన మునిపల్లె రాజు గారు దాదాపొక రెండు దశాబ్దాల కాలం మౌనంగా వుండటమెందుకో అర్థంగాదు. బహుశా అప్పుడాయన వుద్యోగపు పనుల్లో వూర్లు తిరుగుతూ జన్మభూమికి దూరమైపోయి వుంటారు. కానీ రెండోసారి మొదలెట్టిన తర్వాత గూడా తనలో పాత వాడీ, వేడీ తగ్గలేదని నిరూపించి చూపెట్టారు. 'సవతి కొడుకు', 'విశాఖ కనకమాలక్ష్మి' వంటి గొప్ప కథల్ని నిలపకుండా మరో దశాబ్దపు కాలంలో రాశారు. 'పుష్పాలు-ప్రేమికులు', 'దివోస్వప్నాలతో ముఖాముఖి', 'అస్తిత్వ నదం ఆవలి తీరాన', 'మునిపల్లె రాజు కథలు' అనే నాలుగు కథల సంకలనాల్ని తీసుకొచ్చారు. 'వేరొక ఆకాశం - వేరెన్నో నక్షత్రాలు', 'అలసిపోయిన వాడి అరణ్యకాలు' అనే రెండు కవితా సంపుటాలనూ, 'జర్నలిజంలో సృజన రాగాలు' అనే వ్యాస సంకలనమూ రాశారు.

తొలినాటి కథల్లో స్పష్టంగా వామపక్ష అభిమానాన్ని కలిగివుండిన మునిపల్లె రాజుగారిలో ఆ తరువాతి కాలంలో సంప్రదాయ సాహిత్యం పైనా, ఆధ్యాత్మిక ధోరణి పైనా మొగ్గు చోటుచేసుకున్నాయి. వర్తమానంతోనూ, వాస్తవికతతోనూ పోరాటం చేసి అలసిపోయినవాడిలా ఆయన ఆ తర్వాత ఆధ్యాత్మికతనూ, మాజిక్ రియలిజంనూ ఆలంబన చేసుకున్నారు. మాంత్రిక వాస్తవికత అనేది విదేశీయమైనది గాదనీ, అది భారతీయ ప్రాచీన సాహిత్యంలోనే వుందనీ గాఢంగా నమ్మారు.

జీవితంలో అన్ని వూర్లు తిరిగినా, మునిపల్లె రాజుగారు తమ స్వంత వూరు 'తెనాలి'ని తలచుకుంటూనే పులకించిపోయేవారు. యెప్పుడూ కొడవటిగంటి కుటుంబరావు గారి తప్పిపోయిన తమ్ముడు కొడవటిగంటి వెంకట సుబ్బయ్యనూ, అనిసెట్టి సుబ్బారావునూ గుర్తుకు తెచ్చుకునేవారు. శారద జ్ఞాపకాలనూ తవ్వుకునేవారు.

మునిపల్లె రాజు బాగా చదువుకున్న రచయిత. యింగ్లీషులో యెప్పుడూ షెర్‌వుడ్ ఆండర్‌సన్ గురించి పేర్కొనేవారు. తెలుగులో తనకు నచ్చిన కథల్ని చెప్పమంటే అనిసెట్టి సుబ్బారావుగారి 'ఎవరు, ఏమిటి? ఎందుకు?', బి.వి.ఎస్. రామారావు గారి 'ఎసరూ-అత్తెసరూ'ను యెంచుకునేవారు. హృదయమూ- మేధస్సూలతో ప్రభావితమైన కథల్లో తనకు యెక్కువగా హృదయమే పునాదిగా వుండే కథలు యిష్టమని చెప్పేవారు.

పాత ఆంధ్రపత్రిక వుగాది సంచికల్లోనూ, భారతి మాసపత్రికల్లోనూ తరచుగా కనిపించే పేరు మునిపల్లె రాజు గారిది. ఆయన రాయడం మొదలుపెట్టిన రెండో దశలో వచ్చిన చాలా విశేష సంచికలకు ఆయన రచనలు అలంకారాలయ్యాయి. తెలుగులో సాహిత్య పత్రికలు అంతరించిపోవడమూ, ఆయన రాయడం మానేయడమూ దాదాపుగా వొకసారిగానే జరిగినట్టున్నాయి. యిప్పుడాయన భౌతికంగా గూడా వెళ్లిపోయారు.

వుద్యోగం చేస్తున్న రోజుల్లో సికిందరాబాదులో యిండ్లుగా మారిన బ్రిటీషు సిపాయిల గుర్రపుశాలల్లో నివసించినప్పుడూ, వుద్యోగ విరమణ తర్వాత చిక్కడపల్లిలో చిన్నయిల్లలో వుంటున్నప్పుడూ, సైనికపురిలో తన కొడుకు కట్టిన స్విమ్మింగ్‌పూల్ కూడా వుండే విశాలమైన బంగళాకు మారినప్పుడూ- యెప్పుడూ ఆయన తనదిగాని యింటిలోకి దారితప్పి వచ్చిన బాటసారిలాగే కనిపించేవారు. తనదైన అసలైన యిల్లేదో తెలుసుకున్నట్టుగా యిప్పుడాయన యథాలాపంగా యెవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు.

◆ మధురాంతకం నరేంద్ర

కొండచిలువకు ఆహారం కాబోయి...

నలభై ఏళ్ల పాటు రక్షణరంగంలో ఉద్యోగం చేసి 1983లో రిటైర య్యారు మునిపల్లె రాజు. 'నేను ఆయుధం వాడాల్సిన అవసరం పెద్దగా రాలేదు. కానీ ఆయుధాల నిర్వహణ, వాటిని ఉపయోగిం చడం వంటివన్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నాను' అని గతంలో 'సాక్షి'తో మాట్లాడిన సందర్భంలో పేర్కొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధ సమ యంలో బర్మాకు దగ్గరగా ఫీల్డ్ ఏరియాలో, అస్సాం, మద్రాస్, వైజాగ్, పూనాలలో పనిచేశారు. గుడారంలో ఒక నులకమంచం, సమాచారం అందించడానికి అవసరమైన సామగ్రి అమర్చుకునే వాళ్లు. అదే వారి కార్యాలయం. అప్పుడు రాడార్‌లు లేవు కాబట్టి బైనా క్యులర్స్‌తో గగనతలాన్ని పరికించి చూసేవారు. 'ఆకాశంలో ఒక నల్లటి విమానం సంచరించింది, దూరంగా బాంబింగ్ జరిగిన చప్పుడు వినిపించింది. మేమున్న ప్రదేశానికి ఫలానా దిక్కులో బహుశా కిలోమీటరు దూరంలో పడి ఉండవచ్చు...' వంటి వివరా లను టెలిగ్రాఫ్ కోడ్ ద్వారా పంపించేవాళ్లమని చెప్పారు.

కుటుంబాన్ని తీసుకెళ్లలేని ప్రదేశాలను 'నో ఫ్యామిలీ స్టేషన్' అంటారు. సాహిత్యాభిమాని కావడంతో అలాంటి ప్రదేశాల్లో కూడా హాయిగా ఉద్యోగం చేశారాయన. 'వారానికోసారి పట్టణానికి వెళ్లి వారపత్రికలు తెచ్చుకుని చదువుకునే వాడిని. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేవాడిని. ఏనుగుల గుంపు జలపాతం కింద జలకాలా డటం వంటి దృశ్యాలు అద్భుతంగా ఉండేవి. ఒకరోజు కిషన్‌లాల్ అనే సహోద్యోగితో అస్సాం అడవుల్లో తిరుగుతుండగా చెట్టుకి కొండ చిలువ వేళ్లాడుతోంది. జంతువుల కోసం దాని వేట. దాని నోటికి ఆహారం కాబోయి క్షణాల్లో తప్పించుకున్నాం. ఫీల్డ్ ఏరియాలో శత్రు వుల నుంచి ప్రమాదాలను ఊహిస్తాం. కానీ ఇలా ప్రకృతి సహజమైన ప్రమాదాలను కూడా ఊహించి రక్షించుకోవాల్సిందేనని అప్పుడే తెలి సింది' అని తన అనుభవాల్ని పంచుకున్నారు.

గ్రేట్ రైటర్

గుస్తావ్ ఫ్లాబేర్




జీవితంలోని అతి చిన్న, ఎలాంటి ప్రాధాన్యతా లేని సాధారణ ఘటనలను సాహిత్యంలో చిత్రించడానికి పూనుకున్న 'లిటెరరీ రియలిజం' ఉద్యమంలో గుస్తావ్ ఫ్లాబేర్ ఒక కీలక రచయిత. జననం ఫ్రాన్సులో. జీవితకాలం 1821–1880. ఎనిమిదేళ్లకే రాయడం ప్రారంభించాడని చెబుతారు. 'మదామ్ బావరీ' నవల ఆయనకు విశేషమైన ఖ్యాతిని తెచ్చిపెట్టింది. భావానికి తగిన పదాన్ని ఎంచుకోవడం కోసం ఫ్లాబేర్ చాలా శ్రమపడతాడు. అందుకే తన జీవితకాలంలో ఎక్కువ రచనలు చేయలేకపోయాడు. మెమొయిర్స్ ఆఫ్ మేడ్‌మాన్, సెంటిమెంటల్ ఎజుకేషన్, ద టెంప్టేషన్ ఆఫ్ సెయింట్ ఆంథోనీ మొదలైనవి ఆయన ఇతర రచనలు. స్వరసామ్యము కన్నా వాక్యాల మధ్య మేళనము సరిగ్గా కుదర్చడానికి ప్రాధాన్యతనిస్తానని చెప్పుకున్నాడు. ఇరవయ్యో శతాబ్దపు రచయితలు, తాత్వికులకు ఎందరికో ప్రేరణగా నిలిచాడు. విఖ్యాత కథకుడు మపాసాకు ఫ్లాబేర్ గురుసమానుడు. ప్రాణిగా బతకడంలో భరించాల్సిన అవమానాన్ని మరొకరికి బదలాయించడం ఇష్టం లేక పిల్లలకు జన్మనివ్వకూడదనుకున్నాడు. అందుకే పెళ్లి చేసుకోలేదు.

సాహిత్య మరమరాలు

అప్పల పుస్తకంలో కవి పేరా?

'గౌతమీ గాథలు' రచయిత ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి జీవితంలో జరిగిన సంఘటన ఇది. ఆయన రామచంద్రాపురంలో కొంతకాలం తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయనకు అప్పటికే మంచి కవిగా గుర్తింపు ఉంది. ఆ కాలంలో ఆయన కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాంతో ఒకరోజు పెద్దబజారులోని ఒక నగల దుకాణానికి వెళ్లారు. వస్తువుల్ని తాకట్టు పెట్టుకుని అప్పు ఇచ్చే చోటు అది. ఇంద్రగంటి వెళ్లేసరికి అక్కడ ఒక గుమస్తా ఉన్నాడు. ఆయన పేరు రొక్కం నరసింహం. చూడటానికి అతి సాధారణ మనిషిలా కనబడ్డాడు.



హనుమచ్ఛాస్త్రి తను వచ్చిన కారణం చెప్పగానే నరసింహం నొచ్చుకున్నాడు. 'అయ్యా, మీ పాండిత్యం తెలుసు, మీ సాహిత్యం తెలుసు. మీలాంటి గొప్ప పండితుడి పేరు అప్పుల పుస్తకంలో ఉండకూడదు' అన్నాడు.

అని, తన పేరు మీద ఆ అప్పు రాసుకుని, హనుమచ్ఛాస్త్రికి కావాల్సిన నగదు ఇచ్చి పంపాడు.

ప్రతిధ్వనించే పుస్తకం

అంపశయ్య

ఒక యువకుడిలో చెలరేగిన తీవ్రమైన అంతరంగ సంవేదనల బహిఃరూపమే 'అంపశయ్య'. ఒక మారుమూల పల్లెటూరి నుంచి ఎం.ఎ. చదవడానికి వచ్చిన రవికి, ఫైనల్ పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఒక రోజు తెల్లవారుఝామున ఒక భయంకరమైన కల రావడంతో నవల ప్రారంభమవుతుంది.

తనొక అంతులేని జలపాతంలో కొట్టుకుపోతున్నట్టూ, తనను రక్షించడానికి తల్లీ, చెల్లెలూ కూడా ఆ జలపాతంలో కొట్టుకుపోవడం అనే కల అతడి మనస్తత్వానికి ప్రతీక. అతనిని వేధిస్తున్న పరీక్షల భయం; తనను చదివించడం కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు; వాళ్ళ కష్టాలు తీర్చడానికి భవిష్యత్తులో తనకు ఉద్యోగం దొరుకుతుందా లేదా అనే ఆందోళన; చిన్ననాటి నెచ్చెలి రత్తి తన పిరికితనం వల్ల బలయిపోవడం వంటి అనేక ఆలోచనలు ఆ స్వప్న రూపంలో పాఠకులకు తెలియజేస్తాడు రచయిత. ఒక విధంగా తను చెప్పాలనుకున్న ముఖ్యమైన పాయింట్‌ను ఈ ఒక్క కలతో రివీల్ చేస్తాడు.



అంపశయ్య నవీన్

ఇక ఆ రోజు జరిగిన సంఘటనలన్నీ రవిలో గొప్ప మానసిక సంఘర్షణకు దారి తీస్తాయి. డిగ్రీలో అతనికి పాఠాలు చెప్పిన లెక్చరర్ ఉపేంద్ర, యూనివర్సిటీ విద్యార్థి జీవితం 'అంపశయ్య' వంటిదనీ, ఆ దశను ముళ్ళపాన్పులాగా కాక, రాబోయే జీవితంలో ఎదుర్కొనే సమస్యలను తట్టుకునే స్థైర్యాన్ని కలిగించే పూలపాన్పులా, ప్రయోగశాలగా భావించాలనీ రవికి హితబోధ చేస్తాడు. క్యాంపస్‌కు వచ్చిన రవిని రత్తి జ్ఞాపకాలు వేధిస్తాయి. ఆ బాధలో నుండి ఒక విధమైన తెగింపు వస్తుంది. దాంతో రెడ్డి బ్యాచ్‌తో తలపడి దెబ్బలు తిని, దెబ్బలు కొట్టడంతో రెడ్డి బ్యాచ్ పారిపోతుంది. ఒక విజయం సాధించిన భావంతో రవి రూముకి వచ్చి పడుకోవడంతో నవల ముగుస్తుంది.

ఇదీ కథ. సామాన్యమైన కథే. కానీ, ఆ కథను రవి పరంగా చైతన్యస్రవంతి శిల్పంలో చెప్పిన విధానమే, ఈ నవలకు అఖండ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది. 1965–70 ప్రాంతంలో రచయిత నవీన్ తనకు కలిగిన స్వీయానుభవాలకు – ఆనాటి, అంటే స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దం గడిచినా స్వతంత్ర ఫలాలు తమకు అందకపోవడంతో నిరాశలో ఉన్న యువతీయువకుల ఆశలనూ ఆశయాలనూ అద్ది, కొంత ఈనాటి సాహిత్యకారులు ఆమోదించని బూతు మాటలను వాడటంతో అంపశయ్యకు ఒక రకమైన తిరుగుబాటు నవల అనే పేరొచ్చింది. కానీ, ఇది ఏ తరంలోని యువత ఆశయాలనైనా ప్రతిబింబించే నవల. సెక్స్, ఆకలి, పరీక్షల భయం, భవిష్యత్తు గురించిన భయాలు ఏ తరానికైనా ఒక్కటే.


◆ డాక్టర్ ప్రభాకర్ జైని

మిమ్మల్ని బాగా కదిలించిన పుస్తకం గురించి మాతో పంచుకోండి.
మెయిల్: sakshisahityam@gmail.com

కొత్త బంగారం

భార్యా, కొడుకూ పరాయి అయినప్పుడు...

ఒకానొక రాత్రి– బయో కెమిస్ట్ అయిన డగ్లస్ పీటర్‌సన్‌కు భార్య అయిన కోనీ, 'మనిద్దరి పెళ్ళి ఇంక కొనసాగలేదు' అని చెబుతుంది. భార్యని ఎంతగానో ప్రేమించే డగ్లస్, ఆమె లేకుండా తన జీవితాన్ని ఊహించుకోలేకపోతాడు. కోనీ ఆర్ట్ గ్యాలెరీలో పని చేస్తుంది. దంపతులు లండన్ నివాసులు. 18 ఏళ్ళ కొడుకైన ఎల్బీ కాలేజీలో చేరబోయేముందు కొంత మనో వినోదం కోసం తమ ముగ్గురికీ యూరప్ టూర్ ముందే బుక్ చేసుకునుంటాడు డగ్లస్.





డేవిడ్ నికొల్స్

ఆ ప్రయాణం ముగ్గురికీ దిగులు పుట్టించి తమ తమ జీవితాలని పునరావలోకనం చేసుకునేలా చేస్తుంది. ఈ పర్యటన గురించి డగ్లస్ పాఠకులకి చెప్తున్నప్పుడు, తనకి పెళ్ళయిన పాతికేళ్ళ చరిత్రనీ తవ్వుకుంటాడు. భార్యా, కొడుకూ తననుండి ఎలా దూరం అయ్యారో, తనెక్కడ తప్పు చేశానో అన్న డగ్లస్ ఆలోచనల సమాంతరమైన కథనం ఒకటి వినిపిస్తుంది. తల్లిదండ్రుల మధ్య పోట్లాటలు పెట్టి తన పని సాధించుకోవడం తెలిసిన టీనేజర్ ఎల్బీ. కొడుకు నుంచి డగ్లస్ ఎదురుకునేది నిర్లక్ష్యం, అగౌరవం, ఎగతాళీ. ఆమ్‌స్టర్‌డామ్ చేరినప్పుడు ఒక అకార్డియన్ వాయించే ఆస్ట్రేలియన్ అమ్మాయితో పారిపోతాడు ఎల్బీ. భార్య లండన్ తిరిగి వెళ్ళిపోతుంది. ఆఖరికి, డగ్లస్ ఒంటరిగానే ఇంటికి చేరుకుంటాడు.

డగ్లస్‌కు బయాలజీ గురించిన పరిజ్ఞానం బాగానే ఉంటుంది. జీవితం గురించే వీసమాత్రం కూడా తెలియదు. భార్య ప్రేమని తిరిగి పొందే అతని ప్రయత్నాలూ, కొడుకుతో తనకున్న సంబంధం పట్ల అతని దృష్టికోణమూ మనస్సుని తాకుతాయి. రెండు సమానాంతర కథనాలూ ఒకే ప్రశ్నని భిన్నమైన విధానంలో ప్రశ్నిస్తాయి: డగ్లస్‌ను కోనీ ఎందుకు వదిలి పెట్టింది! ఇద్దరివీ తూర్పూ పడమరా వంటి భిన్నమైన దృక్పథాలయినప్పుడు, అసలు డగ్లస్‌ను కోనీ పెళ్ళెందుకు చేసుకుంది?

తను ప్రేమించిన భార్యతో సంబంధం ఎలా నిలబెట్టుకోవాలో, పరాయి వాడిగా ప్రవర్తించే కొడుక్కి ఎలా దగ్గిర అవ్వాలో అని ప్రయత్నించే వ్యక్తి కథ ఇది. కథనం హాస్యంగా, స్వీయనిందతో కూడుకున్నది. పుస్తకాన్ని చదివించేది డగ్లస్ పాత్రే. యూరప్‌ను కళ్ళకి కట్టేలా వర్ణిస్తారు రచయిత. పారిస్ వర్ణన అద్భుతంగా ఉంటుంది.

ఒకే ఒక్క వ్యక్తి దృక్కోణంతో కథనం సాగినప్పటికీ, డగ్లస్ పట్ల భార్యకీ, కొడుక్కీ ఉన్న అభిప్రాయాల గురించి కూడా పాఠకులకి తెలిసే రీతిలో పుస్తకం సాగుతుంది. ఎవరినీ జడ్జ్ చేయదు నవల. ఒక దగ్గిర కూర్చుని మాట్లాడుకునే అలవాటు లేకపోవడంవల్ల కుటుంబంలో తలెత్తే అపార్థాలు, సంబంధాలు చెడిపోవడం గురించి మాట్లాడుతారు రచయిత.


ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చిన డగ్లస్, పూర్తిగా మారిన మనిషి. తన వివాహం విచ్ఛిన్నం అవడం గురించి సంతోషం కలగనప్పటికీ 'ఆ తరువాత తన జీవితం ఎలా సాగుతుందా!' అన్న అతని భయం మట్టుకు వదులుతుంది. నిశితమైన విజ్ఞతతో రాయడం వల్ల కథకుని పాత్రలు వాస్తవంగా అనిపిస్తాయి.

చదవడానికి చాలా సులభమైన నవలే కానీ కథనంలో ఉన్న హాస్యంలో తాత్విక లోతులు కనిపిస్తాయి.


ఈ నవల 2014లో వచ్చింది. స్పెక్సేవర్స్ సంస్థ రచయిత డేవిడ్ నికొల్స్‌ను 'యు.కె. ఆథర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంచుకుంది. 2014లో మాన్ బుకర్ ప్రైజుకి ఈ నవల లాంగ్ లిస్ట్ అయింది. ఆడియో పుస్తకం కూడా ఉంది.

◆ కృష్ణ వేణి


ఈవారం పుస్తకాలు



ఆచార్య జి.ఎన్.రెడ్డి పీఠికలు
సంపాదకుడు: రాచపాళెం చంద్రశేఖరరెడ్డి; పేజీలు: 240; వెల: 175; ప్రచురణ: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 1970–72 ఎం.ఎ. తెలుగు విద్యార్థులు; ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ; ఫోన్: 0866–577533



విపంచిక (వాఙ్మయ వ్యాస కోశం)
రచన: ఆచార్య దావులూరి కృష్ణకుమారి; పేజీలు: 224; వెల: 150; ప్రతులకు: నవభారతి, 5–326, ఫ్లాట్ నం.1, బృందావన అపార్ట్‌మెంట్స్, గాయత్రి నగర్, తిరుపతి. ఫోన్: 9963680940



ప్రవహిస్తున్న జ్ఞాపకం
(గంటి రాజేశ్వరరావు జీవితం)
రచన: కె.ముత్యం; పేజీలు: 184; వెల: 150; ప్రచురణ: దృష్టి; ప్రతులకు: కె.స్వయంప్రకాశ్, సంపాదకుడు, అగ్నిపూలు, 6–19–58, ఆదర్శనగర్, నిజామాబాద్–503002. రచయిత ఫోన్:9440399796



కడప నారాయణదాసు సంకీర్తనలు
కూర్పరి: స.వెం.రమేశ్; సేకరణ: ఐతం దివాకర్, ఒంట్ర పురుసోత్తం; పేజీలు: 172; వెల: 100; ప్రచురణ: తొండనాడు రచయితల సంఘం; ప్రతులకు: ఒంట్ర పురుసోత్తం, ఎ 687, బిహెచ్ఇఎల్ టౌన్‌షిప్, రాణీపేట, వేలూరు జిల్లా, తమిళనాడు–632406. ఫోన్: 9626217868

బుక్ ప్రపంచం

''కొత్త పుస్తకం ఎప్పుడు వేస్తున్నారు సార్''
అని పాత కాగితాలు కొనేవాడు అడిగే
ఆత్రుతలో అయిదు శాతం కూడా నా
అభిమాన పాఠకుల్లో కనపడట్లేదు దివ్యా!



పదం పలికింది - పాట నిలిచింది

యేరుశనగ కోసం మట్టిని దవ్వితే యేకంగా తగిలిన లంకెబిందెలాగ

సినిమా పాట ఒక 'సక్కటి' కవితైపోవడం అన్నిసార్లూ జరగదు. అట్లాంటి సందర్భం వచ్చినప్పుడు మాత్రం ప్రతిభావంతుడైన గీతరచయిత దాన్ని వదులుకోడు. దానికి, మార్చిలో విడుదల కానున్న 'రంగస్థలం' కోసం చంద్రబోస్ రాసిన ఈ గీతమే సాక్ష్యం.



యేరుశనగ కోసం మట్టిని దవ్వితే
యేకంగా తగిలిన లంకెబిందెలాగ
ఎంత సక్కగున్నావె లచ్చిమి ఎంత సక్కగున్నావె
సింతాసెట్టు ఎక్కి సిగురు కొయ్యబోతె
సేతికి అందిన సందమామలాగ / ఎంత
సక్కగున్నావె లచ్చిమి ఎంత సక్కగున్నావె

ఈ పల్లవితో సాగే ఈ పాటలో– 'రెండు కాళ్ల సినుకువి నువ్వు/ గుండె సెర్లో దూకేసినావు'; 'సెరుకుముక్క నువ్వు కొరికి తింటావుంటే... సెరుకుగెడకే తీపి రుసి తెలిపినావె'; 'తిరునాళ్లలో తప్పి ఏడ్సేటి బిడ్డకు ఎదురొచ్చిన తల్లి సిరునవ్వులాగ'; 'కడవ నువ్వు నడుమున బెట్టి కట్టమీద నడిచొత్తావుంటె సంద్రం నీ సంకెక్కినట్టు'; 'కట్టెల మోపు తలకెత్తుకోని అడుగులోన అడుగేత్తవుంటే అడవి నీకు గొడుగట్టినట్టు'; 'బురద సేలో వరి నాటు ఏత్తావుంటె... భూమి బొమ్మకు నువ్వు ప్రాణం పోస్తున్నట్టు' లాంటి చక్కటి వ్యక్తీకరణలున్నాయి. దీనికి సంగీతం, గానం దేవిశ్రీ ప్రసాద్. దర్శకుడు సుకుమార్. సమంత, రామ్‌చరణ్ నాయికానాయకులు.

రారండోయ్

- నిఖిలేశ్వర్ కవితా సంపుటాలు 'ఐదు దశాబ్దాల నిఖిలేశ్వర్ కవిత్వం'(1965–2015), 'అగ్నిశ్వాస'(2015–17), 'అనుసృజన'ల ఆవిష్కరణ మార్చి 3న సా. 5:30కు హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో జరగనుంది. నిర్వహణ: నవోదయ సాహితీ సాంస్కృతిక సంస్థ.
- 'తెలుగు లోగిలి' ఆధ్వర్యంలో– జాతీయ సహస్ర కవిసమ్మేళనం ఫిబ్రవరి 25–27 వరకు బాలికోన్నత పాఠశాల, అవనిగడ్డ, కృష్ణాజిల్లాలో జరగనుంది.
- కొలకలూరి సాహితీ పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 26న సాయంత్రం 6 గంటలకు తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనుంది.
- తెలంగాణ సాహిత్య అకాడమి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించిన 13 పుస్తకాల పరిచయ సభ ఫిబ్రవరి 28న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు రెండు సెషన్లుగా రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది.
- 'అమ్మ–నాన్న–నేను' కవితా సంకలనం (సంపాదకుడు: గుడిబండి వెంకట రెడ్డి) ఫిబ్రవరి 28న త్యాగరాయ గానసభలో ఆవిష్కరణ కానుంది.
- రవూఫ్ 'నది కాలం అతడు' ఇస్మాయిల్ ఇతివృత్త కవితా సంపుటి ఆవిష్కరణ మార్చి 4న సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది.
- బీసీ చింతనతో వెలువరించనున్న సంకలనానికి మార్చి 25లోగా బీసీ కవులు తమ కవితలు పంపమని జూలూరు గౌరీశంకర్(ఎం.ఎస్.కె. టవర్స్, ఫ్లాట్–410, స్ట్రీట్–11, హిమాయత్ నగర్, హైద్రాబాద్–26) కోరుతున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి శు.ఏకాదశి ప.3.12 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం పునర్వసు తె.4.17 వరకు (తెల్లవారితే మంగళవారం). వర్జ్యం సా.5.06 నుంచి 6.35 వరకు. దుర్ముహూర్తం ప.12.34 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.40 వరకు. అమృత ఘడియలు రా.2.03 నుంచి 3.34 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం : 6.00
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.24
జొహర్ : 12.29
అసర్ : 4.44
మగ్రీబ్ : 6.22
ఇషా : 7.34

‘నా కళ్లు చెబుతున్నాయి నిను ప్రేమించానని’ అంటూ ఒకతరం ఆమె వెంటపడింది
‘జాబిలితో చెప్పనా’ అంటూ ఒక శకం ఆమెతో పరుగు తీసింది
‘పందొమ్మిది వందల ఎనభై వరకు’ ఇట్టాంటి అందం ఎవరూ చూడలేదని అందరూ అన్నారు
దేవేంద్రునికి కూతురు ఉంటే ఇలాగే ఉంటుందని ‘అహోమహో’లు పాడారు
ఈ అతిలోక సుందరి వేయి పుంజాల వెలుతురు



మనవమ్మాయే



సోదరి శ్రీలతతో శ్రీదేవి



తల్లిదండ్రులతో శ్రీదేవి (ఫైల్)



చిన్నారి శ్రీదేవి

చంద్రగిరి/రాయచోటి రూరల్: సినీ లోకాన్ని ఏలిన ఇండియన్ సూపర్‌స్టార్, అతిలోక సుందరి శ్రీదేవి తెలుగమ్మాయే. ఈమె తల్లి రాజేశ్వరి తిరుపతిలోని తీర్థకట్టవీధిలో జన్మించారు. శ్రీదేవి అమ్మమ్మ వెంకటరత్నమ్మది వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలోని గేరంపల్లె. విద్యాభ్యాసం పూర్తిచేసి అక్కడే నర్సుగా పనిచేస్తుండేవారు. తిరుపతికి చెందిన వెంకటస్వామిరెడ్డితో వివాహం తర్వాత తీర్థకట్టవీధి డోర్ నం.93లో నివాసముండేవారు. వారికి రాజేశ్వరి, అనసూయమ్మ, అమృతమ్మ, శాంతకుమారి, బాలసుబ్రమణ్యం, సుబ్బరామయ్య సంతానం. ఇందులో మొదటి కుమార్తె శ్రీదేవి తల్లి రాజేశ్వరి. చెన్నైలో చదువుతుండగా తోటి విద్యార్థి, సేలంకు చెందిన అయ్యప్పన్‌ను ప్రేమవివాహం చేసుకుని అక్కడే స్థిరపడ్డారు. రెండో కుమార్తె అనసూయమ్మను తిరుపతి ఆకు తోటవీధిలో నివాసముంటున్న కాంట్రాక్టర్ నారాయణరెడ్డికి ఇచ్చిచేశారు. మూడో కుమార్తె అమృతమ్మ చెన్నైకి చెందిన ఇంజినీరును వివాహం చేసుకున్నారు. నాలుగో కుమార్తె శాంతకుమారి సేలంకు చెందిన మున్సిపాలిటీ ఉద్యోగి సెల్వం రెడ్డిని వివాహమాడి అక్కడే ఉండిపోయారు. శ్రీదేవి మేనమామలు బాలసుబ్రమణ్యం చెన్నైలో సెంట్రల్ ఫుడ్‌కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తూ స్థానికంగా ఉంటున్న బేబిని పెళ్లి చేసుకున్నారు. సుబ్బరామయ్య చెన్నైలోని తమిళనాడు ప్రభుత్వానికి చెందిన లెదర్ కంపనీలో పనిచేసేవారు. చంద్రగిరి మండలం ఏ.రంగంపేటకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి సోదరి నిర్మలను వివాహం చేసుకున్నారు. కాగా, 1991లో శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ చెన్నైలో మరణించారు. 1997లో తల్లి రాజేశ్వరి మృతి చెందారు. ఆమెకు అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం విదేశాలకు తీసుకెళ్లగా.. అక్కడ ఆమె తలకు ఒక వైపు చేయాల్సిన ఆపరేషన్ మరోవైపు చేయడంతో మరణించారు. ఈ సంఘటన అప్పట్లో వివాదానికి దారి తీసింది.

అనసూయమ్మ అంటే ఎంతో ఇష్టం

శ్రీదేవి పిన్నమ్మ అనసూయమ్మ అంటే శ్రీదేవికి ఎంతో ఇష్టం. వివాహంగాక ముందు శ్రీదేవిని ఎంతో ప్రేమగా చూసుకునేవారు. ఆమెకు నారాయణరెడ్డితో వివాహమైన తర్వాత తిరుపతికి వచ్చేశారు. తరచూ అనసూయమ్మ యోగక్షేమాల కోసం శ్రీదేవి తిరుపతికి వచ్చేవారు. పిన్నమ్మ ఆరోగ్యంతో పాటు వారి యోగక్షేమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించేవారు.

ఎ.రంగంపేటతో విడదీయరాని అనుబంధం

చంద్రగిరి మండంలోని ఎ.రంగంపేట గ్రామంతో నటి శ్రీదేవికి విడదీయరాని అనుబంధం ఉంది. మేనత్త నాగమ్మది రంగంపేట. ఆమె కుమార్తె అమరావతమ్మ వివాహమప్పుడు శ్రీదేవికి ఎనిమిదేళ్లు. ఆ సమయంలో సుమారు పది రోజుల పాటు శ్రీదేవి తన తల్లిదండ్రులతో వచ్చి ఎ.రంగంపేటలోని నాగమ్మ ఇంట్లోనే ఉన్నారు.

భగవంతుడు చిన్నచూపు చూశాడు

మా అన్న కుమార్తె శ్రీదేవిపై భగవంతుడు చిన్న చూపు చూశాడు. ఆమె ఎప్పుడు తిరుపతికి వచ్చినా మాతో ఎంతో ప్రేమగా మాట్లాడేది. తాను చిన్నతనంలో మా ఇంటికి వస్తే సుమారు వారం రోజులపాటు ఉండేది. నటిగా పేరుప్రఖ్యాతలు వచ్చినా ఆమె నిరాడంబరంగా అందర్నీ ఆప్యాతయంగా పలకరించేది. అలాంటి మంచి మనిషి మృతి చెందడం చాలా బాధాకరం.

– వేణుగోపాల్‌రెడ్డి, మునిరాజమ్మ దంపతులు, శ్రీదేవికి వరుసకు చిన్నాన్న, పిన్నమ్మలు, ఎ.రంగపేట



పిన్నమ్మ పిల్లలు, బంధువులతో శ్రీదేవి (ఫైల్)



పిన్నమ్మ మునిరాజమ్మను పలకరిస్తున్న శ్రీదేవి (ఫైల్)

కామరాజర్ సిఫార్సుతో సినిమాల్లోకి



ఇటీవల తిరుమల శ్రీవారి ఆలయం వద్ద శ్రీదేవి, బోనికపూర్ దంపతులు(ఫైల్)


సాక్షి, చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి కామరాజర్ సిఫార్సుతోనే శ్రీదేవి బాల నటిగా సినీ రంగంలోకి అడుగు పెట్టింది. ఈ విషయం ఆమె తండ్రి అయ్యప్పన్ సన్నిహిత మిత్రులకు మాత్రమే తెలుసు. వారిలో ఒకరైన 81 ఏళ్ల బాలు నాయకర్ శ్రీదేవి మరణవార్తతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. శ్రీదేవి స్వగ్రామంలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీదేవి తండ్రి అయ్యప్పన్, తాను సాత్తూరు కోర్టులో జూనియర్ న్యాయవాదులుగా ఉన్న సమయంలో స్నేహితులమయ్యామని చెప్పారు. అయ్యప్పన్‌కు చెన్నై సీఐటీ నగర్‌లోని ఓ ఇల్లు కూడా ఉండేదని.. శ్రీదేవి నాలుగేళ్ల వయస్సులో ఆయన చెన్నైకు వచ్చేశారన్నారు. ఆ ఇంటికి సమీపంలోనే అప్పటి కాంగ్రెస్ నేత, దివంగత సీఎం కామరాజర్ నివాసం ఉండేదని ఆయన వివరించారు. కామరాజర్‌కు అయ్యప్పన్ సన్నిహితుడని.. ఆ పరిచయం శివకాశి నియోజకవర్గం నుంచి అయ్యప్పన్ ఎమ్మెల్యేగా పోటీచేయడానికి దారితీసిందన్నారు. ఆ ఎన్నికల్లో అయ్యప్పన్ ఓడిపోయాడని, దాంతో చెన్నైకు పరిమితమైనట్టు ఆయన తెలిపారు. ఓ సాయంత్రం అయ్యప్పన్ శ్రీదేవిని వాకింగ్‌కు తీసుకెళ్లిన సమయంలో కామరాజర్ చూశారని.. అప్పట్లో చిన్నారి శ్రీదేవి అందం, చురుకుదనం చూసి అక్కడే ఉన్న రచయిత కన్నదాసన్‌ను పిలిచి సినిమాల్లో నటింపజేయడానికి ఏర్పాట్లుచేయాలని సూచించినట్టు నాయకర్ తెలిపారు. అనంతరం కామరాజర్ సిఫారసుతో కన్నదాసన్.. నిర్మాత సాండో చిన్నప్ప దేవర్‌కు శ్రీదేవి గురించి చెప్పినట్టు ఆయన వివరించారు. అదే సమయంలో బాలనటి కోసం ఎదురుచూస్తున్న దేవర్, తొనైవన్ సినిమాలో శ్రీదేవికి అవకాశం కల్పించారన్నారు. దానితో మొదలైన శ్రీదేవి సినీ ప్రస్థానం ముంబై వరకు సాగించిందని ఆయన వివరించారు. శ్రీదేవి శాశ్వతంగా దూరం కావడం వేదన కల్గిస్తోందని నాయకర్ చెప్పారు. ప్రస్తుతం మీనంపట్టిలోని పూర్వీకుల నివాసంలో అయ్యప్పన్ సోదరుడు రామస్వామి కుటుంబం ఉంటున్నట్టు ఆయన చెప్పారు.



2005 నవంబర్ 14న హైదరాబాద్‌లో 14వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవ ప్రారంభం సందర్భంగా సినీ నటి శ్రీదేవిని సన్మానిస్తున్న అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి

ప్రముఖుల సంతాపాలు

■ షాక్‌కు గురయ్యా..



శ్రీదేవీ మరణ వార్త విని షాక్‌కు గురయ్యా. కోట్లాది అభిమానుల గుండెలుబద్దలు కొట్టేసి ఆమె వెళ్లిపోయారు. మూండ్రం పిరై, లమ్హే, ఇంగ్లిష్ వింగ్లిష్ చిత్రాల్లో ఆమె నటన ఎందరో నటీనటులకు ఆదర్శం. ఆమె కుటుంబ సభ్యులకు, ఆప్తులకు నా ప్రగాఢ సానుభూతి. *– రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్*

■ ప్రతిభగల నటి..



ఎంతో ప్రతిభ కలిగిన నటి శ్రీదేవి. ఆమె హఠాన్మరణం వల్ల తీవ్ర బాధ కలిగింది. దక్షిణాది భాషా చిత్రాలతోపాటు హిందీలోనూ ఆమె వైవిధ్యభరితమైన నటనను కనబరిచారు. శ్రీదేవి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

– ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

■ ఎంతో బాధించింది..



శ్రీదేవి అకాల మరణం నన్నెంతో బాధించింది. ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో అద్భుతమైన నటనను కనబరిచి చిత్ర పరిశ్రమలో దిగ్గజ నటిగా ఆమె చెరగని ముద్రవేశారు. ఈ విషాద సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా.

– ప్రధాని నరేంద్ర మోదీ

■ బహుముఖ ప్రజ్ఞాశాలి.. అసాధారణ నటి



శ్రీదేవీ అకాల మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యా. ఆమె అసాధారణ ప్రతిభ కలిగిన నటి. బహుముఖ ప్రజ్ఞాశాలి. అనేక భాషల్లో వివిధ రకాల చిత్రాల్లో నటించారు. ఆమె కుటుంబానికి నా సానుభూతి. శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా. *–రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు*

■ చిత్ర పరిశ్రమకు చిహ్నం..



భారత చిత్ర పరిశ్రమకు చిహ్నం లాంటివారు శ్రీదేవి. తెలుగు, తమిళం, హిందీ సహా అనేక భాషల చిత్రాల్లో నటించారు. నా అభిమాన సినిమాల్లో ఆమె నటించినవి ఎన్నో ఉన్నాయి.

– ఎల్‌కే అడ్వాణీ, మాజీ ఉప ప్రధాని

■ హీరోలు ఆమె మేజిక్‌పై ఆధారపడేవారు..



హిందీ సినిమాల్లో కథానాయికలంటే హీరోలను పొగడడానికే ఉంటారన్న భావనను శ్రీదేవి చెరిపేశారు. నా చిన్నప్పటి నుంచి నేను ఆమెకు అభిమానిని. నేను నటిగా ఉన్నప్పుడు, ఆ తర్వాత కూడా పలు కార్యక్రమాల్లో శ్రీదేవిని కలిసినప్పుడల్లా ఆమె నుంచి ఏదో ఒక కొత్త విషయం నేర్చుకునేదానిని. విజయం కోసం ఎందరో హీరోలు ఆమె మేజిక్ మీద ఆధారపడేవారు.

–స్మృతీ ఇరానీ, కేంద్ర జౌళి, సమాచార, ప్రసారాల శాఖ మంత్రి

కాంగ్రెస్ ట్వీట్‌పై నెటిజన్ల ఫైర్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ నటి శ్రీదేవి హఠాన్మరణంపై సంతాపం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ట్వీటర్‌లో చేసిన ప్రకటన నెటిజన్ల ఆగ్రహానికి కారణమైంది. ఆమెకు నివాళి అర్పిస్తూ కాంగ్రెస్ ట్వీటర్‌లో ఓ పోస్ట్ చేస్తూ 2013లో ఆమెకు తామే పద్మశ్రీ పురస్కారం ఇచ్చామని కూడా అందులో పేర్కొంది. యూపీఏ హయాంలోనే శ్రీదేవి పద్మశ్రీ అందుకున్నారని సంతాప ప్రకటనలో చెప్పడంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దిగ్గజ నటి మరణాన్ని కూడా రాజకీయం చేస్తోందని, యూపీఏ హయాంలో అవార్డు ఇవ్వడాన్ని ప్రస్తావిస్తే వారికొచ్చిన లాభం ఏంటని ఒకరు ప్రశ్నించారు. శ్రీదేవికి పద్మశ్రీ ఇచ్చారు కాబట్టి కాంగ్రెస్‌కు ఓటెయ్యమని అడుగుతున్నారా? అని మరొకరు అన్నారు. ట్వీట్‌పై అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తం కావడంతో కాంగ్రెస్ చివరకు ఆ ట్వీట్‌ను తొలగించింది. అనంతరం మరో ట్వీట్ చేస్తూ ‘ఆమె భారత నాల్గవ అత్యుత్తమ పౌరపురస్కారమైన పద్మశ్రీతోపాటు, 6 ఫిలింఫేర్ అవార్డులు గెలుచుకున్నారు. నాలుగేళ్ల వయస్సులో చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి 14 ఏళ్ల వయస్సులో మొదటి ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు’ అని పేర్కొంది.

ఇంటి వద్ద భారీగా అభిమానులు..

ముంబైలోని లోఖండ్‌వాలా ప్రాంతంలో ఉన్న శ్రీదేవి ఇంటివద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమెను కడసారి చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు అక్కడకు చేరుకున్నారు. ఈ ఇంట్లో శ్రీదేవి తన భర్త, ఇద్దరు కూతుళ్లతో కలసి నివసించేవారు. శ్రీదేవి మరణవార్త బయటకొచ్చినప్పటి నుంచి అనేక మంది అభిమానులు ఆమె ఇంటికి చేరుకుంటున్నారు.

శ్రీదేవి మృతికి గవర్నర్ సంతాపం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సినీ నటి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీదేవి అకాల మరణం పట్ల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. శ్రీదేవి కుటుంబ సభ్యులకు గవర్నర్ ప్రగాఢ సంతాపం తెలిపారు.







తిరుపతిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా బంధువులతో శ్రీదేవి (ఫైల్)

ఆపోక్కో చైర్మన్ తండ్రి అఘాయిత్యం

- సహాయం కోసం వచ్చిన యువతిపై లైంగిక దాడి
- వీడియో చిత్రీకరించి బ్లాక్‌మెయిల్
- టీడీపీ నేత కావడంతో పట్టించుకోని పోలీసులు..
- మీడియాను ఆశ్రయించిన బాధితురాలు



మాట్లాడుతున్న బాధితురాలు



గుజ్జల రామకృష్ణ

హైదరాబాద్/సాక్షి, కడప: సహాయం కోసం వచ్చిన ఓ యువతిపై టీడీపీ నేత అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కూతురు వయసున్న యువతిపై లైంగిక దాడికి పాల్పడటమే కాక.. వీడియో తీసి నాలుగు నెలలుగా బ్లాక్‌మెయిల్ చేస్తూ చిత్రహింసలు పెట్టాడు. పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో.. చివరకు ఆ యువతి మీడియాను ఆశ్రయించింది. తనకు న్యాయం చేయాలని గవర్నర్ నరసింహన్‌ను వేడుకుంది. వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన బాధితురాలు ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడింది. ‘తల్లి చనిపోగా.. ఉపాధి కోసం మా నాన్నతో పాటు నా భర్త గల్ఫ్ వెళ్లారు. ఐదు నెలల నుంచి కడపలోనే లేడీస్ హాస్టల్‌లో ఉంటూ ఆస్పత్రిలో పని చేస్తున్నాను. ఈ సమయంలో ఖాజీపేటకు చెందిన సీఆర్ పాషా, ఖదీరుల్లాతో పరిచయం ఏర్పడింది. వారు ఆపోక్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాసులు తండ్రి గుజ్జల రామకృష్ణ(70)తో చెప్పి ఉద్యోగం ఇప్పిస్తామని ఆయన వద్దకు తీసుకెళ్లారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి కుట్టుమిషన్‌తో పాటు తన కుమారుడు చైర్మన్‌గా ఉన్న ఆపోక్కోలో ఉద్యోగం ఇప్పిస్తానని రామకృష్ణ హామీ ఇచ్చారు. పెద్దాయన కావడంతో ఆయన మాటలు నిజమేననుకున్నాను. ఆ తర్వాత రామకృష్ణ మాయమాటలు చెప్పి.. ఓ ఇంట్లోకి తీసుకెళ్లి బలాత్కారం చేశాడు’ అని బాధితురాలు వాపోయింది. మీ కూతురు లాంటి దానినని ఎంతగా వేడుకున్నా ఆయన వినకుండా లైంగిక దాడికి పాల్పడ్డాడని కన్నీరుపెట్టుకుంది. ఆ తర్వాత నుంచి ఫోన్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడని వివరించింది. రహస్యంగా వీడియో తీశానని, నగ్న వీడియోలు యూట్యూబ్‌లో పెడతానని బెదిరించి పలుమార్లు బలాత్కారానికి పాల్పడ్డాడని వాపోయింది. దీనిపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేస్తే.. ఏఎస్‌ఐ తనను దుర్భాషలాడాడని ఆరోపించింది. తెల్ల కాగితంపై సంతకం తీసుకొని.. రూ.50 వేలు ఇస్తాం వెళ్లిపోవాలంటూ బెదిరించినట్లు పేర్కొంది. రామకృష్ణ ఆగడాలు భరించలేక నాలుగుసార్లు ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు వివరించింది. తనకు జరిగిన అన్యాయం మరెవ్వరికీ జరగకూడదని.. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది. కాగా, రామకృష్ణ లైంగిక దాడికి సంబంధించిన వీడియోలు వాట్సాప్‌లో ప్రత్యక్షమయ్యాయి.

కందుల అమ్మకాలకు టీడీపీ టోకెన్లు

- నేతల సిఫారసులున్న రైతులకు టోకెన్లు ఇస్తున్న అధికారులు
- ఇతర రైతులు, కౌలుదారులు పంటను అమ్ముకోలేని దుస్థితి
- మొత్తం పంటలో 20 శాతం కొనుగోలుకే ప్రభుత్వం అనుమతి
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- రైతుల వద్ద కందులు కొని ప్రభుత్వానికి అమ్ముతున్న టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి: కష్టాలలో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వారిని పార్టీల వారీగా విభజిస్తూ అన్యాయం చేస్తోంది. ఈ వివక్ష కందుల కొనుగోళ్లలో స్పష్టంగా కనిపిస్తోంది. మార్కెట్ కమిటీ చైర్మన్లు, టీడీపీ కార్యకర్తలు సిఫారసు చేసిన రైతులే పంటను అమ్ముకోగలుగుతున్నారు. ఇతర రైతులు, కౌలుదారులు పంటను అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఆలస్యమైతే అమ్ముకోలేమనే ఆదుర్దాతో రైతులు పోటీపడుతున్నారు. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్లు, టీడీపీ నేతలు తమ పార్టీ సానుభూతి రైతుల పంట కొనుగోలు చేయాలని అధికారులకు సిఫారసులు చేస్తున్నారు. ఆ సిఫారసుల ఆధారంగా అధికారులూ రైతులకు టోకెన్లు ఇస్తున్నారు. దీంతో అధికారపక్ష నేతల మద్దతున్న రైతులే పంటను అమ్ముకోగలుగుతున్నారు. మిగిలిన రైతుల వద్ద నుంచి ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడంతో వారు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ రేటుకు అమ్ముకుంటున్నారు. దీనిలో కూడా టీడీపీ నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారు. కొందరు టీడీపీ నేతలు, ప్రైవేట్ వ్యాపారులతో కలసి తక్కువ ధరకు కందులు కొనుగోలు చేసి తిరిగి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. వైఎస్సార్ జిల్లాలోని కొందరు టీడీపీ నాయకులు రైతుల నుంచి తక్కువ రేటుకు కందులు కొనుగోలు చేసి, మార్క్‌ఫెడ్ కేంద్రంలో అధికధరలకు అమ్ముకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే దీనిపై కొనుగోలు చేసే సంస్థ డీసీఎంఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో ఆ కొనుగోలు సంస్థను మార్చాలని రాష్ట్ర స్థాయి నేతలతో ఒత్తిడి చేయిస్తున్నారు.

20 శాతం కొనుగోలుకే ప్రభుత్వ అనుమతి

రాష్ట్రంలో అనంతపురం, వైఎస్సార్, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో కంది పంటను దాదాపు రెండు లక్షల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో దాదాపు రెండు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని అంచనా వేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు క్వింటా కందులను రూ. 4,800లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలకు రూ. 5,450 మద్దతు ధరగా నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. నాలుగు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే పండిన పంటలో ఇరవై శాతమే రైతుల నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీసుకుంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల్లో 200 మెట్రిక్ టన్నులు సేకరిస్తే అందులో మూడొంతుల సిఫారసుల ద్వారానే కొన్నారు.

అదనపు కొనుగోలుకు ప్రభుత్వానికి వినతి

కందుల అమ్మకానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. వీరందరి నుంచి కొనుగోలు చేసే అవకాశం లేకపోవడంతో అధికారులు ప్రభుత్వానికి ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ అదనపు కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అనంతపురం జిల్లాలో 10 వేలు, కర్నూలు జిల్లాలో 14 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇవ్వాలంటూ అక్కడి జిల్లా కలెక్టర్లు ప్రభుత్వానికి వినతిపత్రం అందచేశారు. ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాల్లోని అధికారులు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరుగుతుండటం పట్ల రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలకు వెంటనే అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



ప్రకాశం జిల్లా
కనిగిరి నియోజకవర్గం
నందమారెళ్ల



పాదయాత్ర 1300 కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా మొక్క నాటి నీళ్లు పోస్తున్న వైఎస్ జగన్



జగన్‌తో కలసి నడుస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే జె.వెంకట్‌రెడ్డి, సమన్వయకర్త వెన్నా హనుమారెడ్డి



జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాదిగ కార్పొరేషన్ సాధన సమితి నేతలు

యువతోత్సాహం







యువతకు అభివాదం చేస్తున్న జన నేత



పెద్దారికట్లలో జగన్ పాదయాత్రకు యువత పోటెత్తింది. ఆద్యంతం యువకులు మిద్దెలు, బస్సులపైకి ఎక్కి ఉత్సాహంతో కేకలు వేస్తూ.. అభివాదం చేస్తూ జన నేతకు సంఘీభావం తెలిపారు. అక్కచెల్లెమ్మలు సైతం జగన్‌ను చూసేందుకు పోటీ పడ్డారు.

మాలలు, మాదిగలకు చెరో కార్పొరేషన్

పాదయాత్రలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మాలలు, మాదిగలకు చెరొక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకుంటానని ప్రతిపక్ష నేత, ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వారు తనకు రెండు కళ్లలాంటి వారని, రక్త సంబంధీకులతో సమానమని చెప్పారు. ఆదివారం 97వ రోజు ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లో ప్రజాసంకల్ప యాత్రను కొనసాగించారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆయన్ను మాదిగ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కొమ్మూరి కనకారావు మాదిగ నేతృత్వంలో పలువురు కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. మాదిగలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం ద్వారా వారు విద్యావంతులై అభివృద్ధి చెందుతారని జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ సూచించిందని కనకారావు మాదిగ వివరించారు. ఎస్సీల అభివృద్ధికి అంటూ నిధులు కేటాయిస్తున్నప్పటికీ అవి మాదిగలకు చేరువ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక వెనుకబాటు, సామాజిక వివక్ష అనుభవిస్తున్న మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా జగన్ వారితో మాట్లాడుతూ.. ఎస్సీల అభివృద్ధి కోసం ఎంతగా చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మన ఊళ్లలో కులాలతో సంబంధం లేకుండా అత్తా.. మామా.. చిన్నాన్నా.. పిన్నీ అని పిలుచుకుంటామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందని, చంద్రబాబు లాగా అబద్ధాలు చెప్పి మిమ్మల్ని మోసం చేయలేనని, వర్గీకరణ అంశంపై లోతైన అధ్యయనం చేసి మళ్లీ తనను కలవ వచ్చునని జగన్ వారికి సూచించారు. ఉత్తర భారతంలో ఒక విధంగా, దక్షిణ భారతంలో ఒక విధంగా కులాల రిజర్వేషన్లు ఉన్నాయని, వీటిపై కూడా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జగన్‌ను కలిసిన వారిలో మాదిగ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కో కన్వీనర్ తాతపూడి జయపాల్ మాదిగ, లీగల్ అడ్వయిజర్ పచ్చల శ్యాం మాదిగ, ప్రకాశం జిల్లా కన్వీనర్ చెరుకూరి కిరణ్ మాదిగ, కో కన్వీనర్ గుంటగాని పేతురు ఉన్నారు.

వెలిగొండ బాధితులను ఆదుకోండి

వెలిగొండ ప్రాజెక్టు కింద ముంపు గ్రామాల వారికి నష్ట పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సురేష్.. జగన్ దృష్టికి తీసుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు బాధితులతో కలిసి పెద్దారికట్ల సమీపంలో జగన్‌కు వారి సమస్యలు వివరించారు. 2006లో ప్రాజెక్టు కింద సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, కాటమరాజు తాండా, చింతలముడిపి గ్రామాలను ముంపు కింద ప్రకటించారని, ఇప్పటికీ బాధితులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. 2013 కేంద్ర ప్రభుత్వ చట్టం ప్రకారం పరిహారం ఇప్పించాలని వారు జగన్‌కు విజ్ఞప్తి చేశారు. ముంపు గ్రామాలుగా ప్రకటించే నాటికి ఆ గ్రామాల్లోని పిల్లలు చాలా మంది చదువుకుంటున్నారని, ఇప్పుడు వారి వయస్సు 18 ఏళ్లు దాటినందున వారికి ఉద్యోగాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముంపు గ్రామాలకు ప్రత్యేక ప్యాకేజీ కూడా ఇప్పించాలని విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని వారికి జగన్ హామీ ఇచ్చారు. కరువు కారణంగా చెట్లు ఎండిపోతుండటం వల్ల జిల్లాలో కల్లుగీత కార్మికులు అల్లాడుతున్నారని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు జననేతతో వాపోయారు. పెద్దారికట్ల దాటాక వారు జగన్‌ను కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. గతంలో కనిగిరి ప్రాంతంలో తాటిచెట్లు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం నీరు లేక ఎండిపోయాయన్నారు. కరువుతో అల్లాడుతున్న తమకు కరువు భృతి ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార యూనియన్ నుంచి తమకు రూ.9 కోట్లు రావాల్సి ఉందని, ఈ మొత్తాన్ని ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని పాల ఉత్పత్తిదారులు ప్రతిపక్ష నేతకు వినతి పత్రం అందజేశారు.

ప్రత్యేక హోదా పోరాట యోధుడు జగనే

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే పోరాట యోధుడు జగనే అంటూ ఆదివారం పెద్ద సంఖ్యలో యువత నినదించింది. ఉదయం కనిగిరి నియోజకవర్గంలోని టకారిపాలెం నుంచి పాదయాత్ర మొదలయ్యాక కాసేపటికి పెద్ద సంఖ్యలో యువకులు ప్రత్యేక హోదా ప్లకార్డులు చేత పట్టుకుని పాదయాత్ర సాగుతున్న ప్రాంతానికి వచ్చారు. హోదా కోసం పోరాడుతున్న జగన్‌కు మద్దతు పలికారు. జగన్ కూడా ప్రత్యేక హోదా ప్లకార్డు చేతబట్టుకొని యువకులతో కలిసి కొంత దూరం నడిచారు. 'ప్యాకేజీ వద్దు.. ప్రత్యేక హోదానే ముద్దు' అంటూ యువకులు నినాదాలు చేశారు. కనిగిరి నియోజకవర్గంలోని నందనమారెళ్ల గ్రామం వద్ద పాదయాత్ర 1,300 కిలోమీటర్లు పూర్తయింది. ఈ సందర్భంగా వైఎస్ జగన్ అక్కడ ఒక మొక్కను నాటారు.

సీపీఎస్ ఉద్యోగులకు భరోసా

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నాలుగేళ్లగా తాము ఎన్ని పోరాటాలు చేసినా ఇప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యూటీఎఫ్ ప్రతినిధులు జగన్‌కు విన్నవించారు. కాంట్రిబ్యూటరీ పింఛను పథకం (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరారు. సీపీఎస్ విధానం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం (సీపీఎస్‌ఈయూ) ప్రతినిధులు సైతం జగన్‌కు వినతి పత్రం అందజేశారు. ఇరు సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన జగన్.. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తక్షణమే సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత విధానం అమలుకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

అడుగడుగునా బాబు సర్కారు బాధితులే

టైలరింగ్ వృత్తితో జీవనం సాగించే వారి కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటుకు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉత్తర్వులు జారీ చేశారని, అయితే ఇప్పటి వరకు ఆ ఫెడరేషన్‌కు పాలకమండలిని కూడ నియమించలేదని టైలర్స్ వర్క్ వేల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు జగన్‌తో గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 350 దర్జీ సహకార సంఘాలు ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఫెడరేషన్‌కు పాలకమండలిని నియమించడంతో పాటు నిధులు కేటాయించాలని కోరారు. యడవలి క్రాస్ రోడ్డు వద్ద ఆల్ ఇండియా దివ్యాంగుల హక్కుల ఫోరం ప్రతినిధులు జగన్‌ను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 400 మందికి కనిగిరిలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఇప్పుడు ఆ స్థలంలో తాము బేస్‌మెంట్ వరకు ఇళ్లు కట్టుకున్నా చంద్రబాబు ప్రభుత్వం ఏవేవో సాకులు చెబుతూ బిల్లులు చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు. పొరుగు రాష్ట్రాల్లో వ్యవసాయ డిగ్రీ చదువుకున్న రాష్ట్ర విద్యార్థులకు ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ స్టూడెంట్ అసోషియేషన్ ప్రతినిధులు జగన్‌కు వినతిపత్రం ఇచ్చారు. చల్లగిరిగల, నందనమారెళ్ల గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు జననేత దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యర్రగొండపాలెం నియోజకవర్గం (ఇక్కడ పాదయాత్ర లేనందున) పార్టీ నాయకులు, అభిమానులు పెద్దారికట్ల వద్ద పాదయాత్రలో పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర 97వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,310.3 కి.మీ

97వ రోజు నడిచిన దూరం
15.3 కిలో మీటర్లు

ప్రారంభం
ఉ.8 గంటలకు టకారిపాలెం

ముగింపు
సా.5.30 గంటలకు చిన్నారికట్ల

ముఖ్యాంశాలు

- టకారిపాలెం, గడ్డమీదపల్లి క్రాస్, యడవల్లి క్రాస్, పెద్దారికట్లలో జనంతో మమేకం
- చల్లగిరిగిల, నందమారెళ్లలో పార్టీ జెండా ఆవిష్కరణ
- పాదయాత్ర 1300 కి.మీ పూర్తయిన సందర్భంగా నందమారెళ్ల వద్ద మొక్కను నాటిన జననేత

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ.8 గంటలకు చిన్నారికట్ల

ముఖ్యాంశాలు

- చిన్నారికట్ల, చిన్నారికట్ల జంక్షన్, కంబాలపాడులో జనంతో మమేకం
- పోతవరంలో పార్టీ జెండా ఆవిష్కరణ
- పొదిలిలో బహిరంగ సభ



చిన్నారికట్ల వద్ద అశేషజనవాహిని మధ్య పాదయాత్ర సాగిస్తున్న జగన్



టకారిపాలెంలో చిన్నారిని ఎత్తుకున్న జగన్



నందమారెళ్లలో అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్



ఎంత కష్టపడుతున్నావన్నా.. అంటూ టకారిపాలెం వద్ద జగన్ చేయి పట్టుకుని భావోద్వేగానికి గురైన సోదరి




కనిగిరి కొండల మధ్య దివ్యాంగుడితో మాట్లాడుతున్న జగన్



అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత

97వ రోజు

25-02-2018, ఆదివారం
చిన్నారికట్ల, ప్రకాశం జిల్లా



దివ్యాంగుల జీవితాలను మరింత దుర్భరం చేయడం న్యాయమేనా?

ఈ రోజు ఉదయం దాదాపు వందమందికిపైగా దివ్యాంగులొచ్చి కలిశారు. ఒక్కొక్కరిది ఒక్కో కష్టం. పింఛన్లు అందని, సంక్షేమ పథకాలు చేరువకాని కష్టం. స్థలాలున్నా ప్రభుత్వ గృహాలు మంజూరు కాని వైనం. 'అన్నా.. గతంలో మాలాంటి దివ్యాంగుల కోసం మీ నాన్నగారు కనిగిరి అర్బన్ కాలనీలో 250 ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారు. లోన్లు తీసుకోడానికి, ఇళ్లు కట్టుకోడానికి ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు. దివ్యాంగులకు ప్రత్యేకంగా రేషన్ కార్డులిచ్చేవారు. మాకు అవసరమైన ట్రై సైకిళ్లు.. ఇతర ఉపకరణాలకు ఇబ్బందిపడే పరిస్థితే ఉండేది కాదు. కేవలం ఒక అర్జీ ఇస్తేనే సంక్షేమ పథకాలు అందేవి. అధికారులే ఇళ్ల వద్ద కొచ్చి పింఛన్లు పంచేవారు. ఆ మంచి రోజులు అలా గడిచిపోతే.. ఇప్పుడు మాకు అంతా కష్టకాలమే. ఇళ్ల స్థలాలున్నా గృహాలు కట్టుకునే అవకాశం లేదు. ఏ సంక్షేమ పథకానికైనా సవాలక్ష నిబంధనలు. పైగా బాబుగారి హైటెక్ పాలనలో ఆన్‌లైన్ విధానమంటూ ఆఫీసుల చుట్టూ తిప్పుకొంటున్నారు. అంధులు, ఇతర దివ్యాంగులు ఎక్కువమంది నిరక్షరాస్యులే. మాకు ఎలాంటి తోడ్పాటు, సహకారం లేకపోతే.. ఆన్‌లైన్ విధానం ఎంత కష్టమోకదా! సాంకేతిక కారణాలను సాకుగా చూపి మా పింఛన్లలో, రేషన్ కార్డుల్లో, ఇతర సంక్షేమ పథకాల్లో కోత పెడుతున్నారు. అంత్యోదయ కార్డులు కూడా ఇవ్వడంలేదు. మరోపక్క, మా లాంటి వారి పట్ల కూడా జన్మభూమి కమిటీలు అన్యాయంగా వ్యవహరిస్తున్నాయి. మా దగ్గర కూడా లంచాలు వసూలు చేస్తున్నారు. మా లాంటి వారికే న్యాయం చేయకపోతే ఈ ప్రభుత్వం ఎందుకు..' అంటూ ఆవేశంతో ప్రశ్నించారు. విధివంచితులైన దివ్యాంగులకు తోడ్పాటునందించి, సహకరించాల్సిందిపోయి.. వారి జీవితాలను మరింత దుర్భరం చేయడం న్యాయమేనా? విపక్ష పార్టీలంటూ వివక్ష చూపిస్తున్న ఈ రాజ్యాంగేతర జన్మభూమి కమిటీల దుర్మార్గాలకు అంతూపొంతూ లేకుండాపోతోంది.

మధ్యాహ్నం శిబిరం దగ్గర మాదిగ కార్పొరేషన్ సాధన సమితి సభ్యులు కలిశారు. వారి రాష్ట్ర కన్వీనర్ కనకారావన్న.. చంద్రబాబు చేసిన మోసాన్ని చెప్పుకొచ్చాడు. 'గత ఎన్నికలకు ముందు బాబుగారు తన పాదయాత్రలో డప్పు కొట్టాడు.. చెప్పు కుట్టాడు. నేనే పెద్ద మాదిగనవుతాను అంటూ ఫోజులిచ్చాడు. అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ చేసేస్తానన్నాడు. కానీ నాలుగేళ్లయినా ఆ ఊసే ఎత్తడం లేదు. ఎంత మోసం..' అంటూ ఆవేదన చెందాడు. మీరు అధికారంలోకి వచ్చాక మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలంటూ ఒక వినతిపత్రం కూడా అందించాడు. చంద్రబాబు కేవలం తన రాజకీయ స్వార్థం కోసం అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి, రెచ్చగొట్టి, రాష్ట్ర పరిధిలోలేని అంశం అని తెలిసి కూడా మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, మోసపుచ్చి.. రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నించాడు. వర్గీకరణ కేంద్రం పరిధిలోని అంశం కాబట్టి.. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తానని చెప్పి ఉన్నా.. కొద్దో గొప్పో నిజాయితీగా అనిపించేది. అంతేగానీ, అధికారంలోకి వచ్చిన వెంటనే చేసేస్తాను అనడం బాబుగారి దురాలోచనకు నిదర్శనం. ఎస్సీ, ఎస్టీలుగా మారుస్తానంటూ అనేక కులాలను, బీసీల్లో చేరుస్తానంటూ కాపులను మోసగించినట్లే.. వీరినీ మోసగించాడు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఇంతలా దిగజారడం అవసరమా.. అనిపించింది. చంద్రబాబు మోసపు ఉచ్చులో పడొద్దని, మాల, మాదిగలు నాకు రెండు కళ్లు అని, మనందరి ప్రభుత్వంలో తప్పక మంచి జరుగుతుందని మనస్ఫూర్తిగా చెప్పాను. మాల, మాదిగలకు చెరో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాను.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. చేయూత పథకాన్ని పునరుద్ధరించి వికలాంగులకు ప్రోత్సాహకాలు అందిస్తానని మీ మేనిఫెస్టోలో ఘనంగా ప్రకటించుకున్నారు కదా.. మరి ఈ రోజు దివ్యాంగులంతా.. మాకెలాంటి చేయూత అందించడంలేదని, గతంలోని పథకాలను కూడా తీసేస్తున్నారని, జన్మభూమి కమిటీల అరాచకానికి బలవుతున్నామని చెబుతున్నారు. దివ్యాంగుల విషయంలోనూ ఇంత నిర్దయగా, మోసపూరితంగా వ్యవహరించడం మానవత్వమేనా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర
మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

గుండెపోటుతో ట్రాఫిక్ హోంగార్డు మృతి

పెట్టుబడుల సదస్సు జరుగుతున్న ప్రాంతంలో ఘటన



విశాఖ క్రైం: విశాఖలోని బీచ్‌రోడ్డులో పెట్టుబడుల సదస్సు జరుగుతున్న ప్రాంతంలో రెండు రోజులుగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్న మూడో పట్టణ ట్రాఫిక్ హోంగార్డు సీహెచ్ రాజు (39) గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం భాగస్వామ్య సదస్సు సమీపంలోని పోర్టు అతిథి గృహంలో విధులు నిర్వహిస్తున్న రాజు ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. దీంతో ఆయనను అక్కడ ఉన్న సిబ్బంది కేజీహెచ్‌కు తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాజు మరణించారు. రాజు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతం చిలకపేటలో నివసిస్తున్నారు. ఆయనకు భార్య రమణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'సాగర్' ఎడమకాల్వలో పడి ఐఐటీ విద్యార్థి మృతి

మృతుడు మచిలీపట్నానికి చెందిన మణిదీప్‌గా గుర్తింపు



మిర్యాలగూడ రూరల్: స్నేహితుడి సోదరి వివాహానికి వచ్చిన ఓ ఐఐటీ విద్యార్థి నాగార్జునసాగర్ ఎడమకాల్వలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తక్కెళ్లపహాడ్ గ్రామ పంచాయతీ శివారు జగ్గుతండాలో ఆదివారం జరిగింది. మృతుడు ఏపీలోని కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన మణిదీప్(23)గా పోలీసులు గుర్తించారు. తండాకు చెందిన మస్తాన్‌నాయక్ కుమారుడు నవీన్, అతని స్నేహితులు రవి, మణిదీప్ ముగ్గురు అసోంలోని గౌహతీ బీట్ కళాశాలలో ఐఐటీ చదివి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. జగ్గుతండాలో నవీన్ సోదరి వివాహానికి శనివారం హాజరైన వీరు తండా సమీపంలో సాగర్ ఎడమకాల్వలో ఆదివారం ఉదయం స్నానం చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు మణిదీప్ కాలు జారి కాల్వలో పడిపోగా..ఈత రాకపోవడంతో కొట్టుకుపోయాడు. స్నేహితులు, గ్రామస్తులు కాపాడే ప్రయత్నం చేసినా నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఫలితం లేకపోయింది. కాల్వలో అర కిలోమీటరు దూరంలో మణిదీప్ మృతదేహం బయటపడింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

భారత్‌కంటే మేమే ముందు

సీఐఐ భాగస్వామ్య సదస్సులో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్(ఈడీబీ) ర్యాంకుల్లో తాము భారతదేశం కంటే ముందంజలో ఉన్నామని, ప్రపంచ దేశాలతోనే తమకు పోటీ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఆదివారం 'రిఫామ్ కాలిక్యులస్–ప్రమోటింగ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈడీబీ ర్యాంకుల్లో భారత్ ప్రస్తుతం 100వ స్థానంలో ఉందని, రాష్ట్రానికి వచ్చిన పాయింట్ల ఆధారంగా చూస్తే ఏపీ 88వ ర్యాంకులో ఉంటుందన్నారు. 86.6 పాయింట్లతో న్యూజిలాండ్ మొదటి స్థానంలో ఉండగా, 60.8 పాయింట్లతో ఇండియా 100వ స్థానంలో ఉందని తెలిపారు. దేశంలోనే ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో మొదటి స్థానంలో ఉన్న ఏపీకి 63.6 పాయింట్లు వచ్చాయని, వీటిని పరిగణనలోకి తీసుకుంటే ఏపీకి 88వ ర్యాంకు వస్తుందన్నారు. దేశంలో తాము మొదటి స్థానంలో కొనసాగుతామని, తమకు ఇక్కడ ఎవరూ పోటీ కాదని వెల్లడించారు. ప్రపంచంలో టాప్–5 దేశాల్లో ఒకటిగా ఎదగడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

కేంద్రం వేగంగా స్పందించాలి

దేశీయంగా తమ ర్యాంకు మూడు నెలల్లో 64, 9 నెలల్లో 40కి చేర్చేందుకు రెండు లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు చంద్రబాబు వివరించారు. ఈడీబీ ర్యాంకుల లెక్కింపులో ప్రధానంగా 10 అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని, ఇందులో 7 అంశాలు కేంద్రం పరిధిలో, 3 అంశాలు రాష్ట్రం పరిధిలో ఉంటాయన్నారు. కాబట్టి కేంద్రం వేగంగా స్పందిస్తే ర్యాంకు మరింత మెరుగవుతుందన్నారు.



విదేశీ ప్రతినిధులతో సీఎం ఎంఓయూ

కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సీఐఐ సదస్సులో 'టెక్నాలజీస్ ఫర్ టుమారోస్' అనే అంశంపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలా తరహాలో విశాఖను ఇన్నోవేటివ్ వ్యాలీగా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు కనుగొన్న నూతన ఆవిష్కరణలను ఇంక్యుబేషన్, స్టార్టప్ ఫండ్‌ల ద్వారా ప్రోత్సహించడానికి ఇన్నోవేషన్ సొసైటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు సమాచారాన్ని క్షణాల్లో అందించేందుకు మార్చి నాటికి ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ ఈ–ఆఫీస్, ఈ–ఫైలింగ్ పరిధిలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలకు ప్రతినిధులు వారి ఆవిష్కరణలను వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్‌ను ఆదే చేసే ఐవోటీ టెక్నాలజీని అందించడానికి అటోగ్రిడ్ సదరన్ డిస్కమ్‌తో ఒప్పందం చేసుకుంది.

బొమ్మ బాగుంది.. మాటలో స్పష్టత లేదు

ఫైబర్ నెట్ ద్వారా వర్చువల్ బోధనా తరగతులను ఎలా నిర్వహిస్తున్నారో తెలియచేయడానికి చేసిన ప్రయత్నం ఎదురు తన్నింది. సీఐఐ సదస్సును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలకు ప్రత్యక్ష ప్రసారం చేయడమే కాకుండా వారి నుంచి ప్రశ్నలు అడిగి సమాధానం ఇచ్చే ప్రయత్నం ముఖ్యమంత్రి చేశారు. కానీ, వీడియో కాన్ఫరెన్స్ వెంటనే కనెక్ట్ కాకపోవడంతో సదస్సుకు వచ్చిన విద్యార్థిని అడిగిన ప్రశ్నకు చంద్రబాబు సమాధానమిచ్చారు. ఆ తర్వాత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రా వర్సిటీ నుంచి మరో విద్యార్థిని మూడుసార్లు ప్రశ్న అడిగినా సీఎంకి అర్థం కాలేదు. దీంతో వీడియో బాగా వస్తోంది కానీ ఆడియోలో స్పష్టత లేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

శ్రీదేవి మృతి పట్ల సంతాపం

ప్రముఖ సినీ నటి శ్రీదేవి మరణానికి ఆదివారం సీఐఐ ఘనంగా సంతాపం తెలిపింది. పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ప్రారంభానికి ముందుగా ఒక నిమిషం మౌనం పాటించి శ్రీదేవికి నివాళుర్పించారు.

ప్లీజ్ ఆఫ్ డూయింగ్ ఉండాలి: సురేష్ ప్రభు..

దేశంలో చేపట్టిన సంస్కరణల వల్ల ఈడీబీలో ఇండియా ర్యాంకు మరింత మెరుగవుతుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం సీసీఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వ్యాపారం అనేది సంతోషంగా చేయాలని, అందుకే ఈజ్ ఆఫ్ డూయింగ్ కాకుండా ప్లీజ్ ఆఫ్ డూయింగ్ ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ నియమ నిబంధనలకు సంబంధించిన బుక్‌లెట్‌ను సురేష్ ప్రభు ఆవిష్కరించారు. అనంతరం కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఎఫ్‌టీ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ) క్యాంపస్‌లకు శంకుస్థాపన చేశారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో రూపొందించిన ఈ–స్పైస్ బజార్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. 'ఎంపెడా' రూపొందించిన ఎన్‌రోల్‌మెంట్ కార్డులను ఆక్వా రైతులకు అందచేశారు.

చంద్రబాబులో ఎందుకా కలవరం..?

''ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకో కలవర పడుతున్నారు. కేంద్రంలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు కారణమా?'' విశాఖ కేంద్రంగా రెండు రోజులుగా జరుగుతున్న పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో సర్వత్రా జరుగుతున్న చర్చ ఇది. టీ విరామం, భోజన సమయాల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గుంపులు గుంపులుగా చేరి ఇదే అంశంపై చర్చించుకుంటున్నారు. గతంలో జరిగిన రెండు సదస్సుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్సాహంగా కన్పించారు. రాష్ట్రాన్ని తాను చాలా అభివృద్ధి చేశానంటూ ప్రతి సెమినార్‌లోనూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేవారు. అవకాశం దొరికినప్పుడల్లా మీడియా ముందుకొచ్చి పారిశ్రామిక అవగాహన ఒప్పందాలపై మాట్లాడేవారు. పత్రికా ప్రతినిధులను తన చాంబర్‌కే పిలిపించుకుని ఇష్టాగోష్టి నిర్వహించేవారు. కానీ, ఈసారి ఆయన ముఖంలో కలవరం స్పష్టంగా కన్పిస్తోందని సదస్సుకు వచ్చినవారు చెబుతున్నారు. చంద్రబాబు ప్రతి గంటకోసారి తన చాంబర్‌లోకి వచ్చి, జాతీయ రాజకీయ పరిణామాలు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై పార్టీ సన్నిహితులతో చర్చిస్తున్నారని ప్రతిసారి ఒక్కరే రహస్య గదిలోకి వెళ్లి ఫోన్‌లో మాట్లాడుతున్నారని అధికార వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఓటుకు కోట్లు కేసు కీలక మలుపు తిరగడం కూడా ముఖ్యమంత్రి కలవరానికి కారణంగా చెప్పుకుంటున్నారు.

రెండో రోజు పెట్టుబడులు రూ.1.74 లక్షల కోట్లు

పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి



సాక్షి, విశాఖపట్నం: భాగస్వామ్య సదస్సులో రెండో రోజు వివిధ రంగాల్లో రూ.1,74,568 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివిధ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో 285 అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. తొలిరోజు శనివారం 79 అవగాహన ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా రూ.44,264 కోట్ల పెట్టుబడులకు ఆస్కారమేర్పడిందని పేర్కొన్నారు. రెండు రోజుల్లో మొత్తం 364 ఒప్పందాలు జరిగాయని, రూ.2,18,814 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఔత్సాహికులు ఆసక్తి చూపారన్నారు.

కేటాయింపులే.. నిధులివ్వడం లేదు: మంత్రి ప్రత్తిపాటి

కేంద్ర ప్రభుత్వం ఏపీకి కేటాయింపులే తప్ప నిధులివ్వడం లేదని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. కేంద్రం అరకొరగా ఇస్తున్న నిధులతో చిన్నపాటి పనులు కూడా జరగడం లేదన్నారు. విభజన హామీలను మార్చి 5 లోగా అమలు చేయని పక్షంలో ఏం చేయాలన్న దానిపై సీఎం నిర్ణయం తీసుకుంటారన్నారు.

రూ.16 వేల కోట్లతో ఎకనామిక్ సిటీలు

ఎల్‌ఈపీఎల్ ప్రాజెక్టు సీఈవో నరసింహం



రాజధాని అమరావతితోపాటు విశాఖ జిల్లా అచ్యుతాపురంలో ఎకనామిక్ సిటీల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామని ఎల్‌ఈపీఎల్ ప్రాజెక్ట్స్ సీఈవో జీపీవీ నరసింహం చెప్పారు. ఇందుకోసం అమరావతిలో రూ.15వేల కోట్లు, అచ్యుతాపురంలో రూ.1,000 కోట్లు వెచ్చించనున్నామని తెలిపారు. తమ సొంత స్థలాల్లోనే వీటి నిర్మాణ పనులను వచ్చే నెలలో ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.

ప్రతి వ్యక్తికి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు

వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి పూనం మాలకొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పూనం మాలకొండయ్య

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): దేశంలోనే తొలిసారిగా ఏపీలో ప్రతి ఒక్కరి వ్యక్తిగత ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు నమోదుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శ్రీకారం చుట్టినట్లు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. ఆదివారం 'ఆపర్చునిటీ ఫర్ ఇన్నోవేషన్ అండ్ గ్రోత్ ఇన్ ఇండియన్ మెడికల్ డివైస్ మార్కెట్' అనే అంశంపై చర్చా వేదికలో ఆమె మాట్లాడారు. ఈ–హెల్త్ రికార్డు పేరిట ఈ నమోదు కార్యక్రమాన్ని రెండు నెలల్లో ప్రారంభిస్తామని చెప్పారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా ఆయుష్మాన్‌భవ అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

రెండేళ్లలో లక్ష విద్యుత్ వాహనాలు

నెడ్‌క్యాప్ రాష్ట్ర వీసీ, ఎండీ కమలాకరబాబు

పెదవాల్తేరు(విశాఖ తూర్పు): రానున్న రెండేళ్ల కాలంలో లక్ష విద్యుత్ వాహనాలు రాష్ట్రానికి వస్తాయని రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కమలాకరబాబు ఆదివారం వెల్లడించారు. ఈ మేరకు 15 రోజుల్లోగా అధికారులు, ఆటోమొబైల్ రంగ నిపుణులు, కార్ల పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం జరుగుతుందన్నారు.

'మేక్ ఇన్ ఇండియా'తో రక్షణ రంగానికి ఊతం

ఏపీ పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థనాథ్ జైన్



ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): మేక్ ఇన్ ఇండియా ప్రాజెక్టుతో దేశంలో రక్షణ రంగంలో పెట్టుబడులకు మద్దతు పెరిగిందని ఏపీ పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థనాథ్ జైన్ చెప్పారు. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సెక్టార్ డెవలప్‌మెంట్ అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.

మీకు తెలియకుండానే ఏసీ ఆపేస్తాం!

విశాఖ నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి: మీ ఇంట్లో ఏసీ ఎప్పుడు ఆన్, ఆఫ్ చేయాలనేది ఇక మీ ఇష్టం కాదు. వినడానికి వింతగా ఉందా? సాంకేతిక పరిజ్ఞానంతో ఇలాంటి అద్భుతం సృష్టిస్తామంటోంది అటోగ్రిడ్ అనే సంస్థ. రాష్ట్రంలో విద్యుత్‌కు డిమాండ్ ఒక్కసారిగా పెరిగితే పవర్ గ్రిడ్‌పై భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ఏసీలు, పంపుసెట్లను నియంత్రించేందుకు ఇంటర్నెట్ థింగ్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తామని అటోగ్రిడ్ ముందుకొచ్చింది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థతో ఈ మేరకు అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.

ఏపీలో రిలయన్స్ రూ.55 వేల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో రూ.55,000 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రిలయన్స్ గ్రూపు ముందుకొచ్చింది. ఇందులో రూ.40,000 కోట్లు కేజీడీ6 బ్లాక్‌లో ఇన్వెస్ట్ చేయనుండగా, ఎలక్ట్రానిక్స్ రంగంలో మరో 15,000 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, బీపీ ఇంటర్నేషనల్ 50:50 భాగస్వామ్యంగా ఉన్న ఇండియా గ్యాస్ సొల్యూషన్స్ సంస్థ ఇండియాలో గ్యాస్, ఎల్‌ఎన్‌జీని మార్కెటింగ్ చేయడానికి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్‌ఐఎల్ అనుబంధ కంపెనీ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ తిరుపతిలో ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రం, అమరావతిలో అంతర్జాతీయ మౌలిక వసతులను కల్పించనుంది. తిరుపతి వద్ద మొబైల్‌ఫోన్లు, సెట్‌టాప్ బాక్స్‌ల తయారీ కేంద్రాన్ని రిలయన్స్ ఏర్పాటు చేయనుంది.

గోతికాడ గుంటనక్క చంద్రబాబు

- వైఎస్సార్‌పై చేసిన విధంగానే వైఎస్ జగన్‌పైనా దాడి చేస్తున్నారు
- నాడు సోనియా... నేడు మోదీ వద్ద సాగిలపడ్డాడు
- 2014లో మూడు పార్టీలు కలిసి పోటీచేస్తే... జగన్ ఒంటరి పోరాటం చేశాడు
- క్రమశిక్షణ.. చిత్తశుద్ధితో పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం
- చిత్తూరు జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల్లో వైఎస్సార్‌సీపీ నేతలు



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఉమ్మారెడ్డి, చిత్రంలో విజయసాయిరెడ్డి, భూమన, మోపిదేవి తదితరులు

సాక్షి, తిరుపతి: సీఎం చంద్రబాబునాయుడు గోతికాడ గుంటనక్క లాంటి వాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శించారు. కుట్ర రాజకీయాలతో నాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిపై దాడి చేసిన విధంగానే నేడు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పైనా టీడీపీ నేతలు, ఎల్లో మీడియా వాళ్లు దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. తిరుపతి పీఎల్‌ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణ, తమ్మినేని సీతారాం, చిత్తూరు, కుప్పం, తంబళ్లపల్లి, పలమనేరు నియోజకవర్గాల సమన్వయ కర్తలు జంగాలపల్లి శ్రీనివాసులు, చంద్రమౌళి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తదితరులు ప్రసంగించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి క్రమశిక్షణకు మారుపేరని, ఆయన ఆశయ సాధన కోసం ఏర్పడిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులు పూర్తిచేసి వ్యవసాయాన్ని పండుగచేసిన సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి ఒక్కరి గుండెల్లో నిలిచిపోయారని కీర్తించారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. దాని స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పథకాన్ని రూపొందిస్తోందన్నారు.

నాడు సోనియా... నేడు మోదీ వద్ద చంద్రబాబు సాగిలపడ్డారు..

ఓదార్పుయాత్రలో వైఎస్ జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తనకు ప్రత్యర్థి జగనే అని భావించిన చంద్రబాబు నాడు సోనియా వద్ద సాగిలపడి అక్రమ కేసులు బనాయించారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. నేడు పొత్తు పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోది పంచన చేరాడన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డిపై జరిగిన విధంగానే నేడు ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌పై కూడా దాడి జరుగుతోందని వివరించారు. అప్పట్లో మహానేత మరణాన్ని జీర్ణించుకోలేక 675 మంది గుండెలు ఆగిపోయాయన్నారు. అదే చంద్రబాబుపై బాంబు దాడి జరిగితే కనీసం అలిపిరిలోని టీ దుకాణమూ మూతపడలేదని ఎద్దేవా చేశారు.

మనం ఓడిపోలేదు..

2014లో వైఎస్సార్‌సీపీ ఓడిపోయిందన్న టీడీపీ ఆరోపణల్లో వాస్తవం లేదని కేంద్ర మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటిసారిగా రెండు స్థానాల్లో విజయం సాధిస్తే రెండోసారి ఉప ఎన్నికల్లో 16 స్థానాలు కైవసం చేసుకున్నట్లు గుర్తు చేశారు. మూడవ పర్యాయం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏకంగా 67 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించినట్లు ఉమ్మారెడ్డి వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో 167 స్థానాల్లో విజయం సాధించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. అంతకు ముందు మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ నేతలు ఓట్లను తొలగించి దొంగఓట్లు చేర్చుకుంటోందని ఆరోపించారు. అధికార మదంతో డబ్బుసంపాదనే ప్రధాన అజెండాగా టీడీపీ పనిచేస్తోందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఇంకా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రెడ్డమ్మ, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబువన్నీ నాటకాలు, అబద్ధాలే

- కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ మండిపాటు
- విభజన చట్టం శాస్త్రీయంగా లేకపోతే సవరణలు చేయరేం?
- 11 రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక హోదాను ఏపీకి ఎందుకివ్వలేదు?



సమావేశంలో మాట్లాడుతున్న జైరామ్ రమేష్

సాక్షి, అమరావతి: ''పార్లమెంట్‌లో టీడీపీ, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నాయి. విభజన చట్టంలో ఏపీకి ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా ఎన్డీయే ప్రభుత్వం నెరవేర్చలేదు. విభజన చట్టం అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉన్నందునే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదంటూ సీఎం చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారు, అబద్ధాలు చెబుతున్నారు. నిజంగా అప్పట్లో యూపీఏ ప్రభుత్వం చేసిన చట్టం అశాస్త్రీయంగా ఉంటే ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామి అయిన టీడీపీ ఎందుకు సవరణలు చేయించలేదు?'' అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ నిప్పులు చెరిగారు. ఆయన ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కంకణం కట్టుకుంటానని 2014 ఏప్రిల్ 30న తిరుపతిలో శ్రీవారి పాదాల చెంత ఇచ్చిన హామీని మోదీ ఎందుకు అమలు చేయలేదన్నారు.

ఆ 7 నెలల్లో ఏం చేశారు?

''11 రాష్ట్రాలకు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇచ్చినప్పుడు 12వ రాష్ట్రంగా ఏపీకి ఎందుకు ఇవ్వరు? 2014 జూన్ 8న చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక హోదాను రద్దు చేయాలని ఆర్థిక సంఘం పేర్కొన్నట్లు 2015 ఫిబ్రవరిలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. అంటే చంద్రబాబు సీఎం అయిన ఏడు నెలల తర్వాతన్నమాట! మరి ఈ ఏడు నెలల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని చంద్రబాబు ఒక్క లేఖ కూడా కేంద్రానికి ఎందుకు రాయలేదు? ఏడు నెలలు నిద్రపోయారా? చత్తీస్‌గఢ్‌కు ప్రత్యేక హోదా విషయం చట్టంలో లేకపోయినా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ఇచ్చేశారు. ప్రధానమంత్రి తలచుకుంటే విశాఖ రైల్వే జోన్ ఇవ్వడానికి రెండు నిమిషాలు కూడా పట్టదు'' అని జైరాం రమేష్ తేల్చిచెప్పారు.

బాబు ముడుపుల కోసం ప్రజలకు భారం

''పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సహాయ, పునరావాస ప్యాకేజీ అమలుతో సహా ప్రాజెక్టు మొత్తం నిర్మాణ బాధ్యతలను కేంద్రం చేపడుతుందని విభజన చట్టంలోని సెక్షన్ 90లో స్పష్టంగా ఉంది. చంద్రబాబు దృష్టిలో ఇది అశాస్త్రీయమా? చంద్రబాబు ముడుపుల కోసం ఈ ప్రాజెక్టును చేపట్టినందుకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలు ఎందుకు భరించాలి? ఏపీకి బీజేపీ న్యాయం చేయకపోతే ఎన్డీయే ప్రభుత్వం నుంచి టీడీపీ మంత్రులు ఎందుకు బయటకు రాలేదు? విభజన చట్టం అశాస్త్రీయంగా ఉందనడం దారుణం. ఇంతకంటే మంచిగా సవరణలు ప్రతిపాదిస్తే మేం సరిగ్గా చేయలేదని అంగీకరించి, సభలోనే క్షమాపణ చెప్పి మద్దతు ఇస్తాం. 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదట ఏపీ రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలు ఫైల్‌పైనే ప్రధాని తొలి సంతకం చేస్తారు'' జైరాం రమేష్ ఉద్ఘాటించారు. సమావేశంలో ఎంపీ జేడీ శీలం, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, పార్టీ నేత రుద్రరాజు పాల్గొన్నారు.

బీటీ కళాశాలలో జనగణమన శతాబ్ది ఉత్సవాలు



రవీంద్రుడికి నివాళులర్పిస్తున్న కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ తదితరులు

మదనపల్లె: చిత్తూరు జిల్లా మదనపల్లె బీటీ కళాశాల వేదికగా జనగణమన శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి జనగణమన గీతాన్ని అనువదించి బాణీ కట్టి ఫిబ్రవరి 24కు వందేళ్లు పూర్తి కావచ్చిన సందర్భంగా బీసెంట్ థియోసాఫికల్(బీటీ) కళాశాల యాజమాన్యం శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఆయన వందేళ్ల కిందట మదనపల్లెకు వచ్చిన ఫిబ్రవరి 24 నుంచి జనగణమన జాతీయ గీతాలాపన చేసిన ఫిబ్రవరి 28 వరకు నాలుగు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆదివారం బీటీ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ అనిబిసెంట్, గురుదేవులు రవీంద్రుడి విగ్రహాలకు శ్రద్ధాంజలి ఘటించి శతాబ్ది సంబరాలను ప్రారంభించారు. జాతీయగీతంగా జనగణమన, బీటీ కళాశాల నేపథ్యం, రవీంద్రుడి ప్రస్థానం, జనగణమన అనువాదానికి సహకరించిన పరిస్థితులు, గీతానికి బాణీలు కట్టిన విదేశీయురాలు మార్గరెట్ కజిన్స్, స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకాలను ప్రత్యేక సమావేశంలో గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీటీ కళాశాల కరస్పాండెంట్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో వేయి కవితల పండుగ

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన కవులు, సాహితీ వేత్తలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిక్క కృష్ణ

అవనిగడ్డ: జాతీయ సహస్ర కవి సమ్మేళనం, వేయి కవితల పండుగ కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖ కవులు, రచయితలు పాల్గొన్నారు. తొలిరోజు 330 మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. తెలుగు లోగిలి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పేర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సాహితీ విమర్శకులు బిక్క కృష్ణ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రామాలు, మండలాల్లో కవి సమ్మేళనాలు నిర్వహించినప్పుడే తెలుగు భాషాభివృద్ధి సాధ్యమన్నారు. ఆంధ్రప్రభ సంపాదకుడు వైఎస్సార్ శర్మ మాట్లాడుతూ టీవీ సీరియళ్లు, సెల్‌ఫోన్లు వచ్చాక పుస్తకాలు చదివే వారి సంఖ్య తగ్గిందన్నారు. నాలుగేళ్ల నుంచి కవితలు రాసేవారు పెరగడం మంచి పరిణామమన్నారు. కవుల ప్రతిభా పాటవాలు వెలికి తీసేందుకు ఈ ఉత్సవాలు దోహద పడతాయని సినీ దర్శకుడు ప్రభాకర్ జైనీ అన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు..

- నలుగురు దుర్మరణం
- మరో తొమ్మిది మందికి గాయాలు
- మృతులు గుంటూరు జిల్లా వాసులు



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

రొంపిచర్ల: వేర్వేరు కుటుంబాలకు చెందిన 13 మంది దైవదర్శనానికి వెళ్లి స్వస్థలానికి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం అద్దంకి– నార్కెట్‌పల్లి రహదారి పక్కన ఉన్న అన్నవరప్పాడు గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వేర్వేరు కుటుంబాలకు చెందిన 13 మంది దైవదర్శనం కోసం ఈనెల 22న కారులో తిరుమల వెళ్లారు. దైవదర్శనం చేసుకొని తిరిగి స్వస్థలం పిడుగురాళ్లకు వస్తుండగా అన్నవరప్పాడు వద్ద ప్రమాదం జరిగింది. ఘటనలో క్రోసూరు మండలం గుడిపాడుకు చెందిన కొత్తూరి యూన్స్(40), ఆమె కుమారుడు కొత్తూరి రోహిత్(14)తో పాటు పిడుగురాళ్లలో మరో కుటుంబానికి చెందిన కొడమగుండ్ల మన్విత(5) అనే చిన్నారి అక్కడికక్కడే మృతి చెందారు. నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మన్విత తల్లి కొడమగుండ్ల మోతి(40) అనే మహిళ కూడా మృతి చెందింది. ప్రమాదంలో మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. వారిని నరసరావుపేటలో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో గుంటూరుకు తరలించారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు, రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్.ఐ వెంకటరావు సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేసే వారికే యాదవుల మద్దతు

ఏబీవైఎం జాతీయ ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య యాదవ్



మాట్లాడుతున్న రామచంద్రయ్య యాదవ్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసే పార్టీకే తమ మద్దతు ఉంటుందని అఖిల భారతీయ యాదవ మహాసభ (ఏబీవైఎం) జాతీయ ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిలో యాదవ భవన్ నిర్మించాలని కోరారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన రాష్ట్ర యాదవ యువగర్జన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఏ ప్రభుత్వం లోనైనా యాదవ సామాజికవర్గానికి అన్యాయమే జరుగుతోందన్నారు. సీఎం యాదవులపై ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే టీటీడీ చైర్మన్‌గా పుట్టా సుధాకర్ యాదవ్‌ను కొనసాగించాలన్నారు.

ఉరివేసుకుంటున్నట్లు సెల్ఫీ

తమిళనాడులో వ్యక్తి ఆత్మహత్య

సేలం (తమిళనాడు): వ్యాపారంలో నష్టంతో అప్పులపాలైన ఓ వ్యక్తి తీవ్ర మనోవేదనతో ఉరివేసుకుంటున్న దృశ్యాన్ని సెల్ఫీ తీసుకుని అనంతరం బలవన్మరణానికి పాల్పడ్డాడు. తనను కొందరు వేధించారంటూ వారి పేర్లను లిస్టుగా రాసి జేబులో పెట్టుకున్నాడు. తమిళనాడులోని సేలం జిల్లాలో ఈ ఘటన జరిగింది. సెమ్మన పట్టి యానాది కాలనీకి చెందిన సి.మురుగన్ (34) ఓ దుకాణం ఏర్పాటు చేసుకుని వస్త్ర వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. అప్పుల వారి ఒత్తిళ్లు పెరిగిపోవడంతో చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి కురువల్లి సమీపంలోని వెంకటరమణ ఆలయం కోనేరు వద్ద ఉరి వేసుకున్న విధంగా సెల్ఫీ తీసుకుని ఫేస్‌బుక్‌లో పెట్టాడు. ఒత్తిడి చేసిన అప్పుల వారి పేర్లు రాసి జేబులో పెట్టుకున్నాడు. పోలీసులు అక్కడకు చేరుకునేసరికే మురుగన్ చనిపోయాడు.

మహిళలకు సమ ప్రాతినిధ్యం

ఇది భారతీయులందరి ప్రాథమిక విధి ● మన్ కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ/సూరత్

మన జీవితాల్లోని ప్రతి అంశంలోనూ, అడుగులోనూ మహిళ పాత్ర ఉండేలా చూసుకోవడం ప్రతి ఒక్క భారతీయుడి ప్రాథమిక విధి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మాసాంతపు రేడియో కార్యక్రమం 'మనసులో మాట' (మన్ కీ బాత్)లో ఆయన ఆదివారం ప్రసంగించారు. నవ భారతమంటే శక్తిమంతమైన, సాధికారత కలిగిన, అభివృద్ధి కార్యక్రమాల్లో సగం పాత్ర పోషించే మహిళలు ఉండే భారతదేశమని మోదీ నిర్వచించారు. స్త్రీలలో ఉండే అంతర్ శక్తి, ఆత్మ విశ్వాసమే వారిని నేడు తమ కాళ్లపై నిలబడగలిగేలా చేస్తున్నాయన్నారు. 'ఆమె తను ఎదగడమే కాకుండా దేశాన్ని, సమాజాన్ని కూడా కొత్త శిఖరాలకు తీసుకెళ్తోంది. నేడు దేశం మహిళాభివృద్ధి అనే దారిలో కాకుండా, ఆ మహిళలే నాయకత్వం వహిస్తున్న దారిలో పయనిస్తోంది' అని మోదీ ప్రశంసించారు. స్వామి వివేకానందుడు చెప్పిన 'పరిపూర్ణ స్త్రీత్వమే పరిపూర్ణ స్వాతంత్ర్యం' అన్న సూక్తిని మోదీ గుర్తుచేశారు. స్త్రీ పేరుతో పురుషుడిని గుర్తించే సంప్రదాయంలో మనం భాగమనీ, యశోదా నందన్, కౌసల్యా నందన్, గాంధారి పుత్ర తదితర పేర్లే అందుకు నిదర్శనమన్నారు. ఈ నెల 28న జరుపుకోనున్న జాతీయ విజ్ఞాన దినోత్సవం గురించి మోదీ ప్రస్తావిస్తూ.. ప్రశ్నలకు సమాధానాలు వచ్చేంతవరకూ పరిశోధనలు చేస్తూనే ఉండాలన్నారు.

నిబంధనలను పాటిస్తేనే భద్రత

మార్చి 4న పాటించే జాతీయ భద్రతా దినోత్సవం గురించి కూడా మోదీ మాట్లాడారు. ప్రజలంతా భద్రతను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. ఎన్నో పెద్దపెద్ద విపత్తులను నివారించడంలో ఇది సాయపడుతుందని ఆయన సూచించారు. ప్రజలు రోడ్లపై సూచిక బోర్డులను చదువుతారేగానీ ఆ నిబంధనలను పాటించరంటూ విచారం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తే మానవ తప్పిదాల వల్ల జరిగే ఎన్నో ప్రమాదాలను నివారించవచ్చని మోదీ పేర్కొన్నారు. ఇటీవలే ప్రారంభించిన 'గోబర్ (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో అగ్రో రిసోర్సెస్) ధన్' పథకం గురించి కూడా మోదీ ప్రస్తావించారు. పల్లెలను పరిశుభ్రంగా మార్చడానికే ఈ పథకం తీసుకొచ్చామనీ, పశువుల పేడ, పంట వ్యర్థాలతో పర్యావరణహిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయడం ద్వారా రైతులకు ఆదాయం సమకూర్చడమే దీని ఉద్దేశమన్నారు. ఈ వారంలోనే జరుపుకోనున్న హోలీ పండుగ అందరి జీవితాల్లోనూ రంగులు నింపాలని మోదీ ఆకాంక్షించారు.

కులమతాల్లేని నవ భారతాన్ని నిర్మిద్దాం

కుల, మత, అవినీతిరహిత నవభారతాన్ని నిర్మించాలని మోదీ పిలుపునిచ్చారు. డైమండ్ సిటీ సూరత్‌లో 'రన్ ఫర్ న్యూ ఇండియా' పేరుతో ఏర్పాటుచేసిన మారథాన్‌ను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు మోదీ మాట్లాడుతూ.. 'ప్రపంచమంతా భారత ప్రాముఖ్యాన్ని గుర్తించటం ప్రారంభించింది. మనలోని లోపాలను పక్కనబెట్టాల్సిన అవసరం ఉంది. కులమనే విషప్రభావం లేని నవభారతాన్ని నిర్మించుకోవాలి. ఈ నవభారతంలో మతవివాదాలు, అవినీతి ఉండకూడదు. ప్రతిపౌరుడికీ సాధికారత కలిగిన నవభారతాన్ని నిర్మిద్దాం' అని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయులను గౌరవించుకోవాలన్నారు. ప్రజల శక్తిని ప్రశంసిస్తూ.. 'ఏ దేశాన్నైనా.. నేతలు, ప్రభుత్వాలు నిర్మించలేదు. పౌరుల బలంతోనే దేశం నిర్మితమైంది' అని తెలిపారు. యోగా దినోత్సవం, అక్టోబర్‌లో సమగ్రతా పరుగు కార్యక్రమాలను కూడా విజయవంతం చేయాలని సూరత్ ప్రజలను మోదీ కోరారు.


శ్రీ అరవిందోకు నివాళులర్పిస్తున్న మోదీ


ఆరవిల్‌లోని మాత్రీ మందిర్‌ను సందర్శించిన ప్రధాని మోదీ

ఈ 48 నెలలను ఆ 48 ఏళ్లతో పోల్చండి

అన్నేళ్లు దేశాన్ని ఒకే కుటుంబం పాలించింది

రానున్న అన్ని రాష్ట్రాల ఎన్నికల్లోనూ గెలుస్తాం ● పుదుచ్చేరి సభలో మోదీ

సాక్షి, చెన్నై: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న 48 ఏళ్లు ఈ దేశాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఒక్క కుటుంబమే పాలించిందని ప్రధాని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. త్వరలోనే తమ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకుంటోందనీ, తమ 'అభివృద్ధి కేంద్రక' 48 నెలల పాలనను కాంగ్రెస్ 48 ఏళ్ల పాలనతో పోల్చి చూడాలని మోదీ కోరారు. పుదుచ్చేరిలో మోదీ ఆదివారం పర్యటించారు. ఆ సందర్భంగా బీజేపీ ఏర్పాటు చేసిన ఓ బహిరంగ సభలో ప్రసంగించారు. పేర్లను ప్రస్తావించకుండానే నెహ్రూ–గాంధీ కుటుంబం గురించి మోదీ మాట్లాడుతూ 'తొలి ప్రధాని (జవహర్‌లాల్ నెహ్రూ) 17 ఏళ్లు, ఆయన కూతురు (ఇందిరా గాంధీ) 14 ఏళ్లు, ఆమె కొడుకు (రాజీవ్ గాంధీ) ఐదేళ్లు దేశాన్ని పాలించారు. ఆ తర్వాత మరో పదేళ్లు రిమోట్ పాలన (ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఉన్న కాలం గురించి) సాగింది' అని మోదీ విమర్శించారు. 'మా 48 నెలల పాలనను వారి 48 ఏళ్ల పాలనతో పోల్చాలని నేను మేధావులను పుదుచ్చేరి నుంచి కోరుతున్నా. వారు ఈ అంశంపై చర్చలు పెట్టొచ్చు' అని అన్నారు.

కాంగ్రెస్ సీఎం నారాయణస్వామి మాత్రమే..

ఈ ఏడాది జూన్ తర్వాత దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండేది ఒక్క పుదుచ్చేరిలో మాత్రమేనని మోదీ జోస్యం చెప్పారు. కర్ణాటక సహా త్వరలో ఎన్నికలు జరగనున్న అన్ని రాష్ట్రాల్లోనూ తామే గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పుదుచ్చేరి సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం చేపడుతున్న చర్యలను వివరించారు. 'జూన్ తర్వాత కాంగ్రెస్‌కు పుదుచ్చేరి మాత్రమే మిగులుతుంది. అప్పుడు వారి సీఎం అంటే నారాయణస్వామి మాత్రమే ఉంటారు. ఆయనకు నా అభినందనలు' అని మోదీ అన్నారు. అయితే పంజాబ్‌లోనూ అమరీందర్ సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్న విషయాన్ని ఆయన వదిలేశారు.

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా భారత్

'ఆరోవిల్' గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాల్లో ప్రధాని మోదీ

ఆరోవిల్: అనాదిగా భారత్ ప్రపంచానికి ఆధ్యాత్మిక గమ్యంగా విరాజిల్లుతోందని ప్రధాని మోదీ తెలిపారు. వేర్వేరు సంస్కృతులు, మతాలు పరస్పరం కలిసిమెలిసి శాంతియుతంగా జీవించేందుకు భారత్ అనుమతించిందన్నారు. ప్రపంచంలోనే గొప్ప మతాల్లో చాలావరకూ భారత్‌లోనే పుట్టాయన్న మోదీ.. ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజలు ఆధ్యాత్మిక మార్గంవైపు మరలేలా ఇవి ప్రేరేపించాయని పేర్కొన్నారు. ఆదివారం నాడిక్కడ జరిగిన ఆరోవిల్ అంతర్జాతీయ టౌన్‌షిప్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. అరబిందో ఆశ్రమంలో మదర్‌గా పేరుగాంచిన మిర్రా అల్ఫాసా ఆలోచన మేరకే అరోవిల్ అంతర్జాతీయ ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చెందిందని మోదీ తెలిపారు. 'ప్రపంచానికి ఆధ్యాత్మిక నాయకత్వం వహించే విషయంలో అరబిందో ఆశ్రమం మనకు స్ఫూర్తినిస్తూనే ఉంది. ఇందుకు ఆరోవిల్ ప్రత్యక్ష సాక్ష్యం' అని చెప్పారు. గత ఐదు దశాబ్దాలుగా ఆరోవిల్ సామాజిక, విద్యా, ఆర్థిక, ఆధ్యాత్మిక ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని మోదీ అభిప్రాయపడ్డారు. భారత్ విశ్వసించే వసుధైక కుటుంబం నినాదానికి ఆరోవిల్ ప్రత్యక్ష ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. 1968లో 124 దేశాల ప్రతినిధులు హాజరుతో ప్రారంభమైన ఆరోవిల్ టౌన్‌షిప్.. నేడు 49 దేశాలకు చెందిన 2,400 ప్రతినిధులకు కేంద్రంగా మారిందన్నారు. అంతకుముందు పుదుచ్చేరిలోని శ్రీ అరబిందో ఆశ్రమాన్ని సందర్శించిన మోదీ.. ఆశ్రమ స్థాపకుడు శ్రీ అరబిందోకు నివాళులర్పించారు. అక్కడి ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు.


ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులపై అరాచకాలకు నిరసనగా రోమ్‌లోని విఖ్యాత కలోజియంను ఎరుపురంగు లైట్లతో వెలిగించిన దృశ్యం

చంద్రుడి ఉపరితలంపై నీరు..!



వాషింగ్టన్: చందమామపై అధిక మొత్తంలో నీరు ఉందని నాసా శాస్త్రవేత్తలు తాజా అధ్యయనంలో అంచనావేశారు. ఈ నీరు ఏదో ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా చంద్రుడి ఉపరితలమంతా విస్తరించి ఉందని చెబుతున్నారు. చంద్రుడిపై పరిశోధనలకు భారత్ ప్రయోగించిన చంద్రయాన్–1 పంపిన సమాచారాన్ని విశ్లేషించి ఈ విషయం చెప్పారు. ఈ పరిశోధన ఫలితాలు అక్కడి నీటిని ఒక వనరుగా వాడుకునేందుకు చేయాల్సిన పరిశోధనలకు సహకరిస్తాయని అమెరికాలోని స్పేస్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ జోషువా బాండ్‌ఫీల్డ్ వివరించారు.

శ్రీనగర్ జైలులో ఖైదీలకు మతబోధనలు, ఫోన్లు

శ్రీనగర్: అత్యంత భద్రతతో ఉండే శ్రీనగర్ కేంద్రకారాగారంలో జరుగుతున్న తంతుపై సంచలన విషయాలు వెల్లడయ్యాయి. సెంట్రల్ జైలులోని ఖైదీల వద్ద దాదాపు 300 సెల్‌ఫోన్లు ఉన్నట్లు రాష్ట్ర పోలీస్ ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి. ఈ విషయం తెలిసినా ఉన్నతాధికారులు మౌనంగా ఉన్నట్లు తెలిపింది. నేరస్తులందరినీ ఒకే చోట ఉంచుతుండటంతో పాత ఖైదీలు కొత్తగా వచ్చిన వారికి జైలులోనే మత బోధనలు, జీహాద్‌పై ప్రసంగాలు ఇస్తున్నట్లు గుర్తించింది. ఉగ్రవాద సంబంధిత నేరాలపై జైలుకు వచ్చిన వారిని సంబంధిత గ్రూపుల ఖైదీలు ఉండే బ్యారక్‌లలోనే ఉంచుతున్నట్లు గుర్తించింది. జైలులో అమర్చిన మొబైల్ జామర్ పనిచేయడం లేదని తెలిపింది. సెల్‌ఫోన్‌లతో నేరగాళ్లు బయటి వారితో మాట్లాడుతూ ఉగ్రవాద కార్యకలాపాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నారని వెల్లడించింది.

'ఈశాన్యం' కోసం ప్రత్యేక నీతి ఫోరం

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధిని మరింత వేగిరం చేసేందుకు ప్రత్యేకంగా నీతి ఫోరంను ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యాలయంలోనే దీనికి ప్రత్యేకంగా సెక్రటేరియట్ ఉంటుందని వివరించారు. ఆశించిన అభివృద్ధి లక్ష్యాల సాధన, ఎదురవుతున్న అడ్డంకులను గుర్తించి అధిగమించేందుకు ఈశాన్య నీతి ఆయోగ్ ఫోరం కృషి చేస్తుందని చెప్పారు. దీనికి ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రితోపాటు ప్రత్యేక నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌లు సహాధ్యక్షులుగా ఉంటారని చెప్పారు. ఇందులో అన్ని ప్రధాన మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, 8 ఈశాన్య రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు తదితరులు సభ్యులుగా ఉంటారన్నారు.

ఉగ్రదాడిలో అమరులైన ఇద్దరు పోలీసులు

శ్రీనగర్: కశ్మీర్‌లో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఉగ్రవాదులు ఇద్దరు పోలీసులను కాల్చి చంపారు. బుద్గాం జిల్లా చరార్ ఇ షరీఫ్‌లోని నూరుద్దీన్ నూరానీ దర్గా వద్ద కశ్మీర్ సాయుధ పోలీస్ 13వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ కుల్తార్ సింగ్‌పై గుర్తు తెలియని ఉగ్రవాదులు కాల్పులు జరపగా ఆయన తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. మరో ఘటనలో.. హురియత్ కాన్ఫరెన్స్ నేత ఫజల్ హక్ ఖురేషి నివాస సమీపంలో కానిస్టేబుల్ ఫరూక్ అహ్మద్‌పై దుండగులు కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఘటనల నేపథ్యంలో ఆయా ప్రాంతాలను దిగ్బంధనం చేసి దుండగుల కోసం గాలిస్తున్నట్లు డీజీపీ ఎస్పీ వైద్ తెలిపారు.

రైల్వేస్టేషన్లకు ఉచితంగా రీడిజైనింగ్

న్యూఢిల్లీ: ముంబై సహా దేశ వ్యాప్తంగా ఉన్న 19 రైల్వేస్టేషన్లకు ఉచితంగా డిజైన్లు ఇచ్చేందుకు ప్రముఖ వాస్తుశిల్పి, పద్మభూషణ్ గ్రహీత హఫీజ్ కాంట్రాక్టర్ సహా పలువురు ముందుకు వచ్చారని ఇండియన్ రైల్వే స్టేషన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఆర్ఎస్‌డీసీ) ఎండీ, సీఈవో లోహియా చెప్పారు. 600 రైల్వే స్టేషన్లను మళ్లీ డిజైన్ చేసి, అభివృద్ధి చేయటానికి రైల్వేశాఖ సంకల్పించింది. ఇందులో భాగంగా రైల్వే పిలుపు మేరకు హఫీజ్ కాంట్రాక్టర్ సహా నలుగురు స్పందించారు. ఈయన రీడిజైనింగ్ ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తం చేసిన వాటిలో ముంబైలోని దాదర్, పరేల్, వడాలా, బంద్రా, ఖర్ స్టేషన్లు ఉన్నాయని లోహియా తెలిపారు. కాంట్రాక్టర్ ఇచ్చిన డిజైన్లపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

మహిళా పోలీసులు 7 శాతమే!

తమిళనాడులో అత్యధికం.. తెలంగాణలో అత్యల్పం

- కేంద్రపాలిత ప్రాంతాల్లో చండీగఢ్ టాప్
- హోంశాఖ గణాంకాలు వెల్లడి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పోలీస్ విభాగాల్లో మహిళలు కేవలం 7.28 శాతమే ఉన్నారని హోంశాఖ తాజా గణాంకాల్లో తేలింది. దేశంలో అత్యధిక మహిళా ఉద్యోగులతో తమిళనాడు పోలీస్‌శాఖ తొలిస్థానంలో నిలిచింది. కేవలం 2.47 శాతం మహిళా ఉద్యోగులతో తెలంగాణ పోలీస్ విభాగం చివరన ఉంది. కశ్మీర్‌లోని 80వేల మంది పోలీస్ సిబ్బందిలో 3.05 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 2015లో మహిళలపై 3,29,243 నేరాలు జరగగా.. ఈ సంఖ్య 2016 నాటికి 3,38,954కు చేరింది. పోలీస్ విభాగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని 33 శాతానికి పెంచాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 2009, 2012, 2016ల్లో మార్గదర్శకాలు జారీచేసినప్పటికీ పరిస్థితి మారలేదని హోంశాఖ తెలిపింది. తెలంగాణలోని 60,700 మంది పోలీస్ సిబ్బందిలో కేవలం 2.47 శాతం మహిళలు ఉండగా, యూపీలోని 3.65 లక్షల సిబ్బందిలో 3.81 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మేఘాలయలలోనూ మహిళా పోలీసుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. తమిళనాడు తర్వాత హిమాచల్, మహారాష్ట్ర, గోవాలలో మహిళా పోలీసులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. కేంద్రపాలిత ప్రాంతాల్లో చండీగఢ్ పోలీస్ విభాగంలో మహిళలు అత్యధికంగా ఉండగా, ఢిల్లీ పోలీస్‌విభాగంలో కేవలం 8.64 శాతం మహిళా సిబ్బంది ఉన్నారు. దేశవ్యాప్తంగా 2015లో 34,651 రేప్ కేసులు నమోదుకాగా, 2016 నాటికి ఆ సంఖ్య 38,947కు చేరుకుందని పేర్కొంది. దేశంలో అత్యాచారాలు అధికంగా జరుగుతున్న రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, యూపీ, మహారాష్ట్రలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళలపై నేరాల్లో భర్త, కుటుంబ సభ్యులపై నమోదైన కేసులే ఎక్కువ. మహిళలపై దాడి, అపహరణ, అత్యాచారం వంటి నేరాలు తర్వాతిస్థానాల్లో ఉన్నాయి.

రాజ్యసభలో బీజేపీ హవా!

మార్చి 23న ఎన్నికలతో కమలదళానికి మెజారిటీ

కీలకంగా మారనున్న యూపీ, రాజస్తాన్

న్యూఢిల్లీ: వచ్చే నెల 23న 16 రాష్ట్రాల్లోని 58 రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో మెజారిటీ సీట్లు గెలుస్తామని కమలనాథులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా రాజ్యసభలో ప్రతిపక్షాలు కీలక బిల్లుల్ని అడ్డుకోవడాన్ని నిలువరించవచ్చన్నారు. ప్రస్తుతం 58 సీట్లతో రాజ్యసభలో బీజేపీ అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్‌ను వెనక్కునెట్టింది. యూపీలో భారీ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన నేపథ్యంలో ఖాళీ అయ్యే 10 సీట్లలో 8 చోట్ల బీజేపీ గెలవనుంది. ప్రస్తుతం యూపీలో బీజేపీకి ఓ రాజ్యసభ సభ్యుడు మాత్రమే ఉన్నారు. అలాగే రాజస్తాన్‌లో ఖాళీకానున్న మూడు స్థానాలనూ కమలనాథులే దక్కించుకోనున్నారు. అయితే బిహార్‌లో ప్రస్తుతమున్న ఆరు స్థానాల్లో మూడు చోట్ల, గుజరాత్‌లోని నాలుగుస్థానాల్లో రెండుసీట్లను మాత్రమే బీజేపీ నిలుపుకునే అవకాశముంది. ఎన్డీఏ మిత్రపక్షాలతో పాటు కేంద్రానికి అనుకూలంగా ఉన్న అన్నాడీఎంకే, టీఆర్ఎస్, బీజేడీ, వైఎస్సార్‌సీపీల మద్దతును కలుపుకుంటే 245 మంది సభ్యులున్న రాజ్యసభలో బీజేపీకి మెజారిటీ దక్కే అవకాశముందని ఓ బీజేపీ సీనియర్ నేత తెలిపారు. ఈ రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థులు ఖరారు కానప్పటికీ పలువురు జాతీయ ఆఫీస్ బేర్లరను పార్టీ ఎంపికచేసే అవకాశముందన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులైన అనీల్ జైన్, అరుణ్ సింగ్, కైలాశ్ విజయవర్గియా, మురళీధర్‌రావు, రామ్‌మాధవ్, భూపేందర్ యాదవ్‌లు రాజ్యసభ ఆశావహుల జాబితాలో ఉన్నారన్నారు. ప్రస్తుతం కేంద్ర మంత్రులు జైట్లీ, జవదేకర్, రవిశంకర్ ప్రసాద్, ధర్మేంద్ర ప్రధాన్, జేపీ నడ్డా, థావర్‌చంద్ గెహ్లాట్, రామ్‌దాస్ అథావలేల పదవీకాలం పూర్తికానుంది. వీరందరి పదవీకాలాన్ని కేంద్రం పొడిగించే అవకాశముందని పేర్కొన్నారు.

పాఠశాలల్లో గాయత్రీ మంత్రం





చండీగఢ్: పాఠశాలల్లో విద్యార్థులు ఉదయం ప్రార్థనగా గాయత్రీ మంత్రం జపించాలని హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రామ్ బిలాస్ శర్మ తెలిపారు. దైవ ప్రార్థనల్లో గాయత్రీ మంత్రానికి సమున్నత స్థానం ఉందనీ, అందుకే ప్రార్థనా గీతంగా మార్చామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక గీతా శ్లోకాలను పాఠ్యాంశాలుగా చేశామనీ, ఇది సానుకూల ఫలితాలను ఇచ్చిందనీ వివరించారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమైందో సంస్కృతీ విలువలు కూడా అంతే ముఖ్యమని, విద్యార్థులను సన్మార్గంలో నడిపేందుకు గాయత్రీ మంత్రాన్ని ప్రార్థనా గీతంగా చేశామని ముఖ్యమంత్రి ఖట్టర్ అన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం వచ్చే మంగళవారం ఆదేశాలు జారీ చేయనుంది.

సీఆర్పీఎఫ్ బైక్ అంబులెన్స్..

రాయిపూర్(ఛత్తీస్‌గఢ్): ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కోసం సీఆర్పీఎఫ్ బైక్ అంబులెన్స్‌ను ప్రారంభించింది. బస్తర్ ఏరియా మారుమూల అటవీ ప్రాంతంలో ఈ సేవలను అందిస్తుంది. మోటారు సైకిళ్లపై సాయుధ భద్రతా సిబ్బంది రక్షణ మధ్య వైద్య బృందాలు అవసరమైన చోటుకు చేరుకుని అనారోగ్యం బారిన పడిన లేదా గాయపడిన వారికి వైద్యం అందించనున్నాయి. మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న బిజాపూర్–దంతేవాడ జిల్లాలకు చెందిన దాదాపు 70 గ్రామాల ప్రజలకు ఈ సేవలు ఉపయోగపడతాయని 85వ సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండర్ సుధీర్ కుమార్ తెలిపారు. ఒక్కో వైద్య బృందం సేవల పరిధి 32 కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. వైద్య బృందాల సంచారంతో గ్రామీణ ప్రాంత ప్రజలతో సంబంధాలు మెరుగుపడతాయనీ, కూంబింగ్ వంటి సందర్భాల్లో ఇది ఎంతో సహాయకారిగా ఉంటుందనీ ఆయన వివరించారు. గ్రామీణ ప్రజల్లో అక్షరాస్యతకు, ప్రభుత్వ పథకాలను వివరించేందుకు కూడా ఈ సేవలను విస్తరించాలని యోచిస్తున్నామన్నారు.

◆ ఇది స్టీవ్ రెజ్యూమే





యాపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ 1973లో ఓ ఉద్యోగానికి చేసిన దరఖాస్తు ఇది. మార్చి 8-15 మధ్య ఆర్ఆర్ ఆక్షన్స్ నిర్వహించనున్న వేలంలో తప్పలతడకగా ఉన్న ఈ ధరఖాస్తు రూ. 32 లక్షల ధర పలకవచ్చని భావిస్తున్నారు.

చౌకీదార్ మాట్లాడరేం?

కుంభకోణాలపై ప్రధాని మోదీ మౌనంపై రాహుల్‌గాంధీ విసుర్లు

సాక్షి, బళ్లారి (బాగల్‌కోట): ప్రధాన మంత్రిని చేయొద్దు.. దేశానికి చౌకీదారును చేయాలని ఎన్నికల సభల్లో ప్రజలను కోరిన మోదీ.. ఇన్ని కుంభకోణాలు జరుగుతున్నా మౌనంగా ఎందుకు ఉంటున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రశ్నించారు. జనాశీర్వాద యాత్రలో భాగంగా రాహుల్ రెండో రోజైన ఆదివారం కర్ణాటకలోని బాగల్‌కోట జిల్లా చాడగండి తాలూకా చిక్కపడసలగి బ్యారేజ్‌ను సందర్శించి, గంగమ్మ తల్లికి వాయనం సమర్పించారు. అనంతరం మథోళ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీపై నిప్పులు చెరిగారు. తరచూ అవినీతిపై ప్రసంగాలు చేసే మోదీ..వేలాది కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం, దానితో సంబంధమున్న నీరవ్‌మోదీలపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జై షా కంపెనీ టర్నోవర్ రూ.50 వేల నుంచి ఒక్కసారిగా రూ.80 కోట్లకు పెరిగినా పెదవి విప్పటం లేదన్నారు. 'దేశంలోని రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. రైతు రుణాలు మాఫీ చేయాలని స్వయానా ప్రధాని మోదీని కోరినా ఆయన నోరు కూడా మెదపలేదు. బడా పారిశ్రామికవేత్తలకు మాత్రం రూ.లక్షా 40వేల కోట్ల రుణాలు మాఫీ చేశారు' అని రాహుల్ ధ్వజమెత్తారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేని మోదీ మాయమాటలను నమ్మకుండా మళ్లీ హస్తం గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.





జామ్‌ఖండిలో కాంగ్రెస్ సభకు హాజరైన వందలాది మంది కార్యకర్తలు. బిలగిలో రాహుల్‌ను సత్కరించిన దృశ్యం

మోదీ చిల్లర ప్రధాని: కర్ణాటక మంత్రి

మోదీ చిల్లర ప్రధానమంత్రి.. ఆయన కేవలం మాటలతో ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని కర్ణాటక ఎక్సైజ్ శాఖ మంత్రి తిమ్మాపూర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన జనాశీర్వాద యాత్రలో వీరావేశంతో ప్రసంగించారు. దేశం కోసం ప్రధాన మంత్రి మోదీ ఇంట్లో కాని, బీజేపీలో కాని ఎవరైనా ప్రాణ త్యాగం చేశారా? పోనీ, ఆ నేతలకు చెందిన కుక్క అయినా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిందా? అంటూ దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలతో పాటు ఎందరో మహానుభావులు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు.

కర్ణాటకలో అవినీతి పాలన: అమిత్‌షా

కర్ణాటకలో అవినీతి పాలన సాగుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆరోపించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన బీదర్ జిల్లా హుమ్నాబాద్, యాదగిరి జిల్లా సురపుర, యానాగుంది తదితర చోట్ల విస్తృత పర్యటన చేసి, పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు గతంలో ఓ వ్యక్తి రూ.40 లక్షలు ఖరీదు చేసే వాచీని కానుకగా ఇచ్చారంటే ఇక్కడ అవినీతి పాలన ఏమేరకు సాగుతోందో అర్థం చేసుకోవచ్చన్నారు.

జిన్‌పింగ్ కోసం రాజ్యాంగ సవరణ

మూడోసారి అధ్యక్షుడయ్యేందుకు..



బీజింగ్: చైనాలో శక్తిమంతమైన నేతగా గుర్తింపు పొందిన జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యేందుకు పావులు కదుపుతున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల్ని ఏ వ్యక్తులైనా రెండుసార్లకు మించి చేపట్టకూడదనే రాజ్యాంగ నిబంధనను తొలగించేందుకు చైనా కమ్యూనిస్ట్ పార్టీ(సీపీసీ) సిద్ధమైంది. సీపీసీకి చెందిన సెంట్రల్ కమిటీ ఈ నిబంధనను రాజ్యాంగం నుంచి తొలగించాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం చైనా అధ్యక్షుడిగా ఉన్న జిన్‌పింగ్ పదవీకాలం 2022తో ముగియనుంది. తాజా నిర్ణయం వల్ల జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడిగా ఎన్నిసార్లయినా పోటీ చేయవచ్చు. గతేడాది జరిగిన సీపీసీ కాంగ్రెస్ సమావేశాల్లో జిన్‌పింగ్ సిద్ధాంతాల్ని, ఆలోచనా విధానాన్ని రాజ్యాంగంలో చేర్చాలని నిర్ణయం తీసుకుంది.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మెడికల్ ఎడ్యుకేషన్



విదేశాల్లో ఎంబీబీఎస్‌కూ..
నీట్‌గా వెళ్లాల్సిందే!

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్).. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం! ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల ఔత్సాహికులు.. నీట్‌లో మంచి ర్యాంకు సాధిస్తేనే ప్రవేశం ఖాయం! అంతేకాదు.. 2018, మే నుంచి విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు సైతం..'నీట్'లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది! ఈ నేపథ్యంలో ఎంబీబీఎస్ అబ్రాడ్ ఔత్సాహికులకు నీట్ నిబంధనలపై విశ్లేషణ...

దేశంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య దాదాపు 68,000. వీటికోసం ఏటా సుమారు 12 లక్షల మంది నీట్ యూజీ పరీక్షకు హాజరవుతారు. ఇంతటి తీవ్ర పోటీని తట్టుకొని నిలబడిన చాలా తక్కువ మందికి మాత్రమే అడ్మిషన్ లభిస్తుంది. అందుకే ఎంబీబీఎస్ ఔత్సాహికుల్లో కొందరు ఎంబీబీఎస్ స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు విదేశీ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకుంటారు. ఇప్పటివరకు ఆయా దేశాల్లోని యూనివర్సిటీల నిబంధనల ప్రకారం మాత్రమే ప్రవేశాలు జరిగేవి. కానీ, తాజాగా మన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సరికొత్త నిబంధన రూపొందించింది. విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలన్నా.. నీట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరిని పేర్కొంది. ఈ నిబంధన 2018, మే నుంచి ప్రవేశాలు పొందేవారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. నీట్‌లో ఉత్తీర్ణత సాధించి విదేశీ వర్సిటీల్లో ఎంబీబీఎస్ సర్టిఫికెట్ సొంతం చేసుకున్నాక కూడా మరో పరీక్ష రాయాల్సి ఉంటుంది. అది.. ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ).

ఎన్‌వోసీ జారీ

నీట్ యూజీలో ఉత్తీర్ణత ఆధారంగా అభ్యర్థులు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేసుకుంటే.. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) లభిస్తుంది. ఈ సర్టిఫికెట్ ఉన్నవారికే విదేశీ యూనివర్సిటీల్లో ఎంబీబీఎస్‌లో ప్రవేశించేందుకు అర్హత లభిస్తుంది.

కారణాలు

కొందరు ఓపెన్ స్కూల్/దూరవిద్య ద్వారా ఇంటర్మీడియెట్ తత్సమాన అర్హత పొంది.. ఆ సర్టిఫికెట్‌తో విదేశాల్లో మెడికల్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందుతున్నారు. అక్కడ కోర్సు పూర్తయ్యాక మనదేశంలో ఉన్నత విద్య, ప్రాక్టీస్‌కు అవసరమైన ఎఫ్ఎంజీఈలో విఫలమవుతున్నారు. ఇందులో ఉత్తీర్ణత 10-15 శాతం మధ్యలోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో వైద్య కోర్సులు చదివేందుకు తగిన నైపుణ్యాలు ఉన్నవారికే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో నీట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టాప్-రేటెడ్ యూనివర్సిటీలకు..

ప్రస్తుతం భారత్ నుంచి కజికిస్థాన్, రష్యా, ఉక్రెయిన్, చైనా, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్థాన్ తదితర దేశాలకు ఎంబీబీఎస్‌లో చేరేందుకు వెళ్తున్నారు. వీరు ఏజెంట్ల వ్యవస్థపై ఆధారపడుతున్నారు. ఈ ఏజెంట్లు చూపే ఇన్‌స్టిట్యూట్‌లు టియర్-2 లేదా టియర్-3 స్థాయిలో ఉంటున్నాయి. వాటిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభించడం లేదు. దాంతో మనదేశంలో నీట్‌లో ఉత్తీర్ణత సాధించి, ఆయా విదేశాల్లోని టాప్ వర్సిటీల్లో ప్రవేశం పొందినవారికే ఎన్‌వోసీ జారీచేయాలని భావిస్తున్నారు. ఫలితంగా ప్రతిభగల విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి.. తర్వాత దశలో ఎఫ్ఎంజీఈలోనూ మెరుగైన ఫలితాలు సాధించి... వృత్తిపరంగా రాణించగలరని అభిప్రాయపడుతున్నారు.

ఏటా ఏడువేల మంది..

భారత్ నుంచి ఎంబీబీఎస్ కోసం విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య ఏటా దాదాపు ఏడువేలు ఉంటోంది. వీరిలో 40 శాతం మంది రష్యా, చైనా వర్సిటీలకు వెళ్తున్నారు. మిగిలిన వారు ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్థాన్ తదితర దేశాలకు పయనమవుతున్నారు. ఈ దేశాల్లో సగటున రూ.30 లక్షల వ్యయంతో కోర్సు పూర్తిచేసుకునే అవకాశముంది. కానీ, అక్కడ వివిధ యూనివర్సిటీల్లో బోధన పరంగా సరైన నాణ్యత లేకపోవడంతో తర్వాత దశలో ఎఫ్ఎంజీఈలో విఫలమవుతున్నారు.



'నీట్' ఉత్తీర్ణత కష్టం కాదు..

తాజా నిబంధన కోణంలో ఆలోచిస్తే.. నీట్ ఉత్తీర్ణత ఏమంత కష్టం కాదు. జనరల్ కేటగిరీలో 50 పర్సంటైల్, రిజర్వ్‌డ్ కేటగిరీలో 40 పర్సంటైల్ జాబితాలో ఉంటే ఉత్తీర్ణత సాధించినట్లే. కానీ, విదేశీ వర్సిటీలను గుర్తించే క్రమంలో పరిగణనలోకి తీసుకోనున్న టాప్-రేటెడ్ ఇన్‌స్టిట్యూట్ అనే అంశంపైనే విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

భిన్నాభిప్రాయాలు

విదేశీ విద్యకు నీట్ తప్పనిసరినే నిర్ణయాన్ని అధిక శాతం మంది స్వాగతిస్తున్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేస్తుందంటున్నారు. ఏజెంట్ల వ్యవస్థ నుంచి ఉపశమనం కలిగిస్తుందని చెబుతున్నారు. మరికొందరు మాత్రం ఈ నిబంధన ఫలితంగా ముఖ్యంగా ఓపెన్ స్కూల్ విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్నారు. ఔత్సాహికుల సందేహాలను నివృత్తిచేసేందుకు, మార్గనిర్దేశనం చేసేందుకు ఎంసీఐ ఆధ్వర్యంలో హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేసే దిశగా ఆరోగ్య శాఖ యోచిస్తున్నట్లు సమాచారం.

ఇప్పటి నుంచే జాగ్రత్తగా..

ఎంబీబీఎస్ స్టడీ అబ్రాడ్ ఔత్సాహికులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా వ్యవహరించాలి. ముందుగా నీట్‌లో తమ కేటగిరికీ నిర్దేశించిన పర్సంటైల్ తెచ్చుకునేలా కృషిచేయాలి. ఆయా దేశాలు, యూనివర్సిటీల వివరాలను కూడా ముందే తెలుసుకుంటే మంచిది. వాస్తవానికి అన్ని దేశాల్లో ఆగస్టు నుంచి అక్టోబర్ మధ్యలో అకడమిక్ సెషన్ ప్రారంభమవుతుంది. దీనికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ మూడు నుంచి నాలుగు నెలల ముందుగానే ప్రారంభించాల్సి ఉంటుంది.

ఎఫ్ఎంజీఈ అంటే..?

అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా మినహా మిగతా దేశాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారు మన దేశంలో ఇంటర్న్‌షిప్ చేయడానికి, ఆపై ఉన్నత విద్య, ప్రాక్టీస్, ఉద్యోగం వంటి వాటికోసం తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన పరీక్ష.. ఎఫ్ఎంజీఈ. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తేనే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నుంచి లైసెన్స్ లభిస్తుంది.

ఏటా రెండు సార్లు..

ఎఫ్ఎంజీఈని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏటా రెండుసార్లు (జూన్/డిసెంబర్) ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తోంది. అభ్యర్థులు తాము హాజరయ్యే సెషన్ (జూన్/డిసెంబర్) నాటికి తప్పనిసరిగా విదేశీ ఎంబీబీఎస్ కోర్సులో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. సదరు సర్టిఫికెట్‌ను భారత ఎంబసీ వర్గాల అధికారులతో లేదా విద్యార్థి ఎంబీబీఎస్ పూర్తిచేసిన దేశంలోని ప్రభుత్వ నియంత్రణ సంస్థలతో ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. అలా ధ్రువీకరణతో దరఖాస్తు చేస్తేనే ఎఫ్ఎంజీఈలో హాజరుకు అనుమతి లభిస్తుంది.

రెండు భాగాలు.. 300 మార్కులు

ఎఫ్ఎంజీఈ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. 300 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. పార్ట్-1లో 150, పార్ట్-2లో 150 ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఇలా మొత్తం 300 మార్కులకు నిర్వహించే పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రోబయాలజీ తదితర పారా మెడికల్ సబ్జెక్టులతో పాటు క్లినికల్ సబ్జెక్టులుగా పిలిచే జనరల్ సర్జరీ, అనస్థీషియా, ఆర్థోపెడిక్స్, రేడియో-డయాగ్నసిస్, పీడియాట్రిక్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఎఫ్ఎంజీఈ క్లిష్టంగా ఉంటోందని గత కొన్నేళ్ల ఫలితాల గణాంకాలే చెబుతున్నాయి. గత అయిదేళ్లలో ప్రతి సెషన్‌లోనూ 10 శాతం నుంచి 15 శాతం మధ్యలోనే ఉత్తీర్ణత నమోదవుతోంది.

> **ఆందోళన అనవసరం**
>
> ఎంబీబీఎస్ అబ్రాడ్‌కు నీట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేయడంపై ఔత్సాహికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది వారి భవిష్యత్తు ప్రయోజనం కోసమే అని గుర్తించాలి. టాప్ రేటెడ్ యూనివర్సిటీల్లో చదవాలనుకునే వారికే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలనే ఆలోచన కూడా మంచిదే. దీనివల్ల విద్యార్థులకు గ్రాడ్యుయేట్ స్థాయిలో మంచి నైపుణ్యాలు లభిస్తాయి. ఆ తర్వాత మనదేశంలో కెరీర్ పరంగా ఉన్నతంగా స్థిరపడేందుకు వీలవుతుంది.
>
> **- డాక్టర్ వేద్ ప్రకాష్ మిశ్రా, ఎంసీఐ**
> అకడమిక్ కమిటీ చైర్మన్.

కరిక్యులం మారిస్తే సరిపోదు!



- ప్రొఫెసర్ ఉదయ్ కుమార్,
సీఎస్ఏబీ చైర్మన్, ఎంఎన్ఐటీ డైరెక్టర్.

"ఇంజనీరింగ్ కరిక్యులంలో మార్పులు చేస్తూ.. ఏఐసీటీఈ విధి విధానాలను ఖరారు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే తాజా మార్పులకు అనుగుణంగా ఇన్‌స్టిట్యూట్‌లు చర్యలు చేపడుతున్నాయా? లేదా? అని నిరంతరం పర్యవేక్షించే యంత్రాంగం లేదా వ్యవస్థ ఉన్నప్పుడే ఏఐసీటీఈ ప్రయత్నం విజయవంతమవుతుంది" అని అంటున్న సెంట్రల్ సీట్ అలొకేషన్ బోర్డ్ (సీఎస్ఏబీ) చైర్మన్, మాలవీయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జైపూర్) డైరెక్టర్ ప్రొఫెసర్ వై.ఉదయ్‌కుమార్‌తో గెస్ట్ కాలమ్..

గత రెండేళ్లలో జేఈఈ-మెయిన్ దరఖాస్తుల సంఖ్య తగ్గిన మాట వాస్తవమే. అయితే దీన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం బీటెక్‌కు ఉద్దేశించిన పేపర్-1లో 50 వేల దరఖాస్తులు తగ్గాయి. విద్యార్థుల్లో ఇతర కోర్సులపై అవగాహన పెరగడం, అలాగే సొంత రాష్ట్రాల్లోనే చదవాలనే అభిలాష తదితరాలను దరఖాస్తులు తగ్గడానికి కారణాలుగా చెప్పొచ్చు.

సింగిల్ టెస్ట్ విధానం మంచిదే!

నీట్ (మెడికల్) తరహాలో.. ఇంజనీరింగ్‌కు కూడా జాతీయస్థాయిలో సింగిల్ టెస్ట్ విధానం తేవడం మంచిదే. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. సింగిల్ టెస్ట్ విధానాన్ని ఖరారు చేసేటప్పుడు.. కనీసం ఏడాది సమయం ఇవ్వాలి. అప్పుడే అన్ని రాష్ట్రాల విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన సంసిద్ధత లభిస్తుంది.

బ్రాంచ్ ఏదైనా..

ఎన్ఐటీల్లో అన్ని బ్రాంచ్‌లకు డిమాండ్ ఉంటోంది. విద్యార్థినులు.. ఫీల్డ్ వర్క్ అవసరమైన బ్రాంచ్‌ల (సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ తదితర) పట్ల అనాసక్తత ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులు సీటు పొందిన బ్రాంచ్‌లో భవిష్యత్తు అవకాశాలు, ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగాలి. ఎన్ఐటీలు, ఐఐటీల్లో చేరాలనుకునే విద్యార్థులు ఇప్పటి నుంచే ఇంటర్‌పర్సనల్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. ఫలితంగా భిన్న సంస్కృతుల నుంచి వచ్చే విద్యార్థులతో తేలిగ్గా కలిసిపోయేందుకు ఆస్కారముంటుంది.

అవగాహన లేకే సీట్ల మిగులు!

విద్యార్థులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ (జోసా-జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) ఛాయిస్ ఫిల్లింగ్‌పై సరైన అవగాహన ఉండట్లేదు. దీంతో ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. విద్యార్థులు తమకు వచ్చిన ర్యాంకు.. సీటు లభించే అవకాశం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లకు సంబంధించి ముందస్తు కసరత్తు చేయట్లేదు. జోసాలో విద్యార్థుల ప్రయోజనం కోసం అందుబాటులో ఉంచే మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను సైతం సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. విద్యార్థులు కేవలం ఒక బ్రాంచ్‌నే ఎంచుకొని, దాని కోసం పలు ఇన్‌స్టిట్యూట్‌లను ప్రాథమ్యంగా పేర్కొనడం లేదా ఇన్‌స్టిట్యూట్‌ల విషయంలో కొన్నిటికే అధిక ప్రాధాన్యం ఇవ్వడం వంటివి చేస్తున్నారు. ఫలితంగా వారికి వచ్చిన ర్యాంకు ప్రకారం వేరే ఇన్‌స్టిట్యూట్‌లలో సీట్లు లభిస్తున్నాయి. దీంతోపాటు చాలా మంది వ్యక్తిగత కారణాలతో అలాట్‌మెంట్‌కు యాక్సప్టెన్స్ ఇవ్వడంలేదు. ఇలాంటి వాటివల్ల ఎన్ఐటీల్లో సీట్లు మిగులుతున్నాయి.

నిబంధనలు సరళీకృతం

గతేడాది జోసా చివరి రౌండ్ తర్వాత కూడా.. ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో సీట్లు మిగిలిపోయాయి. దీనిపై ప్రత్యేక దృష్టిసారించిన ఎంహెచ్ఆర్‌డీ కొన్ని నిబంధనలను సడలించింది. ఇందులో భాగంగా సీఎస్ఏబీ ఆధ్వర్యంలో స్పాట్ రౌండ్ కౌన్సెలింగ్‌కు ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులకు ఇంటర్మీడియెట్‌లో పొందాల్సిన మార్కుల శాతాన్ని తగ్గించింది. రిజర్వ్‌డ్ కేటగిరీల్లో మిగిలిన సీట్లను ఓపెన్ కేటగిరీలో చేర్చి.. అందరికీ అందుబాటులో తెచ్చింది. దీంతో గతేడాది సీట్ల మిగులు గణనీయంగా తగ్గింది.

సూపర్ న్యూమరరీ మంచిదే..

సీట్లు మిగులుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థినుల శాతాన్ని పెంచేలా.. మొత్తం సీట్లలో 14 శాతానికి సమానంగా సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించడాన్ని విమర్శించడం సరికాదు. వాస్తవానికి అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. పలు రిజర్వేషన్లు, ఇతర అంశాల కారణంగా విద్యార్థినులకు సరైన అవకాశం లభించడం లేదు. అలాగే కొందరు విద్యార్థినులకు సీట్లు లభించినా.. వారికి ఆసక్తి ఉన్న బ్రాంచ్ లేదా ఇన్‌స్టిట్యూట్ దక్కడంలేదు. సూపర్ న్యూమరరీ సీట్ల విధానంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

> **గెస్ట్ కాలమ్**
>
> ఈ ఏడాది కూడా సీఎస్ఏబీ ఆధ్వర్యంలో స్పెషల్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. జోసాలో అన్ని రౌండ్లూ పూర్తయి, విద్యార్థులు తమకు కేటాయించిన ఇన్‌స్టిట్యూట్‌లలో నిర్దేశిత తేదీ లోపు రిపోర్టింగ్ చేసే ప్రక్రియ పూర్తయిన తర్వాత.. మిగిలిన సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ రౌండ్‌కు నోటిఫికేషన్ విడుదల చేస్తాం.


అభ్యర్థులకు సలహా..

జేఈఈ-మెయిన్ అభ్యర్థులకు ఇచ్చే సలహా ఏంటంటే.. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్.. ఏ విధానంలో పరీక్ష రాయాలనుకున్నా.. ముందు ఒత్తిడిని అధిగమించాలి. ఆన్‌లైన్లో పరీక్షలు రాసే విద్యార్థులు మాక్‌టెస్ట్‌లు రాసి.. కంప్యూటర్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. అడ్వాన్స్‌డ్‌ను కేవలం ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నందున ఐఐటీలను లక్ష్యంగా చేసుకున్న విద్యార్థులు తప్పనిసరిగా కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై అవగాహన కలిగుండాలి!

నాలెడ్జ్ Bytes

జీవశాస్త్రం

డార్విన్.. జీవపరిణామ సిద్ధాంతం



చార్లెస్ డార్విన్(1809-1882) మరణించి దాదాపు 140 ఏళ్లు కావస్తున్నా... మనం నేటికీ ఆయన గురించి చర్చించుకుంటున్నాం అంటేనే డార్విన్ ఘనత ఏంటో తెలుస్తోంది కదా..! డార్విన్ సిద్ధాంతం సరైంది కాదని ఇటీవల కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ వ్యాఖ్యానించడం.. దీనిపై ఐఐఎస్ఈఆర్ పరీక్షల్లో విద్యార్థులకు ప్రశ్న అడగటం మరింత చర్చకు దారితీసింది. ఇంతకీ డార్విన్ సిద్ధాంతం ఏంటి.. ఆయన చెప్పిందేంటో ఒకసారి చూద్దాం..!

- క్రీ.శ.1800ల్లో జీవులన్నీ ఒకే సమయంలో ఆవిర్భవించాయని, అవి ఎలాంటి మార్పుచెందక అలాగే కొనసాగుతున్నాయని అప్పట్లో ప్రజలు బలంగా నమ్మేవారు. అలాంటి రోజుల్లో 1809, ఫిబ్రవరి 12న ఇంగ్లండ్‌లో జన్మించిన చార్లెస్ డార్విన్... 1831లో హెచ్ఎంఎస్ బీగిల్ అనే ఓడలో ప్రపంచయాత్రకు బయలుదేరాడు. దాదాపు ఐదేళ్లపాటు ప్రకృతిని, జీవులను అధ్యయనం చేశాడు. అత్యంత క్లిష్టమైన వాతావరణంలో అనేక అష్టకష్టాలు పడుతూ సముద్రయానం కొనసాగించాడు. ఆ ప్రయాణంలో ప్రకృతిని సూక్ష్మంగా పరిశీలిస్తూ.. అంతరించిపోయిన జీవులు, క్షీరదాల శిలాజాలు.. ప్రస్తుతమున్న జీవుల కంటే భిన్నంగా ఉండటాన్ని డార్విన్ గమనించాడు. దీన్ని బట్టి జీవులు గతంలో ప్రస్తుతమున్న దానికంటే భిన్నంగా ఉండేవనే నిర్ధారణకు వచ్చాడు. అలా తన అనుభవాలు, పరిశీలనలతో నేటి బయాలజీ గతిని సమూలంగా మార్చివేసిన విప్లవాత్మక గ్రంథం 'ద ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్'ను 1859, నవంబర్ 24న ప్రచురించాడు. తద్వారా జీవులు వేల ఏళ్ల కాలంలో క్రమేణా పరిణామం చెందుతూ వస్తున్నాయని ప్రపంచానికి ఆధారసహితంగా నిరూపించాడు. మనుషులు, జంతువులు ఒకే పూర్వికుల నుంచి ఉద్భవించినట్లు ప్రతిపాదించిన డార్విన్.. నాడు సంప్రదాయవాదులను విస్మయానికి గురిచేశాడు.
- 'ద ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్' గ్రంథం డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతానికి దారితీసింది, 'థియరీ ఆఫ్ నేచురల్ సెలక్షన్'(ప్రకృతి వరణం) పురుడుపోసుకుంది. వరణం అంటే.. ఎంపిక. అంటే.. సృష్టిలో మనుగడసాగించగలిగే బలమైన లక్షణాలను కలిగిన జీవులను మాత్రమే ప్రకృతి ఎంచుకుంటుంది. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం నుంచే 'బలమైనవి మాత్రమే మనుగడ సాధిస్తాయి' (survival of fittest) అనే పదబంధం బాగా ప్రచారంలోకి వచ్చింది. పరిసరాలకు అనుగుణంగా తమను తాము మార్చుకోగలిగే జీవులు మాత్రమే మనగలుగుతాయని.. మిగిలినవి అంతరించిపోతాయనే వాదం బలపడింది. డార్విన్ ప్రతిపాదించిన 'థియరీ ఆఫ్ నేచురల్ సెలక్షన్'లో రెండు కోణాలు ఉన్నాయి.. ఒకటి, జీవులు తమ సహజ లక్షణాలను తమ తర్వాతి తరానికి సంక్రమింపచేస్తాయి. రెండోది, జీవులు మారుతున్న పరిసరాలకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటూ మనుగడకొనసాగిస్తాయి. ఉదాహరణకు జిరాఫీ.

బులెటిన్ బోర్డ్

నేషనల్ అట్మాస్ఫియరిక్ లేబొరేటరీలో 18 ఖాళీలు

చిత్తూరు జిల్లా గాదంకిలో ఉన్న నేషనల్ అట్మాస్ఫియరిక్ లేబొరేటరీ (ఎన్ఏఆర్ఎల్)... 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)/పోస్ట్ డాక్టోరల్ ఫెలో (పీడీఎఫ్)-3; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-15.
- **ఫెలోషిప్:** ఆర్ఏ/పీడీఎఫ్-రూ.36,000; జేఆర్ఎఫ్-రూ.25,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను బట్టి పీహెచ్‌డీ/ఎంఈ/ఎంటెక్/పీజీ. అలాగే నిబంధనల మేర సంబంధిత రంగంలో ఉద్యోగానుభవం, మార్కుల శాతం ఉండాలి. జేఆర్ఎఫ్‌కు అదనంగా సీఎస్ఐఆర్- యూజీసీ నెట్/గేట్/జామ్/జెస్ట్ క్వాలిఫై అయి ఉండాలి.
- **వయసు:** జేఆర్ఎఫ్‌కు 30 ఏళ్ల లోపు, ఆర్ఏ/పీడీఎఫ్‌కు 35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి ఎన్ఆర్ఎల్ చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 30, 2018.
- **వెబ్‌సైట్:** www.narl.gov.in

ఐఐఆర్ఆర్‌లో 22 ఖాళీలు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్)... వివిధ ప్రాజెక్టుల్లోని 22 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)-4; ప్రాజెక్ట్ అసిస్టెంట్ (పీఏ)-4; సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)-3; యంగ్ ప్రొఫెషనల్ 1 (వైపీ 1)-1; ఆఫీస్ అసిస్టెంట్ (ఓఏ)-1; ఫీల్డ్/ల్యాబ్ అసిస్టెంట్-1; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-1; ఫీల్డ్ వర్కర్/హెల్పర్-2; యంగ్ ప్రొఫెషనల్ 2 (వైపీ 2)-5.
- **వేతనం:** ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్, వైపీ 2-రూ.25,000; ఫీల్డ్/ల్యాబ్ అసిస్టెంట్, వైపీ 1, పీఏ, ఫీల్డ్ వర్కర్/ల్యాబ్ అసిస్టెంట్-రూ.15,000; టీఏ-రూ.10,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి మాస్టర్స్ డిగ్రీ/బ్యాచిలర్ డిగ్రీ/పదోతరగతి ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర పోస్టులను బట్టి ఉద్యోగానుభవం, నెట్ క్వాలిఫై, కంప్యూటర్ ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** 'యంగ్ ప్రొఫెషనల్' పోస్టులకు 21 ఏళ్లు నిండి ఉండాలి. మిగిలిన పోస్టులకు 35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** వాకిన్ ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్లో చూపిన నమూనా దరఖాస్తు పత్రంలో వివరాలు నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి నేరుగా వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **వాకిన్ ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 12-17, 21, 2018.
- **వెబ్‌సైట్:** icar-iirr.org

నేషనల్ కెమికల్ లేబొరేటరీలో 15 ఖాళీలు

పుణెలోని నేషనల్ కెమికల్ లేబొరేటరీ (ఎన్‌సీఎల్)... ఇన్నోవేటివ్ ప్రాసెస్ అండ్ టెక్నాలజీస్ ఫర్ ఇండియన్ ఫార్మాస్యూటికల్ అండ్ ఆగ్రోకెమికల్ ఇండస్ట్రీస్ (ఇన్‌ప్రొటిక్స్-పీఅండ్ఏ) ప్రోగ్రామ్‌లో భాగంగా 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్ (పీఏ)-2/ప్రాజెక్ట్ అసిస్టెంట్ (పీఏ)-3.
- **స్టైపెండ్:** పీఏ-2కు రూ.25,000; పీఏ-3కి రూ.28,000.
- **అర్హతలు:** కనీసం 55 శాతం మార్కులతో ఎంఎస్సీ (కెమిస్ట్రీ) ఉత్తీర్ణత. పీఏ-3కి అదనంగా కనీసం రెండేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి.
- **వయసు:** పీఏ-2కు 28 ఏళ్లు; పీఏ-3కి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** మార్చి 2, 2018.
- **వెబ్‌సైట్:** www.ncl-india.org

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 26-2-2018

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	సెన్సెక్స్	నిఫ్టీ
మార్పు	323 ▲	108 ▲
ముగింపు	34,142	10,491

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	7,337	▲	127
డోజోన్స్	25,310	▲	348
ఎఫ్‌టీఎస్ఈ 100	7,244	▽	8
డాక్స్	12,484	▲	22
షాంఘై	3,289	▲	21
నికాయ్	21,893	▲	156

అమెరికా బ్రిటన్ జర్మనీ చైనా జపాన్

బిజ్ క్విజ్-5

ప్రపంచంలో తక్కువ పన్ను ఎక్కడుంది? అత్యధికంగా చెల్లిస్తున్న పన్ను రేటెంత? ఇవే కాదు. ఇలాంటి పలు ప్రశ్నలకు మీకు జవాబులు తెలుసా? తెలుసుకుంటారా? అయితే సాక్షి బిజినెస్ పాఠకుల కోసం సునీల్ ధవళ అందిస్తున్న బిజినెస్ క్విజ్... చూడండి.

WWW.SAKSHIBUSINESS.COM



రిటైరయ్యాక కూడా పెట్టుబడి!

- జీవితం సాఫీగా సాగాలంటే తప్పదు మరి
- దీనికోసం ముందునుంచే సన్నద్ధత అవసరం
- తరువాతి జీవితానికి పెట్టుబడుల ద్వారానే ఆదాయం
- ఇందుకోసం డెట్, ఈక్విటీ రెండింటా ఇన్వెస్ట్ చేయాలి
- ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తట్టుకునే రాబడి ఉండాలి
- తగినంత నిధి సమకూరకపోతే రిటైర్మెంట్ వాయిదా

మనలో చాలా మంది రిటైర్మెంట్ గురించి వయసులో ఉన్నపుడు పెద్దగా ఆలోచించరు. అదంతా రిటైరయ్యాక చూసుకుందాంలే... అనుకుంటారు. కాకపోతే... రిటైర్మెంట్ గురించి రిటైరయ్యాక ఎలా ఆలోచిస్తామనే చిన్న లాజిక్ అప్పట్లో అర్థం కాదు. అది అర్థమయ్యేసరికి జరగాల్సిన నష్టమంతా జరిగిపోతుంది. అప్పుడు తీరిగ్గా విచారించినా చేసేదేమీ ఉండదు.

గణాంకాలను బట్టి చూసినా... ప్రభుత్వరంగంలోని వారు కాకుండా ప్రైవేటు ఉద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వారిలో రిటైర్మెంట్ గురించి ప్రణాళిక వేసుకునే వారు చాలా తక్కువ. తీరా రిటైర్మెంట్‌కు వచ్చిన తర్వాత... చేతిలో ఉన్న ఆ కాసింత డబ్బును నెలవారీ ఆదాయం కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలన్న సందేహంలో పడిపోతారు. నిజానికి రిటైర్మెంట్ అనేది 35-40 ఏళ్ల ఉద్యోగ జీవితం తర్వాత వచ్చే దశ. ఉద్యోగం చేస్తున్నంత కాలం నెలనెలా వేతనం బ్యాంకు ఖాతాలో పడిపోతూ అన్ని అవసరాలనూ తీర్చేస్తుంది. తీరా ఉద్యోగ కాలం ముగిశాక ఆదాయం ఒక్కసారిగా ఆగిపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి!!. ఏదో తెలియని ఆందోళన ఎదురవుతుంది. అందుకే తగినంత నిధిని ముందు నుంచే ఏర్పాటు చేసుకోవాలి. ఇది రిటైర్మెంట్ తరువాతి జీవనానికి తగినంత ఆదాయాన్నిచ్చేదిలా ఉండాలి. దానికోసం ఎలా ఇన్వెస్ట్ చేయాలో తెలియజేసే కథనమే ఇది...

సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

దాదాపు మనమంతా గమనించాల్సిందొకటుంది. అది... పొదుపు వేరు; ఇన్వెస్ట్‌మెంట్ వేరు. రిటైరయ్యాక ఆదాయం కావాలంటే ఇన్వెస్ట్ చేయడం తప్పనిసరి. ఇన్వెస్ట్ చేయకుండా పొదుపు చేసిన దాన్నుంచి ఖర్చు చేస్తూ వెళితే ఉన్నదంతా కరిగిపోతుంది. పెద్ద వయసులో ఈ పరిస్థితి ఊహించజాలం. చిన్న వయసులో ఉన్న వారైతే రిస్క్ భయం లేకుండా ఇన్వెస్ట్ చేయగలరు. రిస్క్‌ను భరించే సామర్థ్యం వారికి ఎక్కువ. అదే 30-40 ఏళ్ల వయసులో ఉన్న వారైతే కాస్తంత భద్రతతో కూడిన సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తారు. రిటైరయ్యాక తమ దగ్గరున్న నిధి నుంచే ఆదాయం రాబట్టుకోవాలి కనుక వారు చేసే పెట్టుబడులు భిన్నంగా ఉండాలి. స్థిర ఆదాయాన్నిచ్చేలా ఉండాలి. ముఖ్యంగా రిటైర్మెంట్‌కు మూడేళ్ల ముందే కార్పస్ ఎంతుందన్నది సమీక్షించుకోవాలి. రిటైర్మెంట్ తర్వాత అవసరాలకు చాలదనుకుంటే రిటైర్మెంట్‌ను వాయిదా వేసుకోవడం ఉత్తమం.

ఇన్వెస్ట్ చేయడం ఎలా?

రిటైరయ్యాక చాలా మందికి ఎదురయ్యే ప్రశ్నే ఇది. వేతన జీవులు తాము సర్వీసులో ఉన్నంత సేపూ కంపెనీకి సేవలందించి ఉంటారు. అందరికీ ఇన్వెస్ట్‌మెంట్‌పై అవగాహన ఉండదు. దీంతో ఇన్వెస్ట్‌మెంట్లో పొరపాట్లు జరిగే ప్రమాదం ఉంటుంది. రిటైరయ్యాక సంప్రదాయ సాధనాల్లో చేసే ఇన్వెస్ట్‌మెంట్‌పై రాబడులు 7 శాతాన్ని మించవు. అధిక రాబడులు రావాలంటే రిస్క్ అధికంగా ఉండే వాటిలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ దశలో అధిక రిస్క్ తీసుకోలేరు. అందుకే ఇది డెట్, ఈక్విటీల కలబోతగా ఉండాలి. అధిక శాతం డెట్‌లో ఇన్వెస్ట్ చేసి, కొంత మేర ఈక్విటీలో ఇన్వెస్ట్ చేస్తే... రాబడులు 7 శాతం కంటే ఎక్కువే వస్తాయి. అలాగే, రిటైర్మెంట్ నిధిని ఇన్వెస్ట్ చేసి ప్రతి నెలా ఆదాయం తీసుకునేలా ఉండకూడదు. ఏడాది అవసరాలకు సరిపడేలా రిడెంప్షన్ ఉండాలి. ప్రతి నెలా ఎంతో కొంత వెనక్కి తీసుకోవడం వల్ల కార్పస్ తగ్గిపోతుంది. తక్కువ రిస్క్, స్థిరమైన ఆదాయం, కార్పస్ వృద్ధి చెందేలా ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోను రూపొందించుకోవాలి.

నెలవారీ బడ్జెట్ తప్పనిసరి...

రిటైర్మెంట్ నిధిని పెట్టుబడులకు మళ్లించే ముందే నెలవారీ బడ్జెట్‌ను ఖరారు చేసుకోవాలి. రోజువారీ అవసరాల కోసం ప్రతినెలా ఎంత కావాలో తేల్చుకోవాలి. కిరాణా, యుటిలిటీ బిల్లులు, ఈఎంఐలు, వినోదం, ఆహారం, వైద్యం ఇలా అన్ని అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి. వీటిని రెండు భాగాలు చేయాలి. అవసరమైనవి, అవసరం లేనివి.

నిధి రెండు భాగాలు చేయాలి...

మొత్తం రిటైర్మెంట్ నిధిని రెండు భాగాలు చేయాలి. ఒక భాగాన్ని స్థిరాదాయ పథకాల్లో ఇన్వెస్ట్ చేయాలి. దీనిపై వచ్చే ఆదాయం మీ నెలవారీ అవసరాలను తీర్చే స్థాయిలో ఉండాలి. స్థిరాదాయాన్నిచ్చే పథకాలైన పెన్షన్ స్కీమ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ మ్యూచువల్ ఫండ్స్, పోస్టాఫీసు నెలసరి ఆదాయ పథకం దీనికి అనువైనవని చెప్పొచ్చు. రెండో భాగాన్ని రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులను ఇచ్చే ఫండ్స్, ఈక్విటీ వంటి సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాలి.

పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో

రిటైరయిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ 100 శాతం నిధుల్ని తీసుకెళ్లి ఈక్విటీలో పెట్టకూడదు. అధిక భాగం డెట్‌లోనే ఉంచాలి. ఈక్విటీలకు కేటాయించేది స్వల్పంగానే ఉండాలి. సగటున ఈక్విటీ ఫండ్స్‌లో 30 శాతం మించి పెట్టుబడులు పెట్టకపోవటమే మంచిది. డబ్బు ఎంతున్నా దాని విలువను ద్రవ్యోల్బణం కొద్ది కొద్దిగా హరించేస్తుంది. అందుకే ద్రవ్యోల్బణాన్ని మించి మెరుగైన రాబడులను ఇచ్చే సాధనాలను ఎంపిక చేసుకోవాలి. అలాగని అధిక రాబడుల కోసం దీర్ఘకాలం పాటు లాకిన్‌లో ఉండే సాధనాలు రిటైర్ అయిన వారికి సూచనీయం కావు. ఎందుకంటే వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు తమ డబ్బుల్ని వెనక్కి తీసుకునేలా (లిక్విడిటీ) ఉండాలి. అందుకే ఎందులో ఇన్వెస్ట్ చేసినా ఓ అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి.

ఇలా చేయవచ్చు...



ఉదాహరణకు ఓ రిటైర్ అయిన వ్యక్తి దగ్గర రూ.50 లక్షలు ఉన్నాయనుకోండి. నెలవారీ బడ్జెట్ రూ.28,000-32,000. సదరు వ్యక్తి ఎలా ఇన్వెస్ట్ చేయాలంటే... ముందు ఈ నిధి నుంచి కొంత మేర పక్కన పెట్టాలి.

- అత్యవసర నిధి = నెలకు రూ.32,000 చొప్పున ఆరు నెలల కోసం = రూ.1,92,000
- ఏడాది అవసరాలకు అయ్యే వ్యయాలు = రూ.32,000 చొప్పున 12 నెలలకు = రూ.3,84,000
- ఈ రెండూ కలిపి మొత్తం రూ.5,76,000.

ఇప్పుడు అత్యవసర నిధి రూ.1,92,000ను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేయాలి. ఏడాది అవసరాల కోసం ఉద్దేశించిన రూ.3,84,000ను తీసుకెళ్లి అధిక వడ్డీరేటునిచ్చే బ్యాంకు ఖాతాలో ఉంచాలి. ప్రైవేటు రంగ బ్యాంకులు కొన్ని 6% వడ్డీని ఇస్తున్నాయి.

ఈ రెండూ మినహాయించగా రిటైర్మెంట్ కార్పస్ రూ.44,24,000 ఉంటుంది. దీన్ని రెండు భాగాలు చేయాలి.

- 70 శాతం డెట్ విభాగంలో పెట్టుబడులకు = రూ.31,00,000
- 30 శాతం ఈక్విటీలో పెట్టుబడుల కోసం = రూ.13,24,000
- 70 శాతం నిధుల్ని (రూ.31,00,000) మ్యూచువల్ ఫండ్స్ అందించే మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్లలో (ఎంఐపీ) ఇన్వెస్ట్ చేయాలి. వీటి రాబడులు వార్షికంగా 11 శాతం స్థాయిలో ఉంటాయి. మ్యూచువల్ ఫండ్స్ మంత్లీ ఇన్‌కమ్ ప్లాన్లు 80 శాతం నిధుల్ని డెట్‌లోనూ, 15 శాతం నిధుల్ని ఈక్విటీలోనూ, 5 శాతం నిధుల్ని ఇతర విభాగాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. రూ.31,00,000పైన సగటున 11 శాతం రాబడి అంచనా వేసి చూస్తే నెలవారీగా వచ్చే ఆదాయం రూ.28,416 అవుతుంది. దీంతో నెలవారీ అవసరాలు తీరిపోతాయి. 30 శాతం నిధుల్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఐదేళ్ల కాలం కోసం ఇన్వెస్ట్ చేయాలి. ఇవి వార్షికంగా సగటున 16 శాతం రాబడులను ఇవ్వగలవు. ఆ విధంగా చూస్తే ఇది అదనపు ఆదాయం తెచ్చిపెడుతుంది. ద్రవ్యోల్బణ ప్రభావం రిటైర్మెంట్ కార్పస్‌పై పడకుండా ఈ పోర్ట్‌ఫోలియో సాయపడుతుంది. ఐదారేళ్లకు పెట్టుబడులు రెట్టింపవుతాయి.

పాలసీకి ప్రాణం పోస్తారా!

(సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం)

- దానికన్నా ముందు ల్యాప్స్ కాకుండా చూడాలి
- ల్యాప్స్ అయితే పునరుద్ధరించుకోవటానికీ చాన్స్
- గడువులోపు ప్రీమియం చెల్లించుకోవడం నయం
- గ్రేస్ పీరియడ్ దాటకుండా చూసుకోవాలి
- అన్నిటికన్నా టర్మ్ పాలసీకి ఇదెంతో ముఖ్యం
- దానివల్ల యావత్ కుటుంబానికీ ఆర్థిక రక్షణ

ప్రతి కుటుంబానికీ జీవిత బీమా అంటే రక్షణ కవచం లాంటిదే. మరి ఆ కవచం తుప్పుపట్టకుండా ఉండాలంటే... పాలసీ తీసుకున్న వారు సకాలంలో ప్రీమియం చెల్లిస్తూ దాన్ని యాక్టివ్‌గా ఉంచుకోవడం తప్పనిసరి. ప్రీమియం చెల్లించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరవకూడదు. ఒకవేళ మీరు మీ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని ఏదైనా కారణంతో ఆపేద్దామనుకుంటే..!! అలా చేయటం చాలా ఈజీయే కానీ... అది మీ కుటుంబాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేయటమేననుకోవాలి. సకాలంలో ప్రీమియం చెల్లించకపోతే ఏ పాలసీ అయినా ల్యాప్స్ అయిపోతుంది. దీంతో ఏదైనా జరిగితే వ్యక్తి కుటుంబానికి పరిహారం అందకుండా పోతుంది. అందుకే... పాలసీ ల్యాప్స్ అయిందని వదిలేయకుండా ఓ సారి దాన్ని పరిశీలించి, అవకాశం ఉంటే పునరుద్ధరించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

ల్యాప్స్ అయితే ఏంటి పరిష్కారం

టర్మ్ పాలసీ తీసుకుంటే జీవితాంతం నిర్ణీత ప్రీమియం చెల్లిస్తూ ఉండాలి. అప్పుడే అది యాక్టివ్‌గా (చెల్లుబాటు) ఉంటుంది. ఏవో కొన్ని కారణాల రీత్యా గడువులోపు ప్రీమియం చెల్లించలేదనుకోండి. అప్పుడు అదనపు గడువు (గ్రేస్ పీరియడ్) ఉంటుంది. ఆలోగా కూడా ప్రీమియం చెల్లించకుంటే పాలసీ ల్యాప్స్ అవుతుంది. అంటే మురిగిపోతుంది. ఇన్సూరెన్స్ పరిభాషలో నుంచి చూస్తే ల్యాప్స్ అయిన పాలసీ విషయంలో అన్ని రకాల ప్రయోజనాలూ ముగిసిపోయినట్టే. దాదాపు అన్ని బీమా కంపెనీలూ వార్షిక ప్రీమియానికైతే 30 రోజులు, అర్థ సంవత్సరం, నెలవారీ ప్రీమియంలపై 15 రోజులు గ్రేస్ పీరియడ్ ఇస్తున్నాయి. అంటే ఈ లోపైనా ప్రీమియం చెల్లించి పాలసీ ల్యాప్స్ కాకుండా చూసుకోవచ్చు. ఇక కంపెనీలను బట్టి గ్రేస్ పీరియడ్‌లో మార్పులుండొచ్చు. అందుకని టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ డాక్యుమెంట్, నియమ, నిబంధనలు చూడాలి. ఇక్కడ గుర్తించుకోవాల్సిన విషయం ఏమిటంటే గ్రేస్ పీరియడ్‌లోనూ బీమా రక్షణ కొనసాగుతుంది. అంటే గ్రేస్ పీరియడ్‌లో పాలసీదారుడికి ఏదైనా జరిగితే పరిహారం చెల్లించాల్సిన బాధ్యత బీమా సంస్థపై ఉంటుంది. ఉదాహరణకు ఓ వ్యక్తి గడువులోపు టర్మ్ పాలసీ ప్రీమియం చెల్లించకుండా, గ్రేస్ పీరియడ్ పూర్తయ్యేలోపు ప్రమాదం కారణంగా మరణించాడనుకుంటే... ఈ సందర్భంలో బాధితుని కుటుంబం పరిహారం కోసం క్లెయిమ్ దాఖలు చేస్తే బీమా కంపెనీ కచ్చితంగా పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ గ్రేస్ పీరియడ్ ముగిశాక ప్రమాదం జరిగి మరణం చోటు చేసుకుంటే పరిహారం చెల్లింపు బాధ్యత కంపెనీపై ఉండదు.

గ్రేస్ పీరియడ్ తర్వాత...?

గ్రేస్ పీరియడ్ లోపు కూడా ప్రీమియం చెల్లించకుంటే పాలసీ ల్యాప్స్ అయిపోతుంది. అపుడు పాలసీదారుడికి ఏం జరిగినా అతనిపై ఆధారపడిన వారికి కంపెనీ ఎలాంటి పరిహారం చెల్లించదు. ఒకవేళ పాలసీని పునరుద్ధరించుకోవాలని భావిస్తే అందుకు వీలుంటుంది. ఒకవేళ బీమా సంస్థ పాలసీ పునరుద్ధరణకు అంగీకరిస్తే ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పాలసీ పునరుద్ధరణ విషయంలో నిబంధనలన్నవి కంపెనీని బట్టి మారొచ్చు. సాధారణంగా టర్మ్ పాలసీలు ల్యాప్స్ అయితే, బకాయి ఉన్న ప్రీమియంను వడ్డీతో కలిపి చెల్లించడం ద్వారా పునరుద్ధరించుకోవచ్చు. కాకపోతే తమ ఆరోగ్య స్థితి బాగానే ఉందని ధ్రువీకరణ ఇవ్వడం లేదా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి రావచ్చు. అయితే, బీమా సంస్థ అంగీకరిస్తేనే పాలసీ పునరుద్ధరణ సాధ్యం. ఇందుకు నిర్ణీత ప్రక్రియ ఉంటుంది.



కీలకాంశాలివీ...

అన్ని కంపెనీలు సకాలంలో ప్రీమియం చెల్లించాలంటూ ముందు నుంచే ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్స్ ద్వారా అలర్ట్ చేస్తుంటాయి. ప్రీమియం చెల్లించేందుకు ఎన్నో ఆప్షన్లు కూడా ఉన్నాయి. ప్రీమియం చెల్లింపు ఆప్షన్లను పరిశీలించి... పాలసీదారుడు తన బ్యాంకుకు స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఇచ్చినట్టయితే సకాలంలో (నిర్ణీత తేదీన) బ్యాంకు నుంచి ప్రీమియం బీమా కంపెనీకి వెళ్లిపోతుంది. ఇందు కోసం బీమా సంస్థలు బ్యాంకులతో ఒప్పందం చేసుకుంటున్నాయి. దీంతో పాలసీదారులు ప్రీమియంను బ్యాంకు ద్వారా చెల్లించొచ్చు. బీమా సంస్థ ఆఫీసుకు వెళ్లి చెల్లించొచ్చు. లేదా తన దగ్గరకే వచ్చి రెన్యువల్‌కు సంబంధించిన చెక్ తీసుకెళ్లాలని కోరొచ్చు. కొన్ని బ్యాంకులు ఏటీఎం నుంచే ప్రీమియం చెల్లింపు సదుపాయాన్ని అందిస్తున్నాయి. ఇపుడు ఆన్‌లైన్ చెల్లింపులూ అందుబాటులోకి వచ్చాయి.

చివరిగా చెప్పేదేమంటే బీమా పాలసీని ఎట్టి పరిస్థితుల్లోనూ ల్యాప్స్ కాకుండా చూసుకోవడమే మంచిది. పాలసీ కాల వ్యవధి ముగిసేదాకా ఏటా ప్రీమియం చెల్లించడం ద్వారా మీ కుటుంబానికి రక్షణ కల్పించడాన్ని మర్చిపోవద్దు. అలాగే, ఆదాయపన్ను సెక్షన్ 80సీ కింద పాలసీకి చెల్లించే ప్రీమియానికి పన్ను మినహాయింపు పొందొచ్చు. పాలసీ ల్యాప్స్ అయితే ఈ ప్రయోజనం కోల్పోతారు. టర్మ్ పాలసీ అన్నది మీ కోసం కాదు. మీ కుటుంబం కోసం. ఆత్మీయుల సంరక్షణ దృష్ట్యా పాలసీ తీసుకుని దాన్ని మనుగడలో ఉంచేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది.



- వాటివల్ల కొత్త రుణాలు రాకపోవచ్చు
- వడ్డీ రేట్లు కూడా ఎక్కువగా ఉండే అవకాశం
- వీటిని సరిచేసుకునే అవకాశం ఉండనే ఉంది
- బ్యాంకులకు చెప్పటం ద్వారా ఉచితంగానే చేయొచ్చు
- క్రెడిట్ బ్యూరో నిపుణుల సలహాలు, సూచనలివీ...

క్రెడిట్ రిపోర్టులో తప్పులున్నాయా?


రుణానికి దరఖాస్తు చేసుకున్నప్పుడు క్రెడిట్ స్కోరు పాత్రే కీలకం. బ్యాంకులు రుణ అభ్యర్థనలను ఆమోదించే ముందు దరఖాస్తుదారులకు సంబంధించి క్రెడిట్ బ్యూరో సంస్థలందించే స్కోరును చూస్తాయి. ఈ స్కోరు ఆధారంగా బ్యాంకు వడ్డీ రేట్లలోనూ హెచ్చు, తగ్గులుంటాయి. అందుకే రుణానికి కీలకమైన క్రెడిట్ రిపోర్టులో తప్పులున్నా ఆ ప్రభావం దరఖాస్తుదారులపై పడుతుంది. ఈ నేపథ్యంలో వాటికి పరిష్కారాలను తెలియజేసే కథనమే ఇది.

రిపోర్టులో ఏముంటుంది?

- రుణ గ్రహీతలకు సంబంధించి స్కోరు ఎంతుందన్నది క్రెడిట్ రిపోర్టులో ఉంటుంది. 300 నుంచి 900 మధ్య ఈ స్కోరు ఉండొచ్చు.
- వ్యక్తి పేరు, జండర్, గుర్తింపు వివరాలు (పాన్, వోటర్ ఐడీ, ఆధార్), చిరునామా, ఫోన్ నంబర్, సంబంధిత వ్యక్తి వృత్తి లేదా ఉద్యోగం తదితర సమాచారం రిపోర్ట్‌లో ఉంటుంది.
- గతంలో తీసుకున్న రుణాలు, వాటికి సంబంధించి ఏవైనా బకాయిలుంటే ఆ సమాచారం, అలాగే విడిగా తీసుకున్నారా లేక భాగస్వామ్యంతో తీసుకున్నారా లేక వేరెవరికైనా హామీదారుగా ఉన్నారా... వంటి వివరాలు సైతం క్రెడిట్ రిపోర్టులో ఉంటాయి.
- బ్యాంకులకు ఇంత వరకు ఎన్ని సార్లు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు, తిరస్కరణకు గురయ్యాయా? మంజూరయ్యాయా? ఆ మొత్తం ఎంత... అనే సమాచారమూ ఉంటుంది.
- సాధారణంగా ఓ రుణ గ్రహీతకు సంబంధించిన క్రెడిట్ రిపోర్టును బ్యాంకుల అభ్యర్థన మేరకు బ్యూరోలు జారీ చేస్తాయి. ప్రతి రుణ గ్రహీతకు సంబంధించి సమాచారం, వివరాలను బ్యాంకులు ఎప్పటికప్పుడు క్రెడిట్ బ్యూరోలకు అందిస్తుంటాయి. రుణ దరఖాస్తులు వచ్చినప్పుడు ఆయా వ్యక్తుల తాజా క్రెడిట్ రిపోర్ట్‌ను బ్యూరోల నుంచి పొందుతుంటాయి.
- ఎవరికి వారు విడిగా తమ క్రెడిట్ రిపోర్ట్‌ను క్రెడిట్ బ్యూరోల నుంచి పొందే అవకాశం కూడా ఉంది. వారికి సంబంధించిన క్రెడిట్ రిపోర్ట్‌ను ఏడాదిలో ఒకసారి ఉచితంగా పొందొచ్చని, అంతకన్నా ఎక్కువ సార్లయితే నామమాత్రపు ఫీజు చెల్లించాలని ట్రాన్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ హృషికేష్ మెహతా తెలియజేశారు.

సాధారణంగా జరిగే తప్పులు

క్రెడిట్ రిపోర్టులో తప్పులు దొర్లడం కొన్ని సందర్భాల్లో సాధారణంగానే జరుగుతుంది. వీటి కారణంగా ఒక్కోసారి రుణ దరఖాస్తులు తిరస్కరణకు గురికావచ్చు. లేదా అధిక వడ్డీ రేట్లకు దారితీయొచ్చని హృషికేష్ మెహతా పేర్కొన్నారు. ''అంత మాత్రాన ఆందోళన అక్కర్లేదు. ఆ తప్పులను సులభంగానే సరిచేసుకోవచ్చు. సాధారణంగా ఇలాంటి తప్పులను అకౌంట్ తాలూకు, వ్యక్తిగత సమాచారం తాలూకు అని రెండు రకాలుగా చూడాల్సి ఉంటుంది'' అని ఎక్స్‌పీరియన్ క్రెడిట్ బ్యూరో ఎండీ వైశాలి కస్తూరి తెలిపారు. అకౌంట్‌కు సంబంధించినవైతే ఆలస్యపు చెల్లింపులకు సంబంధించిన సమాచారం ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చెల్లింపులు చేసినప్పటికీ బకాయి ఉన్నట్టు నివేదిక చూపిస్తుంటుంది. ఓ క్రెడిట్ కార్డు లేదా రుణ ఖాతా వివరాలను పొరపాటుగా మరో వ్యక్తి ఖాతాలో నమోదు చేయడం, ఓ రుణాన్ని తీర్చివేసినప్పటికీ అది ఇంకా ముగిసిపోలేదని చూపించడం వంటివి కూడా ఖాతాకు సంబంధించిన తప్పులు. వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన తప్పులు అంటే పేరు, చిరునామాలో తప్పిదాలు, పని చేస్తున్న సంస్థ వివరాలు. వీటిని ఎప్పుడైనా సరి చేసుకోవచ్చు. ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. క్రెడిట్ రిపోర్టుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునే ఆప్షన్‌ను ప్రతీ క్రెడిట్ బ్యూరో అందిస్తోందని, అయితే ఏ మార్పులైనా సంబంధింత బ్యాంకును సంప్రదించిన తర్వాతే సరిచేయడం జరుగుతుందని వైశాలి తెలిపారు. క్రెడిట్ రిపోర్టు సరిచేసుకోవాలంటే దరఖాస్తును రుణం పొందిన బ్యాంకుకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తును క్రెడిట్ బ్యూరోల వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. క్రెడిట్ బ్యూరోల వద్ద కూడా నమోదు చేసుకోవచ్చు. జతగా ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడు బ్యూరోలు ఆ సమాచారాన్ని బ్యాంకులకు పంపి స్పష్టత తీసుకుంటాయి. తర్వాత మార్పు చేస్తాయి. దాంతో తాజా వివరాలు క్రెడిట్ రిపోర్ట్‌లో ప్రతిఫలిస్తాయి. క్రెడిట్ సమాచార కంపెనీల చట్టం 2005 ప్రకారం దరఖాస్తు అందిన 30 రోజుల్లోపు క్రెడిట్ సమాచారాన్ని అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని వైశాలి తెలిపారు.



"కష్టానికి, శ్రమకు తగిన ప్రతిఫలం లభించడానికి కొంత సమయం పడుతుంది." – వారెన్ బఫెట్

పొదుపు-మదుపు



క్వాంటమ్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్





మార్కెట్లలో దిద్దుబాటు కొనసాగితే మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో వేల్యూ ఇన్వెస్టింగ్ అనుసరించేవి ఆకర్షణీయంగా మారతాయి. విలువల పరంగా ఆకర్షణీయ స్థాయిలో ఉన్న స్టాక్స్‌ను కొనుగోలు చేయడం వేల్యూ ఇన్వెస్టింగ్‌లో భాగం. ఈ తరహా పథకాలకు ఇటీవల కాస్తంత ఆదరణ తగ్గింది. బుల్ ర్యాలీ జోరే అందుకు కారణం. కరెక్షన్ నేపథ్యంలో వీటికి మళ్లీ ఆకర్షణ వస్తోంది. ఇటువంటి పథకాల్లో క్వాంటమ్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్ కూడా ఒకటి. మార్కెట్లు డౌన్‌సైడ్‌లో ఉన్నప్పుడు ఆ ప్రభావాన్ని గట్టిగా ఎదుర్కోగలిగే సామర్థ్యం ఈ ఫండ్‌కు ఉంది. లార్జ్‌క్యాప్ ఫండ్ కేటగిరీలోకి వస్తుంది. దీర్ఘకాలంలో ఇతర పథకాల కంటే క్వాంటమ్ లాంగ్‌టర్మ్ రాబడులు అధికంగా ఉండడం గమనించొచ్చు.

రాబడులు బాగున్నాయి...

గతేడాది బుల్స్ ర్యాలీ జోరుగా ఉన్నప్పుడు, ఈ పథకం రాబడులు 12.5 శాతమే. గతేడాది ప్రామాణిక సూచీల రాబడులు 22.5 శాతం అయితే, లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోనే ఇతర పథకాల సగటు రాబడులు 20 శాతం. కాకపోతే, దీర్ఘకాలంలో చూస్తే మూడు, ఐదు, పదేళ్ల కాలంలో క్వాంటమ్ లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్ రాబడులు సూచీలకు దీటుగా కాస్తంత పైనే ఉన్నాయి. అందుకే దీర్ఘకాలిక లక్ష్యాలు, అవసరాల కోసం నిధి సమకూర్చుకునేందుకు పరిశీలించతగిన పథకం ఇది. దీర్ఘకాలిక పోర్ట్‌ఫోలియోలో, లార్జ్‌క్యాప్‌కు ప్రాధాన్యం ఇచ్చే వారి పోర్ట్‌ఫోలియోలో చోటివ్వదగిన పథకం. ముఖ్యంగా గడిచిన ఏడాది కాలంలో ఈ ఫండ్ రాబడులు తక్కువగా ఉండడానికి ప్రధాన కారణం అధిక నగదు నిల్వలు ఉండటమే. మొత్తం నిధుల్లో 16 శాతం నగదు రూపంలోనే ఉన్నాయి. పెట్టుబడుల్లో 80 శాతం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌కే కేటాయించింది. దీంతో బుల్ ర్యాలీలో రాబడులు పరిమితంగా, స్థిరంగా ఉన్నాయి. మార్కెట్లు, స్టాక్స్ విలువలు ఖరీదుగా మారాయని భావిస్తే విక్రయించేసి నగదు నిల్వలను పెంచుకోవడంలో ఈ పథకం ఏమాత్రం సంకోచించదు. అధిక నగదు నిల్వలుండటం వల్ల మార్కెట్ల దిద్దుబాటులో ఆకర్షణీయమైన విలువల వద్ద లభించే స్టాక్స్‌లో తిరిగి ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు లభిస్తుంది.

పెట్టుబడులు, పోర్ట్ ఫోలియో

ఈ పథకం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌కే పరిమితం. దీంతో మార్కెట్లు డౌన్‌టర్న్‌లో స్మాల్, మిడ్ క్యాప్ స్టాక్స్ మాదిరిగా విలువ భారీగా హరించుకుపోయే ప్రమాదం తక్కువ. ఇతర పథకాలతో పోలిస్తే ప్రతికూల సమయాల్లోనూ ఈ ఫండ్ మెరుగ్గా రాణించడానికి ఈ విధానమే కారణం. ఈ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో (వ్యయాల నిష్పత్తి) చాలా తక్కువ. డైరెక్ట్ ప్లాన్‌లో ఇది 1.29 శాతం అయితే, రెగ్యులర్ ప్లాన్‌లో 1.46. ఇక పోర్ట్‌ఫోలియో సైతం అధిక నాణ్యత కలిగిన 25లోపు కంపెనీలతోనే ఉండడం ఆకర్షణీయమే. గడిచిన ఏడాది కాలంలో ఈ ఫండ్ తన పోర్ట్‌ఫోలియోలోకి చేర్చుకున్న స్టాక్ లుపిన్ మాత్రమే. ఈ షేరు ధర భారీగా పతనం కావడంతో చౌకగా లభిస్తుండడమే కారణం. మరోవైపు, కోటక్ మహీంద్రా బ్యాంకు, ఇండియన్ ఆయిల్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్‌ను విక్రయించింది.

టాప్ టెన్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
బజాజ్ ఆటో	7.55
హెచ్‌డీఎఫ్‌సీ	7.36
ఇన్ఫోసిస్	6.46
హీరో మోటోకార్ప్	6.13
టీసీఎస్	5.80
ఐసీఐసీఐ బ్యాంక్	4.66
ఎస్‌బీఐ	4.05
ఇండియన్ హోటల్స్	3.89
విప్రో	3.71
ఎన్‌టీపీసీ	3.66

● యాప్‌కీ కహానీ...

డైలీ ఎక్స్‌పెన్సెస్-2



మీకు వచ్చే జీతంలో మీరు ప్రతి నెల ఎంత మొత్తం ఖర్చు చేస్తున్నారో తెలుసుకోవాలని భావిస్తున్నారా? అలాగే మీ ఖర్చులను వేటి కోసం అధికంగా చేస్తున్నారో ట్రాక్ చేయాలనుకుంటున్నారా? ఎలాంటి తికమక, గందరగోళం లేకుండా సులభంగా మీ ఆర్థిక లావాదేవీలపై పట్టు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారా? అయితే ఇంకేం.. ఆర్థిక లావాదేవీల నిర్వహణ కోసం 'డైలీ ఎక్స్‌పెన్సెస్-2' అనే యాప్‌ను ఉపయోగించి చూడండి. యూజర్లు దీన్ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



ప్రత్యేకతలు

- యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్.
- ఆదాయం, ఖర్చులకు సంబంధించిన లావాదేవీలను కేటగరైజ్ చేసుకోవచ్చు.
- ముందుగా క్రియేట్ చేసుకున్న రికార్డులను తొలగించవచ్చు.
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బకాయిల చెల్లింపుల కోసం బిల్స్ రిమైండర్లను, అలర్ట్స్‌ను సెట్ చేసుకోవచ్చు.
- ఆదాయ, వ్యయాలను రోజూ, వారం, నెల, ఏడాది వారీగా చూసుకోవచ్చు.
- డేటా బ్యాకప్ ఫీచర్ ఉంది. యాప్‌కు పాస్‌వర్డ్‌ను పెట్టుకోవచ్చు.
- రిపోర్టులను ఇన్ఫోగ్రాఫిక్స్ రూపంలో చూడొచ్చు.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, ఫిబ్రవరి 22 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.75- 6.90	6.90
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.45- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.7	6.50
డీసీబీ బ్యాంక్	7.00	7-7.15	7.2-7.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.5	6.75 - 6.85	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6-6.7	6.7-6.85	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.2-6.4	6.60	6.40
ఎస్‌బీఐ	6.25	6.25	6.00
సిండికేట్ బ్యాంక్	6.25	6.75	6.50

మరింత సమాచారం కోసం W పై క్లిక్ చేయండి

పసిడికి డాలరు దెబ్బ

- వారంలో 27 డాలర్ల పతనం
- దేశీయంగా పతనానికి రూపాయి అడ్డు
- మరింతగా తగ్గకపోవొచ్చంటున్న విశ్లేషకులు

మూడేళ్ల కనిష్టస్థాయి నుంచి డాలరు రికవరీకావడంతో గతవారం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు పసిడి ధర హఠాత్ పతనాన్ని చవిచూసింది. వారంవారంగా 27 డాలర్లు నష్టపోయి 1,330 డాలర్ల వద్ద ముగిసింది. ఒకదశలో ఇది 1,325 డాలర్లకు సైతం పడిపోయింది. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ఈ వారంలో అమెరికా కాంగ్రెస్ ముందు చేసే ప్రసంగం ఆధారంగా సమీప భవిష్యత్తులో పసిడి ట్రెండ్ వుండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డీ రేట్ల పెరుగుదల నెమ్మదిగా వుండవచ్చన్న సంకేతాల్ని ఆయన వెల్లడిస్తే పసిడి క్రమేపీ పుంజుకుంటుందని, వడ్డీ రేట్ల పట్ల కఠిన వైఖరిని పావెల్ ప్రదర్శిస్తే బంగారం ధర మరికాస్త తగ్గవచ్చని విశ్లేషకులు వారి అంచనాల్లో పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో అమెరికా ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం వుందని, ఈ కారణంగా ద్రవ్యోల్బణానికి రక్షణాత్మక పెట్టుబడిగా భావించే బంగారం ప్రస్తుత స్థాయి నుంచి భారీగా పతనమయ్యే అవకాశం లేదని వారు అంటున్నారు. సాంకేతికంగా 1,305, 1,290 స్థాయిల వద్ద పసిడి ఫ్యూచర్లకు మద్దతు లభిస్తున్నదని, 1,360, 1,375 స్థాయిల వద్ద అవరోధం కలగవచ్చని అనలిస్టులు అంచనావేస్తున్నారు.

దేశీయంగా రూ.300కుపైగా పతనం...

ఇక దేశీయంగా చూస్తే, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం ఇక్కడా కనిపించింది. అయితే ప్రపంచ మార్కెట్లో 2 శాతం వరకూ పసిడి తగ్గినప్పటికీ, ఇక్కడ మాత్రం క్షీణత 1 శాతానికే పరిమితమయ్యింది. రూపాయి భారీగా తగ్గిన కారణంగా, దేశీయంగా పసిడి పతనం అల్పంగా వుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో పసిడి వారంలో 10 గ్రాములకు రూ. 300 తగ్గి, రూ.30,509కి చేరింది.



ప్రధాన ముంబై స్పాట్ మార్కెట్‌లో 99.9 స్వచ్ఛత ధర రూ. 345 నష్టంతో రూ.30,570కు పడింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అదే స్థాయిలో తగ్గి రూ. 30,420కు చేరింది. వెండి కేజీ ధర భారీగా రూ.320 నష్టపోయి, రూ.38,390కి చేరింది. ఇక వారం వారీగా అంతర్జాతీయంగా రూపాయి డాలర్ మారకంలో బలహీనపడి 64.90 వద్ద ముగిసింది. 16వ తేదీతో ముగిసిన వారంలో ఈ విలువ 64.60 వద్ద ఉంది.

ప్రభుత్వ బ్యాంకుల్లో అధిక పెట్టుబడులున్న స్కీములివే

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వెల్లడైన రూ.11,000 కోట్ల కుంభకోణం దరిమిలా పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు ఇటీవల భారీ పతనాన్ని చవిచూసాయి. ఈ రంగంపై ఏర్పడిన నెగిటివ్ సెంటిమెంట్ కారణంగా ప్రముఖ బ్యాంకింగ్ షేర్లయిన ఎస్‌బీఐ, బీఓబీలు కూడా క్షీణతను చవిచూసాయి. దాంతో సహజంగానే మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలయ్యింది. కానీ కొన్ని స్కీముల్లో మాత్రమే ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో పెట్టుబడులు ఎక్కువ వున్నాయి. అన్నింటికంటే అధికంగా జనవరి నెలాఖరునాటికి హెచ్‌డీఎఫ్‌సీ ఇన్‌ఫ్రా ఫండ్ మొత్తం పెట్టుబడుల్లో 18.40 శాతం పెట్టుబడి ఈ షేర్లలో వుంది. రిలయన్స్ విజన్ ఫండ్‌కు 17.55 శాతం, ఎల్ఐసీ ఎంఎఫ్ ఈక్విటీ ఫండ్‌కు 17.14 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ ఈక్విటీ ఫండ్‌కు 15.01 శాతం రిలయన్స్ ట్యాక్స్ సేవర్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్‌కు 14.82 శాతం చొప్పున పెట్టుబడులు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో వున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ ప్రీమియర్ మల్టీక్యాప్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ టాప్–200 ఫండ్, ఫ్రాంక్లిన్ బిల్డ్ ఇండియా ఫండ్, ఫ్రాంక్లిన్ ఇండియా హైగ్రోత్ కంపెనీస్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ ట్యాక్స్ సేవర్‌లు 10–12 శాతం మధ్య పెట్టుబడుల్ని ఈ షేర్లలో కలిగివున్నాయి.

స్టాక్స్ వ్యూ

గ్రాసిమ్ ఇండస్ట్రీస్ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: ఎడిల్‌వీజ్ ఫైనాన్షియల్
ప్రస్తుత ధర: రూ.1,131 ; **టార్గెట్ ధర:** రూ.1,416

ఎందుకంటే: ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన ఫ్లాగ్‌షిప్ కంపెనీ ఇది. సిమెంట్, కెమికల్స్, టెక్స్‌టైల్స్, వీఎస్ఎఫ్ సెగ్మెంట్లలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అల్ట్రాటెక్ సిమెంట్‌లో 60.3 శాతం, ఆదిత్య బిర్లా క్యాపిటల్‌లో 56 శాతం చొప్పున వాటాలున్నాయి. వీఎస్ఎఫ్, సిమెంట్ సెగ్మెంట్‌ల నుంచి దాదాపు 90 శాతం ఆదాయం వస్తోంది. దుస్తుల తయారీలో వినియోగించే విస్కోస్ స్టేపుల్ ఫైబర్(వీఎస్ఎఫ్) సెగ్మెంట్లో ప్రపంచంలోనే అగ్రస్థానం ఈ కంపెనీదే. ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. ఇబిటా (స్టాండ్‌లోన్) రూ.870 కోట్లకు పెరిగింది. వీఎస్ఎఫ్ సెగ్మెంట్లో అమ్మకాలు,, డిమాండ్ జోరుగా ఉండటంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడేళ్లలో 58 శాతం పెంచుకుంటోంది. దీని కోసం రూ.4,300 కోట్లు పెట్టుబడులు పెడుతోంది. గుజరాత్‌లోని విలాయత్ వీఎస్ఎఫ్ ప్లాంట్ విస్తరణకు ఇటీవలనే పర్యావరణ ఆమోదం పొందింది. రసాయనాల సెగ్మెంట్లో కూడా ఈ కంపెనీదే అగ్రస్థానం. ఈ క్యూ3లో రూ.359 కోట్ల ఇబిటా సాధించింది. కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక క్వార్టర్లీ ఇబిటా. గత ఏడాది డిసెంబర్ నాటికి కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నగదు రూ.274 కోట్లుగా, నికర రుణ భారం రూ.14,460 కోట్లుగా ఉన్నాయి. స్టాండ్‌లోన్ ప్రాతిపదికన రూ.600 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. వీఎస్ఎఫ్, కెమికల్స్ రంగాల్లో అగ్రస్థానంలో ఉండడం, సిమెంట్ రంగం వృద్ధి ఆశావహంగా ఉండడం, ఆర్థిక సేవల రంగం వ్యాపారం కూడా బాగా ఉండనుండడం సానుకూలాంశాలు. సిమెంట్, వీఎస్ఎఫ్ ధరలు బాగా తగ్గితే అది ఈ కంపెనీపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. వీఎస్ఎఫ్ సెగ్మెంట్ ఉత్పత్తి వ్యయాలు పెరగడం, దేశీయంగా, అంతర్జాతీయంగా ఇంధన వ్యయాలు అధికమయ్యే అవకాశాలు, ఆర్థిక సేవల రంగ సెగ్మెంట్ వృద్ధి అవకాశాలు తగ్గడం... ఇవన్నీ ప్రతికూలాంశాలు.

అశోక్ లేలాండ్ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.134 ; **టార్గెట్ ధర:** రూ.158

ఎందుకంటే: హిందుజా గ్రూప్‌లో ప్రధానమైన కంపెనీ ఇది. బస్సుల తయారీలో భారత్‌లోనే అతి పెద్ద కంపెనీ. మధ్య, భారీ వాణిజ్య వాహన మార్కెట్లో 26 శాతం మార్కెట్ వాటాతో భారత్‌లో రెండవ అతి పెద్ద కంపెనీ ఇదే. ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. ఆదాయం 47 శాతం వృద్ధితో రూ.7,110 కోట్లకు పెరిగింది. వివిధ రకాల మోడళ్లను అందుబాటులోకి తేవడం, ఎగుమతులు పెరగడంతో ఇబిటా మార్జిన్ 2 శాతం పెరిగి 11.1 శాతానికి చేరింది. ఇబిటా 74 శాతం వృద్ధితో రూ.790 కోట్లకు ఎగసింది. నికర లాభం 178 శాతం వృద్ధి చెంది రూ.450 కోట్లకు పెరిగింది. ఈ క్యూ3లో అమ్మకాలు 42 శాతం పెరిగాయి. పంత్ నగర్ ప్లాంట్ పన్ను ప్రోత్సాహకాలు తగ్గడం, భారీ డిస్కౌంట్ల కారణంగా స్థూల మార్జిన్ ఒకింత తగ్గింది. పన్ను రేటు అంచనాల కంటే అధికంగా ఉండటంతో ఇతర ఆదాయం రూ.38 కోట్లకు తగ్గింది. వాణిజ్య వాహన రంగం ఈ ఆర్థిక సంవత్సరంలో 10 శాతం వృద్ధి చెందగలదన్న అంచనాలున్నాయి. ఈ కంపెనీ కూడా ఇదే స్థాయిలో వృద్ధి చెందగలదని అంచనా వేస్తున్నాం. గత ఏడాది నవంబర్‌లో 1 శాతం, ఈ ఏడాది జనవరిలో 1–2 శాతం చొప్పున వాహనాల ధరలను పెంచడం కంపెనీకి కలిసివచ్చే అంశం. కీలకం కాని ఆస్తుల విక్రయం, మూలధన పెట్టుబడులపై నియంత్రణ, తదితర చర్యల కారణంగా రుణ భారం తగ్గించుకోవాలని, నగదు నిల్వలను పెంచుకోవాలని యోచిస్తోంది. ఏడాది కాలంలో 6–7 కొత్త మోడళ్లను అందుబాటులోకి తేనున్నది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఓవర్ లోడింగ్‌పై నిషేధం కారణంగా అమ్మకాలు పుంజుకోనుండడం, రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేయనుండడం, వ్యయ నియంత్రణపై కంపెనీ గట్టిగా దృష్టి పెట్టడం సానుకూలాంశాలు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

పోంజీ స్కీములపై కొరడా



పోంజీ పెట్టుబడి పథకాలతో సామాన్య ప్రజానీకాన్ని మోసగించే, నిర్వహించే వారిని కఠినంగా శిక్షించే దిశగా కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా చట్టవిరుద్ధంగా డిపాజిట్లు సమీకరించడాన్ని నిషేధిస్తూ సమగ్ర బిల్లును రూపొందించింది. అన్‌రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్స్ నిషేధ బిల్లు 2018ని త్వరలో పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది.

'తేజ్'లో యుటిలిటీ బిల్లుల చెల్లింపు

గూగుల్ ఇండియా గతేడాది సెప్టెంబర్‌లో ఆవిష్కరించిన మొబైల్ వాలెట్ యాప్ 'తేజ్'ను సరికొత్త ఫీచర్‌తో అప్‌డేట్ చేసింది. యుటిలిటీ బిల్ పేమెంట్ ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో యూజర్లు వాటర్, ఎలక్ట్రిసిటీ, డీటీహెచ్, మొబైల్ బిల్లులను చెల్లించొచ్చు. అది కూడా ఎటువంటి ట్రాన్సాక్షన్ చార్జీలు లేకుండా.

డీల్స్..



- ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ.. మీడియా సంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్‌లో వాటా కొంటోంది. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టయిన ఈరోస్ ఇంటర్నేషనల్‌లో 5 శాతం వాటాను ఒక్కో షేర్‌ను 15 డాలర్లకు రిలయన్స్ ఇండస్ట్రీస్ తన అనుబంధ కంపెనీ ద్వారా కొనుగోలు చేయనుంది.
- ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ రంగంలోకి ప్రవేశించింది. ఇన్వెస్ట్‌మెంట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈక్విరస్ క్యాపిటల్‌లో 26 శాతం వాటాను కొనుగోలు చేశామని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది.

మూతబడనున్న మరో టెల్కో

రుణభారంతో మూతబడుతున్న టెలికం సంస్థల జాబితాలో తాజాగా ఎయిర్‌సెల్ కూడా చేరబోతోంది. సుమారు రూ. 15,500 కోట్ల రుణాలు పేరుకుపోవడంతో కంపెనీ త్వరలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందు దివాలా పిటీషన్ దాఖలు చేయనుంది. మలేషియాకి చెందిన మాతృ సంస్థ మ్యాక్సిస్ గతంలో ఎయిర్‌సెల్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినప్పటికీ.. ఆ తర్వాత వెనక్కి తగ్గినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ప్రైవేటుకూ బొగ్గు మైనింగ్



ప్రభుత్వ రంగ దిగ్గజం కోల్ ఇండియా గుత్తాధిపత్యానికి చెక్ పెడుతూ బొగ్గు రంగంలో కేంద్రం మరిన్ని సంస్కరణలకు తెరతీసింది. ఇకపై వాణిజ్య అవసరాల కోసం బొగ్గును ఉత్పత్తి చేసేందుకు ప్రైవేట్ కంపెనీలకు కూడా కాంట్రాక్టులివ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీలు సొంత అవసరాల కోసం బొగ్గును ఉత్పత్తి చేయడానికి మాత్రమే అనుమతిస్తున్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో ఇటీవల జరిగిన సమావేశంలో కేంద్ర క్యాబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) ఈ నిర్ణయం తీసుకుంది.

షేర్ల తనఖా తగ్గింది!

ప్రమోటర్ల షేర్ల తనఖా గత ఏడాది డిసెంబర్ క్వార్టర్లో తగ్గింది. తనఖాలో ఉన్న ప్రమోటర్ల షేర్ల శాతం గత ఏడాది అక్టోబర్ క్వార్టర్లో సగటున 8.3 శాతంగా ఉంది. అది డిసెంబర్ క్వార్టర్లో 7.8 శాతానికి తగ్గినట్లు కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ రీసెర్చ్ తెలియజేసింది. డిసెంబర్ క్వార్టర్లో ప్రమోటర్లు రూ.1.98 లక్షల కోట్ల విలువైన షేర్లను తనఖా పెట్టారని ఇది బీఎస్ఈ–500 సూచీ మార్కెట్ క్యాప్‌లో 1.47 శాతానికి సమానమని పేర్కొంది.

పీఎఫ్ వడ్డీ రేటు 8.55 శాతానికి తగ్గింపు



ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఈపీఎఫ్‌వో 2017–18 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్‌పై వడ్డీ రేటును 8.65 శాతం నుంచి 8.55 శాతానికి తగ్గించింది. దీంతో రూ. 586 కోట్ల మేర మిగులు నమోదు కానుందని ఈపీఎఫ్‌వో ట్రస్టీల సమావేశం అనంతరం కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 8.65 శాతం వడ్డీ రేటునివ్వడంతో.. రూ. 695 కోట్ల మిగులు నమోదైనట్లు వివరించారు. దాదాపు 6 కోట్ల చందాదారులపై ఇది ప్రభావం చూపనుంది.

భారత్‌లో పెట్టుబడులు కొనసాగిస్తాం: ఉబెర్

ప్రముఖ ట్యాక్సీ సేవల సంస్థ 'ఉబెర్' తాజాగా భారత్‌లో పెట్టుబడులు కొనసాగిస్తామని స్పష్టం చేసింది.'ఇండియా మాకు చాలా ముఖ్యమైన ప్రాంతం. ప్రధానమైన మార్కెట్ కూడా. ఇక్కడ వచ్చే దశాబ్ద కాలంలో దాదాపు 10 రెట్ల వరకు వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం' అని ఉబెర్ సీఈవో డారా ఖోస్రోషాహి తెలిపారు. తొలిసారి భారత్‌లో పర్యటిస్తోన్న ఆయన.. సంస్థ ప్రధాన ఇన్వెస్టర్ అయిన సాఫ్ట్ బ్యాంక్ సలహాలను స్వీకరించబోమనే సంకేతాలిచ్చారు.

తొలి 5జీ ట్రయల్స్ సక్సెస్..



ఎయిర్‌టెల్, హువావే సంస్థలు తాజాగా భారత్‌లో తొలిసారి 5జీ నెట్‌వర్క్ ట్రయల్స్‌ను నిర్వహించాయి. ఇందులో 3 గిగాబైట్ పర్ సెకన్ (జీబీపీఎస్)కుపైగా డేటా స్పీడ్‌ను సాధించినట్లు ఇరు కంపెనీలు ప్రకటించాయి. గురుగావ్‌లోని మానేసర్ వద్ద ఉన్న ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఈ ట్రయల్స్ జరిగాయి.

ఇంటర్నెట్ యూజర్లు @ 50 కోట్లు!!

దేశంలో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 2018 జూన్ నాటికి 50 కోట్లకు చేరుతుందని అంచనా. ఐఎంఏఐ– ఐఎంఆర్‌బీ సంయుక్త సర్వేలో ఈ విషయం వెల్లడయ్యింది. సర్వే ప్రకారం.. 2017 డిసెంబర్‌లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 11.34 శాతం వృద్ధితో 48.1 కోట్లకు చేరింది. పట్టణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 2017 డిసెంబర్ నాటికి వార్షిక ప్రాతిపదికన 9.66 శాతం వృద్ధితో 29.5 కోట్లకు చేరి ఉంటుందని అంచనా. ఇక ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 14.11 శాతం వృద్ధితో 18.6 కోట్లకు పెరిగి ఉండొచ్చు. భారత్‌లోని మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో విద్యార్థులు, యువత వాటా దాదాపు 60 శాతం.

ఇక క్రాస్ కరెన్సీ ట్రేడింగ్!



బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో (బీఎస్ఈ) క్రాస్ కరెన్సీ డెరివేటివ్స్ ట్రేడింగ్ మొదలవుతోంది. ఈ నెల 27 నుంచి క్రాస్ కరెన్సీ డెరివేటివ్స్‌ను ప్రారంభిస్తున్నామని, క్రాస్ ఇండియన్ రూపీ (ఐఎన్‌ఆర్) ఆప్షన్స్‌ను కూడా ఆరంభిస్తామని బీఎస్ఈ వెల్లడించింది. వీటివల్ల లిక్విడిటీ మరింతగా పెరుగుతుందని తెలియజేసింది. ప్రస్తుతం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (ఎంసీఎక్స్) కరెన్సీ ట్రేడింగ్‌కు అనుమతి ఉంది కానీ.. క్రాస్ కరెన్సీ ట్రేడింగ్‌కు అనుమతి లేదు.

మూడేళ్లలో ఇ-రిటైల్‌లో 2.5 రెట్లు వృద్ధి!!

ఇ-రిటైల్ మార్కెట్ వచ్చే మూడేళ్లలో రెండు రెట్లకు పైగా పెరగనుందని క్రిసిల్ తన నివేదికలో అంచనా వేసింది. అయితే మార్కెట్ పరిమాణం ఎంతుంటుందో మాత్రం వెల్లడించలేదు. కంపెనీలు డిస్కౌంట్ల నుంచి ఏకీకరణ, భౌగోళిక వైవిధ్యం, వ్యాపార పునర్‌నిర్మాణం, కస్టమర్లకు చేరువ కావడం వంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించాల్సి వస్తుందని తెలిపింది.

ఆటోమొబైల్స్..




- అల్ట్రా–లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'రోల్స్‌రాయిస్' తాజాగా 8వ జనరేషన్ ఫాంటమ్ కారును భారత్ మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.9.5 కోట్లు.
- జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యూకు చెందిన ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగం బీఎండబ్ల్యూ మోటొరాడ్ తాజాగా భారత్‌లో తన బైక్స్ ధరలను 10 శాతం వరకు తగ్గించింది. ధరల తగ్గింపు నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. అడ్వెంచర్, స్పోర్ట్, టూరింగ్, హెరిటేజ్, రోడ్‌స్టర్ వంటి కేటగిరీల్లోని మోటార్‌సైకిళ్లకు తగ్గింపు వర్తిస్తుందని పేర్కొంది.
- స్కోడా ఆటో ఇండియా తన అన్ని మోడళ్ల ధరలను వచ్చే నెల నుంచి పెంచుతోంది. బడ్జెట్లో కస్టమ్స్ సుంకాలను పెంచడంతో అన్ని మోడళ్ల ధరలను 1 శాతం వరకూ (రూ.10,000 నుంచి రూ.35 వేల వరకూ) పెంచుతున్నామని స్కోడా ఆటో ఇండియా తెలిపింది. కస్టమ్స్ సుంకం పెంపు ప్రభావాన్ని తట్టుకోవడానికి దశల వారీగా కార్ల ధరలను మరింతగా పెంచుతామని పేర్కొంది.
- కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ 'లెనొవొ ఇండియా' ఆండ్రాయిడ్ ట్యాబ్లెట్ వ్యాపారంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తాజాగా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 30.8 శాతం మార్కెట్ వాటాతో మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. కంపెనీ మొదటి స్థానంలో ఉండటం ఇది వరుసగా మూడో త్రైమాసికం.



బొమ్మ-బొరుసు

"సాహసోపేత నిర్ణయాలు తీసుకోలేకపోతే..
జీవితంలో ఎప్పటికీ ఏమీ సాధించలేం."
–జాక్ వెల్చ్, జనరల్ ఎలక్ట్రిక్ మాజీ ఛైర్మన్



జీడీపీ గణాంకాలు కీలకం

- మార్చి 2 (శుక్రవారం) హోలీ సెలవు
- ట్రేడింగ్ నాలుగు రోజులే
- జీడీపీ, తయారీ రంగ గణాంకాలపై దృష్టి
- వెలుగులో వాహన షేర్లు

జీడీపీ, తయారీ రంగ గణాంకాలు, డాలర్‌తో రూపాయి కదలికలు ఈ వారం మార్కెట్‌కు కీలకం కానున్నాయని నిపుణులంటున్నారు. ఉత్తర కొరియాపై అమెరికా భారీగా ఆంక్షలు విధించడం కూడా ప్రభావం చూపించవచ్చని నిపుణులంటున్నారు. వీటితో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల గమనం, ప్రపంచ మార్కెట్ల పోకడ, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి తదితర అంశాలు స్టాక్ సూచీల కదలికలను నిర్దేశిస్తాయని మార్కెట్ విశ్లేషకులంటున్నారు. హోలీ కారణంగా వచ్చే నెల 2(శుక్రవారం) మార్కెట్‌కు సెలవు. ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానున్నది.

బుధవారం క్యూ3 జీడీపీ గణాంకాలు..

ఈ నెల 28న(బుధవారం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక జీడీపీ గణాంకాలు వస్తాయి. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ1లో 5.7 శాతంగా ఉన్న జీడీపీ ఈ క్యూ2లో 6.3 శాతానికి పెరిగింది. అదే రోజు తయారీ రంగ పీఎమ్ఐ గణాంకాలు కూడా వెలువడతాయి. గత ఏడాది డిసెంబర్‌లో 54.7గా ఉన్న తయారీ రంగ పీఎమ్ఐ గత నెలలో 52.4కు పడిపోయింది. ఫిబ్రవరి నెల వాహన విక్రయ వివరాలను వాహన కంపెనీలు వచ్చే నెల 1(గురువారం) వెల్లడిస్తాయి. దీంతో ఈ వారం వాహన షేర్లు వెలుగులోకి రావచ్చు. ఇక ఈ వారంలో 17 కంపెనీలు తమ క్యూ3 ఫలితాలను వెల్లడిస్తాయి. ఓఎన్‌జీసీ, సీఈఎస్‌సీ, పీఎఫ్‌సీ, టీవీఎస్ మోటార్ తదితర కంపెనీలు తమ క్యూ3 ఫలితాలను ఈ వారంలోనే వెల్లడిస్తాయి.



మార్కెట్ ముందుకే !

ఇన్వెస్టర్లు తాజా సంకేతాల కోసం ఎదురుచూస్తున్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ప్రపంచ మార్కెట్లు నిలకడగా ఉంటే, అది దేశీయంగా ఇన్వెస్టర్లపై సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఇక ఈ వారంలో క్యూ3 జీడీపీ అంచనాలు, తయారీ రంగ గణాంకాలు కీలకం కానున్నాయని వ్యాఖ్యానించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం మార్కెట్‌పై బాగానే ప్రభావం చూపించిందని శామ్‌కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోదీ చెప్పారు. అయితే ఇది ఇప్పటికే మార్కెట్లో పూర్తిగా డిస్కౌంట్ అయిపోయిందని పేర్కొన్నారు. ఈ కుంభకోణం సైజు చిన్నదేనని, దేశ వృద్ధి జోరును ఆపే శక్తి ఈ స్కామ్‌కు లేదని వివరించారు. ఈ కుంభకోణాన్ని విస్మరించి మార్కెట్ ముందుకే దూసుకుపోతుందని పేర్కొన్నారు. గత వారంలో డాలర్‌తో రూపాయి మారకం బాగా క్షీణించిందని, ఇది ఆందోళన చెందే విషయమని ఏంజెల్‌బ్రోకింగ్ చీఫ్ అనలిస్ట్ సమీత్ చవాన్ చెప్పారు. రూపాయిపై, అమెరికా మార్కెట్‌పై ఇన్వెస్టర్లు ఒక కన్నేసి ఉంచాలని ఆయన సూచించారు.

నేటి నుంచి హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఐపీఓ

హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ ఐపీఓ సోమవారం ప్రారంభమై ఈ నెల 28(బుధవారం) ముగుస్తుంది. రూ.263–270 ప్రైస్‌బాండ్‌తో ఈ ఐపీఓ ద్వారా రూ.462 కోట్లు సమీకరించాలని కంపెనీ యోచిస్తోంది. కనీసం 55 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వచ్చే నెల 9న ఈ షేర్ స్టాక్ మార్కెట్లో లిస్టవుతుంది. ఇక ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్ కంపెనీ షేర్ నేడు(సోమవారం) స్టాక్‌మార్కెట్లో లిస్ట్‌కానున్నది. రూ.180–190 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఈ ఐపీఓ 1.3 రెట్లు సబ్‌స్క్రైబయింది. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.980 కోట్లు సమీకరించింది.

10,000 కోట్ల విదేశీ నిధులు వెనక్కి

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు ఈ నెలలో ఇప్పటిదాకా మన స్టాక్ మార్కెట్‌నుంచి రూ.10,000 కోట్ల మేర పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) రూ.11,400 కోట్ల కుంభకోణానికి అంతంత మాత్రంగానే ఉన్న అంతర్జాతీయ సంకేతాలు కూడా తోడవడంతో ఈ స్థాయిలో విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నారని నిపుణులంటున్నారు. కాగా గత నెలలో విదేశీ ఇన్వెస్టర్లు మన స్టాక్ మార్కెట్లో రూ.13,780 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. దేశీయ సంకేతాలు బలహీనంగా ఉండటం, ముడిచమురు ధరలు పెరుగుతుండటంతో ద్రవ్యలోటు పెరుగుతుందేమోనన్న ఆందోళన ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

డిపాజిటరీల గణాంకాల ప్రకారం, విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెల 1–23 మధ్యన స్టాక్ మార్కెట్లో రూ.9,899 కోట్ల మేర పెట్టుబడులు ఉపసంహరించుకోగా, డెట్ మార్కెట్లో మాత్రం రూ.1,500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు.

ఎల్‌ఈడీ/ఓఎల్‌ఈడీ టీవీల ధరలకు రెక్కలు



7% వరకు అధికమయ్యే చాన్స్

న్యూఢిల్లీ: ఎల్‌ఈడీ/ఓఎల్‌ఈడీ టీవీల ధరలకు రెక్కలు రానున్నాయి. మోడల్‌నుబట్టి ధర 2 నుంచి 7 శాతం వరకు అధికమయ్యే చాన్స్ ఉంది. పెరిగిన కస్టమ్స్ డ్యూటీకి అనుగుణంగా తయారీ కంపెనీలు సైతం ధరల సవరణకు దిగడమే ఇందుకు కారణం. 7.5 శాతం ఉన్న దిగుమతి పన్నును తాజా బడ్జెట్‌లో 15 శాతానికి చేర్చిన సంగతి తెలిసిందే. అలాగే ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ, ఓఎల్‌ఈడీ టీవీల విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీని 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. డ్యూటీని 10 శాతానికి కుదించాల్సిందిగా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయెన్సెస్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సియామా) ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ధరల సవరణకు దిగింది. ఎల్‌ఈడీ, ఓఎల్‌ఈడీ రంగంలో రెండేళ్లుగా పెద్దగా వృద్ధి లేదని, ధరలు పెరిగితే స్వల్పకాలంలో డిమాండ్ తగ్గుతుందని సియామా చెబుతోంది. ఇదే జరిగితే తయారీ కంపెనీల విస్తరణ పరిమితమవుతుందని అసోసియేషన్ ప్రెసిడెంట్ మనీష్ శర్మ పేర్కొన్నారు. కొత్త ఉద్యోగాల సృష్టి తగ్గుతుందన్నారు.

ఒకదాని వెంట ఒకటి..

ధరల పెంపు ప్రభావం కస్టమర్లపై ఉంటుందని ప్యానాసోనిక్ చెబుతోంది. మోడళ్ల ధర 2–7 శాతం అధికం కానుందని కంపెనీ ఇండియా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం బిజినెస్ హెడ్ నీరజ్ బహల్ తెలిపారు. ధరల సవరణ విషయంలో సామ్‌సంగ్ సైతం ఇదే బాటలో నడవనుంది. ధరల పెంపు తప్పదని, ఏ మేరకు పెంచాలో అన్న అంశంపై కసరత్తు చేస్తున్నామని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండీ కి వాన్ కిమ్ వ్యాఖ్యానించారు. విక్రయ ధర అధికమైతే మధ్య, దీర్ఘకాలిక ప్రభావం ఎలా ఉంటుందన్న అంశాన్ని అధ్యయనం చేస్తున్నట్టు సోనీ ఇండియా బ్రేవియా బిజినెస్ హెడ్ సచిన్ రాయ్ పేర్కొన్నారు. టీవీల విక్రయాలు గత కొన్నేళ్లుగా వృద్ధిబాటలో ఉన్నాయని, మొత్తం పరిశ్రమను చూస్తే పెంపు ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు. కాగా, దేశీయంగా తయారీని పెంచడానికే దిగుమతి పన్ను పెంపు అని ప్రభుత్వం చెబుతోంది.

కార్పొరేట్లకు రుణాలను కట్టడి చేయరాదు

- అలా చేస్తే నష్టం
- బ్యాంకులను పటిష్టపరచాలి
- ప్రభుత్వ వాటాలను తగ్గించుకోవాలి
- పీఎన్‌బీ స్కామ్ నేపథ్యంలో కార్పొరేట్ రంగం సూచనలు



Confederation of Indian Industry

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల స్కామ్ వెలుగు చూసిన నేపథ్యంలో కార్పొరేట్లకు రుణాల జారీ తగ్గించరాదని దేశ కార్పొరేట్ రంగం హెచ్చరించింది. ముఖ్యంగా వృద్ధి రేటు పుంజుకోవాల్సిన తరుణంలో, అధిక వృద్ధి రేటు సాధించాల్సి ఉన్నందున ఈ చర్య అవసరమని సూచించింది. ఆర్థిక మోసాలకు చెక్ పెట్టేందుకు మరింత పటిష్టమైన వ్యవస్థలను ప్రవేశపెట్టాలని, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రభుత్వం తన వాటాను క్రమంగా తగ్గించుకోవాలని కోరింది. "పీఎస్‌బీల్లో ప్రభుత్వం తన వాటాను క్రమంగా 33 శాతానికి తగ్గించుకోవాలి. ఆర్థిక మోసాలను అరికట్టేందుకు, మెరుగైన పర్యవేక్షణ, బ్యాంకుల తనిఖీలను మెరుగుపరిచే రెండంచెల విధానాన్ని అనుసరించాలి. ఉత్తమమైన కార్పొరేట్ పరిపాలనా ప్రమాణాలను కొనసాగించాలి" అని సీఐఐ సూచించింది.

సవాళ్లకు వెంటనే పరిష్కారం కనుగొనాలి

"ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, పరిశ్రమ వెంటనే ఆర్థిక రంగంలోని వ్యవస్థాపరమైన సవాళ్లను వెంటనే పరిష్కరించాలి. బ్యాంకింగ్ రంగానికి మెరుగైన నిర్వహణ, నిర్వహణ సామర్థ్యాలు, బ్లాక్‌చెయిన్, డేటా అనలైటిక్స్ వంటి టెక్నాలజీల వినియోగం, పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటాను తగ్గించుకోవడం వంటివి అవసరం" అని సీఐఐ ప్రెసిడెంట్ శోభనా కామినేని పేర్కొన్నారు. పీఎన్‌బీ స్కామ్ నేపథ్యంలో కార్పొరేట్లకు రుణాల వితరణను పూర్తిగా నిలిపివేయడం చేస్తే అది పీఎస్‌బీల్లో ఉన్నత స్థాయిలోని వారిని నిరుత్సాహానికి గురిచేస్తుందని అసోచామ్ హెచ్చరించింది. అనైతిక వ్యాపార సంస్థలు, అవినీతి అధికారులు కుమ్మక్కై పాల్పడే ఆర్థిక నేరాల కారణంగా పరిశ్రమకు నిధులు నిలిపివేసే పరిస్థితి రాకూడదని పేర్కొంది. "పీఎస్‌బీలను స్థిరీకరించడం ద్వారా ఉత్తమ ప్రమాణాలు, జవాబుదారీ, పారదర్శకతతో కూడిన పలు పటిష్ట బ్యాంకులను ఏర్పాటు చేయాలి. రీక్యాపిటలైజేషన్‌తో ప్రభుత్వం తన వాటాను పెంచుకుంటోంది. కానీ, ప్రభుత్వం నిర్దేశించుకున్న విధంగా తన వాటాను 52 శాతానికి వెంటనే తగ్గించుకోవాలి" అని శోభ కామినేని సూచించారు. బ్యాంకుల ప్రైవేటీకరణ వంటి దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరమని అసోచామ్ జనరల్ సెక్రటరీ డీఎస్ రావత్ అన్నారు. "ఏవో ఒకటి రెండు నల్ల గొర్రెలు మన ఆర్థిక వ్యవస్థను కూల్చేయలేవు. ఈ తరహా షాక్‌లను తట్టుకోగలదు. అయినప్పటికీ ఆ తరహా కుదుపులను వ్యవస్థాపరమైన సంస్కరణలతో నివారించాలి" అని రావత్ సూచించారు.

యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి డాక్టర్ రెడ్డీస్‌కి ఈఐఆర్

DR.REDDY'S

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన శ్రీకాకుళం ఏపీఐ యూనిట్‌కు అమెరికా ఆహార ఔషధ నియంత్రణ మండలి (యూఎస్‌ఎఫ్‌డీఏ) నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ (ఈఐఆర్) అందింది. ఈ విషయాన్ని కంపెనీ వెల్లడించింది. "ఎఫ్‌డీఏ మరిన్ని వివరాలు కోరింది. ఆ వివరాలను అందించే పనిలో ఉన్నాం. పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించుకునేందుకు ఎఫ్‌డీఏకు సహకారం అందిస్తాం" అని డాక్టర్ రెడ్డీస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. ఈఐఆర్‌లోని అంశాలను వివరించకుండా, యూఎస్ ఎఫ్‌డీఏ ఓఏఐ స్టాటస్‌ను కొనసాగించినట్టు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. ఓఏఐ అన్నది ఆడిట్ చేసిన చోట అభ్యంతరకరమైన పరిస్థితులనుగుర్తించినట్టు, ఎఫ్‌డీఏ నుంచి నియంత్రణ పరమైన లేదా పరిపాలనా పరమైన ఆంక్షలను తెలియజేస్తుంది.

గత వారం హీరోలు

స్టాక్స్	23 ముగింపు	16 ముగింపు	మార్పు(%)
అపోలో హాస్పిటల్స్	1,232	1,138	8
టెక్ మహీంద్రా	620	585	6
వేదాంత	337	319	6
టీసీఎస్	3,077	2,937	5
భారతీ ఇన్‌ఫ్రాటెల్	340	327	4
బ్రిటానియా	4,964	4,781	4
యస్ బ్యాంక్	324	312	4
గ్రాసిమ్ ఇండస్ట్రీస్	1,134	1,098	3
ఇన్ఫోసిస్	1,156	1,125	3
కోటక్ బ్యాంక్	1,080	1,052	3

ఎందుకు పెరిగాయంటే...

అనుబంధ సంస్థల కోసం రూ.101 కోట్ల మేర లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ) జారీ చేయడంతో అపోలో హాస్పిటల్స్ 8 శాతం ఎగసింది. రూపాయి బలహీనపడి, డాలర్ పుంజుకోవడం, నాస్కామ్ ఆశావహ అంచనాల నేపథ్యంలో టెక్ మహీంద్రా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ షేర్లు 2–6 శాతం పెరిగాయి. ఆఫ్రికాలో జింక్ కార్యకలాపాల విస్తరణ కారణంగా వేదాంత 6 శాతం వరకూ పెరిగింది. టార్గెట్ ధరను రూ.5,550కు క్రెడిట్ సూసీ పెంచడంతో బ్రిటానియా షేర్ 4 శాతం వరకూ లాభపడింది.

గత వారం జీరోలు

స్టాక్స్	23 ముగింపు	16 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	190	245	-23
పీఎన్‌బి	113	126	-10
బీపీసీఎల్	430	466	-8
సీమెన్స్	1,171	1,264	-7
బ్యాంక్ ఆఫ్ బరోడా	146	152	-4
డాబర్ ఇండియా	329	342	-4
బజాజ్ ఆటో	2,988	3,103	-4
కమ్మిన్స్ ఇండియా	820	851	-4
ఏషియన్ పెయింట్స్	1,102	1,144	-4
ఎం అండ్ ఎం	719	744	-3

ఎందుకు తగ్గాయంటే...

న్యూ వరల్డ్ ఫండ్ ఇన్‌కార్పొ, స్మాల్ క్యాప్ వరల్డ్ ఫండ్ ఇన్‌కార్పొలు 1.5 శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించడంతో వక్రంగీ షేర్ 23 శాతం వరకూ నష్టపోయింది. కుంభకోణం నేపథ్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాలు 10–6 శాతం తగ్గాయి. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థలు అమ్మేయండి అన్న రేటింగ్‌ను ఇవ్వడం, మొబిలిటీ డివిజన్, రైల్ ట్రాక్షన్ డ్రైవ్స్ బిజినెస్‌ను విక్రయించనుండటంతో సీమెన్స్ 7% పతనమైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 26-2-2018

విశాఖ	360-00
చిత్తూరు	388-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	395-00
విజయవాడ	358-00
గోదావరి	358-00
నమక్కల్	380-00
25-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	385-00
ఢిల్లీ	375-00
కోల్‌కతా	415-00

రూ.25,000కోట్లకు.. ఐపీవోలు

- క్యూలో రెండు డజన్లకు పైగా కంపెనీలు
- ఐసీఐసీఐ సెక్యూరిటీస్, భారత్ డైనమిక్స్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్




న్యూఢిల్లీ: రెండు డజన్లకు పైగా కంపెనీలు ఐపీవో మార్గంలో నిధుల సమీకరణకు సిద్ధమయ్యాయి. రూ.25,000 కోట్ల నిధుల సమీకరణకు సన్నద్ధమవుతున్నాయి. హిందుస్తాన్ ఏరోనాటిక్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీ, ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్, తదితర కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. రానున్న నెలల్లో ఇవన్నీ నిధులు సమీకరించనున్నాయి. సెబీ వద్ద ఈ కంపెనీలు దాఖలు చేసిన ఐపీవో పత్రాలను పరిశీలిస్తే విస్తరణ, మూలధన అవసరాలకు, బ్రాండ్ విలువ పెంచుకునేందుకు, వాటాదారులకు లిక్విడిటీ కోసం ఐపీవోలకు వస్తున్నట్టు తెలుస్తోంది. బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీ, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, భారత్ డైనమిక్స్, ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఐపీవోలకు సెబీ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంకా రైట్స్, మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్, బంధన్ బ్యాంకు, ఇండోస్టార్ క్యాపిటల్ ఫైనాన్స్, నజారా టెక్నాలజీస్, రూట్ మొబైల్ సహా 20 కంపెనీలు సెబీ అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ కలసి సుమారు రూ.25,000 కోట్ల నిధుల్ని సమీకరించనున్నాయని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.

34,100పైన రిలీఫ్ ర్యాలీ

మార్కెట్ పంచాంగం


రెండువారాల క్రితం ప్రపంచ మార్కెట్లను బెంబేలెత్తించిన అమెరికా మార్కెట్ గత 10 రోజులుగా గొప్పర్యాలీని జరిపింది. అంతక్రితం చవిచూసిన నష్టాల్లో 70 శాతం వరకూ ఈ మార్కెట్ పూడ్చుకోగలిగింది. సాంకేతికంగా కీలకమైన 61.8 శాతం రిట్రేస్‌మెంట్ స్థాయిని అమెరికా సూచీలు దాటగలగడం ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు ఊరటనిచ్చే అంశం. ఇందుకు తగ్గట్లే పలు ప్రధాన ఆసియా సూచీలు..లాటిన్ అమెరికా దేశాల సూచీలు కూడా పెరిగాయి. ఇవి ఇటీవల పతనంతో సంభవించిన నష్టాల్లో 50–60 శాతం వరకూ పూడ్చుకోగలిగాయి. కానీ భారత్ మార్కెట్ మాత్రం 25 శాతం మాత్రమే రికవరీ కాగలిగింది. దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులపై బడ్జెట్లో ప్రతిపాదించిన పన్ను, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వంటి అంశాలు మన మార్కెట్..ఇతర సూచీలను అనుసరించకపోవడానికి కారణం. అయితే గతవారం ఫిబ్రవరి డెరివేటివ్ సిరీస్ ముగింపు సమయంలో జరిగిన ఒడుదుడుకుల్లో ఫిబ్రవరి 6 నాటి కనిష్టస్థాయిల్ని సెన్సెక్స్, నిఫ్టీలు నిలుపుకోగలగడం సానుకూలాంశం. ఈ సాంకేతిక అంశం కారణంగా రానున్న కొద్దిరోజుల్లో రిలీఫ్ ర్యాలీ జరిగే అవకాశాలు అధికంగా వున్నాయని అధికశాతం విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ఇక ప్రధాన సూచీల సాంకేతిక అంశాలు ఇలా వున్నాయి.

సెన్సెక్స్ సాంకేతికాలు..



ఫిబ్రవరి 23తో ముగిసినవారంలో గత మార్కెట్ పంచాంగంలో సూచించిన అంచనాలకు అనుగుణంగా 33,850 మద్దతుస్థాయిని కోల్పోయినంతనే 33,554 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమయ్యింది. వారంలో చివరిరోజున పెద్ద ర్యాలీ జరపడంతో ద్వారా 34,142 పాయింట్ల వద్ద ముగిసింది. అంతక్రితంవారంతో 131 పాయింట్ల లాభాన్ని ఆర్జించింది. ప్రస్తుతానికి 34,100 పాయింట్ల స్థాయి సెన్సెక్స్‌కు ఈక్విలిబ్రియమ్‌గా వ్యవహరించవచ్చు. ఈ స్థాయి ఎగువన బలం, దిగువన బలహీనతల్ని సెన్సెక్స్ ప్రదర్శించవచ్చని టెక్నికల్ చార్టులు సూచిస్తున్నాయి. ఈ కారణంగా 34,100పైన మార్కెట్లో రిలీఫ్‌ర్యాలీ జరిగే చాన్సుంది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ భారీగా పెరిగిన కారణంగా ఈ సోమవారం గ్యాప్‌అప్‌తో మొదలైతే సెన్సెక్స్ 34,470 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయి ఎగువన ముగిస్తే 34,610–34,670 పాయింట్ల శ్రేణిని చేరవచ్చు. ఈ స్థాయిని కూడా ఛేదించగలిగితే క్రమేపీ 34,874–35,006 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ వారం రెండో నిరోధస్థాయిని దాటలేకపోయినా, బలహీనంగా మొదలైనా 33,830 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే వేగంగా 33,650 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ స్థాయిని వదులుకుంటే మరోదఫా 33,480 పాయింట్ల స్థాయికి పడిపోవొచ్చు.

10,480 స్థాయిపైన నిఫ్టీకి బలం



క్రితం వారం తొలిరోజున 10,302 పాయింట్ల కనిష్టస్థాయివరకూ పడిపోయిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ చివరిరోజున 10,500పైకి ర్యాలీ జరపగలిగింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 39 పాయింట్ల లాభంతో 10,491 వద్ద ముగిసింది. ఈ సోమవారం పాజిటివ్‌గా మార్కెట్ మొదలైతే నిఫ్టీకి 10,580 వద్ద తొలి అవరోధం కలగవచ్చు. ఈ స్థాయిపైన స్థిరపడితే 10,615–10,640 శ్రేణి వరకూ పెరగవచ్చు. ఆపైన ముగిస్తే 10,702–10,736 శ్రేణి వరకూ నిఫ్టీ రిలీఫ్ ర్యాలీ సాగించవచ్చు. ఈ వారం రెండో నిరోధశ్రేణిని ఛేధించలేకపోయినా, బలహీనంగా మొదలైనా 10,390 పాయింట్ల వద్ద నిఫ్టీకి తొలి మద్దతు లభ్యమవుతున్నది. ఈ లోపున ముగిస్తే 10,350 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే మరోదఫా 10,276 పాయింట్లస్థాయికి పతనం కావొచ్చు.

– పి. సత్యప్రసాద్

నేరుగా ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేస్తే?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా ఇద్దరి పిల్లల ఉన్నత విద్యావసరాల కోసం గత కొంత కాలం నుంచి మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాను. నేను లక్ష్యంగా నిర్దేశించుకున్న మొత్తానికి..ఈ ఇన్వెస్ట్‌మెంట్స్, వీటిపై రాబడులు చేరాయి. ఇప్పుడు ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను తీసేసుకోమంటారా ?

–జగన్, హైదరాబాద్

ఒక ఆర్థిక లక్ష్యం కోసం చేసిన ఇన్వెస్ట్‌మెంట్స్ ఆ లక్ష్యాన్ని చేరితే, ఆ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను తీసేసుకోవచ్చు. ఉదాహరణకు పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం మీరు కొంత కాలం పాటు ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తూ ఉన్నారు. నిర్దేశిత కాలంలో కొంత రాబడితో ఆశించిన మొత్తాన్ని ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ సాధించాయి. దీంతో మీరు అనుకున్న ఆర్థిక లక్ష్యం నెరవేరింది. ఇలాంటప్పుడు చివరి నిమిషం దాకా వేచి చూడాల్సిన పనిలేదు. మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు, మీకు ఈ డబ్బులు మరో మూడేళ్ల దాకా అవసరం లేదు అనుకుంటే ఈ మొత్తంలో కొంత భాగాన్ని వెనక్కి తీసుకోవచ్చు. మీ ఇన్వెస్ట్‌మెంట్స్ మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి మించిన సంతృప్తి కంటే ఎక్కువ ఏదీ కాదు. మీ పిల్లల ఉన్నత విద్యావసరాల కోసం మీరు మీ కష్టార్జితంలోంచి పొదుపు చేస్తున్నారు. కాబట్టి ఈ ఆర్థిక లక్ష్యం సాధన మీకు ఎంతగానో తృప్తినిచ్చి ఉంటుంది. అందుకని నిరభ్యంతరంగా ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకోండి. కానీ ఈ డబ్బులను మీ పిల్లల ఉన్నత విద్యావసరాల కోసమే వినియోగించండి. ఇతరత్రా చిల్లర, మల్లర ఖర్చులకు వాడేసి తర్వాత సర్దుబాటు చేద్దాంలే అనుకోకండి.

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు వస్తాయని చెప్తున్నారు కదా! ఫండ్స్‌లో కాకుండా నేరుగా ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేయవచ్చు కదా?

–లత, విశాఖపట్టణం

నేరుగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం కన్నా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. మనలాంటి సాధారణ ఇన్వెస్టర్లందరి దగ్గర నుంచి పొదుపుల రూపంలో డబ్బులను సమీకరించి మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఇన్వెస్ట్ చేస్తాయి. ఏ షేర్‌లో ఇన్వెస్ట్ చేయాలి లేదా ఏ బాండ్‌ను ఎంచుకోవాలి అనే నిర్ణయాన్ని మన బదులు ఫండ్ మేనేజర్లు ఆలోచిస్తారు. ఈక్విటీల్లో నేరుగా ఇన్వెస్ట్ చేయడం కొంచెం కష్టసాధ్యమైన పనే. మనం ఏ కంపెనీ షేర్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నాం? ఆ రంగం స్థితిగతులు ఎలా ఉన్నాయి? కంపెనీ ఆర్థిక పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయి ? కంపెనీ ప్రమోటర్ల ట్రాక్ రికార్డ్ ఎలా ఉంది ? కంపెనీకి ఎదురువుతున్న సవాళ్లేంటి ? తదితర చాలా విషయాలను కూలంకషంగా పరిశీలించాల్సి ఉంటుంది. అదే మ్యూచువల్ ఫండ్స్ అయితే ఇలాంటి విషయాలన్నింటినీ ఆమూలాగ్రం పరిశీలించడానికి, పరిశోధించడానిక ఒక పూర్తి స్థాయి రీసెర్చ్ టీమే ఉంటుంది. అంతే కాకుండా ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో దశాబ్దాల అనుభవం ఉన్న వ్యక్తులు ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ విషయమై మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న వ్యక్తులనే మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఫండ్ మేనేజర్లుగా తీసుకుంటాయి. నేరుగా ఈక్విటీల్లో కంటే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడమే ఇన్వెస్టర్ల పరంగా చూస్తే మంచి నిర్ణయం. ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం సులభం, నేరుగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం కంటే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి తక్కువ సమయం, తక్కువ ప్రయత్నాలు సరిపోతాయి. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించి తక్కువ అనుభవమున్నా, లేదా అసలు అనుభవం లేకున్నా అవగాహన లేకపోయినా సరే, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి మంచి రాబడులు పొందవచ్చు. ఇక ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించి అత్యంత కీలకమైన అంశం డైవర్సిఫికేషన్. ఇది ఒక్క మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారానే సాధ్యమవుతుంది. మీరు నేరుగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తే, మీ ఇన్వెస్ట్‌మెంట్స్ కొన్ని కంపెనీలకే పరిమితమవుతాయి. అదే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేశారనుకుంటే ఆ ఫండ్ పోర్ట్‌ఫోలియోలో విభిన్న రంగాలకు చెందిన కంపెనీలుండే అవకాశాలు అధికంగా ఉంటాయి. అందుకని మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్‌ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు పొందవచ్చు. చాలా మంది ఇన్వెస్టర్లు ఏం చేస్తారంటే.. తమకు మంచి అవగాహన ఉందంటూ ఏవో కొన్ని షేర్లలో ఇన్వెస్ట్ చేస్తారు. తమ నైపుణ్యాలను అధికంగా అంచనా వేసుకొని బోల్తా పడుతుంటారు. ఫలితంగా ఖరీదైన మూల్యం చెల్లిస్తుంటారు. ఇలా జరగకుండా ఉండాలనుకుంటే ఈక్విటీల్లో నేరుగా కంటే కూడా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడమే ఉత్తమం.

నాకు ఇద్దరు కొడుకులున్నారు. ఇద్దరి వయసులు 25, 23 సంవత్సరాలు. వీరిద్దరి పేరు మీద జీవన్ సరళ్, మనీ బ్యాక్ పాలసీల కింద ఏడాదికి రూ.25,000 ప్రీమియమ్ చెల్లిస్తున్నాను. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సీ కింద నా ఇద్దరు కొడుకుల పాలసీలకు చెల్లిస్తున్న ప్రీమియమ్‌కు నేను పన్ను మినహాయింపు పొందవచ్చా?

–అనంత్, విజయవాడ

మీ ఇద్దరు కొడుకులకు మీరు చెల్లిస్తున్న పాలసీల ప్రీమియమ్‌లకు పన్ను మినహాయింపులు పొందవచ్చు. ఏ వ్యక్తి అయినా, తనకు, తన భార్యకు, తన సంతానానికి చెల్లిస్తున్న పాలసీల ప్రీమియమ్‌లకు ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. లక్షన్నర వరకూ ఆదాయపు పన్ను మినహాయింపులు పొందవచ్చు.



'ఫ్లోర్' ఫైనల్లో అరుణ రెడ్డికి ఏడో స్థానం

ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్‌లో చివరిరోజు భారత జిమ్నాస్ట్‌లకు నిరాశ ఎదురైంది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఆదివారం జరిగిన మహిళల ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఫైనల్లో హైదరాబాద్ అమ్మాయి బుద్దా అరుణ రెడ్డి ఏడో స్థానంలో నిలిచింది. ఆమె 10.833 పాయింట్లు స్కోరు చేసింది. పారలల్ బార్స్ ఫైనల్లో భారత్‌కే చెందిన రాకేశ్ పాత్రా 13.433 స్కోరుతో ఏడో స్థానాన్ని పొందాడు. శనివారం వాల్ట్ ఈవెంట్‌లో అరుణ రెడ్డి కాంస్యం గెలిచి ఈ మెగా ఈవెంట్‌లో పతకం నెగ్గిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే.

ఆ సవాల్‌కు సిద్ధం!

ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలపై కోహ్లి

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా గడ్డపై అద్భుత ప్రదర్శన కనబర్చిన అనంతరం భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఇప్పుడు ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలలో జరిగే సిరీస్‌లపై దృష్టి పెట్టాడు. ఆ రెండు దేశాల సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నట్లు అతను చెప్పాడు. వరుసగా రెండోసారి ఐసీసీ టెస్టు నంబర్‌వన్‌గా నిలిచి గద అందుకున్న అనంతరం తమ ప్రదర్శన ఇంకా 80 శాతంగా మాత్రమే ఉందని అతను అన్నాడు. 'రాబోయే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలు మాకో పెద్ద సవాల్‌లాంటివి. మేం ఈ దేశాల్లో అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే మరింత పట్టుదలగా ఆడాలి. ప్రస్తుతానికి మా ప్రదర్శన 80 శాతంగా మాత్రమే ఉంది. ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టు కావాలంటే అది 100 శాతం కావాలి. అయితే 80 శాతంతో సాధించిన ఫలితాలు కూడా గొప్పగా అనిపిస్తున్నాయి. మా దృష్టిలో ప్రతీ మ్యాచ్ సొంత మైదానంలో ఆడుతున్నట్లే భావిస్తాం తప్ప పిచ్‌ల గురించి పట్టించుకోం. ఒక్కసారి పిచ్‌ను చూశాక పరిస్థితులకు తగినట్లుగా సిద్ధమైపోతాం' అని కోహ్లి తమ జట్టు ఆటను విశ్లేషించాడు. దక్షిణాఫ్రికాతో చివరిదైన మూడో టి20 మ్యాచ్ ముగిశాక ఐసీసీ తరపున 'హాల్ ఆఫ్ ఫేమ్' దిగ్గజ ఆటగాళ్లు సునీల్ గావస్కర్, గ్రేమ్ పొలాక్ ఈ గదను కోహ్లికి అందజేశారు. భారత జట్టు గదతో పాటు, 10 లక్షల డాలర్ల (రూ. 6 కోట్ల 48 లక్షలు) ప్రైజ్‌మనీని దక్కించుకుంది. ర్యాంకింగ్స్ పరిశీలనకు తుది గడువైన ఏప్రిల్ 3వ తేదీ నాటికి మరే జట్టు టీమిండియాను అధిగమించే అవకాశం లేకపోవడంతో టాప్ ర్యాంక్ పదిలమైంది.



భారత కెప్టెన్ కోహ్లికి ఐసీసీ తరఫున గద అందజేస్తున్న సునీల్ గావస్కర్, గ్రేమ్ పొలాక్



టి20 సిరీస్ ట్రోఫీతో భారత జట్టు సభ్యులు

వన్డేల్లోనూ తిరిగొస్తా

రైనా ఆత్మవిశ్వాసం

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్ సురేశ్ రైనాకు పునరాగమనంలాంటిది. దాదాపు ఏడాది తర్వాత జట్టులోకి వచ్చిన అతను ఈ సిరీస్‌లో 15, 31, 43 పరుగులు చేశాడు. చివరి టి20లో బౌలింగ్‌లో కూడా రాణించి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ ప్రదర్శనతో తాను చాలా సంతోషంగా ఉన్నానని, భవిష్యత్తులో ఇదే జోరు కొనసాగించి వన్డే జట్టులోకి కూడా తిరిగొస్తానని అతను విశ్వాసం వ్యక్తం చేశాడు. రైనా భారత్ తరపున 2015 అక్టోబరులో ఆఖరిసారిగా వన్డే ఆడాడు. 'తిరిగి జట్టులోకి రావడం నాకు కీలక మలుపులాంటింది. ఇప్పుడు గెలిచిన జట్టులో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. మూడో స్థానంలో నాకు అవకాశమిచ్చి దూకుడుగా ఆడమంటూ కోహ్లి నాపై నమ్మకముంచడం వల్లే ఇది సాధ్యమైంది. ముున్ముందు శ్రీలంకతో టోర్నీతో పాటు ఐపీఎల్‌లో కూడా పెద్ద సంఖ్యలో మ్యాచ్‌లకు అవకాశం ఉంది. గత రెండేళ్లుగా చాలా కష్టపడ్డాను. భారత్‌కు మళ్లీ ఆడాలనే పట్టుదలతో మైదానంలో, జిమ్‌లో కూడా తీవ్రంగా శ్రమించాను. వన్డేల్లో నేను గతంలో ఐదో స్థానంలో రాణించాను. రాబోయే మరికొన్ని మ్యాచ్‌లలో బాగా ఆడితే చాలు వన్డేల్లో కూడా తిరిగి వస్తాననే నమ్మకం ఉంది' అని రైనా చెప్పాడు.

ఎక్కడా తగ్గలేదు

- అదే మా విజయ రహస్యం
- భారత్ ప్రదర్శనపై రోహిత్ శర్మ

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో రెండు పరిమిత ఓవర్ల సిరీస్‌లు గెలుచుకొని సగర్వంగా తిరిగి వెళుతుండటం పట్ల తాత్కాలిక కెప్టెన్ రోహిత్ శర్మ చాలా సంబరంగా ఉన్నాడు. చివరి టి20లో కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్, ఈ మ్యాచ్‌లో తమ వ్యూహాలన్నీ సఫలమయ్యాయని చెప్పాడు. 'ఈ రెండు పరిమిత ఓవర్ల ట్రోఫీలను అందుకోవడం సంతోషంగా ఉంది. సిరీస్ మొత్తం మేం చాలా దూకుడుగా ఆడాం. ఎలాంటి పరిస్థితుల్లో కూడా మా బృందం వెనకడుగు వేయలేదు. దాని వల్లే ఇవాళ విజేతలుగా ఇక్కడ నిలబడ్డాం' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. తొలి ఆరు ఓవర్లలో కచ్చితత్వంతో వికెట్లపైకి మాత్రమే బంతులు వేయాలనేది తమ వ్యూహమని, దీనిని సమర్థంగా అమలు చేసి బౌలర్లు మ్యాచ్ గెలిపించారని అతను అన్నాడు. 'నిజాయితీగా చెప్పాలంటే మేం మరో 15 పరుగులు తక్కువగా చేశాం. మాకు లభించిన ఆరంభాన్ని బట్టి చూస్తే చివర్లో కాస్త జోరు తగ్గింది. అయితే ఈ అనుభవంతో ముున్ముందు మరిన్ని విషయాలు నేర్చుకుంటాం' అని రోహిత్ అభిప్రాయపడ్డాడు. ఏ జట్టుకూ సాధ్యం కాని రీతిలో గత రెండున్నర నెలలుగా అద్భుత ప్రదర్శన కనబర్చామన్న భువనేశ్వర్ కుమార్...ఈ పర్యటన తనకు మధురానుభూతిగా మిగిలిపోయిందని చెప్పాడు.



స్విస్ ఓపెన్ విజేత సమీర్ వర్మ

బాసెల్ (స్విట్జర్లాండ్): భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సమీర్ వర్మ స్విస్ ఓపెన్ టైటిల్ చేజిక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన స్విస్ ఓపెన్ సూపర్ 300 టోర్నీ ఫైనల్లో సమీర్ వర్మ 21–15, 21–13తో జాన్ జోర్గెన్‌సెన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. తద్వారా ఈ టోర్నమెంట్ టైటిల్ నెగ్గిన నాలుగో భారత ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. గతంలో సైనా (2011, 2012), కిడాంబి శ్రీకాంత్ (2015), ప్రణయ్ (2016) ఈ ఘనత సాధించారు. ఈ గెలుపుతో సమీర్‌కు 11,250 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 7 లక్షల 28 వేలు)తోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

అమిత్ 'పసిడి' పంచ్



సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్ అమిత్ పంఘల్ స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల 49 కేజీల విభాగం ఫైనల్లో సయిద్ మొర్దాజీ (మొరాకో)పై అమిత్ విజయం సాధించాడు. మహిళల విభాగంలో భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ (48 కేజీలు), సీమా పూనియా (ప్లస్ 81 కేజీలు) రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. ఫైనల్లో సెవ్డా అసెనోవా (బల్గేరియా) చేతిలో మేరీకోమ్... అనా ఇవనోవా (రష్యా) చేతిలో సీమా ఓడిపోయారు. మహిళల విభాగంలో భారత్‌కు మొత్తం ఆరు పతకాలు లభించాయి. మీనా కుమారి దేవి (54 కేజీలు), సరితా దేవి (60 కేజీలు), సవీటి బూరా (75 కేజీలు), భాగ్యబతి కచారి (81 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

ధ్యాన్‌చంద్‌ను క్యూలో నిలబెట్టారు

ఆత్మకథలో వెల్లడించిన మాజీ కెప్టెన్ గుర్‌బక్ష్ సింగ్



ధ్యాన్‌చంద్

కోల్‌కతా: భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్. తన అసాధారణ ఆటతీరుతో జర్మనీ నియంత హిట్లర్‌నే మెప్పించిన ఈ అలనాటి స్టార్ ఒలింపిక్స్‌లో స్వర్ణ చరిత్ర లిఖించారు. ఇప్పుడైతే వేనోళ్ల స్తుతిస్తున్నారు... ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. కానీ... ఆయన కెరీర్ ముగియగానే దిక్కుమాలిన రాజకీయాలతో ఘోరంగా అవమానించారని భారత హాకీ మాజీ కెప్టెన్ గుర్‌బక్ష్ సింగ్ తన ఆత్మకథ 'మై గోల్డెన్ డేస్'లో పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్ ఆట చూసేందుకు క్యూ కట్టిన రోజులున్నాయి. అయితే 1962లో ఆయన్నే క్యూలో నిలబెట్టిన ఘనత మన కుటిల రాజకీయాలది అని గుర్‌బక్ష్ సింగ్ తన బాధని వెళ్లగక్కారు. 1960 నుంచి 1970 వరకు క్రీడల వ్యవహారాలు నీచ రాజకీయాలతో మసకబారాయి. పాటియాలాలోని జాతీయ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఐఎస్), భారత హాకీ సమాఖ్యకు అప్పట్లో అసలు పొసిగేదే కాదు. ఆ సమయంలో ధ్యాన్‌చంద్ ఎన్ఐఎస్ చీఫ్ కోచ్‌గా పని చేశారు. తన వద్ద శిక్షణ పొందిన ఆటగాళ్లు తదనంతరం అహ్మదాబాద్‌లో మ్యాచ్‌లు ఆడుతుండగా... అక్కడికి వెళ్లిన ధ్యాన్‌చంద్‌ను స్టేడియంలోకి అనుమతించలేదు. అయితే ధ్యాన్‌చంద్ మాత్రం తన కుర్రాళ్ల ప్రదర్శన చూడాలన్న తాపత్రయంతో ప్రతీ మ్యాచ్ కోసం క్యూలో నిలబడి టికెట్ కొనుక్కొని మరీ చూశారు. ఇది అత్యంత శోచనీయమని గుర్‌బక్ష్ తన ఆత్మకథలో చెప్పుకొచ్చారు.

కివీస్‌ను గెలిపించిన రాస్ టేలర్



హామిల్టన్: రాస్ టేలర్ (113; 12 ఫోర్లు) అద్భుత శతకానికి సాన్‌ట్నర్ (27 బంతుల్లో 45; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు తోడవడంతో... ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్ గెలుపొందింది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య జట్టు 3 వికెట్లతో విజయం సాధించింది. మొదట ఇంగ్లండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. బట్లర్ (79; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), జో రూట్ (71; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కివీస్‌కు శుభారంభం లభించలేదు. 27 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన సమయంలో టేలర్, లాథమ్ (79; 6 ఫోర్లు) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 178 పరుగులు జోడించారు. చివర్లో సాన్‌ట్నర్ మెరవడంతో విజయం సొంతమైంది. నాలుగు నెలల తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌లో బరిలోకి దిగిన వివాదాస్పద ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ (2/43) బౌలింగ్‌లో ఫర్వాలేదనిపించాడు. టేలర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే బుధవారం మౌంట్‌మాంగనీలో జరుగనుంది.

ఐపీఎల్ మ్యాచ్‌లు చూపించడం కుదరదు

ఐసీసీ విజ్ఞప్తిని తిరస్కరించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు విజయవంతమైన టోర్నీగా ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లోని పలువురు సభ్యులు ఇప్పటివరకు ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడలేదు. ఏప్రిల్ 22 నుంచి 26 మధ్య కోల్‌కతాలో జరిగే ఐసీసీ సమావేశానికి వీరంతా హాజరవుతుండటంతో తాము ఐపీఎల్ చూడవచ్చని వారు ఆశించారు. కానీ ఆయా తేదీల్లో ఈడెన్ గార్డెన్స్‌లో ఒక్క ఐపీఎల్ మ్యాచ్ కూడా లేదు. దాంతో తమ కోసం షెడ్యూల్‌ను కాస్త మార్చి ఒక మ్యాచ్ జరిగేలా చూడమంటూ బీసీసీఐని ఐసీసీ చిరు కోరిక కోరింది. అయితే బీసీసీఐ మాత్రం అది కుదరదంటూ తిరస్కరించేసింది. 'ఒక మ్యాచ్‌లో మార్పులు చేస్తే మొత్తం షెడ్యూల్, దానికి సంబంధించి ఇప్పటికే చేసుకున్న ఏర్పాట్లు దెబ్బతింటాయి. కాబట్టి అది సాధ్యం కాదని మేం జవాబిచ్చాం' అని బోర్డు ఉన్నతాధికారి వెల్లడించారు.

కోహ్లి, ధోనీలకు విశ్రాంతి

- భువీ, బుమ్రా, పాండ్యా, కుల్దీప్‌లకు కూడా
- సిరాజ్‌కు దక్కిన చోటు
- ముక్కోణపు టి20 టోర్నీకి భారత జట్టు ప్రకటన

ముంబై: సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనలో మూడు ఫార్మాట్‌లలో ఆడిన నలుగురు భారత క్రికెటర్లకు తర్వాతి టోర్నమెంట్ నుంచి విశ్రాంతి ఇవ్వాలని సీనియర్ సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. వచ్చే నెలలో శ్రీలంకలో జరిగే ముక్కోణపు టి20 టోర్నీ 'నిదాహస్ ట్రోఫీ' కోసం ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని కమిటీ ఆదివారం భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్ విరాట్ కోహ్లి, బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాలను ఈ టోర్నీకి ఎంపిక చేయలేదు. వీరితో పాటు మహేంద్ర సింగ్ ధోని, కుల్దీప్ యాదవ్‌లను కూడా పక్కన పెట్టారు. స్వయంగా ధోని తనకు విశ్రాంతి కావాలని కోరగా... కుల్దీప్ ప్రస్తుతం గాయంతో బాధపడుతున్నాడు. 'రాబోయే సిరీస్‌ల షెడ్యూల్, పని భారాన్ని దృష్టిలో ఉంచుకుంటూ నిదాహస్ ట్రోఫీ కోసం జట్టును ఎంపిక చేశాం. ముఖ్యంగా పేస్ బౌలర్లు గాయాలపాలు కాకుండా ఉండేందుకు, మరింత మెరుగైన ప్రదర్శన కోసం తగినంత విశ్రాంతి అవసరమని హై పెర్ఫార్మెన్స్ బృందం సూచించింది. ధోని తనకు విశ్రాంతి కావాలని కోరడం వల్లే అతడిని ఎంపిక చేయలేదు' అని ఎమ్మెస్కే వెల్లడించారు.



సిరాజ్

విశ్రాంతినిచ్చిన ఆటగాళ్ల స్థానంలో వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, దీపక్ హుడా, రిషభ్ పంత్‌ను జట్టులోకి తీసుకున్నారు. హైదరాబాద్ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ఎంపిక కాలేకపోయిన సిరాజ్... విజయ్ హజారే టోర్నీలో 7 మ్యాచ్‌లలో కేవలం 15.65 సగటుతో 23 వికెట్లు పడగొట్టి బౌలర్ల జాబితాలో అగ్రస్థానంలో నిలవడం విశేషం. దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు శ్రీలంకతో జరిగిన టి20 సిరీస్‌లో సుందర్ కూడా ఆడగా, హుడాకు మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. శ్రీలంకతో టెస్టు సిరీస్ ఎంపికైనా విజయ్ శంకర్‌కు తుది జట్టులో స్థానం దక్కకపోగా... పంత్ భారత్ తరపున 2 టి20లు ఆడాడు. మరోవైపు ఈ సీజన్‌లో అన్ని ఫార్మాట్‌లలో కలిపి 2 వేలకు పైగా పరుగులు చేసిన కర్ణాటక బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేయకపోవడం ఆశ్చర్యం కలిగించింది. అయితే దేశవాళీ క్రికెట్‌లో బాగా ఆడినా... కనీసం ఇండియా 'ఎ' తరపున రాణించిన తర్వాతే ఆటగాళ్లను సెలక్షన్ కోసం పరిశీలించడం రివాజుగా పెట్టుకున్నట్లు బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. మార్చి 6 నుంచి 18 వరకు జరిగే ఈ టోర్నీలో భారత్‌తోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొంటాయి.

భారత టి20 జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), ధావన్ (వైస్ కెప్టెన్), రాహుల్, రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్ (వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చహల్, అక్షర్, విజయ్ శంకర్, శార్దుల్, ఉనాద్కట్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సిరాజ్.

ద్రవిడ్ మాట మన్నించారు

- అండర్–19 ప్రపంచకప్ జట్టు సహాయ సిబ్బందికి సమాన నజరానా
- సన్నాహాల్లో భాగమైన వారికీ వర్తింపు



ముంబై: భారత బ్యాటింగ్ దిగ్గజం, విజయవంతమైన జూనియర్ జట్ల కోచ్ రాహుల్ ద్రవిడ్ మాటను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మన్నించింది. అండర్–19 ప్రపంచకప్‌లో భారత జట్టు విజేతగా నిలిచేందుకు తోడ్పడిన శిక్షణ సిబ్బందికి సమాన ప్రోత్సాహకాన్ని ఇవ్వనున్నట్లు బోర్డు ప్రకటించింది. దీంతో ద్రవిడ్‌తో పాటు బృంద సభ్యులందరికీ రూ. 25 లక్షల చొప్పున నజరానా అందిస్తామని బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. కప్ గెలవగానే బోర్డు... ఆటగాళ్లకు రూ 30 లక్షలు, హెడ్ కోచ్ ద్రవిడ్‌కు రూ. 50 లక్షలు, సహాయ సిబ్బందికి రూ. 20 లక్షల చొప్పున ప్రోత్సాహకాల్ని ప్రకటించింది. దీనిపై ద్రవిడ్ అసంతృప్తి వెలిబుచ్చాడు. జట్టు కోసం తన సిబ్బంది అంతా సమష్టిగా శ్రమించారని, ఈ ఫలితంలో పేరొచ్చినా... ప్రోత్సాహకం వచ్చినా సమానంగా దక్కాల్సిందేనని డిమాండ్ చేశాడు. దిగ్గజ ఆటగాడి మాటకు విలువిచ్చిన బీసీసీఐ... ఏడాదికి పైగా యువ జట్టుకు సేవలందించిన కోచింగ్ సిబ్బందికి సమాన నజరానాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దీంతో జాతీయ క్రికెట్ అకాడమీ (బెంగళూరు)లో జట్టు సన్నాహాల్లో పాల్గొన్న సహాయ సిబ్బందికి కూడా నజరానా అందనుంది. మొదటి నజరానా జాబితాలో ఉన్న పారస్ మాంబ్రే (బౌలింగ్ కోచ్), అభయ్ శర్మ (ఫీల్డింగ్ కోచ్), యోగేశ్ పార్మర్ (ఫిజియోథెరపిస్ట్), ఆనంద్ దతే (ట్రెయినర్), మంగేశ్ గైక్వాడ్ (మసాజ్), దేవ్‌రాజ్ రౌత్ (వీడియో అనలిస్ట్)లతో పాటు స్వదేశంలోని సన్నాహాల్లో పాలుపంచుకున్న మరో ఐదుగురు డబ్ల్యూవీ రామన్ (కోచ్), మనుజ్ శర్మ, సుమిత్ మలహాపుర్కర్ (లాజిస్టిక్స్ మేనేజర్స్), అమోఘ్ పండిట్ (ట్రెయినర్), రాజేశ్ సావంత్ (దివంగత ట్రెయినర్)లకు బోర్డు బెనిఫిట్స్ దక్కనున్నాయి. ద్రవిడ్‌కు సగం నజరానా (రూ.25 లక్షలు) తగ్గినా అతను కోరుకున్న సమానత్వం మాత్రం దక్కింది.

ఔరా... ద్రవిడ్ ఔదార్యం

పృథ్వీ షా నేతృత్వంలోని కుర్రాళ్ల జట్టు ఒక్క మ్యాచ్ (ఫైనల్)తో అండర్–19 ప్రపంచకప్ గెలిచింది. కానీ ఆ ఒక్క విజయం కోసం ద్రవిడ్ సారథ్యంలోని కోచింగ్ బృందం ఓ ఏడాదికిపైగా విశేష కృషి చేసింది. ఈ బృంద సభ్యుల్లో కొందరు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో సేవలందిస్తే, ఇంకొందరు న్యూజిలాండ్ (ఆతిథ్య దేశం)కు జట్టుతో పాటు వెళ్లి చెమటోడ్చారు. అయితే బీసీసీఐ మొదట కివీస్ వెళ్లిన కోచింగ్ బృందానికే నజరానా ప్రకటించగా... టీమ్ ట్రెయినర్ రాజేశ్ సావంత్ గతేడాది మరణించారు. రాజేశ్ కూడా యువ జట్టును తీర్చిదిద్దిన రాహుల్ అండ్ కో సభ్యుడు. దీంతో అతనికి ప్రోత్సాహకం అందాలని ద్రవిడ్ గట్టిగా కృషిచేశాడు. ఇప్పుడు బోర్డు అతని కుటుంబానికి రూ. 25 లక్షలు ఇచ్చేందుకు సిద్ధపడింది. అందినకాడికి వచ్చిన దాంతో తన ఇంటిని మాత్రమే చక్కబెట్టుకునే వాళ్లున్న ఈ రోజుల్లో అందరికి పేరు, ప్రోత్సాహం రావాలన్న ద్రవిడ్ నిజంగా గ్రేట్... గ్రేటెస్ట్ కదా!

ఆంధ్ర ఓటమి

సెమీస్‌లో సౌరాష్ట్ర విజయం

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు పోరాటం ముగిసింది. అజేయంగా సెమీస్ చేరిన ఆంధ్ర ఆదివారం జరిగిన సెమీఫైనల్లో సౌరాష్ట్ర చేతిలో 59 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 49.1 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌట్ కాగా... ఆంధ్ర 45.3 ఓవర్లలో 196 పరుగులకే పరిమితమై టోర్నీ నుంచి నిష్క్రమించింది. రవీంద్ర జడేజా (56; 4 ఫోర్లు, 1 సిక్స్), అర్పిత్ (58; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో సౌరాష్ట్ర గౌరవప్రద స్కోరు చేసింది. ఆంధ్ర బౌలర్లలో కార్తీక్ రామన్ 4 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఆంధ్ర బ్యాట్స్‌మెన్‌కు మంచి ఆరంభాలు లభించినా వాటిని భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. భరత్ (29), అశ్విన్ హెబర్ (12), కెప్టెన్ విహారి (25), రికీ భుయ్ (13) తక్కువ స్కోర్లకే పరిమితమయ్యారు. సుమంత్ (42; 2 ఫోర్లు, 1 సిక్స్), రవితేజ (42) పోరాడినా లాభం లేకపోయింది. మంగళవారం జరిగే ఫైనల్లో కర్ణాటకతో సౌరాష్ట్ర తలపడుతుంది.

తిరుమలలో చిరుత మళ్లీ హల్‌చల్


బాలాజీనగర్‌లో సంచరిస్తున్న చిరుత

సాక్షి, తిరుమల: తిరుమలవాసులకు, అక్కడికి వచ్చే భక్తులకు చిరుత పులులు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కొంతకాలంగా అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న బాలాజీనగర్, కాటేజీ ప్రాంతాల్లో చిరుతల సంచారం పెరిగింది. ఇటీవల బాలాజీ నగర్‌లోని తూర్పు ప్రాంతంలో ఓ ఇంట్లో దూరిన చిరుత అక్కడి కుక్కను ఎత్తుకెళ్లింది. తాజాగా, ఆదివారం రాత్రి చిరుత తిరిగి అదే ప్రాంతానికి చేరుకుంది. సుమారు గంటకుపైగా అటూఇటూ తిరగాడింది. చెట్లు అలికిడి కావడంతో ఇంటి మిద్దెపై ఉన్న స్థానికుడు చిరుతను గుర్తించాడు. వెంటనే తన కెమెరాలో చిరుతను బంధించాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు అదే ప్రాంతానికి చేరుకోవడంతో చిరుత అడవిలోకి వెళ్లిపోయింది. తరచూ చిరుతల సంచారం పెరగడంతో స్థానికులు, భక్తులు భయాందోళనకు గురవుతున్నారు.


ఆకాశంలో విహరిస్తున్న రుస్తుం-2 యుద్ధ విమానం

రుస్తుం-2 గగన విహారం

సాక్షి, బెంగళూరు: మానవరహిత యుద్ధ విమానాన్ని డీఆర్‌డీఓ ఆదివారం విజయవంతంగా ప్రయోగించింది. రుస్తుం–2గా పిలిచే ఈ యుద్ధ విమానాన్ని డీఆర్‌డీఓ రూపొందించింది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరలోని ఏరోనాటిక్ టెస్ట్ రేంజ్ (ఏటీఆర్)లో రుస్తుం–2కు డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు అన్ని పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. నిఘాతో పాటు శత్రువుల ప్రాంతాలను గుర్తించేందుకుగాను ఈ విమానాన్ని భారత సైన్యం ఉపయోగించనుంది. ఇందులో అత్యంత శక్తివంతమైన ఇంజన్‌ను ఉపయోగించినట్లు అధికారులు తెలిపారు.

ఎస్‌ఎస్‌సీ సీజీఎల్ టైర్-2 పరీక్షల్లో మార్పు

సాక్షి, అమరావతి: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (టైర్–2)–2017 పరీక్షలో పేపర్–1కు సంబంధించి స్వల్ప మార్పు చేసింది. ఈ పరీక్షలు 17 నుంచి 22వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జరిగాయి. అయితే 21న జరిగిన పరీక్షలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. అనేక మంది అభ్యర్థులు పరీక్ష రాయడానికి అవస్థలు పడ్డారు. దీనిపై కమిషన్‌కు అనేక విన్నపాలు వచ్చాయి. అలాగే ఆయా రీజియన్ అధికారుల నుంచి కూడా కమిషన్‌కు నివేదికలు అందాయి. వీటిని పరిశీలించిన కమిషన్ ఆరోజు జరిగిన పేపర్–1 పరీక్షను తిరిగి నిర్వహించాలని నిర్ణయించింది. ఈ పరీక్షను మార్చి 9న నిర్వహించనున్నట్లు కమిషన్ ప్రకటించింది. పరీక్షకు తొలుత హాజరైన అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పించనుంది.

నేడు జూడాల అత్యవసర సమావేశం

సాక్షి, అమరావతి: స్టైఫండ్ పెంపు, బకాయిలు చెల్లింపులు, జీవో విడుదల చేసినా దాన్ని అమలు చేయకపోవడంపై జూనియర్ వైద్యులు సోమవారం అత్యవసరంగా సమావేశం కానున్నట్లు జూడాల సంఘం ఆదివారం తెలిపింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. మంత్రిని, ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన తర్వాత వారి సమాధానం మేరకు కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తుందని తాము ఊహించలేదని, జీవో ఇచ్చినా అమలు కాకపోవడం తమను బాధిస్తోందని జూడాల సంఘం ప్రతినిధి ఒకరు 'సాక్షి'తో చెప్పారు.

కాపులకు రిజర్వేషన్లు కొత్తగా ఇచ్చేవేమీ కాదు

- మార్చి 31లోగా రిజర్వేషన్లు కల్పించకుంటే ఉద్యమం
- కాపు ఉద్యమ నేత ముద్రగడ



కంభం: బ్రిటిష్ కాలంలో 1915లోనే కాపు, తెలగ, బలిజ, కులాలకు రిజర్వేషన్లు ఉన్నాయని, ప్రత్యేకంగా ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చేదేమీ లేదని గవర్నర్ సంతకంతో రాష్ట్రంలో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కూడా ఈ జాతి రిజర్వేషన్లు అనుభవించిందన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా కంభం వచ్చిన ఆయనకు కాపు నేతలు ఘన స్వాగతం పలికారు. స్థానిక కందులాపుర కూడలిలోని శ్రీకృష్ణదేవరాయలు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఉద్యోగాల్లో కాపులకు రిజర్వేషన్లు అమలు చేయడం కోసం ప్రధాని అనుమతితో రాష్ట్రపతి ఆమోదం అవసరమని, రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలుకు గవర్నర్ సంతకంతోనే అమలు చేయవచ్చన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో కాపురిజర్వేషన్లు ఖాయమన్న సీఎం నాలుగేళ్లు గడుస్తున్నా మంజునాథ కమిషన్ పేరిట కాలయాపన చేశారన్నారు. రాబోయే నోటిఫికేషన్లలోనే కాపులు 5 శాతం బీసీ–ఎఫ్ రిజర్వేషన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 31లోగా రిజర్వేషన్ల అంశం పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కాపు నాయకులతో చర్చించి ఉద్యమిస్తామన్నారు.

'రాజ్యసభ ఎన్నికలు బహిష్కరిస్తే కేంద్రంపై ఒత్తిడి'



అనంతపురం న్యూసిటీ: ప్రత్యేక హోదా విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజ్యసభ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని చెబితే కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుందని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభ ఎన్నికలు బహిష్కరించాలని సీఎం చంద్రబాబు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలను రఘువీరా కోరారు. ఏప్రిల్ 5లోపు ప్రత్యేకహోదాను సాధించుకోవాలని, తర్వాత అవకాశం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో 184 నిబంధన కింద నోటీసిచ్చిందన్నారు. బీజేపీ, తెలుగుదేశం దీనికి అడ్డుపుల్ల వేయవద్దన్నారు. ఈ నిబంధన చర్చకు వస్తే ఓటింగ్ పెరిగి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీతో స్నేహంగా ఉన్న 14 పార్టీలతో మద్దతు కూడగడుతామన్నారు. మార్చి 2న జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమం చేస్తున్నామని అందరూ భాగస్వామ్యులవ్వాలన్నారు. ఢిల్లీలో 6,7, 8 చలో పార్లమెంట్‌కు వెళ్తున్నామన్నారు.


పరీక్షకు వెళ్లే ముందు పెళ్లి పీటలపై సుధారాణి

పెళ్లి పీటల నుంచి 'టెట్'కు..!

కురబలకోట: పెళ్లి పీటల నుంచే టెట్ పరీక్షకు హడావుడిగా వెళ్లింది ఓ పెళ్లి కూతురు. ఈ ఘటన చిత్తూరు జిల్లా కురబలకోట మండలం తెట్టులో చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకురాలు, తెట్టు సర్పంచ్ చుక్కా మల్లమ్మ కుమారుడు చుక్కా వెంకటమోహన్‌కు పెద్దమండ్యం మండలంలోని సుధారాణితో నెల క్రితం పెళ్లి నిశ్చయమైంది. ఆదివారం తెట్టు జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు వీరి పెళ్లి జరిగింది. అయితే సుధారాణికి టెట్ పరీక్ష కూడా ఆదివారమే కావడంతో పెళ్లిపీటల నుంచే ఆమె పరీక్షకు హాజరుకావాల్సి వచ్చింది. పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఆమె టెట్ పరీక్షకు హాజరయ్యారు.

మైసూరు వారసుడికి నామకరణం

ఆద్యవీర నరసింహరాజ ఒడయార్‌గా పేరు పెట్టిన రాజమాత


సాక్షి, బెంగళూరు: దశాబ్దాల అనంతరం మైసూరు రాజవంశంలో జన్మించిన వారసుడికి ఆదివారం రాజమాత ప్రమోదాదేవి నామకరణం చేశారు. గతేడాది డిసెంబర్‌లో మైసూరు రాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్, త్రిషికా దంపతులకు జన్మించిన కుమారుడికి ఆద్యవీర నరసింహరాజ ఒడయార్‌గా ఆమె నామకరణం చేశారు. బెంగళూరు నగరంలోని ప్యాలెస్‌లో వైభవంగా నిర్వహించిన ఈ నామకరణ కార్యక్రమానికి ఇరు వంశాల కుటుంబసభ్యులు, ఆత్మీయులు మాత్రమే హాజరయ్యారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం, 26-2-2018



దేవుడా దేవుడా దేవుడా...
మరికొన్ని కథనాలు, స్పెషల్ ఇంటర్వ్యూలు
- ఫ్యామిలీ లోపలి పేజీల్లో



శీలాపనిందలు

లేని నిందల్ని నీలాపనిందలు అంటారు.
శీలం ఉన్నా లేదని అంటే?
అది శీలాపనిందే అవుతుంది.
మహిళపై దాడికి గొడ్డళ్లు, కొడవళ్లు అక్కర్లేదు.
శీలం మీద ఇంత బురద చల్లితే చాలు..
తను చచ్చిపోతుందనుకుంటారు.
ఊహు.. మేం ఒప్పకోం.
మా చెల్లి తామరాకు.
తనకు ఏ బురదా అంటుకోదు.
ఈ కేస్ స్టడీ చదవండి.
మగాడి నీచత్వం, స్త్రీ ఔన్నత్యం తెలుస్తుంది.

‘ఈమె డాక్టర్ సౌమ్య. గుడ్ రీసెర్చర్ ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్. పోస్ట్ లంచ్ సెషన్‌లో ప్రజంటేషన్ ఇస్తారు’ మిస్టర్ మీనన్‌కి నన్ను పరిచయం చేశారు మా డైరెక్టర్. మీనన్ చిరునవ్వుతో గ్రీట్ చేశారు.

‘విమెన్ ఎంపవర్‌మెంట్ మీద మీ పేపర్ చదివాను. ఎ గుడ్ ఐ – ఓపెనర్’ అన్నారు మీనన్. చాయ్ తాగుతూ ఆ సబ్జెక్టు గురించి పది నిమిషాలు మాట్లాడుకున్నాం.

దూరం నుంచి రెండు కళ్లు నా వైపు పదేపదే పరిశీలనగా చూస్తున్నాయి. బహుశా ఇప్పుడు ‘అతడు’ మరో ‘కుట్రకథ’ అల్లుతూ ఉంటాడనుకుంటాను. గిట్టని స్త్రీల ‘క్యారెక్టర్’తో ఆడుకోవడం.. రాజకీయం చేయడం.. రకరకాల కథలల్లడం అతడి అలవాటు. ఉద్యోగ జీవితంలో పైకి రావడానికి వీటినే నమ్ముకున్నాడు అతడు.

ఇక్కడ ‘అతడు’ అంటే అతడొక్కడే కాదు సుమా! ‘అతడు’ లాంటి ఇంకొందరి గురించి కూడా నేను మాట్లాడుతున్నా.

• ❖ •

ట్రైబల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును బాగా చేశానని ప్రశంసించారు మా డైరెక్టర్. కొత్త ప్రాజెక్టుల గురించి అరగంటసేపు చర్చించారు. చాలా సంతోషంగా అనిపించింది. అది నా కష్టానికి లభించిన గుర్తింపు.

ఆ లెవిల్‌కి రాలేకపోయాడు ‘అతడు’. సంస్థలో తనకు ప్రాధాన్యత లేకపోవడం భరించలేకపోయాడు. ఒక ఉద్యోగినిగా నన్ను ‘చంపేసేందుకు’ పావులు కదిపాడు. ‘క్యారెక్టర్’పై కథలల్లాడు.

ఆమె ఉద్యోగం చేయదు.. ఆవిడగారి కోసం ఎవరెవరో వచ్చిపోతుంటారు.. డైరెక్టర్‌కు ఆమె చాలా స్పెషల్.. ఇట్లాంటి మాటలు అనేకంగా ప్రచారంలో పెట్టాడు అతడు.

మొదట్లో నేనెంత భయపడిపోయానంటే – సీటులో నుంచి కదలబుద్ధయ్యేది కాదు. నా చుట్టూ ఉన్న వాళ్లని తప్పించుకుని తిరగడం మొదలుపెట్టాను. డైరెక్టర్ సార్ దగ్గరకి వెళ్లడం బాగా తగ్గించేశాను.

నాది వైబ్రెంట్ పర్సనాలిటీ అని ఎక్కడైతే కితాబులు అందుకున్నానో అక్కడే నాలోకి నేను ముడుచుకుపోయాను. తట్టుకోలేక ఏడుస్తూ అమ్మకు అన్నీ చెప్పేశాను. ‘ఎవడు ఎంత చెత్త వాగినా పట్టించుకోవద్దు. పని చేసుకుంటూ పో’ అని సలహా ఇచ్చింది మా అమ్మ.

నా వల్ల కాలేదు. కావడం లేదు. తరచూ మనసంతా ఒత్తిడి. ఎడతెరిపి లేని ఆలోచనలు. ‘అమ్మ కూడా ఈ విషప్రచారం నమ్మేస్తే..’ అనే ఆలోచన వచ్చినప్పుడు మరింత దుఃఖం.

• ❖ •

‘సౌమ్య హజ్బెండ్ నిన్న ఇక్కడికొచ్చాడు.
చాలా పెద్ద హోదాలో ఉన్నాట్ట’
‘మరెందుకో ఈవిడగారికి ఉద్యోగాలు...
హాయిగా ఇంటిపట్టున ఉండొచ్చు కదా’
‘వాళ్ల రిలేషన్‌షిప్ లీగలా? ఇల్లీగలా?’
‘ఆ పైవాడికే తెలియాలి.
అతడే భర్తని ఆమె చెప్పుకుంటూ ఉంటది’

ఇలాంటి సంభాషణలకు నారు పోసి నీరు పెట్టింది ‘అతడే’. లేడీ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇలాంటి మాటలు విన్నప్పుడు కుతకుతలాడిపోతుంటారు. మరి వాళ్లు కూడా ‘అతడి’ బాధితులే.

నేను రకరకాల ఆలోచనలతో కుంగిపోవడం గమనించాక – లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీకి ఫిర్యాదు చేయమన్నారు నా హజ్బెండ్.

ఈలోపే ఇంకో ఘోరం. ప్రమోషన్ లిస్ట్‌లో నా పేరు లేకుండా పోయింది. మనసంతా దిగులు కమ్మేసింది.

ఎన్నో మెచ్చుగోళ్లు.. 30 – 40 పబ్లికేషన్లు.. మంచి మంచి లెక్చర్లు.. ఛాలెంజింగ్ ప్రాజెక్టులు.. ఇవేమీ అక్కరకు రాలేదు. ఇలాంటి అకడమిక్ రికార్డ్ లేనప్పటికీ ప్రమోషన్ కొట్టేశాడు ‘అతడు’.

మీకు ఉద్యోగాలెందుకు? జీతాలెందుకు? అని నా ఎదుటికొచ్చి ప్రశ్నిస్తున్నాడంటే అతడికి ఎంత దురహంకారం? మనిషిగా, ఒక పౌరురాలిగా నా హక్కుల్ని నిరాకరిస్తున్నాడు ఆ సెక్సిస్ట్. నన్ను సర్‌పాస్ చేయమని నా మగ సబార్డినేట్లను పురిగొల్పుతున్నాడు. కొత్తగా వచ్చిన డైరెక్టర్ ‘నా జేబులోనే ఉన్నాడు’ అని ఒకటే ప్రేలాపనలు.

• ❖ •

ఓ వైపు ఆఫీసులో నా ప్రతిపత్తిని దిగజార్చే కుట్రలు. మరోవైపు నా గురించి ఇంటా బయటా ఏమనుకుంటున్నారోననే భయాలు. ఆలోచనలతో అలసిపోయేదాన్ని. యాంగ్జయిటీ తీవ్రమైనప్పుడు ఇర్రెగ్యులర్ పీరియడ్స్. భరించలేనంత బ్లీడింగ్. షాక్‌కు గురై ఆసుపత్రిలో చేరిన సందర్భాలున్నాయి. అబార్షన్లు కూడా అయ్యాయి. డాక్టర్ ఇచ్చిన మందులు వాడకపోతే పని చేయలేను. మందులు మింగితేనే నిద్ర.

ఇలాంటి పరిస్థితుల్లోనే – ఇంటెర్నల్ కంప్లయింట్స్ కమిటీ (ఐసీసీ) చైర్‌పర్సన్ అపాయింట్‌మెంట్ కోరాను. నెలరోజులు గడిచినా నాకు టైమ్ ఇవ్వలేదు. అకడమిక్ రంగంలో నాకున్న పరిచయాల ద్వారా ఒకలాంటి ఒత్తిడి తెస్తే గానీ ఆమె నా కంప్లయింట్ స్వీకరించలేదు. కానీ ఆమె నా మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకురమ్మన్నారు. తట్టుకోలేకపోయాను. దుఃఖాన్ని దిగమింగుకుంటూ బయటకొచ్చాను.

నాది చట్టబద్ధ వివాహం. పేరెంట్సే చేశారు. అయినా, పెళ్లికీ – కేసుకీ సంబంధమేంటి? చట్టం రిలేషన్‌షిప్స్‌ని స్క్రూటినీ చేయమందా? ఇదెక్కడి న్యాయం?

• ❖ •

మ్యారేజ్ సర్టిఫికెట్ ఇచ్చాను ఐసీసీ చైర్‌పర్సన్‌కి. పదుల సంఖ్యలో అమ్మాయిల్ని విచారించారు. అందరూ ‘అతడి’కి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినవారే. వారంతా ‘అతడి’ బాధితులే.

కమిటీ అతణ్ణి దోషిగా నిర్ధారించింది. ట్రాన్స్‌ఫర్ చేయాలని నిర్ణయించింది. కానీ ఆ నిర్ణయం అమలు కాలేదు. నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరని విరగబడి నవ్వుతున్నాడు ‘అతడు’. ఆఫీసు వాతావరణం నానాటికీ శత్రుపూరితంగా తయారవుతోంది నాకు. విమెన్స్ కమీషన్‌కు మొర పెట్టుకున్నాను. కేంద్రంలోని మూడు మంత్రిత్వ శాఖలకు లేఖలు రాశాను. న్యాయం కోసం ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలి నేను? మనఃశరీరాలను మెలిపెట్టే ఈ వేదన నుంచి నాకు విముక్తి ఎప్పుడు?

(సౌమ్య కేస్ స్టడీ)

- వి.ఉదయలక్ష్మి

ఐసీసీ తీర్మానాలకు కట్టుబడాల్సిందే..



లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం – అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) చేసిన రికమండేషన్లను సంస్థల యాజమాన్యాలు తప్పకుండా అమలు చేయాలి. కానీ సౌమ్య కేసులో అలా జరగలేదు. ఒకవేళ ఐసీసీ సిఫారసుల పట్ల అసంతృప్తిగా ఉన్నట్టయితే సంస్థ మళ్లీ విచారణ జరిపించవచ్చు. కొన్ని కార్పొరేట్ సంస్థల్లో మాదిరిగా ఎథిక్స్ కమిటీ వేసి, కేసును పరిశీలనకు పెట్టొచ్చు. ఇలాంటి కేసుల్లో యాజమాన్యాల వైపు నుంచి న్యాయం జరగనప్పుడు లేదా ఐసీసీ రికమండేషన్లపై అసంతృప్తి ఉన్నప్పుడు.. న్యాయవ్యవస్థను ఆశ్రయించాలంటోంది చట్టం. కానీ, ఐసీసీ విచారించిన కేసును మళ్లీ కోర్టు ముందుకు తోయడమంటే.. చట్టంలో లోపమున్నట్టే. అసలు సున్నితమైన ఇలాంటి అంశాల్లో కోర్టులకు వెళ్లేందుకు దాదాపు ఎవ్వరూ ఇష్టపడరు కూడా. ఈ నేపథ్యం నుంచే చట్టం రూపుదిద్దుకుంది. చట్టం ఐసీసీల ఏర్పాటును తప్పనిసరి చేసింది. మినీ కోర్టుల్లాంటి ఐసీసీల సిఫారసుల విషయంలో సంస్థలు సెన్సిటివ్‌గా ఉండాలి. ఆ సెన్సిటివిటీ లోపించడం వల్లే సౌమ్య కేసులో జాప్యం జరుగుతున్నట్టు అగుపిస్తోంది. ఈ జాప్యాన్ని నివారించేగలిగే / పరిస్థితిని చక్కదిద్దగలిగే మెకానిజమ్ ఏర్పాటు కావాల్సిన అవసరముంది. చట్టంలో లోపాల్ని సవరించాల్సి వుంది.

- **బి. గిరిజ,** తెలంగాణ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్, ‘సఖి’

ప్రశ్నించే ఫోరమ్స్ పెంచుకుందాం

వేధింపులు సహా స్త్రీలు ఎదుర్కొనే రకరకాల హింసల్నీ, వాళ్ల హక్కుల్నీ హేళన చేసే వాతావరణం మన చుట్టూ అలముకుంది. (సౌమ్య కేసులో ఇదే జరిగింది.) సీరియల్స్‌లో ఇలాంటి వాతావరణమే కనిపిస్తోంది. కుటుంబ హింస, రేప్ వంటివన్నీ ఇందులో ఉంటాయి. కానీ వాటిని ఎలా డీల్ చేయాలనేదానిపై ఒక సైంటిఫిక్ – థియరిటికల్ యాటిట్యూడ్ లేదు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాధితురాలితో – ఎక్కువ మాట్లాడితే నువ్వే వేధిస్తున్నట్టు కేసు పెడతానంటాడు పోలీసు. మరోవైపు, నెగిటివ్ క్యారెక్టర్ కుటుంబ హింస జరగకపోయినా జరిగినట్టు కేసు పెట్టించగలుగుతుంది. ఈ సీరియల్స్ ప్రకారం.. కోడళ్లందరూ అత్తలను హింసిస్తారు. కానీ తమను అత్తలే హింసిస్తున్నట్టు కేసులు పెడతారు. పోలీసులు వాటిని స్వీకరిస్తారు. ఈ తరహా ఇమేజస్ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. దాదాపు అన్ని సీరియల్స్ ఇలాంటి తప్పుడు భావనలే వ్యాప్తి చేస్తున్నాయి. ఇలాంటి ధోరణుల్ని ప్రశ్నించే ఫోరమ్స్ మరిన్ని ఏర్పడాలి. ‘హింస’మీద డిబేట్ జరగాలి.



- **కె. సజయ,**
సామాజిక కార్యకర్త

కౌన్సెలింగ్ అవసరం



సౌమ్యలో యాంగ్జయిటీ, డిప్రెషన్ లక్షణాలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి బయటపడాలంటే కౌన్సిలింగ్‌కు సిద్ధపడాలి. అవసరాన్ని బట్టి మందులూ వాడాలి. ఆమెను బలహీనపరచే ఆలోచనల్ని కౌంటర్ చేయాలంటే ఒక సిస్టమాటిక్ – సైంటిఫిక్ అండ్ స్ట్రక్చరల్ అప్రోచ్ అవసరం. సైకాలజిస్టును కలసినట్టయితే – బాధితురాలికి బాధల నుంచి, ఆమెను వ్యాకులపరిచే ఆలోచనల నుంచి ఎలా బయటపడాలో నేర్పిస్తారు. కుటుంబ సభ్యులు ఆమె సమస్యల పట్ల సహానుభూతితో స్పందించడం, ‘నీకు మేమున్నాం’ అనే భరోసా ఇవ్వడం చాలా ముఖ్యం.

- **డాక్టర్ సి.వీరేందర్,** కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

చెట్టు నీడ

గుండెలో పెరిగిన పాప

ఒక పాఠశాలలో ఫ్యామిలీ ఫొటో గురించిన పాఠం చెబుతోంది టీచరు. విద్యార్థులంతా చిన్నపిల్లలు. అందులో భాగంగా రకరకాల ఫొటోలు చూపిస్తోంది టీచరు. తరువాతి ఒక ఫొటో చూపించింది. అందులో ఉన్న ఇంటి సభ్యులందరి జుట్టు గోధుమ రంగులో ఉండగా, ఒక పాప జుట్టు రంగు మాత్రం నల్లగా ఉంది. చూడగానే ఆ పాప ఆ ఇంట్లో పుట్టలేదని కొందరు పిల్లలు గుర్తించారు.

‘ఆ పాపను వాళ్లు దత్తత తీసుకున్నారు కావొచ్చు,’ అన్నాడు ఒక బ్బాయి.

మామూలు పిల్లలు తల్లి కడుపులో పెరుగుతారు; దత్తుపిల్లలు తల్లి హృదయంలో పెరుగుతారు.

‘మీకు దత్తత అంటే ఏమిటో తెలుసా?’ క్లాసును ఉద్దేశించి ప్రశ్నించింది టీచర్.

‘నాకు తెలుసు’ వెంటనే ఒక చిన్నారి లేచి నిలబడింది. ‘ఎందుకంటే నేను కూడా దత్తతగా వచ్చినదాన్నే’.

క్లాసు అంతా ఆమె వైపే చూస్తోంది.

‘దత్తత అంటే ఏమిటో చెప్పమ్మా?’ అడిగింది టీచర్.

‘మామూలు పిల్లలు తల్లి కడుపులో పెరుగుతారు; దత్తుపిల్లలు తల్లి హృదయంలో పెరుగుతారు’ తడుముకోకుండా బదులిచ్చింది పాప.

క్లాసంతా మొదట నిశ్శబ్దం. ఆ వెంటనే చప్పట్లతో మారుమోగిపోయింది.

ఆ పాప ఎలాంటి పరిస్థితుల్లో మరో ఇల్లు, మరో తల్లి మారిందో తెలీదు. కానీ ఎలాంటి పరిస్థితుల్లోంచి వచ్చినా ఆ పాపలాంటి వారి మనసు గెలుచుకునే అవకాశం మరో తల్లికి, మరో ఇంటికి ఉంటుందనేది ఇందులోని బ్యూటీ.

గుడ్ ఫుడ్

ఆరెంజ్‌లో కంటే ఎక్కువే!

క్యాబేజీ ఒక ఆరోగ్యకరమైన ఆకుకూరగా మాత్రమే కాదు, అనేక ఆరోగ్య సమస్యలకు చికిత్సగా కూడా పనికి వస్తుంది. క్యాబేజీని ఆహారంలో తరచూ తీసుకునే వారిలో ఎన్నో రకాల జబ్బులు దూరం అవుతాయి. అంతేకాదు, ఎన్నో వ్యాధులను అవి రాకుండా కూడా క్యాబేజీ నివారిస్తుంది! క్యాబేజీతో ఒనగూరే ఆరోగ్య ప్రయోజనాల్లో కొన్ని ఇవి.



- విటమిన్–సి ఎన్నో వ్యాధులను నివారిస్తుందన్నది తెలిసిందే. నమ్మడం ఒకింత కష్టంగానీ నిజానికి ఆరెంజ్‌లో కంటే క్యాబేజీలోనే విటమిన్–సి పాళ్లు ఎక్కువ. అది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ కూడా. అందుకే క్యాబేజీ ఎన్నో క్యాన్సర్లను నివారించడంతో పాటు, వయసు పెరుగుదలతో వచ్చే మార్పులను ఆలస్యం చేసి, దీర్ఘకాలం యౌవనంగా ఉండటానికి తోడ్పడుతుంది.
- క్రమం తప్పకుండా క్యాబేజీని ఆహారంలో తీసుకునేవారిలో అలర్జీలు, నొప్పి–మంట–వాపు (ఇన్‌ఫ్లమేషను) చాలా తక్కువ. క్యాబేజీలోని గ్లుటామైన్ అనే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఏజెంట్ ఇందుకు కారణం. గాయాలు త్వరగా తగ్గేందుకూ క్యాబేజీ దోహదపడుతుంది.
- క్యాబేజీలోని బీటా–కెరటిన్ కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతేకాదు... ఈ బీటా–కెరటిన్ వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ కూడా నివారితమవుతుంది.
- క్యాబేజీ వల్ల వెలువడే క్యాలరీలు చాలా తక్కువ. అందుకే స్థూలకాయులకు, బరువు పెరుగుతున్న వారికి ఇది మంచి ఆహారం.
- మెదడు ఆరోగ్యానికి, నరాల మీద ఉండే మైలీన్ షీత్ అనే పొర దెబ్బతినకుండా కాపాడటానికి క్యాబేజీ ఎంతగానో దోహదపడుతుంది. అల్జైమర్స్, డిమెన్షియా వ్యాధులను నివారిస్తుంది.
- క్యాబేజీలో... మిగతా పోషకాలతో పాటు క్యాల్షియమ్ కూడా ఎక్కువే. అందుకే ఇది ఎముక ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు ఎముకలు బలహీనంగా మారే ఆస్టియోపోరోసిస్ వంటి కండిషన్లను నివారిస్తుంది.
- క్యాబేజీ అధిక రక్తపోటును నియంత్రిస్తుంది. అంతేకాదు... ఇది ఒంట్లోని విషాలను హరించే మంచి డీ–టాక్సిఫైయింగ్ ఏజెంట్.

ఆడజన్మ

ఎన్ని శో.. కా.. లో!

మీరైతే ఇన్‌స్టాగ్రామ్‌లో ఎలాంటి ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటారు? ఇదేం ప్రశ్న! అందంగా దిగిన సెల్ఫీలు, అద్భుతం అనిపించిన ప్రకృతి దృశ్యాలు, ఫ్యామిలీ ఫొటోలు.. ఇలాంటివే కదా పోస్ట్ చేస్తాం ఎవరిమైనా! కానీ, కావియా ఇల్లంగ్.. లైంగిక అంశాలు, ఆరోగ్యం, స్త్రీల దేహధర్మాలు, కాలకృత్యాలు, ఇంటా బయట మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు.. ఇలాంటి వాటిని ఇలస్ట్రేషన్లుగా గీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటారు. ముంబయ్‌కి చెందిన ఈ ఆర్టిస్ట్ ‘100 డేస్ ఛాలెంజ్’ అంటూ ఇన్‌స్టాగ్రామ్‌ను వేదికగా చేసుకొని మన సామాజిక వ్యవస్థలోని వివక్షల్ని ఉతికేసే పనిలో పడ్డారు.

‘‘స్త్రీలు చాలా వరకు ఫిల్టర్ చేసిన సెల్ఫీలు, సందర్శన స్థలాలు, ఫిట్‌నెస్ లక్ష్యాల విజయాలు, స్టైలిష్ దుస్తులు, ఫ్యాన్సీ రెస్టారెంట్స్ పోస్టులు పెడుతుంటారు. అయితే.. రంగుకాగితాలు అంటించి కళ్లద్దాలుగా పెట్టుకున్న సోషల్ మీడియాలో ఒక సీరియస్ ఇష్యూ చేరితే ఎలా ఉంటుందో చూడాలనిపించింది. అదీ సంక్లిష్ట బాంధవ్యాలు, దైనందిన యాంత్రికత, మానసిక ఆరోగ్యం, వ్యసనంగా మారిన మొబైల్ ఫోన్ల వాడకం, లైంగికత్వం, శారీరక ప్రతికూలత.. వంటి అంశాలను అర్థవంతంగా చూపించాలనుకున్నాను. మనుషుల మనసుల్లో దాగి ఉన్న మురికిని ప్రక్షాళన చేయడానికి ఆన్‌లైన్ వేదిక వీలు కలిపిస్తుందని భావించాను’’ అంటారు కావియా!

కావియా ‘100 డేస్ ఆఫ్ డర్టీ లాండ్రీ’ (#100daysofdirtylaundry) ఇన్‌స్టాగ్రామ్ పేజీని 2017 జూన్ 6న మొదటిసారి అప్‌లోడ్ చేసింది.




కావియా ఇల్లంగ్ గీసిన ఒక చిత్రం

చాలామంది ఈ ఇలస్ట్రేషన్‌లను మొదట తేలికగా తీసుకున్నారు. కానీ, ఇది మనిషి లోలోతుల్లోని పేగులను కదిలించే ఉద్యమం. మహిళల శరీరంలో లోపాలుగా భావించే అంశాలను కావియా బట్టబయలు చేస్తున్నారు. బ్యూటీ పేరుతో నరకాన్ని పంటిబిగువున భరిస్తున్న ఆకృతులను తన రేఖలలో ఆవిష్కరిస్తున్నారు. మోసపూరిత బంధాలు, ఒంటరితనం, ఆందోళన, డిప్రెషన్.. ఒకటేమిటి ఇవి కూడా ఓ సమస్యలేనా అని అంతా భావించే పెద్ద పెద్ద అంశాలను ‘డర్టీ లాండ్రీ’గా ప్రపంచం ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నారు కావియా. వీటిని చూడటం, తెలుసుకోవడం అసౌకర్యంగానే అనిపించవచ్చు. కానీ, ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన తప్పనిసరి విషయం అని ఒప్పుకోక తప్పదు.

- ఎన్.ఆర్.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం
26-2-2018



తీరని కోరిక!

- జూనియర్ అతిలోకసుందరి... శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్‌ను చూసి ఇలాగే అనుకున్నారంతా. మరాఠీ హిట్ 'సైరట్'ను హిందీలో రీమేక్ ద్వారా జాన్వీ కథానాయికగా పరిచయం కానున్నారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఈ సినిమా ఫస్ట్ డే షూట్ లొకేషన్‌కి కూడా వెళ్లారు శ్రీదేవి. కూతురికి ధైర్యం చెప్పారు. జాన్వీ కూడా తన తల్లి పేరును నిలబెట్టాలని ఎంతో కసితో షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా జూలై 20న విడుదల కానుంది. శ్రీదేవి ట్విట్టర్ అకౌంట్ కూడా జాన్వీ 'ధడక్' సినిమా పోస్టర్‌తోనే పిన్ అయి ఉంటుంది. కానీ జాన్వీని వెండితెరపై చూడకుండానే శ్రీదేవి కన్నుమూశారు. శ్రీదేవి దుబాయ్‌లో మరణించారు. షూటింగ్ నిమిత్తం ముంబైలో ఉన్నారు జాన్వీ. తల్లి మరణం కూతురికి తీవ్ర ఆవేదన కలిగించి ఉంటుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

చివరి సినిమా

- షారుక్ ఖాన్ హీరోగా ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వంలో కత్రినాకైఫ్, అనుష్క శర్మ కథానాయికలుగా రూపొందుతోన్న చిత్రం 'జీరో'. ఈ సినిమాలో శ్రీదేవిని ఓ స్పెషల్ రోల్ చేయమని అడగ్గా.. ఆమె ఓకే చెప్పారు. ఇందులో ఓ పాటలో శ్రీదేవి తనలానే (హీరోయిన్ శ్రీదేవి) కనిపిస్తారట. ఇదే శ్రీదేవికి చివరి సినిమా.

లాస్ట్ ట్వీట్

- తమిళంలో నటి ధన్సిక ప్రధాన పాత్రలో 'కాత్తాడి' అనే చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా బాగా ఆడాలని శ్రీదేవి ట్వీట్ చేశారు. ఇప్పుడే కాదు మంచి చిత్రాలను ప్రోత్సహించడంలో ఆమె ఎప్పుడూ ముందుంటారు. ఈ సినిమా గురించి శ్రీదేవి స్వయంగా చేసిన ఈ ట్వీటే ఆఖరిది.

జగదేకసుందరి - కొన్ని జీవిత విశేషాలు

- బాలీవుడ్‌లో ఎంటరైన తొలినాళ్లలో హిందీ భాష రాక ఇబ్బంది పడేవారు శ్రీదేవి. ఆ తర్వాత మెల్లిగా నేర్చుకున్నారు. 'సావన్' (1979) సినిమాతో హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 'చాందిని' (1989) సినిమాతో సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడం మొదలుపెట్టారు.
- ఎమ్‌ఏ తిరుముగమ్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ్ భక్తి చిత్రం 'తునైవన్' సినిమాలో చైల్డ్ ఆర్టిస్టుగా నటించారు శ్రీదేవి. అయితే..ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు శ్రీదేవి రోడ్డు పైకి వెళ్లారట. ఆ సమయంలో ఆమెకు చిన్న ప్రమాదం జరిగింది. రజనీకాంత్‌కు సవతి తల్లిగా కనిపించిన శ్రీదేవి కొన్నేళ్ల తర్వాత ఆయన పక్కనే హీరోయిన్‌గా చేశారు.
- 'బడి పంతులు' సినిమాలో ఎన్టీఆర్‌కు మనవరాలిగా చేసిన శ్రీదేవి ఆ తర్వాత ఆయన పక్కన హీరోయిన్‌గా నటించారు. ఎన్టీఆర్‌తో శ్రీదేవి చేసిన తొలి చిత్రం 'వేటగాడు'.
- సద్మా (1983), చాందినీ (1989), గర్జన (1991), క్షణక్షణం (1991) సినిమాల్లో పాటలు పాడారు.
- 'జురాసిక్ పార్క్'లో శ్రీదేవిని నటింపచేయాలను కున్నారట స్టీవెన్ స్పీల్‌బర్గ్. కానీ బాలీవుడ్‌లో కెరీర్ పీక్స్‌లో ఉండటంతో ఆమె ఆ ఆఫర్‌ను

- బోనీకపూర్ మెదటి భార్య మోనా కపూర్ తన కుమారుడు (అర్జున్ కపూర్) ఫస్ట్ సినిమా రిలీజ్‌కి కొన్ని నెలల ముందు మరణించారు. ఇప్పుడు శ్రీదేవి కూడా తన కుమార్తె జాన్వీ కపూర్ ఫస్ట్ సినిమా రిలీజ్‌కు కొన్ని నెలల ముందు మరణించారు.

- 1990లలో ఎక్కువ పారితోషికం తీసుకుంటున్న నటిగా శ్రీదేవి రికార్డ్ సృష్టించారు. బ్యాక్ టు బ్యాక్ హిట్ సాధించిన సినిమాలతో లేడీ సూపర్‌స్టార్ అన్న హోదాను దక్కించుకున్నారామె.
- 'రూప్‌కీ రాణీ చోరోంకా రాజా' సినిమాలోని 'దుష్మన్ దిల్ కా వో హై' పాటలో శ్రీదేవి వేసుకున్న గోల్డెన్ కలర్ డ్రస్ దాదాపు 25 కేజీలు బరువు ఉందట. ఈ పాటను సుమారు 15 రోజుల పాటు చిత్రీకరించారట.
- 13వ ఏటనే 'మూండ్రు ముడిచ్చు' సినిమాలో తిరస్కరించారట.
- భర్త బోనీ కపూర్ నిర్మాణంలో వచ్చిన 'జుడాయి', 'హమారీ దిల్ ఆప్ కీ పాస్' అనే సినిమాలో హీరోయిన్లు పోషించిన క్యారెక్టర్ పేర్లనే తన కుమార్తెలకు పెట్టుకున్నారు శ్రీదేవి.
- టాలీవుడ్‌లో అక్కినేని నాగేశ్వరరావు ఆయన కుమారుడు నాగార్జునతో, బాలీవుడ్‌లో ధర్మేంద్ర ఆయన కుమారుడు సన్నీ డియోల్‌- ఇలా తండ్రీ కొడుకులతో శ్రీదేవి యాక్ట్ చేయడం విశేషం.

- **ఓసారి షూటింగ్ ముగించుకొని ఒంటరిగా కారులో ఇంటికి వెళ్తోంది చిన్నారి శ్రీదేవి. ట్రాఫిక్ సిగ్నల్స్ పడ్డాయి. పక్కనే ఐస్ క్రీమ్ బండి కనిపించింది. 'నాకు ఐస్‌క్రీమ్ తినాలనుంది' అని డ్రైవర్‌ని ముద్దుగా అడిగింది. 'వద్దు తల్లీ.. నువ్వు ఐస్‌క్రీమ్ తిన్నట్టు మీ అమ్మకి తెలిస్తే నా పని పట్టేస్తుంది. అలాంటివి తింటే నువ్వు లావయిపోతావట' అన్నాడు డ్రైవర్. కారు కదిలిపో తుంటే ఆ బండి వైపే చూస్తుండిపోయింది శ్రీదేవి. అప్పటికి బాల నటిగా తన సంపాదనతో కుటుంబం మొత్తాన్ని పోషి స్తున్న శ్రీదేవికి ఇష్టమైనవి తినే స్వేచ్ఛ లేదు. ఆరేళ్ల శ్రీదేవి ఐస్‌క్రీమ్ కావాలని మారాం చేయలేదు.. సర్దుకుపోయింది.**



ఎన్టీఆర్ కారు, శ్రీదేవి కారు గుద్దుకుంటాయి 'వేటగాడు'లో.

'ఏయ్ మిస్టర్. వెనకేం రాసుందో చూసుకోలేదా' అని దిగి, దబాయిస్తుంది శ్రీదేవి.

వెంటనే ఎన్టీఆర్ శ్రీదేవి రెక్క పట్టుకుని వెనక్కు తిప్పుతాడు.

ఆమె ప్యాంట్ వెనుక 'లవ్ మీ' అని ఉంటుంది.

'దాందేముంది మిస్. అలాగే ప్రేమిస్తాం. గెట్ రెడీ.. గెట్ రెడీ' అంటాడు.

ఆ క్షణాన ఎన్టీఆరే కాదు ఆ గ్లామర్‌కీ, చలాకితనానికీ ప్రేక్షకులు కూడా గెట్ రెడీ అయిపోయారు.

అది శ్రీదేవి.

• ❖ •

'ఆకలి రాజ్యం' సినిమా.

ఆకలితో ముగ్గురు కుర్రాళ్లు నకనకలాడిపోతున్నారు. గుప్పెడు మెతుకుల కోసం అల్లాడిపోతున్నారు. వాళ్ల పరిస్థితి చూసిన శ్రీదేవి తన దగ్గర ఉన్న చిల్లర మల్లర డబ్బులతో వాళ్లను ఇంటికి భోజనానికి పిలుస్తుంది. చాలారోజుల తర్వాత భోజనం. అందరూ చకచకమని వంట చేస్తారు. విస్తళ్లు పరుస్తారు. భోజనానికి కూచుంటారు.

కాని గదిలో నుంచి చిన్న మూలుగు వినిపిస్తుంది. లోపలికి వెళ్లిన శ్రీదేవి అక్కడ తన నానమ్మ మరణించిందని గ్రహిస్తుంది.

ఆ సంగతి బయటకు చెప్తే వాళ్లు భోజనం చేయడం మానేస్తారేమోనని భయం.

కాని నానమ్మ చనిపోయిందన్న దుఃఖం.

చిన్న క్లోజప్.

ప్రేక్షకుల హృదయం ద్రవించిపోతుంది.

అదీ శ్రీదేవే.

• ❖ •

'శ్రీదేవికి చీర కట్టుకోవడం కూడా సరిగా వచ్చేది కాదు. నేనే నేర్పించాను' అన్నాడు కమల్‌హాసన్ ఒకసారి. వాళ్లిద్దరూ కలిసి తమిళ హిట్ 'పదినారు వయదినిలే'లో నటించారు. తమిళంలో హీరోయిన్‌గా శ్రీదేవిని ఎస్టాబ్లిష్ చేసిన సినిమా. 15 ఏళ్లు నిండకుండానే పదహారేళ్ల అమ్మాయిగా నటించడానికి సిద్ధపడింది. నటించడం తప్ప వేరే ఏమీ తెలియదు. స్కూలుకు వెళ్లలేదు. స్టూడియోనే బడి. మేకప్పే టెక్స్ట్ బుక్. 'యాక్షన్', 'కట్' అనే మాటలే పాఠాలు. ఆమె తొందరగా హీరోయిన్ కావడం ఇంటి పరిస్థితుల రీత్యా అవసరం. తల్లి రాజేశ్వరి అందుకు శ్రమించేది.

కమల్‌హాసన్ కూడా బాల నటుడే. కాని అతడు మగాడు. బయట తిరిగేవాడు. లోకం చూసినవాడు. శ్రీదేవి ఇంటి నాలుగ్గోడల మధ్య కానీ ఫ్లోర్‌లోని నాలుగ్గోడల మధ్య కానీ ఉండేది. కమల్‌హాసన్‌తో ఆమె 'ఎర్ర గులాబీలు', 'గురు', 'ఆకలి రాజ్యం' వంటి సినిమాలు చేసింది. కాలం గడిచిపోయింది. ఇద్దరూ 1986లో 'ఒక రాధ ఇద్దరు కృష్ణులు'లో నటించారు. ఒకరోజు ఒక వ్యక్తికి సెట్‌లో చాలా పెద్ద చెక్ ఇస్తూ కనిపించింది.

'అంత డబ్బా. దేనికి?' అడిగాడు కమల్‌హాసన్.

'నా కాస్ట్యూమ్స్‌కి' అని జవాబిచ్చింది శ్రీదేవి.

అప్పటికే దేశంలోని ఆడపిల్లలందరూ ఆమె ఏ చీర కట్టుకుంటే ఆ చీరను ఫాలో అవుతున్నారు.

అది శ్రీదేవే.

• ❖ •

డాన్స్ మాస్టర్ సలీమ్ ఒకసారి చెప్పాడు- 'సలీం మాస్టర్... ఎన్టీఆర్ గారితో ఏ స్టెప్ అయినా వేయించండి. కానీ చేయి పట్టుకుని వేసే స్టెప్ మాత్రం వద్దు' అని అందట శ్రీదేవి.

చేయి పట్టుకుని వేసే స్టెప్పులో ఎన్టీఆర్ లీనమైపోయి గట్టిగా పట్టుకునేవాడు. ఆమెకు అది కొంచెం నొప్పి అనిపించేది. ఆ తర్వాత సలీమ్ మాస్టర్ ఆమెతో ఎన్టీఆర్‌చే చేయి పట్టించలేదు.

అది శ్రీదేవి.

• ❖ •

ఎన్టీఆర్ అంటే వాణిశ్రీ హీరోయిన్. ఆ తర్వాత జయప్రద వచ్చింది. 'అడవి రాముడు', 'యమగోల', 'డ్రైవర్ రాముడు'. జయసుధ కూడా 'డ్రైవర్ రాముడు', 'కేడీ నంబర్1'.

అప్పుడు 'వేటగాడు' కోసం దర్శకుడు రాఘవేంద్రరావు ఎన్టీఆర్ పక్కన శ్రీదేవిని బుక్ చేశాడు. ఇదేంటి వాళ్లిద్దరికీ ఎలా కుదురుతుంది అన్నారు జనం. కొందరు ఇది రాంగ్ చాయిస్ అన్నారు. శ్రీదేవి చెవిన ఈ మాటలు పడుతూనే ఉన్నాయి. భారీ జ్వరంలో 'ఆకుచాటు పిందె తడిసె' పాట చేసింది. కొంచెం కష్టమైనా తెల్లవారు జామునే లేచి ఊటిలో 'జాబిలితో చెప్పనా' అంటూ జాగింగ్ చేసింది. 'కొండమీద చందమామా' గ్రూప్ డాన్సర్లతో శ్రమపడింది.

సినిమా విడుదలైంది. సూపర్ డూపర్ హిట్. 'మా తర్వాతి సినిమాలన్నింటిలోనూ ఆమెనే హీరోయిన్‌గా బుక్ చేయండి' అని శాసనం వేయించాడు ఎన్టీఆర్.

శ్రీదేవి రేంజ్ ఆయన విడువదలుచుకోలేదు.

అది- శ్రీదేవి.

• ❖ •

తెలుగులో పెర్ఫార్మెన్స్ తాలూకు లెగసీ ఒకటి ఉంది. భానుమతి, సావిత్రి.. ఆ లెగసీకి పాదు వేశారు. జయప్రద, జయసుధ ఆ లెగసీని కొనసాగించారు. కానీ జమున, వాణిశ్రీ, శ్రీదేవి గ్లామర్‌నూ పెర్ఫార్మెన్స్‌ను సమానంగా బేలెన్స్ చేసుకుంటూ ప్రేక్షకులను అలరించారు. శ్రీదేవిది ఆ స్కూలు. హిందీలో రేఖా, జీనత్ అమాన్ తమ లుక్స్ మీద, కాస్ట్యూమ్స్ మీద ఎంత శ్రద్ధ పెట్టేవారో దక్షిణాదిన శ్రీదేవి అంత శ్రద్ధ పెట్టేది. 'ఈ ముక్కు వెడల్పుగా ఉంది' అని 1981లో ఆమె ప్లాస్టిక్ సర్జరీకి వెళ్లడం ఆ రోజుల్లో చాలా పెద్ద వింత. ఆంధ్ర రాష్ట్రంలో ఆడవాళ్లందరూ ముక్కు సన్నగా అయిన శ్రీదేవి సినిమాలు చూడటానికి ఎగబడ్డారు. 1983 నాటికి ఈ సన్నముక్కు శ్రీదేవి తన వెడల్పు ముక్కు దక్షణాది జీవితాన్ని క్రమంగా వదిలేయదలుచుకుందని ప్రేక్షకులకు అర్థమైంది.

1983లో హిందీలో విడుదలైన 'హిమ్మత్‌వాలా' పెద్ద హిట్.

ఆ టైమ్‌లో అక్కడ హేమమాలిని టాప్‌లో ఉంది. ఆ తర్వాత పర్వీన్ బాబీ, టీనా మునిమ్, అనితా రాజ్... వీళ్లంతా ఏలుతున్నారు.

'తోఫా' (1984) హిట్ అయ్యింది. 'నగీనా' (1986) హిట్ అయ్యింది.

కాని డజన్ ఫ్లాపులు కూడా ఉన్నాయి.

సరే.. దక్షిణాది నుంచి వచ్చి అందరిలో ఒకరుగా ఉన్న ఒక హీరోయిన్.

అది- శ్రీదేవి.

• ❖ •

1987.

'మిస్టర్ ఇండియా'.

'ఇందులో ఒక రొమాంటిక్ సాంగ్ ఉందండీ' అన్నాడు దర్శకుడు శేఖర్ కపూర్.

'అయితే ఆ పాట ఒకసారి వినడానికి పంపండి' అని అడిగింది శ్రీదేవి.

'కాటేనహి కట్‌తే ఏ దిన్ ఔర్ రాత్'.... వినిందామె.

ఒక నీలి రంగు చీరను ఎంచుకుంది. కురులను గాలికి వదిలిపెట్టింది. పాదాలను నగ్నంగా వదిలిపెట్టింది. వానలో కొంచెం ఒళ్లు తడిపింది. నడుమును కొంచెం ఒక్కసారి విదిలించింది.

అంతే. కోట్లాదిమంది ఆ వొంపులో కొట్టుకునిపోయారు. శాశ్వతంగా పడిపోయారు.

'మిస్టర్ ఇండియా' సూపర్ డూపర్ హిట్.

ఇప్పుడు శ్రీదేవి సూపర్ స్టార్. ఇండియాస్ నంబర్ ఒన్ హీరోయిన్.

అదే- శ్రీదేవి.

• ❖ •

యశ్ చోప్రా ఆమెను ఆరాధించాడు. 'చాందినీ', 'లమ్హే' వంటి సినిమాలు ఆమె కోసమే తయారు చేశాడు. ఆమె ఇమేజ్ రోజురోజుకీ పెరిగిపోతోంది. దానిని తెలుగు ఇండస్ట్రీ కూడా ఆహ్వానించింది. 'శ్రీదేవి ఒక్క సినిమా చేయగలిగితే చాలు'.. అందరూ ఎదురు చూపులే. 'అంత పెద్ద స్టార్ పక్కన మనం తేలిపోకుండా ఉండగలమా' హీరోలకు గుబులు. వాళ్లు శ్రీదేవి మీద ఏమాత్రం చేయి వేయగలరో చూద్దాం అని అభిమానుల కుతూహలం.

కాని నాగార్జున 'ఆఖరి పోరాటం' సినిమాలో ఆమెతో పాటు మెరవగలిగాడు.

చిరంజీవి 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'లో సమఉజ్జీగా ఢీకొట్టాడు.

వెంకటేశ్ 'క్షణక్షణం'లో గట్టిగా నిలబడగలిగాడు.

ఆమె అలా తెలుగులో కనిపిస్తుంటే బాగుండని చాలామంది అనుకున్నారు.

కాని ఆమె కనబడలేదు. అది శ్రీదేవి.

• ❖ •

1996లో ఆమె బోనీ కపూర్‌ను వివాహం చేసుకుంది. 2012 వరకు ఇల్లు, కుటుంబం ముఖ్యమనుకుంది. ఇద్దరు కుమార్తెలను పెంచి పెద్ద చేసింది. అభిమానులు ఆమె తిరిగి నటించాలని కోరుకున్నారు. 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమా చేసింది. విమర్శకులు పూలవర్షం కురిపించారు. ఇంకా ఇంకా చేయిమని అడిగారు. కానీ ఐదేళ్ల తర్వాత 2017లో 'మామ్' చేసింది. ఇన్నాళ్ల తర్వాత కూడా యాక్షన్ అనగానే తనలో నుంచి ఒక గొప్ప నటి ఎలా ఉబికి వస్తుందో నిరూపించింది.

ఇంకా ఇంకా అని ప్రేక్షకులు అన్నారు.

చేస్తానని ఆమె మాట ఇచ్చింది.

ఇదిగో దుబాయ్ దాకా వెళ్లొస్తానని వెళ్లింది.

తిరిగి రాలేదు.

ఒక అందమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది.

అది- శ్రీదేవి.

క్షణక్షణంలో శ్రీదేవికి ఒక ఊతపదం ఉంది. 'దేవుడా.. దేవుడా.. దేవుడా...' అని. దేవుడు చల్లగా చూస్తాడని అనుకున్నాం. కానీ ఇలా చేస్తాడని అనుకోలేదు. 'దేవుడా... దేవుడా... దేవుడా'...

దేవుడా.. దేవుడా.. దేవుడా..!





సినీ ప్రముఖుల స్పందన

- షాకింగ్ అండ్ వెరీ డిస్ట్రబింగ్. నేనో మంచి మిత్రురాలిని అలాగే ఇండస్ట్రీ ఒక లెజెండ్‌ను కోల్పోయింది. **- రజనీకాంత్**
- శ్రీదేవి సక్సెస్ లక్ కాదు.. ఇదంతా చిన్నతనం నుంచి తను చేసిన హార్డ్ వర్క్. నాకు తను చాలా చిన్న వయసు నుంచి తెలుసు. 'మూండ్రు ముడుచ్చు' సినిమా సెట్‌లో అడుగుపెట్టి నప్పుడు తను చాలా చిన్న అమ్మాయి. బాలచందర్‌గారు కొన్నిసార్లు యాక్టింగ్‌లో కరెక్ట్ చేయడం, స్టెప్స్ విషయంలో హెల్ప్ చేసే బాధ్యతను నాకు అప్పగించేవారు. శ్రీదేవి ఈరోజు ఈ స్థాయికి వచ్చిందంటే అది కేవలం ప్రతి రోజు ఏదో ఒకటి నేర్చుకోవాలనే తన తత్వమే. తను సాధించిన సక్సెస్‌లన్నీ స్వయంగా వేసిన అడుగులే. 27 సినిమాలు కలిసి పని చేశాం. మేం ఇద్దరం కూడా పెద్ద ఎమోషన్స్ చూపించే రకం కాదు. కానీ లాస్ట్ టైమ్ మేం కలిసినప్పుడు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాం. ఈ వార్త వినగానే తనతో నాకున్న హ్యాపీ మూమెంట్స్ అన్నీ మదిలో మెదిలాయి. 'సద్మా' సినిమాలో లుల్లా బేబి ఇంకా మెదులుతూనే ఉంది. **- కమల్ హాసన్**
- చిన్న వయసులోనే శ్రీదేవి మనల్ని విడిచి వెళ్లిపోవడం బాధగా ఉంది. ఆమె ఇంకా ఎన్నో పాత్రల్లో నటించగలదు. ఎంతో భవిష్యత్ ఉంది. ఆమె చిన్నప్పుడు మా ఇంటి పక్కనే ఉండేది. మా ఇంట్లో శ్రీదేవి సందడి చేస్తూ ఉండేది. 'బుర్రిపాలెం బుల్లోడు' సినిమాలో నా సరసన హీరోయిన్‌గా తొలిసారి శ్రీదేవి నటించింది. వంద రోజులు ఆడింది ఆ పిక్చర్. శ్రీదేవి 86 తెలుగు సినిమాల్లో నటిస్తే అందులో నా పక్కన హీరోయిన్‌గా దాదాపు 31 సినిమాల్లో నటించింది. అందరితో కంటే నాతోనే ఎక్కువ సినిమాల్లో యాక్ట్ చేసింది శ్రీదేవి. **- కృష్ణ**
- అందం, అభినయం కలబోసిన నటి శ్రీదేవి. ఇంత అత్యద్భుతమైన నటిని నేను ఇంతవరకూ చూడలేదు. ఇకపై వస్తారన్న నమ్మకం లేదు. శ్రీదేవి హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. ఆమెకు నటన తప్ప మరో వృత్తిలేదు. ఆమె అంకితభావం చూసి నేనెంతో నేర్చుకున్నాను. ఒక గొప్ప నటి దూరమవ్వడం భారత ప్రజలు చేసుకున్న దురదృష్టమని నేను భావిస్తున్నాను. కోట్లమంది ప్రేక్షకుల హృదయాలను తన నటనతో ఆకట్టుకున్న శ్రీదేవి చనిపోయిందని నేను అనుకోవడం లేదు. ఎప్పటికీ ఆమె ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ఈ సినిమా ప్రపంచం ఉన్నంత వరకు శ్రీదేవి బ్రతికే ఉంటుంది. **- చిరంజీవి**
- ఎలాంటి భావాన్నైనా కళ్లతోనే పలికించగల మహానటి శ్రీదేవి. ఆవిడ హఠాన్మరణం చిత్రసీమకు తీరని లోటు. శ్రీదేవితో నాన్నగారు చాలా సినిమాల్లో నటించారు. ఆవిడ ఆత్మకి శాంతి చేకూరాలని ఆ దేవుణ్ణి వేడుకుంటున్నాను. **- బాలకృష్ణ**
- శ్రీదేవి చనిపోయారన్న నిజాన్ని నమ్మలేకపోతున్నాను. ఆ నిజం నన్ను ప్రతి ఉదయం వెంటాడుతూనే ఉంటుంది. ఈ దుర్వార్త కలలో భాగమై, శ్రీదేవి తిరిగొస్తే బాగుండనిపిస్తోంది. ప్రేక్షకులందరితో పాటు నేను కూడా శ్రీదేవిని ప్రేమిస్తూనే ఉంటా. **- నాగార్జున**
- శ్రీదేవి మరణవార్త నన్ను ఎంతగానో బాధించింది. అమేజింగ్ టాలెంటెడ్ యాక్ట్రస్‌ను కోల్పోయాం. యంగ్ ఏజ్‌లోనే స్టార్‌డమ్ తెచ్చుకున్నప్పటికీ ఆమె ఎంతో హుందాగా ప్రవర్తించేవారు. ఇండస్ట్రీలోకి రావాలనుకునే ప్రతి ఒక్కరికీ శ్రీదేవి స్ఫూర్తి. **- వెంకటేశ్**
- ఈ రోజు సూర్యుడు ఉదయించాడు. కానీ వెలుగు మిస్సయ్యింది. ఒక నక్షత్రం తిరిగి స్వర్గానికి చేరింది. మరొకరికి మహానటి టైటిల్ ఇవ్వాలంటే అది శ్రీదేవికే. వెళ్లు మిత్రమా.. తిరిగి రాని నేస్తమా. **- అశ్వనీదత్**
- మకుటంలేని మహారాణిలా చిత్రపరిశ్రమలో వెలుగొందిన శ్రీదేవి ఫ్యామిలీతో మాకు ఎంతో అనుబంధం ఉంది. శ్రీదేవి లేరన్న వార్తను నమ్మలేకపోతున్నాను. **- బీవీఎస్ఎన్ ప్రసాద్**
- అసమానమైన అభినయంతో ప్రేక్షకలోకం అభిమానాన్ని ఆమె చూరగొన్నారు. భౌతికంగా ఈ లోకాన్ని వీడినా నటిగా శ్రీదేవి ముద్ర సుస్థిరం. **- పవన్ కల్యాణ్**



భర్త బోనీకపూర్, కుమార్తెలు జాన్వీ, ఖుషీలతో శ్రీదేవి


- ఆల్‌టైమ్ నా ఫేవరెట్ యాక్టర్ శ్రీదేవిగారు. యాక్టర్‌గానే కాదు.. మహిళగా కూడా ఆమె ఎందరికో స్ఫూర్తి. ఆమె ఇక లేరనే వార్త షాకింగ్‌గా అనిపించింది **- మహేశ్‌బాబు**
- శ్రీదేవిగారు అద్భుతమైన నటి. అలాగే టైమ్‌లైస్ బ్యూటీ. శ్రీదేవి మ్యాజికల్ ఎరా చిరకాలం గుర్తుండిపోతుంది **- ప్రభాస్**
- ఫిల్మ్ ఇండస్ట్రీకి తీరని లోటు. శ్రీదేవిగారి మరణం గురించి విని షాక్ అయ్యాను. చాలా బాధపడ్డాను. **- రామ్‌చరణ్**
- తను వచ్చింది, చూసింది, గెలిచింది. తిరిగి తన నివాసమైన స్వర్గానికే వెళ్లిపోయింది. శ్రీదేవి గారి లేని లోటు తీర్చలేనిది. **-ఎన్టీఆర్**
- ఎక్కడ అడుగు పెడితే అక్కడి ప్రాంతాన్ని జయించింది శ్రీదేవి. తన హార్డ్‌వర్క్, టాలెంట్‌తో బాలీవుడ్ శిఖరాన్ని కూడా అధిరోహించింది. శ్రీదేవిని బాలీవుడ్‌లోకి పరిచయం చేసింది నేనే అని గర్వంగా చెప్పకోగలను. కేవలం సౌత్ స్టేట్స్‌లోనే కాకుండా అడుగుపెట్టిన ప్రతి ఇండస్ట్రీలోనూ తనదైన ముద్ర వేసింది శ్రీదేవి. **- భారతీరాజా**
- శ్రీదేవి గారి వర్క్‌కి నేనెప్పుడూ పెద్ద అభిమానిని. అందరి లాగే తన గ్రేస్‌ను, తన అందాన్ని ఆరాధించిన వాళ్లలో నేను కూడా ఒకణ్ణి. ప్రస్తుతం తనకోసం మౌనంగా రోదిస్తున్న కోట్లాది అభిమానుల్లో నేను కూడా ఒకణ్ణి. మేడమ్... మిమల్ని ఎప్పటికీ మా హృదయాల్లో ప్రేమతో, అపారమైన గౌరవంతో పదిలపరుచుకుంటాం. **- ఆమిర్ ఖాన్**
- శ్రీదేవితో కలిసి నటించే అద్భుతమైన అవకాశం చాలా కాలాం క్రితమే లభించింది. ఎప్పటినుంచో తన స్టార్‌డమ్ అలానే కంటిన్యూ అవుతూనే ఉంది. **- అక్షయ్ కుమార్**
- షాక్‌కి గురయ్యాను. బోనీ, ఆయన కుమార్తెలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను **- రిషీ కపూర్**
- ఈ చేదు వార్తతో మేల్కొన్నాను. ప్రపంచం ఒక టాలెంటెడ్ పర్సన్‌ని కోల్పోయింది **- మాధురీ దీక్షిత్**
- ఇంకా డీప్ షాక్‌లోనే ఉన్నాను. ఒక బబ్లీ పర్సన్, వండర్‌ఫుల్ యాక్టర్. మన మధ్య లేరంటే ఇంకా నమ్మబుద్ధి కావడం లేదు. ఎవ్వరూ పూరింపలేని ఒక ఖాళీను వదిలి వెళ్లారు. **- హేమ మాలిని**

- మానవ జాతికి దేవుడు ఇచ్చిన వరం శ్రీదేవి. బ్రహ్మ దేవుడు ఎప్పుడో స్పెషల్ మూడ్‌లో ఉన్నప్పుడు చేసే క్రియేషన్ శ్రీదేవి. 'శివ' సినిమా స్టార్ట్ కాకముందు కేవలం తనను చూడటం కోసమే తన ఇంటికి ముందుకు వెళ్లి నిల్చునేవాడిని. తనెప్పుడైనా బయటకి వస్తే చూద్దామనే ఆశ. కానీ అలాంటి అదృష్టం నాకెప్పుడు కలగలేదు. 'క్షణక్షణం' అనే సినిమా కేవలం శ్రీదేవిని ఇంప్రెస్ చేయడం కోసం రాశాను. నా దృష్టిలో ఆ సినిమా శ్రీదేవికో లవ్ లెటర్ లాంటిది.
- శ్రీదేవిని సృష్టించినందుకు దేవుడికి, జీవితాంతం తన అందాన్ని పదిలంగా భద్రపరుచుకోవడానికి కెమెరాను కనిపెట్టిన లూయిస్ లుమీర్‌కు మనస్ఫూర్తిగా థాంక్స్ చెబుతున్నాను.
- ఐ హేట్ శ్రీదేవి. తను కూడా మనందరి లాంటి మనిషే అని, తనకు మరణం ఉంటుందని ఐ హేట్ శ్రీదేవి. మనందరి లాగే ఏదో రోజు ఆగిపోయే గుండె తనకూ ఉందని ఐ హేట్ శ్రీదేవి. అంత త్వరగా



తీసుకువెళ్లిపోయినందుకు దేవుణ్ని, అంత త్వరగా చనిపోయినందుకు ఐ హేట్ శ్రీదేవి. **- రామ్‌గోపాల్ వర్మ**





ఎదుటివారిని నొప్పించేది కాదు



- **జయసుధ, జయప్రద, శ్రీదేవి.. ఒకానొక సమయంలో ఈ ముగ్గురు నాయికలూ ఇండస్ట్రీని రూల్ చేశారు. ఆ రోజుల్లో మీ మధ్య బాగా పోటీ ఉండేదా?**

జయసుధ: శ్రీదేవి, నేను కలిసి దాదాపు 8,9 వరకూ సినిమాలు చేశాము. నాకు ఎవ్వరితో పోటీ ఉండేది కాదు. ఎందుకంటే నేను ఎవ్వరితో కంపేర్ చేసుకోను కాబట్టి. శ్రీదేవి అంత అందంగా కనిపించాలి అనుకుంటే పోటీ ఉండేది. నేను అలా చేసేదాన్ని కాదు. నేను శ్రీదేవి అంత హైట్ కాదు. ఆమె ఫిగర్ నాకు లేదు. నేను చేయతగ్గదల్లా నా పాత్రను నేను బాగా చేయడమే. నా క్యారెక్టర్ ఏంటని మాత్రమే చూసుకునేదాన్ని. మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ప్రేమాభిషేకం' పెద్ద హిట్. ఆ తర్వాత 'అనురాగ దేవత, గజదొంగ' సినిమాలు వంటి చాలా సినిమాలు ఉన్నాయి.

- **శ్రీదేవిగారు కాంపిటీషన్‌లో ఉన్న హీరోయిన్లతో బాగుండేవారా?**

ఆమె చాలా సాఫ్ట్ అండి. నేను అయినా సెట్‌లోకి వచ్చి అదీ ఇదీ మాట్లాడేదాన్ని. మేం కూడా సాఫ్ట్... బట్ తను అసలు మాట్లాడదు. ఇప్పుడని కాదు.. చిన్నప్పటి నుంచి చాలా సిగ్గు తనకి. నాకు తను ఆరు ఏళ్ల వయసు అప్పటి నుంచి తెలుసు. నాకంటే ఐదారేళ్లు చిన్న అంతే. మద్రాసుల్లో మా ఇళ్లు దగ్గర దగ్గర ఉండేవి. వాళ్ల ఇంటికి వెళ్లితే డోర్ పక్కన నుంచొని తొంగి చూసేది. వాళ్ల అమ్మగానే బాగా మాట్లాడేవారు. శ్రీదేవి కూడా అందరితో కలిసిమెలిసి ఉండేది కానీ సిగ్గు, మొహమాటం ఎక్కువ. చైల్డ్ ఆర్టిస్ట్‌గా వచ్చింది కదా. మామూలుగా అయితే అలాంటి వాళ్లు ఫుల్‌గా మాట్లాడతారు లేదా క్వైట్‌గా ఉంటారు. శ్రీదేవి రెండో రకం.

- **శ్రీదేవిగారికి ప్రతీదీ వాళ్ల అమ్మే చూసుకునేవారు. అందుకేనేమో ఆమె రిజర్వ్‌డ్‌గా ఉండేవారు..**

అలా అంటే షూటింగ్ సమయాల్లో మా నాన్నని దాటి నాతో ఎవ్వరూ మాట్లాడటానికి వీలు లేదు. ఆ అమ్మాయికి బిగినింగ్‌లో వాళ్ల అమ్మ చూసుకునేవారు. ఆ తర్వాత స్టార్ అయ్యాక అన్నీ తనే చూసుకునేది. కానీ ఎందుకో తక్కువ మాట్లాడేది అంతే.

- **ఇప్పుడు ఇద్దరు హీరోయిన్లు ఒకే సినిమా చేస్తున్నారంటే ఎవరెవరు ఎలాంటి కాస్ట్యూమ్ వేసుకుంటున్నారో, ఎవరి క్యారెక్టర్ లెంగ్త్ ఎంతో తెలుసుకుంటుంటారని ఇండస్ట్రీలో అంటుంటారు. అప్పట్లో అలా ఉండేదా?**

అప్పుడూ ఉండేది. కానీ క్యారెక్టర్ విషయంలో ఉండేది. ఆవిడ ఏ వేషం వేస్తుంది నేను ఏం వేస్తున్నాను అని. అంతే కానీ వేరే ఎందులోనూ ఉండేది కాదు. శ్రీదేవి తన క్యారెక్టర్ ఏంటి? తన డ్రెస్ ఏంటి? ఏం చేయాలి? అని ఆలోచించేది తప్ప వేరే ఏదీ పట్టించుకునేది కాదు. చాలా ప్రొఫెషనల్. చిన్నప్పుడు మనకు ఒక పని చేయమని అప్పజెప్పితే ఎలా చేస్తామో అలాగే ఉండేది తన మనస్తత్వం. సెట్‌లో తనకు ఇబ్బందిగా ఏదైనా అనిపిస్తే.. ఆ విషయాన్ని డిప్లొమాటిక్‌గా చెప్పేది. ఎదుటివారిని నొప్పించని మనస్తత్వం శ్రీదేవిది.

- **మీ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ప్రేమాభిషేకం' సూపర్ హిట్. ఆ సినిమా గురించి ఒకరినొకరు కాంప్లిమెంట్ చేసుకున్న సందర్భాలు ఏమైనా ఉన్నాయా?**

అదేం జరగలేదు కానీ ఎప్పుడో ఒకసారి ఆ సీన్ బావుంటుంది కదా అని డిస్కస్ చేసుకునేవాళ్లం. ఆ సినిమా దాదాపు 300రోజులు ఆడింది. ఆ సినిమా ఫంక్షన్‌లు ఎక్కడికి వెళ్లినా మేం ఇద్దరం స్టేజ్ మీద ఏం మాట్లాడేవాళ్లం కాదు. అందరూ ఉపన్యాసాలు ఇస్తున్నా మేం చాలా సిగ్గుపడుతుండేవాళ్లం. రీసెంట్‌గా సుబ్బరామిరెడ్డిగారి ఫంక్షన్‌లో స్టేజ్ మీద నెక్స్ట్ నువ్వే మాట్లాడాలి అంటే, 'అయ్యో నేనేం మాట్లాడాలి అండి' అంది. అప్పట్లోనూ అంతే. ఇప్పుడూ అంతే. ఆ మధ్య తనకు పద్మ శ్రీ వచినప్పుడు బాగా దగ్గరైనవాళ్ల కోసం ఓ ఫంక్షన్ ఏర్పాటు చేశారు. అప్పుడు నేనూ వెళ్లాను. చాలా బాగా మాట్లాడుకున్నాం. ఒకప్పటికీ ఇప్పటికీ చాలా తేడా కనిపించింది. చాలీ మెచ్యూర్డ్‌గా అనిపించింది. ఇప్పటికి కూడా తను మిత భాషి.

- **మీరిద్దరు ఒకరికొకరు ఏమని పిలుచుకునేవాళ్లు?**

నేను తనని శ్రీ అనీ లేదా పప్పీ అనీ పిలిచేదాన్ని. తను మాత్రం నన్ను జయసుధగారు అనే పిలిచేది. నేను తన కంటే ముందు హీరోయిన్ అయ్యాను కాబట్టి అలా పిలుస్తుంది.

- **శ్రీదేవి గారి కూతుళ్లతో ఏమైనా పరిచయం ఉందా?**

ఎప్పుడో నాలుగేళ్ల ముందు కలిశాను. మహేశ్వరి వాళ్ల బ్రదర్ మ్యారేజ్‌లో కలిశాం. ఆ తర్వాత వాళ్ల అమ్మాయి సినిమాలో యాక్ట్ చేయబోతుందనగా కలిశాం. ఆ సినిమా బాగా రావాలని డిస్కస్ చేశాం. జాన్వీ సక్సెస్ అవ్వాలని అంటుండేది. ఎంత సెలబ్రెటీ అయినా ఒక కూతురికి తల్లే కదా. వాళ్ల ఇంట్లో ఏ ఫంక్షన్ ఉన్నా మమల్ని కచ్చితంగా పిలుస్తుంది. ఇంకో విషయం ఏంటంటే మేం చైన్నైలో ఉన్నప్పుడు తన ప్రతి పుట్టినరోజుకు వాళ్ల అమ్మగారు పిలిచేవారు. అసలు శ్రీదేవితో నా పరిచయమే తన బర్త్‌డేస్ వల్ల.

- **బాధాకరమైన విషయం ఏంటంటే తన కుమార్తెను సిల్వర్ స్క్రీన్ పై చూసుకోలేకపోయారు.**

అవును. అది బాధపడాల్సిన విషయమే.

- **హిందీ సినిమాల్లోనూ శ్రీదేవిగారు సక్సెస్ అవ్వడం గురించి?**

యాక్చువల్‌గా తను చాలా సెలెక్టెడ్‌గా ఉండేది. అప్పటికే హేమమాలినీ డ్రీమ్ గాళ్ అనిపించుకున్నారు. బట్ శ్రీదేవి ఈజ్ డిఫరెంట్. తనొక సెన్సేషన్. ఆ




శ్రీదేవి

పుట్టింది	:	ఆగస్టు 13, 1963
జన్మస్థలం	:	శివకాశి, తమిళనాడు
తల్లిదండ్రులు	:	అయ్యప్పన్, రాజేశ్వరి
అసలుపేరు	:	శ్రీ అమ్మయ్యంగార్
ముద్దుపేరు	:	పప్పీ
తొలి చిత్రాలు	:	బాలనటిగా... 1967 కందన్ కరుణై చిత్రంలో బాలమురుగన్ పాత్ర. హిందీలో... 1975లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా... జూలీ. హీరోయిన్‌గా... 1976 - తమిళంలో కె.బాలచందర్ డైరెక్షన్‌లో 'మూండ్రు ముడిచ్చు' 1977 - తెలుగులో... దాసరి నారాయణరావు డైరెక్షన్‌లో... 'మా బంగారక్క'
సినిమాలు	:	తెలుగు 86, హిందీ 71, తమిళం 72, మలయాళం 23, కన్నడ 6 (ఇవి కాక బాలనటిగా చాలా సినిమాల్లో నటించారు) మొత్తం 50 ఏళ్ల సినీ కెరీర్‌లో 300 సినిమాలు.
కుటుంబం	:	భర్త బోనీ కపూర్ (నిర్మాత), కుమార్తెలు జాన్వీ, ఖుషీ.

అమరపురిలోనే కాదు...
అవనిపై కూడా దేవతలు సంచరిస్తారన్న
నమ్మకం కలిగించి...
అమృతం సేవిస్తేనే కాదు... ఆనందామృతం
పంచిపెట్టినా కూడా
అమరత్వం సిద్ధిస్తుందని చాటిచెప్పిన సంపూర్ణ
జీవన ప్రస్థానం...
అందానికి అభినయాన్ని జోడించి, వ్యక్తిత్వానికి
హుందాతనాన్ని మేళవించి,
అర్ధాయుష్షుతోనే అటూ ఇటూ కలిపి మూడు
తరాలను ఉర్రూతలూగించిన
చలనచిత్ర వ్యాకరణం
ఒక నిండు ఉదయాన్ని, ఒక నిండు
సూర్యోదయాన్ని చిమ్మచీకటి చేసి వెడలిన
అరుదైన నిష్క్రమణం.

- రామజోగయ్య శాస్త్రి,
సినీ గేయ రచయిత





సోమవారం అర్ధరాత్రి అమితాబ్ ఏదో కీడు శంకిస్తుంది అని ట్వీట్ చేశారు. ఇలా ట్వీట్ చేసిన 20 నిమిషాలకే శ్రీదేవి మరణించారు అనే న్యూస్ బయటకు వచ్చింది. అంటే.. అమితాబ్ మనసు శ్రీదేవి మరణాన్ని గ్రహించిందా? లేక కుటుంబ సభ్యులు బయటపెట్టకుండా తాను చెప్పకూడదని అలా ట్వీట్ చేశారా? 'ఎందుకో తెలీదు ఒకరకమైన అలజడిగా అనిపిస్తుంది' అని అమితాబ్ బచ్చన్ ట్వీట్ చేశారు.

- అమితాబ్ బచ్చన్

మాకు విభేదాలు లేవు



- **అప్పట్లో మీతో పాటు ఇండస్ట్రీని రూల్ చేసిన శ్రీదేవిగారి గురించి..**

ప్రతి పాత్రలోనూ జీవించాలని ఎంతో కష్టపడేది. ఆన్‌స్క్రీన్ స్టైల్‌గా కనిపించడంతో పాటు ఎమోషన్స్‌ను ఎంతో బ్యాలెన్స్‌గా పలికించేది. గొప్ప నటి ఆమె. అంతేకాదు గొప్ప అమ్మ కూడా. తన జీవితంలోకి అన్ని రంగులు త్వరగానే వచ్చేసాయేమో అనిపిస్తుంది. తక్కువ వయసులోనే సక్సెస్ చూసింది. తక్కువ వయసులోనే వెళ్లిపోయింది. అందుకే దేవుడు జీవితంలోని అన్ని కలర్స్‌ను తనకు త్వరగా చూపించాడేమో అనిపిస్తుంది. శ్రీదేవి మనతో లేరు అనేది ఒక నమ్మలేని నిజం. మళ్లీ తిరిగి రానటువంటి నిజం. చివరి క్షణాల్లోనూ ఆనందంగా ఉన్న సమయాల్లోనే కన్ను మూసింది. ఒక కల్యాణానికి వెళ్లి అక్కడ అందరితో సరదాగా ఉంటున్న సమయంలో తుది శ్వాస విడిచింది. అంటే.. ఒక మనిషి జీవితం ఎంత చిన్నదో తెలుసుకోవచ్చనిపిస్తోంది.

- **మీరిద్దనూ ఎక్కువగా కలుస్తుండేవారా?**

తరచూ కాకపోయినా అప్పుడప్పుడూ మేము కలుస్తూనే ఉంటాం. మా ఇంట్లో జరిగిన పెళ్లి (జయప్రద అక్క కుమారుడు సిద్ధార్థ్ వెడ్డింగ్) వేడుకకు భర్త బోనీ కపూర్‌తో సహా శ్రీదేవి వచ్చింది. అందర్నీ ఆప్యాయంగా పలకరించింది. సరదాగా టైమ్ స్పెండ్ చేసింది. నా లైఫ్‌లో అవి మెమొరబుల్ మూమెంట్స్‌లా మిగిలిపోయాయి.

- **మీరిద్దరూ కలిసి చాలా సినిమాలు చేశారు కదా.. విభేదాలేమైనా?**

జయసుధ, శ్రీదేవి, నాకు మధ్యలో ఎప్పుడు ఎలాంటి విభేదాలు లేవు. ఒక మాట అనుకోవడం కూడా లేదు. అయితే.. మీడియా ఒక ప్రొఫెషనల్ హైప్‌ను క్రియేట్ చేసింది. మా మధ్య ఎటువంటి తగువులు లేవు. 'దేవత'లో తను నాకు చిట్టిచెల్లెలిగా చేసింది. మరో సినిమాలో సవతిగా చేసింది. డిఫరెంట్ రోల్స్ చేశాం. ఒకర్ని మించి ఒకరం బాగా చేయాలని తప్పిస్తే వేరే ఏమీ ఉండేది కాదు.

- **శ్రీదేవి నటించవాటిలో మీకు నచ్చిన సినిమాలు?**

చాలా ఉన్నాయి. జగదేకవీరుడు అతిలోకసుందరి, దేవత సినిమాలు.. ఇలా. తను చేసిన హిందీ సినిమాలూ ఇష్టమే. తన సినిమా కెరీర్ అద్భుతమైనది. సినిమా లైబ్రరీలో తనదో ప్రత్యేకమైన స్థానం ఉండాలి. ఆమె లాంటి ఆర్టిస్టు మళ్లీ రావడం కష్టం.

- **శ్రీదేవిగారి పెద్ద కుమార్తె జాన్వీ హీరోయిన్‌గా సినిమా చేస్తున్న విషయం తెలిసే ఉంటుంది..**

ఇన్నాళ్లూ కూతుళ్లకు తోడుగా ఉంది. ఇప్పుడు కూతురు సినిమా చేస్తున్న సమయానికి తోడుండి చూసుకోలేకపోయింది. జాన్వీ ఎంతో దుఃఖంలో ఉంటుంది. రెండో పాప ఖుషీ కూడా. జాన్వీని ఆన్‌స్క్రీన్‌పై చూసుకోవాలన్న శ్రీదేవి ఆశ నేరవేరలేదని బాధగా ఉంది. ఆ కుటుంబానికి ఆ భగవంతుడు ఇది తట్టుకునే శక్తి ఇవ్వాలని కోరుకుంటున్నాను.






నివాళి

శ్రీదేవిని ఎత్తుకునేవాణ్ణి

- రాఘవేంద్రరావు



మీ డైరెక్షన్‌లో 24 సినిమాలు చేసిన హీరోయిన్ శ్రీదేవి. ఎన్నో అద్భుత పాత్రల్లో ఆమెను చూపించిన మీకు శ్రీదేవి 'ఇక లేరు' అంటే ఎలా అనిపిస్తోంది?

రాఘవేంద్రరావు: నాకు పాత రోజులు గుర్తొచ్చాయి. శ్రీదేవి సిల్వర్ స్క్రీన్‌కి ఎలా వచ్చింది? ఎంత ఎదిగింది? అని స్వయంగా చూశాను. మా నాన్నగారు (కె.ఎస్. ప్రకాశ్ రావు) డైరెక్ట్ చేసిన 'నా తమ్ముడు' సినిమాలో శ్రీదేవి చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసింది. నేను శ్రీదేవిని ఎత్తుకుని షూటింగ్ లొకేషన్‌కి తీసుకువెళ్లేవాణ్ణి. ఆ సినిమాలో తను నెహ్రూ క్యారెక్టర్ చేసింది. అంత చిన్న పిల్ల నుంచి ప్రేక్షకుల మనసుల్లో అతిలోక సుందరిగా ఎదిగిన వరకూ శ్రీదేవిని నేను చూశాను. ఒక హీరోయిన్‌తో 24 సినిమాలు చేసే అవకాశం ఇచ్చిన ఆ భగవంతుడికి ధన్యవాదాలు. 54 ఏళ్ల వయసులోనే శ్రీదేవిని ఆ దేవుడు తీసుకెళ్లినందుకు బాధపడుతున్నా.

శ్రీదేవి 'నాన్ కాంట్రవర్షియల్' హీరోయిన్ అనిపించుకున్నారు.. ఆ విషయం గురించి?

శ్రీదేవి కొంచెం రిజర్వ్డ్‌గా ఉండేది. అయితే అది అహంభావం కాదు. తన తత్వం అంతే. కానీ ఎవరినీ నిందించడం, నొప్పించడం తనకు తెలియదు. కలుపుగోలుతనంగా ఉండేది. తన పనేంటో తను చూసుకునేది. అందుకే ఎలాంటి వివాదాలు లేవు. జనరల్‌గా మీకు ఏ హీరోయిన్ అంటే ఇష్టం? అని అడిగితే, ఎవరి పేరు చెబితే ఏమొస్తుందోనని భయపడుతుంటాం. ఒక హీరోయిన్ పేరు చెబితే ఇంకో హీరోయిన్ బాధపడుతుందేమోననుకుంటాం. కానీ ఎవర్నడిగినా 'శ్రీదేవి' పేరును చెబుతారు. తన పేరు చెబితే ఎవరూ ఫీలవ్వరు. అంత మంచి పేరు సంపాదించుకుంది.

ఆలిండియా సూపర్ స్టార్ అనిపించుకోవడానికి కారణం చెబుతారా?

గ్లామర్ ఒక్కటే సరిపోదు. ఆ ఒక్కటితోనే శ్రీదేవి ఈ స్థాయికి రాలేదు. తను మల్టీ టాలెంటెడ్. ఎన్ని రకాల పాత్రలు ఇస్తే అన్నీ చేయగల సత్తా తనకుంది. ప్రతి పాత్రకీ వ్యత్యాసం చూపించగలదు. తెలుగులో 'పదహారేళ్ల వయసులో'తో మొదలుపెట్టి తనతో ఎన్నో సినిమాలు చేశా. తెలుగు, తమిళ నుంచి జాతీయ.. అంతర్జాతీయ స్థాయి వరకు శ్రీదేవి అధిరోహించని మైలురాయి లేదంటే అతిశయోక్తి కాదు. బాలనటి నుంచి కథానాయిక వరకూ నాతో ప్రయాణం చేసిన శ్రీదేవి మరణం చాలా బాధాకరం.

మళ్లీ చెప్పుకుందాం! రీటోల్డ్ కథలు - 16

ఎదిగిన పిల్లలు



● పి.సత్యవతి





తుమ్ ఇత్‌నా జో ముస్కురా రహే హో...

సెల్‌లో తక్కువ శబ్దంలో పాట వింటున్నాను.

అలజడిగా ఉన్నప్పుడు పాట వింటాను.

అలజడిగా ఉన్నప్పుడే అన్నయ్య ఫోన్ కూడా వస్తుంది.

ఎలా తెలుసో వాడికి ఇప్పుడు చేయాలని.

'ఏంటమ్మడు సంగతులు?'

'ఏంటంటున్నాడు మీ ట్రంపు?' హుషారు తెచ్చుకుంటూ అన్నాను.

'వద్దులే... పాయింటురా. గొంతులో వేరియేషన్స్ మార్చి ఎందుకు అవస్థలు పడతావు. ఏమంటున్నాడు సామర్లకోట పెళ్లికొడుకు'

'చేసుకుంటానన్నాడు'

'గుడ్'

'అయితే చిన్న డౌటండీ... మీ అమ్మ నిజంగానే చచ్చిపోయిందా లేదంటే అందరూ అనుకున్నట్టుగా అని మూడు చుక్కలు పెట్టాడు'

'ఏమన్నావు'

'మూడు చుక్కలే నిజమండీ అన్నాను. అయినా మీకు ఆ మూడు చుక్కలే అభ్యంతరం అయితే మన పెళ్లి జరగదండీ అని కూడా చెప్పాను. కాఫీ తాగాక ఆలస్యం చేయకుండా బయల్దేరమన్నాను'

'బెదరగొట్టుంటావ్'

'లేదులే. కుర్రాడు గట్టాడు. మా అమ్మకు నేను సర్ది చెప్తానండీ. అదంతా నాకు ఇష్యూ కాదు. నేను మిమ్మల్ని తప్పక చేసుకుంటాను. మీరు నాకు నచ్చారు అన్నాడు'.

'అయితే గట్టాడు కాదు... తెలివైనాడు. నువ్వు చదువులో బ్రిలియెంట్. అదిరిపోయే ఉద్యోగం ఉంది. కష్టపడి ఫ్లాట్ కొనుక్కున్నావు. అంతర జ్ఞానంతోనో ఆత్మవిశ్వాసంతోనో నువ్వు అతడితో భుజం భుజం రాసుకుని నిలబడినప్పుడు ఇద్దరూ సమానం అని అన్నప్పుడు... హు... నువ్వు ఫలానా ముడుచుక్కలదాని కూతురువి నేను దయదలిచి చేసుకున్నాను అని ఒక దెబ్బ కొడతాడు. లేవకుండా పడి ఉంటావు. ఆ ప్రమాదమైతే నీకు ఎప్పుడూ ఉంటుంది. ఫరెవర్. దానికి ప్రిపేరవ్వు. అదీగాక'....

ఫోన్ కట్ అయ్యింది.

యు.ఎస్ కాల్ ఒకసారైనా కట్ అయితేనే దానికి గౌరవం. మళ్లీ వచ్చేదాకా ఎదురు చూసేలా చేయడం అంటే దానికి ఆట.

అమ్మ కూడా అలా ఆట ఆడిందా?

ఆటేమో అనుకున్నాను చిన్నప్పుడు. ఇవాళొస్తుంది... రేపొస్తుంది అనుకున్నాను. కాని రాలేదు. ఆట కాదు. నిజమే. నాన్నకు ఉత్తరం రాసి వెళ్లిపోయిందట. మొగుడు పోయిన మేనత్త ముక్కు చీదుతూ వచ్చి దగ్గరకు తీసుకుంది. వంట చేసింది. నచ్చలేదు. దగ్గరకు తీసుకోవాలని చూసింది. నచ్చలేదు. అమ్మ కావాలి... నాకు అమ్మ కావాలి... ఏడుస్తూనే ఉన్నాను. నాకంటే నాలుగేళ్ల పెద్దవాడు అన్నయ్య. ఇద్దరం ఎంత వయసు పిల్లలమని? ఏడుస్తూనే ఉన్నాం. శవం లేచిన ఇంటిదైతే అదో తీరు. నాల్రోజులు ఏడుస్తారు. వదిలేస్తారు. ఇదలా కాదు. మనిషి మాయమైన ఇల్లు. స్త్రీ మాయమైన ఇల్లు. భార్య మాయమైన ఇల్లు. తల్లి మాయమైన ఇల్లు. ఇంటి మర్యాద మాయమైన ఇల్లు.

అమ్మ మీద కోపంతో ఆమె ఫొటో తగలబెట్టబోయాను. అంతలోనే గుండెలకు గట్టిగా అన్చుకుని పెద్దగా ఏడ్చాను. దానిని జాగ్రత్తగా ప్రాణం కంటే మిన్నగా పుస్తకంలో దాచుకుని. బయట స్నేహితులతో ఆడుకుంటుంటే అమ్మ గుర్తుకొచ్చేది. వాకిలిలోని జాజితీగ మొదటి గుబురు వేస్తే అమ్మ గుర్తుకొచ్చేది. పాల గ్లాసులో ఇంకొంచెం పాలు మిగిల్చి కుర్చీలో గిరాటేసే అలవాటు మానుకుని అత్తయ్య కోసం దానిని శుభ్రంగా కడిగి వంటింట్లో పెడుతున్న ప్రతిసారీ అమ్మ గుర్తుకొచ్చేది. అమ్మా... అమ్మా... ఎందుకు వదిలేసి పోయావు.

ఫోన్ మోగింది.

'కట్ అయ్యింది అమ్మడు'...

'ఊ...ఊ'...

'ఏంటి ఏడుస్తున్నావా? నువ్వు పేరు మార్చుకుని ట్యాప్‌రాణి అని పెట్టుకోవే. కళ్ల మీదే ఉంటాయి నీకు ట్యాప్స్' నవ్వాడు.

'ఎందుకలా చేసిందన్నయ్య అమ్మ' ఎన్నిసార్లు అడిగిందో తను.

ఎన్నిసార్లు అడిగినా విసుక్కోడు అన్నయ్య.

'చేసిందమ్మా. ఏం చేస్తాం'

'లీగల్‌గా విడిపోయి ఉండొచ్చుగా... అంతగా ఇష్టం లేకపోతే.'

'అదంతా సులభమా తల్లీ మన దేశంలో. మొగుడు ఇవ్వాలి. బంధువులు ఒప్పుకోవాలి. తల్లిదండ్రులు అత్తామామలు... తంతు నడిచే దాక సలహాలు సంప్రదింపులు...'

'పోనీ నిన్ను నన్నూ తీసుకెళ్లి ఉండొచ్చుగా'

నవ్వాడు.

'నాన్న రెండో పెళ్లి చేసుకొనొచ్చి ఈమెనే మీ అమ్మ అనుకో అనంటే అనుకోగలిగావా. నోరారా ఒక్కసారి అమ్మా అని పిలువలేదు. ఆమె నిన్ను తీసుకెళ్లి ఈయనే నాన్ననుకో అనంటే అనగలిగేదానివా. అందుకే తీసుకెళ్లలేదేమో'

'అసలు అంత కొంపలేం మునిగిపోయాయి అని'

'తెలియదమ్మా. అది అమ్మకూ నాన్నకే తెలియాలి. ఆమె ఆశలూ ఆకాంక్షలు ఎలా ఉన్నాయో. ఆయన బిహేవియర్ ఎలా ఉందో. జీవితంలో ఒక్కసారైనా కళ్లల్లో కళ్లు పెట్టి చూసుకున్నారో లేదో. ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకున్నారో లేరో. అమ్మకు ఒక మనసు ఉందని ఆయన గ్రహించాడో లేదో. పెళ్లాం ఒక బాధ్యత మాత్రమేఎఅనుకున్నాడో ఏమో. నీకు గుర్తుందా. నాన్న కాఫీ తాగాక తాగిన సిగరెట్ పీకను ఆ కప్పులోనే నులిమేవాడు. దానిని కడిగే ప్రతిసారీ అమ్మ వాంతి చేసుకున్నట్టు మొహం పెట్టేది. విముఖత్వానికి తాటిచెట్లే అడ్డం పడాలని లేదమ్మా. దారితీగ కూడా చాలు. పేపర్లలో వార్తలు చూస్తుంటాం. ఏదో ఇంట్లో ఎవరో హత్యో ఆత్మహత్యో చేసుకుంటారు. ఇరుగు పొరుగువాళ్లు మాత్రం ఇద్దరూ బాగానే ఉండేవారండీ అని అంటారు. అరుపులు కేకలు వేసుకుంటేనే ఇద్దరికీ సరిపడనట్టు కాదు. నిశ్శబ్దంలో కూడా బోలెడంత అశాంతి ఉంటుంది'...

'నేను అమ్మను క్షమించనన్నాయ్యా'

'అలా అనకమ్మా. తను ఎక్కడ ఉన్నా బాగుండాలని కోరుకో'

'మరి నేను పడిన క్షోభ?'

'నీ స్వార్థం నువ్వు చూస్తున్నావు. తను మనిషి కాదా. తన స్వార్థం తాను చూసుకోకూడదా. ఆమె మన దగ్గరే ఉండిపోయింది అనుకుందాం. ఇన్నాళ్లు తను అనుభవించాల్సిన క్షోభ. దానికేమంటావ్'

నా దగ్గర సమాధానం లేదు.

కథ ముగిసింది.

పి.సత్యవతి రాసిన 'దమయంతి కూతురు' కథ ఇది.

స్త్రీ, పురుషుల విభేదాలు, ఎడబాట్ల విషయంలో బ్లేమ్ గేమ్ ఎవరి మీద సాగుతుందో మనం జాగ్రత్తగా గమనించాలి. స్వేచ్ఛను, తెగింపును, తిరుగుబాటును ప్రదర్శించిన ప్రతిసారీ నిందను స్త్రీ మీద వేసి ఆమెను విక్టిమ్ చేయడం గమనిస్తాం. సమాజం, చట్టం అంగీకారంతో స్త్రీ స్వేచ్ఛను పొందవచ్చు. కాని అది జటిలమనుకుని అడుగు ముందుకేసిన స్త్రీలను మనం ఎదిగి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎదిగిన పిల్లలు మనకు చెబుతున్నది అదే.

పునః కథనం: ఖదీర్

చిన్నారి శ్రీదేవి నా ఒళ్లో నిద్రపోయింది

- చంద్రమోహన్



శ్రీదేవిగారికి తెలుగులో మీరు ఫస్ట్ హీరో.. 'పదహారేళ్ల వయసులో' మీ ఇద్దరు జంటగా చేసినప్పటి జ్ఞాపకాలు పంచుకుంటారా?

చంద్రమోహన్: ఆ సినిమాకి శ్రీదేవిని హీరోయిన్‌గా తీసుకుందామని అనుకున్నప్పుడు కొందరు నిర్మాతలు వ్యతిరేకించారు. కానీ కమల్‌హాసన్‌తో ఇదే సినిమాలో తమిళంలో బాగా చేసిందని రాఘవేంద్రరావుగారు కన్విన్స్ చేశారు. నాక్కూడా శ్రీదేవితో చేయడానికి అభ్యంతరం అనిపించలేదు. తననే కథానాయికగా తీసుకున్నాం. బ్రహ్మాండంగా నటించింది. హీరోయిన్‌గా అందనంత దూరం వెళ్లిపోయింది.

ఆమె చైల్డ్ ఆర్టిస్ట్‌గా మీతో ఒక సినిమా చేసినట్లున్నారు?

అవును. 'యశోద కృష్ణ' సినిమాలో చిన్ని కృష్ణుడు పాత్ర చేసింది. ఆ సినిమాలో నేనేమో నారదుడి పాత్ర చేశాను. అప్పుడు శ్రీదేవికి ఏడెనిమిదేళ్లు ఉంటాయనుకుంటా. ఆ వయసులోనే చాలా క్రమశిక్షణగా ఉండేది. చాలా ముచ్చటేసేది. బిస్కెట్లు తింటూ కూర్చునేది. నా సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసిన తను ఆ తర్వాత మూడేళ్లకు నా పక్కన హీరోయిన్ ('పదహారేళ్ల వయసులో')గా చేస్తుందని మాత్రం ఊహించలేదు. అయితే 'యశోద కృష్ణ' సినిమా చేస్తున్నప్పుడు తను పెద్ద స్థాయికి వెళుతుందనుకున్నాను.

బాలనటిగా ఆమె మీ సినిమాలో చేసినప్పుడు జరిగిన సంఘటనలేమైనా గుర్తు చేసుకుంటారా?

'యశోద కృష్ణ' చేస్తున్న సమయంలో ఆ అమ్మాయి వేరే తమిళ సినిమా ఒప్పుకుంది. మర్నాడు మద్రాసు వెళ్లాలి. ట్రైన్ టికెట్స్ దొరకలేదు. అప్పట్లో మేం మద్రాసులో ఉండేవాళ్లం. నా షెడ్యూల్ కంప్లీట్ అయిపోవడంతో నా కారులో శ్రీదేవిని తీసుకు రావడానికి వీలు పడుతుందా? అని ఆమె అమ్మగారు అడగడంతె సరే అన్నాను. దాదాపు 14 గంటలు జర్నీ చేశాం. ఆ ప్రయాణంలో శ్రీదేవి నా ఒళ్లో నిద్రపోయింది. జాగ్రత్తగా వాళ్ల అమ్మకు అప్పజెప్పాను.

మీతో సినిమా చేయకముందు నుంచే శ్రీదేవిగారి కుటుంబంతో మీకు పరిచయం ఉందా?

మద్రాసు టీ నగర్‌లో మావి పక్క పక్క ఇళ్లే. మా పిల్లలతో శ్రీదేవి ఆడుకునేది. వాళ్ల అమ్మగారికి కూతుర్ని పెద్ద హీరోయిన్‌ని చేయాలని ఉండేది. అమ్మ కలని కూతురు నెరవేర్చింది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ.. ఇలా అన్ని భాషల్లోనూ సినిమాలు చేసింది. హిందీలో చాలా బాగా సక్సెస్ అయిన మన తెలుగు పిల్ల అని మనందరం గర్వంగా చెప్పుకోవచ్చు. దివి నుంచి భువికి దిగి వచ్చిన సుందరి శ్రీదేవి. తనలా ఎవరూ ఉండరు. పుట్టరు. శ్రీదేవి శ్రీదేవే.

మీ పక్కన ఏ హీరోయిన్ యాక్ట్ చేసినా ఆ తర్వాత స్టార్ అవుతారనే సెంటిమెంట్ శ్రీదేవిగారి విషయంలో కూడా నిజమైంది కదా?

అప్పట్లో ఆ సెంటిమెంట్ ఉండేది. 'పదహారేళ్ల వయసులో' సూపర్ డూపర్ హిట్టయి శ్రీదేవికి చాలా మంచి పేరొచ్చింది. అప్పుడు తన అమ్మగారు 'చంద్రమోహన్‌గారి సినిమాతో హీరోయిన్‌గా మా అమ్మాయి అరంగేట్రం అయింది. స్టార్ అయిపోయింది' అనేవారు. జయప్రద, జయసుధ.. ఇలా చాలామంది హీరోయిన్లు ఆ సెంటిమెంట్‌ని ఆపాదించారు. 'నాదేం లేదు.. అంతా మీ స్వయంకృషి' అనేవాడు. విశేషం ఏంటంటే... తన భర్త బోనీకపూర్‌కి నన్ను పరిచయం చేసేటప్పుడు 'నా ఫస్ట్ హీరో' అని చెప్పింది. ఓసారి నా తెలుగు సినిమా షూటింగ్, అమితాబ్ బచ్చన్, శ్రీదేవి చేస్తున్న సినిమా షూటింగ్ పక్క పక్కనే జరిగాయి. అప్పుడు అమితాబ్‌కి 'నా ఫస్ట్ హీరో' అని నన్ను పరిచయం చేసింది.

'పదహారేళ్ల వయసులో' తమిళ మాతృకలో కమల్‌హాసన్‌గారు చేశారు. ఎప్పుడైనా నటనపరంగా మీ ఇద్దరికీ శ్రీదేవిగారు పోలిక పెట్టారా?

ఆ సినిమా విజయోత్స వేడుకలో నాకన్నా చంద్రమోహన్‌గారు బాగా చేశారు అని కమల్‌హాసన్ అన్నారు. ''నేను తప్ప ఆ క్యారెక్టర్‌ని వేరే ఎవరూ బాగా చేయలేరనుకున్నా. ఆ అభిప్రాయాన్ని వెనక్కి తీసుకుంటున్నా. చంద్రమోహన్‌గారు గొప్పగా నటించారు'' అని కమల్‌గారు అన్నారు. శ్రీదేవి కూడా ఆ మాటే అంది. వాస్తవానికి 'స్వాతిముత్యం' సినిమాలో నేనే చేయాల్సింది. ఆ సినిమాలో క్యారెక్టర్ కూడా 'పదహారేళ్ల వయసు' క్యారెక్టర్ లానే ఉంటుంది. అయితే ఆ సినిమాని తమిళ్‌లో కూడా ప్లాన్ చేశారు. అక్కడ కమల్‌గారికి మార్కెట్ ఉంది కాబట్టి, బిజినెస్ పాయింటాఫ్ వ్యూలో ఆయనతో చేయించాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది.

నటిగా శ్రీదేవిగారిలో ఉన్న మంచి లక్షణాల గురించి?

నేను భానుమతిగారు, సావిత్రిగార్లతో సినిమాలు చేశాను. వాళ్లు చిన్న చిన్న ఎక్స్‌ప్రెషన్స్ విషయంలో కూడా రాజీపడేవారు కాదు. ఆ లక్షణాలను శ్రీదేవిలో చేశాను. అప్పట్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసిన అమ్మాయిలు ఆ తర్వాత శ్రీదేవి స్థాయిలో హీరోయిన్లుగా సక్సెస్ కాలేకపోయారు. శ్రీదేవి గొప్ప నటి. ఎన్టీఆర్, ఏయన్నార్, కమల్‌హాసన్, రజనీకాంత్.. ఇలా ఎవరి పక్కన చేసినా తన నటన ప్రత్యేకంగా ఉండేది. ఆడియన్స్ తననే చూసేంత గొప్పగా నటించేది. అందుకే అన్ని లాంగ్వేజెస్‌లో రాణించగలిగింది.

చివరిసారిగా మీరు ఆమెను ఎప్పుడు కలిశారు?

వైజాగ్‌లో జరిగిన టీయస్సార్ అవార్డు ఫంక్షన్‌లో కలిశాం. అప్పుడు సన్నిహితులెవరో 'నీ ఫస్ట్ హీరోయిన్ వచ్చారు' అంటే, 'నా ఫస్ట్ హీరో వచ్చారు' అని శ్రీదేవి నా దగ్గరకు నవ్వుతూ వచ్చింది. ఎంత స్టార్ అయినా తనలో ఎప్పుడూ నేను భేషజం చూడలేదు. నటిగా అందనంత దూరానికి వెళ్లింది. ఇప్పుడు కూడా అందనంత దూరానికి వెళ్లింది. క్షణాల్లో మిస్సయిపోయింది.

శ్రీదేవిగారు చనిపోయారనే వార్త విన్నప్పుడు ఏమనిపించింది?

మోహన్‌బాబు: షాకింగ్ న్యూస్. నమ్మలేకపోయాను. ఇంత త్వరగానా అనిపించింది. మంచి మనిషి. మళ్లీ సినిమాలు చేయడం మొదలుపెట్టింది కాబట్టి.. ఇంకా ఎక్కువ సినిమాలు చేస్తుందనుకునేవాణ్ణి. ఇలా జరుగుతుందని ఊహించలేదు. పైగా ఆరోగ్యంగానే కనిపిస్తోంది కాబట్టి ఎవరూ ఊహించలేం.



ఎంత ఎదిగినా శ్రీదేవి మారలేదు

- మోహన్‌బాబు

శ్రీదేవిగారి కుటుంబంతో మీ పరిచయం తిరుపతి నుంచే జరిగింది కదా?

అవును. శ్రీదేవి తల్లి రాజేశ్వరీగారిది తిరుపతి. ఆ కుటుంబంతో నాకు తిరుపతి నుండి మంచి అనుబంధం ఉంది. రాజేశ్వరిగారు చాలా మంచి మనిషి. కూతుర్ని మంచి హీరోయిన్‌ని చేయాలనే పట్టుదల ఆమెలో ఉండేది. అనుకున్నట్లే చేయగలిగారు. కూతురికి వైభవాన్ని చూశారు. ఆమె చనిపోయినప్పుడు చాలా బాధపడ్డాను. ఏదో ఆపరేషన్ చేయించుకోబోయి, ఊహించని విధంగా చనిపోయారావిడ. ఇప్పుడు శ్రీదేవి అకాల మరణం పెద్ద షాక్. భారతీయ చిత్రసీమ మంచి నటిని మాత్రమే కాదు, ఉన్నతమైన వ్యక్తిని కూడా కోల్పోయింది.

'పదహారేళ్ల వయసు', 'దేవత'.. ఇలా మీరు, శ్రీదేవిగారు చాలా సినిమాల్లో నటించారు. ఆ సమయంలో ఆమె మీకు ధీటుగా నటించడానికి ఇబ్బందిపడిన సంఘటనలేమైనా?

ఒకటీ రెండు ఉన్నాయి. అయితే అవి పెద్దగా చెప్పుకోవాల్సిన అవసరంలేదు. 'దేవత' సినిమాలో నా భార్య క్యారెక్టర్ చేసింది శ్రీదేవి. అప్పుడు వాళ్ల అమ్మగారు సినిమాల్లోనే మోహన్‌బాబుగారు యాంటీ రోల్స్ చేస్తారు. నిజజీవితంలో చాలా మంచి వ్యక్తి అని శ్రీదేవితో అనేవారు. నా కాంబినేషన్‌లో నటించడానికి తనెప్పుడూ ఇబ్బంది పడలేదు. స్వతహాగా ఏ పాత్రను అయినా అవలీలగా చేయగల గొప్ప నటి శ్రీదేవి. భారతదేశం గర్వించదగ్గ నటి అనిపించుకున్నప్పటికీ సెట్‌లో పోజు కొట్టడం నేనెప్పుడూ చూడలేదు. బాంబేకి వెళ్లి అక్కడ టాప్ హీరోయిన్ అయ్యాక కూడా తనలో మార్పు రాలేదు. ఆ వ్యక్తిత్వమే ఆమెను పెద్ద స్థాయికి తీసుకెళ్లింది.

కరెక్టే.. ముంబయ్‌లో సెటిలైనా ఇక్కడ ఏ ఫంక్షన్ జరిగినా హాజరయ్యేవారు. పుట్టినింటికి వచ్చానంటూ ఆనందంగా మాట్లాడేవారు..

అవును నిజమే. నా 42వ సినీ జీవిత ఉత్సవాలు వైజాగ్‌లో జరిగినప్పుడు ఫంక్షన్‌కి రావాలనగానే, ఇక్కసారి భర్త బోనీతో మాట్లాడమంది., 'వాట్ మోహన్ బాబుగారు వాట్ డూ యు వాంట్? అన్నారు. విషయం చెప్పాను. ఓకే అన్నారు. మీ సెక్రటరీని మా సెక్రటరీతో మాట్లాడమనండి అన్నారు. ఫ్లైట్ టిక్కెట్స్ గురించి నేను మాట్లాడబోతుంటే, 'వద్దు. మేమే టికెట్స్ కొనుక్కుంటాం. హోటల్ కూడా మేమే చూసుకుంటాం' అన్నారు. హోటల్ ఓకే చేశాం కానీ టిక్కెట్స్ మాత్రం ఆ అమ్మాయి ఒప్పుకోలేదు. ''మోహన్‌బాబుగారూ.. మీరు నన్ను గుర్తుపెట్టుకుని ఇంత ప్రేమగా పిలిచారు. అది చాలు'' అంది శ్రీదేవి. వేరేవాళ్లయితే 'డైరీ చెక్ చేసుకుని చెబుతానండి' అనేవారేమో. కానీ శ్రీదేవి అలా కాదు. అక్కడికి వచ్చి చాలా బాగా మాట్లాడింది. అంతకన్నా సంస్కారం ఏం ఉంటుంది. మన ఇండస్ట్రీలో కొంతమందిని ఫంక్షన్‌కి పిలిస్తే 'అబ్బో బిజీ బిజీ' అంటుంటారు. అంతెందుకు? మనతో సినిమాలు చేసేవాళ్లు ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కి రమన్నా రారు. ఈ జనరేషన్‌లో అలాంటివాళ్లు చాలామంది ఉన్నారు. వాళ్లందరికీ శ్రీదేవి ఆదర్శప్రాయురాలు.

పిల్లల బాగోగులు అడగడం వంటివి చేసేవారా?

మా ఫ్యామిలీకి చాలా క్లోజ్. ఎక్కడ కనిపించినా 'ఏం శ్రీదేవి ఎలా ఉన్నావ్?' అంటే, 'నేను బోనీకపూర్ బాగున్నాం. పిల్లలు బాగున్నారు' అని చెప్పి, మా పిల్లల బాగోగుల గురించి అడిగి తెలుసుకుంటుంది. గొప్ప సంస్కారవంతురాలు. ఈ జనరేషన్‌లో చాలామంది ఆమెను చేరుకోవడం కష్టం. శ్రీదేవి అంటే నాకు చాలా అభిమానం. అందుకే నేను హీరోగా యాక్ట్ చేసిన 'అల్లుడుగారు' సినిమా ఫస్ట్ షాట్‌కు తనతో క్లాప్ కొట్టిద్దామని రాఘవేంద్రరావుగారు అడగ్గానే 'ఓ యస్' అన్నాను. శ్రీదేవి కూడా చాలా ఆనందంగా వచ్చి, క్లాప్ కొట్టింది.

శ్రీదేవిగారు తక్కువ మాట్లాడేవారట. చిన్న వయసులోనే ప్రొఫెషనల్‌గా బిజీ బిజీగా ఉండటం వల్ల ఆమెలో కష్టం ఏదైనా ఉండేదా?

పర్సనల్ విషయాలు మనకేం తెలుస్తాయి. కానీ నాకు తెలిసినంతవరకూ తను హ్యాపీగా ఉండేది. స్వతహాగా మితభాషి. మాట్లాడిన నాలుగు మాటలు బాగానే మాట్లాడేది. ఎక్కడ పుట్టింది? ఎక్కడికి వెళ్లింది? భారతదేశంలోనే ౦బర్ వన్ అనిపించుకుంది. తెలుగు ప్రజలు గర్వించదగ్గ విషయం ఇది. శ్రీదేవి లేని లోటు భర్తీ చేయలేనిది. నటిగా ఆమె ఓ అద్భుతం.